## పార్టీ ఎడ్యుకేషన్ సిరీస్

**3**

# రాజకీయ అర్థశాస్త్రం

ప్రచురణ : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ కమిటీ

# పార్టీ ఎడ్యుకేషన్ సిరీస్ 3

## విషయసూచిక


ప్రవేశిక ........................................................ 5

1. రాజకీయ అర్థశాస్త్రం – ప్రాథమిక అంశాలు ................. 6

2. ద్రవ్య పెట్టుబడి, సమకాలీన సామ్రాజ్యవాదం .............. 24

3. భారత రాజకీయ అర్థశాస్త్రం,
స్వాతంత్ర్యానంతరం దేశ ఆర్థికాభివృద్ధి ..................... 38

4. సమాజంలోని వివిధ తరగతులపై
నయా ఉదారవాద ప్రభావం ................................. 91

# ప్రవేశిక

**భా**రత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) విద్యా సబ్-కమిటీ 2022 అక్టోబరులో కేంద్ర ఉపాధ్యాయ శిక్షణా పాఠశాల నిర్వహించింది. ఈ పాఠశాలలో పంపిణీ చేసిన నోట్సు, వాటిపై పాఠశాలలో పాల్గొన్న వారి నుండి వచ్చిన సూచనలు, అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకొని అవసరమైన సవరణలు చేసిన తర్వాత ఈ పుస్తకం ప్రచు రిస్తున్నాము.

రాజకీయ అర్థశాస్త్రంలో నాలుగు భాగాలున్నాయి. 1) రాజకీయ అర్థశాస్త్రం ప్రాథమిక అంశాలు 2) ద్రవ్య పెట్టుబడి, సమకాలీన సామ్రాజ్యవాదం 3) స్వాతంత్ర్యా నంతర భారతదేశ ఆర్థికాభివృద్ధి రాజకీయ అర్థశాస్త్రం 4) వివిధ తరగతులపై నయా ఉదారవాద విధానాల ప్రభావం.

రాజకీయ అర్థశాస్త్రాన్ని బోధించే వారు ఈ నాలుగు అంశాలు కలిపి, లేదా విడివిడిగా వివిధ స్థాయిల్లో రాజకీయ విద్య కోసం ఉపయోగించుకోవచ్చు. ఈ అంశాలను బోధించేవారికి, ఇతరులకు కూడా ఈ పుస్తకం రాజకీయ అర్థశాస్త్రాన్ని అర్థం చేసుకోవడానికి సహాయపడుతుందని ఆశిస్తున్నాము.

**పార్టీ విద్యా సబ్-కమిటీ**
**సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ,.**

**ఫిబ్రవరి 2023**

(1)

# రాజకీయ అర్థశాస్త్రం - ప్రాథమిక అంశాలు

పెట్టుబడిదారీ వ్యవస్థలోని దోపిడి, అభివృద్ధి, సంక్షోభాలను అర్థం చేసుకోడానికి మార్క్సిస్టు రాజకీయ అర్థశాస్త్రం సహాయపడుతుంది. ఇది సమాజపు ఆర్థిక పునాదిని అధ్యయనం చేస్తుంది. అందువల్ల సామాజిక మార్పు కోసం పోరాటం చేస్తున్న వారికి ఇది ముఖ్యమైనది. విశ్వవిద్యాలయాలలో బోధించే బూర్జువా ఆర్థిక శాస్త్రం చెబుతున్నట్లు మార్క్సిస్టు రాజకీయ అర్థశాస్త్రం అన్ని సామాజిక వ్యవస్థల సార్వత్రిక ఆర్థిక నియమాలను కనుగొనడానికి ప్రయత్నిస్తున్నట్లు చెప్పదు. ప్రతి ఉత్పత్తి విధానానికి చలన నియమాలు నిర్ధిష్టంగా ఉంటాయని చెపుతుంది.

మనం నొక్కి చెప్పాల్సిందేమంటే మార్క్సిస్టు విశ్లేషణకు సబంధించిన ఈ లక్షణం వల్లనే రాజకీయ అర్థశాస్త్రాన్ని శాస్త్రీయమైనదిగా పిలుస్తాము.

## నాలుగు ప్రశ్నలు?

రాజకీయ అర్థశాస్త్రం ఒక విస్తారమైన అంశం. పెట్టుబడి గ్రంథం మూడు సంపుటాలు, అదనపు విలువ మూడు సంపుటాలు, గ్రుండ్రిస్సే (రాత ప్రతులు), అనేక ఇతర చిన్న రచనలలో మార్క్స్ స్వంత రచనలు విస్తరించి ఉన్నాయి. మార్క్స్ అనంతరం లెనిన్ (పెట్టుబడిదారీ విధానం అత్యున్నత దశ సామ్రాజ్యవాదం, రష్యాలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి) సహా ఇతర మార్క్సిస్టు పండితులు మార్క్సిస్టు రాజకీయ అర్థశాస్త్రాన్ని నవీకరించి, మరింత సుసంపన్నం చేశారు.

రాజకీయ అర్థశాస్త్రం ప్రాథమిక తరగతిలో ఈ విస్తారమైన సాహిత్యాన్ని వివరించడం సాధ్యం కాదు. నాలుగు ప్రాథమిక రాజకీయార్థిక ప్రశ్నలను సరళమైన పద్ధతిలో వివరించే ప్రయత్నం చేస్తాం.

1. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ అనేది ఒక ఉత్పత్తి విధానం. ఇక్కడ పెట్టుబడిదారీ వర్గం ఉత్పత్తి సాధనాలను కలిగి ఉంటుంది. ఉత్పత్తి చేయడానికి వేతన కార్మికులను నియమించుకుంటుంది. కార్మికులు వేతనాలు తీసుకుంటారు, పెట్టుబడిదారులు

లాభాలు గడిస్తారు. పెట్టుబడిదారీ ఉత్పత్తి ఉద్దేశమే లాభం పొందడం. లాభం ఎక్కడ నుండి వస్తుంది? పెట్టుబడిదారులు కూడా ఫ్యూడల్ భూస్వాములు, బానిస యజమానుల వలే దోపిడీ వర్గమా? పెట్టుబడిదారీ దోపిడీ రహస్యం ఏమిటి?

2. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంకన్నా ముందున్న ఉత్పత్తి విధానాల వలే కాకుండా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో వేగవంతమైన వృద్ధి, విస్తరణ ఉంటుంది. పెట్టుబడిదారులు తమ లాభాలను ఆదా చేసి, వాటిని తిరిగి పెట్టుబడి పెడతారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఉత్పత్తిని విస్తరించడానికి పెట్టుబడిదారులను ప్రేరేపించే అంశం ఏమిటి?

3. పెట్టుబడిదారీ విధానం వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, అది అనివార్యంగా వరుసగా సంక్షోభాలను ఎదుర్కోవడాన్ని కూడా మనం చూడవచ్చు. ఉత్పత్తి చేయబడిన వస్తువులు, సేవలు అన్ని విక్రయించబడవు, నిరుద్యోగం, పేదరికం పెరుగుతాయి. ఒకవైపు పెట్టుబడిదారులు ఎంత అభివృద్ధి చెందితే మరోవైపు పేదరికం అంత పెరుగుతుంది. ఇది గతంలో ఊహించలేని పరిస్థితి. ఈ వైరుధ్యాన్ని మీరు ఎలా వివరిస్తారు?

4. పోటీ పెట్టుబడిదారీ విధానం గుత్తాధిపత్యానికీ, పెట్టుబడుల ఎగుమతికీ, వలసవాద, నయా–వలసవాద ప్రపంచ వ్యవస్థలకూ, ప్రపంచ ద్రవ్యీకరణకూ దారితీసింది. పెట్టుబడిదారీ అభివృద్ధిలో ఇదొక కొత్త దశ – సామ్రాజ్యవాద యుగం. సామ్రాజ్యవాద ముఖ్య లక్షణాలను ఇప్పుడు మనం క్లుప్తంగా చూద్దాం.

# I
# పెట్టుబడిదారీ దోపిడీ


## పెట్టుబడిదారీ పూర్వపు ఉత్పత్తి విధానాలలో దోపిడీ

పెట్టుబడిదారీ పూర్వపు వర్గ సమాజాలలో దోపిడీ ప్రత్యక్షంగా, స్పష్టంగా కనిపిస్తుంది. మనం అర్ధ బానిస (సెర్ఫ్) ఆధారిత భూస్వామ్య సమాజపు సాధారణ నమూనాను తీసుకుందాం. భూమి ఫ్యూడల్ ప్రభువు ఆధీనంలో ఉంటుంది. కానీ అర్ధ బానిసలచే సాగు చేయబడుతుంది. భూమి రెండుగా విభజించబడుతుంది: 1) ప్రభువు భూమి లేదా జమీన్‌దారీ (డెమెస్నే) భూమి, 2) అర్ధ బానిసల గుడిసె భూమి. అర్ధ బానిసలు తమ జీవనాధారం కోసం తమ గుడిసె భూమిలోని ఉత్పత్తులను తీసుకోవచ్చు. కానీ ఒక షరతు ఉంది: వారు తమ సొంత గుడిసె భూమి మీద వారానికి రెండు రోజులు పని చేయవచ్చు. కానీ వారు ప్రభువు భూమిలో

నాలుగు రోజులు పని చేయాలి. ఆదివారం, ప్రార్ధనా దినం, సెలవు దినం.

## చార్ట్ 1

## అర్ధ బానిస ఆధారిత భూస్వామ్య ఉత్పత్తి విధానంలో దోపిడీ సాధారణ నమూనా




వారంలో ఆరు పనిదినాలు ఉంటే రెండు రోజులు అర్ధ బానిసలు తమ సొంత గుడిసె భూమిలో పనిచేసుకుంటారు. ఈ రెండు రోజులు వారు తమకోసం తాము పని చేసుకుంటారు. ఆ ఉత్పత్తి వారి జీవనోపాధికి సరిపోదు. ఈ రెండు రోజులు వారి మనుగడకు అవసరమైన శ్రమ కాలం అంటే వారి అవసర కాలం.

ఆరు పని దినాలలో, మిగిలిన నాలుగు రోజులు వారి మిగులు శ్రమ కాలం. ఈ మిగులు శ్రమ కాలాన్ని ప్రభువు కౌలు రూపంలో అతని నుండి లాక్కుంటాడు. శ్రమ కౌలు అనేది అర్ధ బానిస యొక్క మిగులు శ్రమ అని ఎవరికైనా స్పష్టంగా కనిపిస్తుంది. ప్రత్యక్ష శ్రమ కౌలుకు బదులుగా ఉత్పత్తిలో కొంత భాగాన్ని లేదా స్థిర డబ్బును కౌలుగా ఇవ్వవచ్చు. శ్రమ కౌలు, ఉత్పత్తిలో కొంత భాగం కౌలు, లేదా డబ్బు కౌలు, రూపం ఏదైనా కౌలు అనేది రైతు/అర్ధ బానిసల అదనపు శ్రమ.

బానిస సమాజంలో బానిస యజమానులు పని చేయరు. అన్ని పనులు బానిసలే చేస్తారు. ఉత్పత్తిలో కొంత భాగాన్ని బానిసల పోషణ కోసం బానిసలకు ఇస్తారు. మిగిలిన ఉత్పత్తి మొత్తం బానిస యజమానులే తీసుకుంటారు.

పూర్వపు ఆధిపత్య వర్గాల వలె పెట్టుబడిదారులు తమను తాము దోపిడీ దారులుగా అంగీకరించరు. ఆశ్చర్యకరంగా చాలా మంది కార్మికులు కూడా దోపిడీ జరుగుతున్న విషయాన్ని అర్థం చేసుకోలేరు. దోపిడీ వ్యవస్థను అంతం చేయడం కంటే వేతనాలను పెంచుకోవడానికే వారు ఎక్కువ ప్రయత్నం చేస్తారు. పెట్టుబడిదారీ


వ్యవస్థ సృష్టించిన భ్రమలే ఇందుకు కారణం. పెట్టుబడిదారు, కార్మికులు ఇద్దరూ స్వతంత్రులు, చట్టం ముందు సమానులు. ఇద్దరూ సరుకు అమ్మకందారులే. కార్మికులు తమ శ్రమశక్తిని అమ్ముతున్నారు, పెట్టుబడిదారులు తమ ఉత్పత్తులను అమ్ముతున్నారు అనేవే ఆ భ్రమలు. భ్రమలు కల్పించే మార్కెట్ మాయాజాలం ముసుగును మార్క్సిస్టు రాజకీయ అర్థశాస్త్రం తొలగిస్తుంది. భూస్వామ్య ప్రభువు, బానిస యజమాని వలె పెట్టుబడిదారుడు కూడా మరొక దోపిడీదారు అని రుజువు చేస్తుంది.

## పెట్టుబడిదారునితో ప్రయాణం

మన చర్చ సరళంగా, ఆసక్తికరంగా ఉండటానికి, పెట్టుబడిదారుని లాభం గురించి తెలుసుకోడానికి అతనితో కలిసి ప్రయాణం చేద్దాం.

**చార్ట్ 2**

**బట్టల మిల్లు యజమాని పెట్టుబడి చలనాన్ని అనుసరిద్దాం.**




**దశ 1 – డబ్బు :** ప్రయాణం ప్రారంభంలో పెట్టుబడిదారుడి వద్ద డబ్బు రూ. 80 (లక్షలు) ఉంది. అతడు/ఆమె గుడ్డల ఫ్యాక్టరీలో పెట్టుబడి పెట్టాలని నిర్ణయించుకుంటారు.

**దశ 2 – కొనుగోలు :** అతడు/ఆమె యంత్రాలు (మగ్గం), ముడిసరుకు (పత్తి) కొనుగోలు చేస్తారు. కార్మికులను నియమించుకుంటారు (శ్రమశక్తిని కొనుగోలు చేస్తారు). కాబట్టి, దశ 2 చివరిలో, అతని/ఆమె డబ్బు పెట్టుబడి... ఉత్పత్తి పెట్టుబడిగా మారింది.

**దశ 3 - ఉత్పత్తి :** కార్మికుడు మగ్గాలను ఉపయోగించి పత్తి నుండి వస్త్రాన్ని నేస్తాడు. ముడిసరుకును కార్మికులు కొత్త వస్తువుగా మార్చడాన్ని ఉత్పత్తి అంటారు. ఉత్పత్తిలో ఉపయోగించే వస్తువు ఇప్పుడు కొత్త వస్తువుగా, వస్త్రంగా రూపాంతరం చెందింది. ఉత్పత్తి పెట్టుబడి కాస్త సరుకుల పెట్టుబడిగా రూపాంతరం చెందింది.


**దశ 4 - విక్రయం :** ఉత్పత్తి చేయబడిన వస్త్రాన్ని తప్పనిసరిగా విక్రయించాలి, అప్పుడు మాత్రమే పెట్టుబడిదారుడు అతడు/ఆమె లాభం పొందుతారు. పెట్టుబడిదారులు గుడ్డను రూ.100కి అమ్ముతున్నారు. ఇప్పుడు సరుకుల పెట్టుబడి... డబ్బు పెట్టుబడిగా మారింది.

పెట్టుబడిదారు తన ప్రయాణం డబ్బుతో మొదలు పెట్టి డబ్బుతో ముగించారు. ప్రారంభ మొత్తం డబ్బు కంటే చివరి మొత్తం డబ్బు ఎక్కువగా ఉంటే మాత్రమే ఈ చలన ప్రక్రియ అర్థవంతమైనది. పెట్టుబడిదారుడు అదనంగా రూ. 20 పొందుతాడు. ఈ రూ. 20 మిగులు ఎక్కడ నుండి వచ్చింది అనేది కీలకమైన ప్రశ్న?

పైన పేర్కొన్న పెట్టుబడిదారుల లావాదేవీలు చిన్న ఉత్పత్తిదారుల లావాదేవీల కంటే చాలా భిన్నంగా ఉంటాయి. చార్ట్ 3లో చూపినట్లుగా, ఒక చిన్న తరహా ఉత్పత్తిదారు నేత వస్త్రాన్ని ఉత్పత్తి చేస్తాడు, దానిని అతను డబ్బు కోసం మార్కెట్‌లో విక్రయిస్తాడు. ఆ డబ్బుతో తన వినియోగానికి కావాల్సిన బియ్యాన్ని కొంటాడు. అతని ప్రయాణం సరుకు నుండి మొదలై సరుకుతో ముగుస్తుంది. కానీ వస్త్రం, బియ్యంలలో ఉపయోగ విలువలు భిన్నంగా ఉంటాయి. కాబట్టి, లావాదేవీలు అర్థవంతంగా ఉన్నాయి.

**చార్ట్ -3**

**చిన్న ఉత్పత్తిదారుల లావాదేవీలు**





అయితే, మనం చార్ట్ 2లో చర్చించిన పెట్టుబడిదారుడి విషయంలో, అతని లావాదేవీలు డబ్బుతో మొదలై డబ్బుతో ముగుస్తాయి. అతను ఒక వెర్రి వెంగళప్ప

కాదని మనకు తెలుసు. ఎందుకంటే అతను ప్రారంభించిన డబ్బు పరిమాణం కంటే అతను ముగించే డబ్బు పరిమాణం పెద్దది.

### చార్ట్ - 4

### పెట్టుబడిదారీ లావాదేవీలు




మనం మరింత ముందుకు వెళ్ళే ముందు, ఒక స్పష్టత ఇద్దాం. మీ ఇంట్లో, నీ జేబులో డబ్బు ఉండవచ్చు. సూది, దారం లేదా గుడ్డ రూపంలో కూడా డబ్బు ఉండవచ్చు. కానీ అవి పెట్టుబడి కాదు. వాటిని తగిన అదనపు విలువ లేదా లాభం కోసం వినియోగించినప్పుడే అవి పెట్టుబడి అవుతాయి. పెట్టుబడిదారుల, కార్మికుల మధ్య సామాజిక సంబంధాన్ని పెట్టుబడి సూచిస్తుంది.

పెట్టుబడిదారు (1) కొనుగోలు (2) ఉత్పత్తి (3) అమ్మకం అనే మూడు కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్నాడు. కొనుగోలు, అమ్మకం ఒక సాధారణ కార్యాచరణకు రెండు వైపులా ఉంటాయి అంటే మార్పిడి. అందువల్ల, లాభం అనేది ఎక్కడ ఉద్భ వించింది? మార్పిడిలోనా, లేక ఉత్పత్తి ప్రక్రియలోనా అనేది ప్రశ్న. మార్పిడిని నిర్ణయించే నియమాలను ముందుగా పరిశీలిద్దాం.

## శ్రమ విలువ సిద్ధాంతం

మార్క్స్ తన ప్రఖ్యాత చిరస్మరణీయ అధ్యయన గ్రంథం 'పెట్టుబడి'లో పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ ప్రాథమిక లక్షణంపై దృష్టి కేంద్రీకరించారు. పెట్టుబడిదారీ ఉత్పత్తి ఎప్పుడూ మార్కెట్ కోసమే. మార్కెట్ కోసం ఉత్పత్తి చేయబడిన ఏదైనా వస్తువు లేదా సేవను సరుకు అంటారు. మార్కెట్‌లో ప్రతిరోజూ లక్షల కోట్ల సరుకులు అమ్ముడవుతున్నాయి. కొనుగోలు చేయబడుతున్నాయి.

ఈ సరుకులలో ఒక సాధారణ అంశం ఉంటే తప్ప చాలా భిన్నమైన ఉపయోగ విలువలు లేదా పదార్థాలతో ఉన్న సరుకులను ఒకదానితో మరోదాన్ని

పోల్చడం ఎలా సాధ్యమవుతుంది?

పోల్చడానికి అవసరమైన సాధారణ అంశం ఏమిటి? వాటిలో ఉన్న పదార్థాల లేదా వినియోగపు విలువల ఆధారంగా వాటిని పోల్చడం సాధ్యం కాదు. అవి ఒక సరుకు నుండి మరొక సరుకుకి చాలా భిన్నంగా ఉంటాయి.

ఈ సరుకులలో మనం గుర్తించగలిగే ఏకైక సాధారణ అంశం ఏమిటంటే, అవన్నీ మానవ శ్రమ ఉత్పత్తులే. వస్త్రం, కత్తి అనే రెండు ఉత్పత్తులను పోల్చి చూసినప్పుడు, వాటిని సమానంగా పరిగణించినప్పుడు (1 కత్తి = 1 మీటరు గుడ్డ) వేర్వేరు ఉపయోగాలు, వేర్వేరు వస్తుపరమైన ముడి పదార్థాలు ఉన్నప్పటికీ, కత్తిని ఉత్పత్తి చేయడానికి అవసరమైన శ్రమకాలం = ఒక మీటర్ గుడ్డను ఉత్పత్తి చేయడానికి అవసరమైన శ్రమకాలం అని పేర్కొంటున్నాము. వస్త్రం, కత్తి తయారీలో కమ్మరి, నేతకారుని ప్రత్యక్ష శ్రమ మాత్రమే కాకుండా, వాటిని తయారు చేయడానికి ఉపయోగించిన ముడిసరుకు, పనిముట్లలో తగ్గిన శ్రమ విలువ కూడా ఉంటుంది.

ఇక్కడ ఇంకొక సమస్య ఉంది. సాంకేతిక స్థాయి, శ్రామికుల ఉత్పాదకత, శ్రామికుల నైపుణ్యం, శ్రమ తీవ్రతలో తేడాలు వంటి అంశాల ఆధారంగా ఒకే రకమైన సరుకును ఉత్పత్తి చేయడానికి వేర్వేరు ఉత్పత్తిదారులు వేర్వేరు శ్రమ పరిమాణాన్ని ఖర్చు చేయవచ్చు. అందువల్ల, సరుకు విలువ దానిని ఉత్పత్తి చేసిన ఒక వ్యక్తి శ్రమ కాలాన్ని బట్టి కాకుండా, సగటు పరిస్థితులలో దాని ఉత్పత్తికి సామాజికంగా అవసరమైన శ్రమ కాలాన్ని బట్టి నిర్ణయించబడుతుంది. దీనినే శ్రమ విలువ సిద్ధాంతం అంటారు. సరుకు విలువ దాని ఉత్పత్తికి సామాజికంగా అవసరమైన సగటు శ్రమ కాలం ద్వారా నిర్ణయించబడుతుంది.

ఒక సరుకు విలువ మరొక సరుకు విలువతో పోల్చడం ద్వారా వ్యక్తీకరించబడుతుంది. కొంత కాలం తరువాత, సులభంగా వ్యాపారం చేయడం కోసం, విలువైన లోహాల వంటి కొన్ని సరుకులు విలువ మార్పిడి సాధనంగా లేదా డబ్బు మాధ్యమంగా రంగం మీదికి వచ్చాయి. సాధారణ కొలమానంగా మారాయి. డబ్బు రూపంలో వ్యక్తీకరించబడిన విలువను ధర అంటారు. సరఫరా, డిమాండ్‌లో మార్పులను బట్టి ధరలు మారుతూ ఉంటాయి. ఏ సమయంలోనైనా సరుకు ధర దాని ఉత్పత్తి విలువ కంటే ఎక్కువగా ఉండవచ్చు లేదా తక్కువగా కూడా ఉండవచ్చు. సరుకు ధర ఉత్పత్తి విలువ కంటే ఎక్కువగా ఉంటే దాని ఉత్పత్తి, సరఫరా పెరుగుతుంది. తత్ఫలితంగా ఆ సరుకు ధర తగ్గుతుంది. సరుకు ధర ఉత్పత్తి

విలువ కంటే తక్కువగా ఉంటే దాని ఉత్పత్తి, సరఫరా తగ్గుతుంది, ఫలితంగా ధర పెరుగుతుంది. దీర్ఘకాలంలో సగటు ధర సమానంగా ఉంటుంది.

మరో మాటలో చెప్పాలంటే, సాధారణ పరిస్థితుల్లో మార్పిడి సమాన విలువల మధ్య జరుగుతుంది. వాస్తవానికి, ఒక పెట్టుబడిదారుడు ఉత్పత్తి విలువ కంటే ఎక్కువ ధర నిర్ణయించడం ద్వారా మరొక పెట్టుబడిదారుని మోసం చేయవచ్చు. అయితే అలాంటప్పుడు మొదటి పెట్టుబడిదారుడి అదనపు లాభం రెండో పెట్టుబడిదారుడు అనుభవించే నష్టానికి సమానంగా ఉంటుంది. పెట్టుబడిదారీ వర్గం వారిలో వారు ఒకరినొకరు మోసం చేసుకోవడం ద్వారా లాభం పొందరు.

పై పరిస్థితిని బట్టి విశ్లేషణ కొరకు, మన మోడల్‌లోని పెట్టుబడిదారుడు సరుకులను వాటి విలువకు కొనుగోలు చేసి విక్రయిస్తున్నాడని మనం భావించాలి.

మరో మాటలో చెప్పాలంటే, వస్త్రం రూ. 100 విలువను కలిగి ఉన్నందున రూ. 100కి విక్రయించబడింది. పత్తి, మగ్గం రూ. 60కి కొనుగోలు చేయబడతాయి ఎందుకంటే వాటి విలువ రూ. 60. అదే తర్కం ప్రకారం కార్మిక శక్తిని రూ. 20కి కొనుగోలు చేస్తారు. ఎందుకంటే దాని విలువ రూ. 20. ఈ చివరి ప్రకటన కొంచెం గందరగోళంగా ఉంది. శ్రమశక్తి విలువ అనే భావనను మనం విశదీకరించాలి.

## వేతనాలు = శ్రమశక్తి విలువ

కనీస వేతనాలు నిర్ణయించబడే ప్రక్రియను పరిశీలించడం వేతనాలను అర్థం చేసుకోవడానికి ఉత్తమ మార్గం. కనీస వేతనాల కమిటీ విస్తృతమైన ప్రక్రియ ద్వారా కార్మికుల జీవనోపాధికి అవసరమైన కనీస వ్యయాన్ని లెక్కిస్తుంది. మరో మాటలో చెప్పాలంటే, కార్మికుల జీవనానికి వేతనాలు సరిపోతాయి.

పైన పేర్కొన్నది ఆశ్చర్యకరమైన పరిణామమేమి కాదు. చరిత్ర అంతటా శ్రామిక వర్గాలు అంటే బానిసలుగానీ, లేదా సేవకులు లేదా కౌలుదారులు, పేదరైతులు ఉత్పత్తిలో కొంత భాగాన్ని జీవనోపాధి కోసం పొందుతారు. పెట్టుబడిదారీ పూర్వ ఆర్థిక వ్యవస్థల్లో వారి వాటా సాంప్రదాయ నిబంధనల ద్వారా నిర్ణయించబడుతుంది. అయితే ఆధునిక వేతన కార్మికుల విషయంలో ఇది శ్రమశక్తి డిమాండ్, సరఫరా ద్వారా నిర్ణయించబడుతుంది. సామూహిక బేరసారాల ద్వారా వేతన కార్మికులు తమ వేతనాలను మెరుగుపరచుకోవచ్చు. కానీ ఒక విషయం గుర్తుంచుకోవాలి, అయినప్పటికీ వారు ఆశించే ఉత్తమమైన, న్యాయమైన జీవనం కోసం అవసరమైన వేతనం,

జీవనాధార వేతనం అనేది సార్వత్రికమైనది, స్థిరమైనది కాదు. అది చారిత్రక, నైతిక అంశాలపై ఆధారపడి ఉంటుంది.

శ్రమశక్తి అనేది మానవునిలోని పని చేయగల సామర్థ్యం. పెట్టుబడిదారు శ్రమశక్తిని దానితో సమానంగా వేతనాలు చెల్లించడం ద్వారా నిర్దిష్ట కాలానికి నియమించుకుంటాడు. శ్రమశక్తిని ఉత్పత్తి చేయడానికి, కుటుంబ నిర్వహణ ద్వారా దానిని పునరుత్పత్తి చేయడానికి అవసరమైన వస్తువులు, సేవల విలువ ద్వారా శ్రమశక్తి విలువ నిర్ణయించబడుతుంది. మా నమూనాలో, పెట్టుబడిదారుడు కార్మికుల శ్రమశక్తిని నియమించినందుకు రూ. 20 లక్షలు చెల్లిస్తాడు, ఎందుకంటే శ్రమశక్తి విలువ రూ. 20 లక్షలు.

## అదనపు విలువ సిద్ధాంతం

మార్పిడి ప్రక్రియలో అదనపు విలువ సృష్టిని మనం తోసిపుచ్చాము. కాబట్టి అది ఉత్పత్తి ప్రక్రియలో సృష్టించబడి ఉండాలి. ఉత్పత్తిలో పాల్గొన్న మూడు సరుకులలో ఒక సరుకు దాని స్వంత విలువ కంటే ఎక్కువ విలువను ఉత్పత్తికి బదిలీ చేయడానికి ప్రత్యేక సామర్థ్యాన్ని కలిగి ఉండాలి. అటువంటి సరుకు శ్రమశక్తి మాత్రమే. శ్రమశక్తి దాని స్వంత విలువ కంటే ఎక్కువ విలువను ఉత్పత్తి చేయగలదు. భూస్వామ్య సమాజపు నమూనా విషయంలో, అర్థ బానిస యొక్క అవసర శ్రమకాలం వారానికి రెండు రోజులు. సేవకుడు నాలుగు రోజుల అదనపు శ్రమను అందించగలడు. యంత్రాలు అధిక ఉత్పాదకతతో పనిచేసే ఆధునిక వేతన కార్మికుని విషయంలో అవసరమైన శ్రమకాలం చాలా తక్కువగా ఉంటుంది. అదనపు శ్రమకాలం చాలా ఎక్కువగా ఉంటుంది. పెట్టుబడిదారుడు చెల్లించేది శ్రమశక్తికి మాత్రమే కాని అది ఉత్పత్తి చేసే శ్రమకు కాదు. పెట్టుబడిదారుడు అవసరమైన శ్రమకాలాన్ని చెల్లిస్తాడు, ఇది మొత్తం శ్రమకాలంలో కొద్దిభాగం మాత్రమే. పెట్టుబడిదారుడి లాభం కార్మికుడు ఉత్పత్తి చేసే అదనపు విలువ.

మరో మాటలో చెప్పాలంటే, అదనపు విలువ = శ్రమశక్తి ద్వారా ఉత్పత్తి చేయబడిన విలువ – శ్రమశక్తి విలువ.

పెట్టుబడిదారు వెచ్చించిన పెట్టుబడిలో.. ఉత్పత్తి సాధనాలలో పెట్టుబడి పెట్టబడిన భాగం ఉత్పత్తి తుది విలువలోకి స్థిరమైన నిష్పత్తిలో బదిలి చేయబడి మళ్ళీ కన్పిస్తుంది. విలువను స్థిరంగా బదిలీ చేసింది.

కనుక దీనిని స్థిర పెట్టుబడి (C) అంటారు. దీనికి విరుద్ధంగా కార్మికులను నియమించుకోవడంలో వెచ్చించిన పెట్టుబడి ఉత్పత్తిలో అదనపు విలువ (S)తో

పాటుగా కనిపిస్తుంది కాబట్టి, దీనిని అస్థిర పెట్టుబడి (V) అంటారు. ఉత్పత్తి యొక్క విలువ C + V + S కలిగి ఉంటుంది. దోపిడీ యొక్క తీవ్రత S నుండి V నిష్పత్తి ద్వారా కొలవబడుతుంది. లాభం రేటును మొత్తం మూలధనానికి అదనపు విలువ నిష్పత్తి ద్వారా కొలుస్తారు.

దోపిడీ రేటు = S/V x 100

లాభం రేటు = S/C + V x 100

ఫ్యాక్టరీలో సృష్టించబడిన మొత్తం అదనపు విలువ ఫ్యాక్టరీ యజమానికి చెందదు. కర్మాగారాన్ని నెలకొల్పడానికి రుణం ఇచ్చిన బ్యాంకర్‌కు వడ్డీ, ఉత్పత్తిని మార్కెట్ చేసే వ్యాపారికి కమిషన్, భూమిని లీజుకు ఇచ్చిన యజమానికి అద్దె మొదలైన వాటాలు పంచుకోవాలి. రాజకీయ అర్థశాస్త్రం వడ్డీ రేటు, అద్దె మొదలైన వాటి ద్వారా ఈ పంపిణీ జరిగే సూత్రాలను కూడా పరిశీలిస్తుంది.

## II

## పెట్టుబడి పోగుపడటం, వృద్ధి చెందడం

పెట్టుబడిదారీ విధానం అనేది లాభాల కోసం వేతన కార్మికుల శ్రమతో సరుకులను ఉత్పత్తి చేసే వ్యవస్థ. సరుకుని దాని విలువకు మార్కెట్‌లో విక్రయించినప్పుడే లాభం వస్తుంది. పెట్టుబడిదారీ విధానం అనేది మార్కెట్‌లోని ఉత్పత్తిదారుల పోటీలో విజయం సాధించడంపై ఆధారపడి ఉంటుంది. ఇది ఉత్పాదక సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది. అధిక సామర్థ్యం కోసం మెరుగైన సాంకేతికత, పెద్ద స్థాయిలో అధిక పెట్టుబడి అవసరం. పెట్టుబడి పెట్టడంలో, విస్తరించడంలో, ఉత్పాదకతను మెరుగు పరచడంలో విఫలమైన పెట్టుబడిదారులు దివాలా తీయడంలో పోటీ పడతారు. అందువల్ల, మార్కెట్ పోటీ ప్రతి పెట్టుబడిదారున్ని దోపిడీని పెంచడానికి, ఉత్పత్తిని విస్తరించడానికి, మెరుగుపరచడానికి, లాభాలను తిరిగి పెట్టుబడి పెట్టడానికి బలవంతం చేస్తుంది. ఇది పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క విలక్షణమైన గుణం. ఇది చరిత్రలో అసమానమైన చైతన్యాన్ని ఇస్తుంది. పెట్టుబడి విస్తరించేందుకు లాభాన్ని తిరిగి పెట్టుబడి పెట్టే ప్రక్రియను పెట్టుబడి పోగుపడటం అంటారు.

### సాధారణ పునరుత్పత్తి, విస్తృత పునరుత్పత్తి

నిరంతర ఉత్పత్తి లేకుండా సమాజం మనుగడ సాగించలేదు. ఉత్పత్తి అయిన

అదనపు ఉత్పత్తి మొత్తం వినియోగం జరిగినప్పుడు దానిని సాధారణ పునరుత్పత్తి అంటారు. సాధారణ ఉత్పత్తిలో ఉత్పత్తి చేయబడిన మిగులు పూర్తిగా సమాజంచే వినియోగించబడుతుంది, తద్వారా తదుపరి ఉత్పత్తి చక్రంలో పెట్టుబడి గత పెట్టుబడి స్థాయిలోనే ఉంటుంది. పెట్టుబడిదారీ పూర్వ సమాజాలలో ఇది వాస్తవంగా జరిగింది. తద్వారా ఆర్థిక వృద్ధి నత్తనడకగా సాగుతుంది.

దీనికి విరుద్ధంగా మార్కెట్లో పెట్టుబడిదారుల మధ్య పోటీ పెట్టుబడిదారులను అదనపు విలువను కూడబెట్టుకుని తిరిగి ఉత్పత్తిలో పెట్టుబడి పెట్టేలా ఒత్తిడి చేస్తుంది. పోగుపడిన లాభాలను తిరిగి నిరంతరం పెట్టుబడి పెట్టడం ఉత్పత్తి స్థాయిలో నిరంతర పెరుగుదలకు దారి తీస్తుంది. మార్క్స్ దానిని విస్తృత పునరుత్పత్తి అని పిలిచాడు.

## సంపూర్ణ పేదరికం, సాపేక్ష పేదరికం

విస్తృత పునరుత్పత్తిలో సంభవించే ఒక ముఖ్యమైన ధోరణి కార్మికుల పేదరికం. పెట్టుబడిదారులు లాభాలు పెంచుకోవడానికి మార్కెట్ లో ఒకరితో ఒకరు పోటీ పడుతూ ఒత్తిడిలో ఉంటారు. లాభాలు పెంచుకోవడానికి రెండు మార్గాలు ఉన్నాయి. 1) పని సమయాన్ని పొడిగించడం, తద్వారా అదనపు శ్రమకాలం పెరుగుతుంది. 2) యాంత్రీకరణ వలన ఉత్పాదకత పెరుగుతుంది, తద్వారా అవసర శ్రమకాలం తగ్గుతుంది.

పని దినం నిడివి పెంచడం, పనిభారాన్ని పెంచడం, వేతనాలలో కోత విధించడం వంటి చర్యలు కార్మికులను పూర్తిగా పేదరికంలోకి నెడతాయి. అందువల్ల వీటిని సంపూర్ణ అదనపు విలువను పెంచే పద్ధతులు అంటారు. సంపూర్ణ అదనపు విలువను పెంచే పద్ధతిలో దోపిడీ చేయడం వల్ల కార్మికుల జీవన ప్రమాణాలు క్షీణిస్తాయి. అందువల్ల, కార్మికులు ఈ చర్యలను తీవ్రంగా ప్రతిఘటిస్తారు.

పెట్టుబడిదారులు యాంత్రీకరణ చేయడం ద్వారా సాపేక్ష అదనపు విలువను పెంచుకోవడానికి ప్రయత్నిస్తారు. యాంత్రీకరణ వలన ఉత్పాదకత పెరిగి కార్మికులను సంపూర్ణ పేదలుగా చేయకుండానే అదనపు విలువను పెంచుకోవడానికి పెట్టుబడి దారులకు అవకాశం ఏర్పడుతుంది. అయినప్పటికీ, ఉత్పత్తి చేయబడిన విలువలో కార్మికుల వాటా తగ్గుతుంది. పెట్టుబడిదారీ వృద్ధి ప్రక్రియలో సంపూర్ణ పేదరికం, లేదా సాపేక్ష పేదరికం అనేది అనివార్యంగా ఉంటుంది.

### యాంత్రీకరణ, నిరుద్యోగం

వెనుకబాటులో ఉన్న చిన్న ఉత్పత్తిదారులు, సంస్థలు యాంత్రీకరణ వలన దివాలా తీస్తాయి. ఫలితంగా నిరుద్యోగం పెరుగుతుంది. నిరుద్యోగం లేకుండా పెట్టుబడిదారీ విధానం మనుగడ సాగించలేదు. అందరికి ఉపాధి లభిస్తే శ్రమశక్తి డిమాండ్ పెరిగి వేతనాలు శ్రమశక్తి విలువ కంటే ఎక్కువగా పెరుగుతాయి. పెట్టుబడిదారుల లాభం దెబ్బతింటుంది. అందుకే పెట్టుబడిదారీ వ్యవస్థ నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తుంది. మార్క్స్ నిరుద్యోగులను ఇండస్ట్రియల్ రిజర్వ్ ఆర్మీగా వర్ణించాడు, అవసరమైనప్పుడు పనిలోకి పిలవవచ్చు.

### లాభం రేటు తగ్గే ధోరణి

నిరంతరం జరిగే యాంత్రీకరణ ఫలితంగా స్థిర పెట్టుబడి (C) నిష్పత్తి, మొత్తం పెట్టుబడిలో (C+V) పెరుగుతుంది. స్థిర పెట్టుబడి (C) అస్థిర పెట్టుబడి (V) మధ్య నిష్పత్తిని పెట్టుబడి యొక్క అంతర్గత పొందిక అంటారు. ఇతర అంశాలలో మార్పు లేనప్పుడు C/Vలో పెరుగుదల ఉంటే లాభం రేటు (S/C+V) క్షీణిస్తుంది. పెట్టుబడి పోగుపడటం పెరిగే కొద్దీ లాభం రేటు తగ్గే ధోరణి ఉంటుందని మార్క్స్ చెప్పారు.

## III
## పెట్టుబడిదారీ విధానం - చక్రీయ సంక్షోభం

ఉత్పత్తి చేయబడిన సరుకులు అమ్ముడుపోకుండా, ఉత్పత్తైన విలువను పొందడం సాధ్యం కాదు. దీంతో పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో సంక్షోభం ఏర్పడుతుంది. విస్తృత పునరుత్పత్తి ముందుకు సాగాలంటే, ఉత్పత్తి చేయబడిన ఉత్పత్తి సాధనాలు, వినియోగ సరుకులు మొత్తం మార్కెట్లో అమ్ముడుపోవాలి. బూర్జువా ఆర్థికవేత్తలు సంక్షోభ పరిస్థితి ఎన్నటికీ రాదని, ఎందుకంటే సరఫరా అనేది స్వతహాగానే డిమాండ్ ను సృష్టించుకుంటుదని వాదించారు. ఉత్పత్తి, డిమాండ్ ఒకే వేగంతో విస్తరిస్తాయన్నారు. వారి వాదన చార్ట్ 5లో వివరించబడింది.

## చార్ట్ 5

### ఉత్పత్తి, డిమాండ్ ఒకే నిష్పత్తిలో పెరుగుతున్నప్పుడు పెట్టుబడి పోగుపడటం గురించి వివరించే నమూనా పట్టిక

| సంవత్సరం | ఉత్పత్తి | డిమాండ్ | విక్రయించబడని స్టాక్ |
|---|---|---|---|
| 1 | 100 | 100 | 0 |
| 2 | 120 | 120 | 0 |
| 5 | 150 | 150 | 0 |
| 7 | 200 | 200 | 0 |

పెట్టుబడి పోగుపడటం కొనసాగుతున్నందున అధికోత్పత్తి అనివార్యమని మార్క్స్ అంచనా వేశారు. డిమాండ్ రెండు రకాలుగా ఉంటుంది. 1) పెట్టుబడిదారుల నుండి ఉత్పత్తి సాధనాలకు డిమాండ్, 2) కార్మికుల నుండి వినియోగ సరుకులకు డిమాండ్. ఈ రెండు రకాల డిమాండ్లు ఉత్పత్తి పెరిగినంత వేగంగా పెరగవు.

**సాధారణ పద్ధతిలో పెట్టుబడి పోగుపడడం**

సాధారణ పద్ధతిలో పెట్టుబడి పోగుపడే విధానంలో జరిగే పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధిలో కూడా సంక్షోభాలు అనివార్యంగా ఎలా వస్తాయో మేము వివరిస్తాము.

ఈ పద్ధతిలో రెండు వర్గాలు మాత్రమే ఉంటాయి. పెట్టుబడిదారులు, కార్మికులు. సరళత కోసం కార్మికులు తమ ఆదాయాన్ని మొత్తం ఖర్చు చేస్తారని, పెట్టుబడిదారులు వారి ఆదాయాన్ని ఆదా చేస్తారని అనుకుందాం.

## చార్ట్ 6

**సాధారణ పద్ధతిలో పెట్టుబడిదారీ వృద్ధి, సంక్షోభం (కోట్లు)**

| సంవత్సరం | ఉత్పత్తి | డిమాండ్ | | | |
|---|---|---|---|---|---|
| | | ఉత్పత్తి సాధనాలు | వినియోగ వస్తువులు | మొత్తం | విక్రయించ బడని స్టాక్ మొత్తం |
| I | 100 | 60 | +40 | 100 | 0 |
| II | 120 | 72 | +48 | 120 | 0 |
| III&IV | – | – | – | – | – |
| V | 150 | 95 | +55 | 150 | 0 |
| VI&VII | – | – | – | – | – |
| VIII | 200 | 130 | + 60 | 190 | 10 |

మొదటి సంవత్సరంలో మొత్తం ఉత్పత్తి రూ. 100 కోట్లు, ఇందులో రూ. 60 కోట్లు ఉత్పత్తి సాధనాలు, రూ. 40 కోట్లు వినియోగ సరుకులు. మొత్తం ఉత్పత్తులు మార్కెట్‌కు వస్తాయి. డిమాండ్ ఉంటే రూ. 60 కోట్ల ఉత్పత్తి సాధనాలు, రూ. 40 కోట్లు వినియోగ సరుకులు విక్రయించబడుతాయి. అలా మొత్తం సరుకులు విక్రయించడితే, ఉత్పత్తి, డిమాండ్ సమానంగా ఉన్నట్లు. అది రూ. 100కోట్లు.

రెండవ సంవత్సరంలో ఉత్పత్తి రూ. 120 కోట్లకు పెరిగింది. ఉత్పత్తి 20 శాతం పెరిగినందున డిమాండ్ కూడా 20 శాతం పెరగాలి.

మనం చార్ట్ 6లో చూస్తున్నట్లుగా ఉత్పత్తి సాధనాలు, వినియోగ సరుకులు రెండింటికీ డిమాండ్ 20 శాతం పెరిగి వరుసగా రూ. 72 కోట్లు , రూ. 48 కోట్లకు చేరుకుంది. డిమాండ్‌లో ఈ నిష్పత్తిలో పెరుగుదల నిరవధికంగా కొనసాగదు అని మార్క్స్ వాదించారు. ఎందుకంటే మనం ఇంతకు ముందు చూసినట్లుగా, పెట్టుబడిదారుల వద్ద పెట్టుబడి పోగుపడ్డ కొద్దీ కార్మికుల ఆదాయం పూర్తిగా పడిపోవడం లేదా, సాపేక్షంగా తగ్గిపోవడం జరుగుతుంది.

### వినియోగశక్తి తగ్గుదల

చార్ట్‌లో మనం చూసాం సాధారణంగా జరిగే పెట్టుబడిదారీ ఉత్పత్తి

విధానంలో మొదటి సంవత్సరం ఉత్పత్తి కంటే 5వ సంవత్సరపు ఉత్పత్తి రూ. 150 కోట్లకు లేదా 50 శాతం పెరుగుతుంది. కానీ కార్మికుల ఆదాయం ఆ నిష్పత్తిలో పెరగలేదు. అందువల్ల రూ. 60 కోట్లు ఉండాల్సిన వినియోగ సరుకుల డిమాండ్ రూ. 55 కోట్లే ఉంది. ఫలితంగా, రూ. 5 కోట్ల విలువైన సరుకులు అమ్ముడుపోకుండా మిగిలిపోయాయి.

అయినప్పటికీ, మా ఈ ఉత్పత్తి పద్ధతిలో ఉత్పత్తి చేయబడిన సరుకులన్నీ మార్కెట్లో అమ్ముడు పోయాయని, అమ్ముడు కాకుండా అదనంగా మిగిలిన రూ. 5 కోట్ల విలువైన సరుకులను ఉత్పత్తి సాధనాలుగా పెట్టుబడిదారీ వర్గం కొనుగోలు చేయాలని నిర్ణయించింది కాబట్టి సంక్షోభం నివారించబడిందని అంటారు. వినియోగంతో సంబంధం లేకుండా ఉత్పత్తి స్వతంత్రంగా కొనసాగుతుందని వాదించే ఆర్థికవేత్తలు కూడ ఉన్నారు.

## లాభం, పెట్టుబడి రేట్లలో క్షీణత

అయితే, కొన్ని కారణాల వల్ల, లాభాల రేటు తగ్గుతుందని పెట్టుబడిదారులు కనుక భయపడితే సంక్షోభాన్ని నివారించడానికి ఉన్న మార్గం కూడా మూసివేయ బడుతుంది.

పెట్టుబడి ఎక్కడ, ఎంత పెట్టాలనే నిర్ణయం పెట్టుబడిదారులు వ్యక్తిగతంగా తీసుకుంటారు. లాభం రేటు పడిపోవడం వల్ల ప్రతి ఒక్క పెట్టుబడిదారు అధిక ఉత్పత్తి నుండి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తారు. కాబట్టి, కొంత కాలానికి ఉత్పత్తి పెరుగుదలకు అనుగుణంగా పెట్టుబడి పెట్టడం వెనకబడుతుంది.

చార్ట్ 6లో VIII వ సంవత్సరం నాటికి ఆర్థిక వ్యవస్థలో మొత్తం ఉత్పత్తి రూ. 100 కోట్ల నుండి రూ. 200 కోట్లకు పెరిగి రెట్టింపయింది. వినియోగ డిమాండ్ కూడా పెరుగుతుంది. కానీ 50 శాతం మేర మాత్రమే, రూ. 40కోట్ల నుండి రూ. 60 కోట్లు పెరిగింది. పెట్టుబడి డిమాండ్ (ఉత్పత్తి సాధనాల డిమాండ్) రూ. 140 కోట్లకు పెరిగి ఉంటే మొత్తం ఉత్పత్తి, డిమాండ్ సమానంగా ఉండేవి. కానీ పెట్టుబడి డిమాండ్ (ఉత్పత్తి సాధనాల డిమాండ్) కేవలం రూ. 130 కోట్లకే పెరిగింది. కాబట్టి రూ. 10 కోట్ల విలువైన సరుకులు అమ్ముడుపోలేదు. దీనినే అధికోత్పత్తి సంక్షోభం అంటారు.

## సంక్షోభ చక్రం

ఒక్కసారి అధికోత్పత్తి దిగ్మండలంపై కనిపించిగానే ప్రతి పెట్టుబడిదారుడు కార్మికులను పనిలో నుండి తొలగించి, ఉత్పత్తిని తగ్గించడం ద్వారా తన నష్టాలను తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తాడు. దీంతో నిరుద్యోగం పెరుగుతుంది, కార్మికుల

ఆదాయం తగ్గుతుంది. ఫలితంగా వినియోగ సరుకుల డిమాండ్ మరింత తగ్గుతుంది. ఇది వినియోగ సరుకుల డిమాండ్‌ను మాత్రమే కాకుండా ఉత్పత్తి సాధనాల డిమాండ్ ను కూడా మరింత తగ్గించడానికి దారి తీస్తుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ డిమాండ్, ఉపాధి, ఉత్పత్తి క్షీణించే విషవలయంలో పడిపోతుంది.

నిరుద్యోగం వేతనాలను తగ్గిస్తుంది. వినియోగ సరుకులకు డిమాండ్ లేకపోవడంతో ముడి సరుకుల ధరలు తగ్గుతాయి. పెట్టుబడికి డిమాండ్ తగ్గడం వల్ల వడ్డీ రేట్లు తగ్గుతాయి. ఫలితంగా, లాభాల అంచనాలు పెరిగి, పెట్టుబడి పెరగడం ప్రారంభమవుతుంది. ఫలితంగా, ఉపాధి, ఉత్పత్తులకు డిమాండ్ తిరిగి పుంజుకునే వలయం ఆరంభమవుతుంది.

పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ వృద్ధి పెరుగుతూ శిఖరాగ్రానికి చేరుతుంది, కానీ ఆ తర్వాత మళ్లీ క్రిందికి దిగజారడం ప్రారంభమవుతుంది. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ పెరుగుదల ప్రతి చక్రంలో 1) పెరుగుదల 2) స్తబ్దత అనే రెండు దశలు ఉంటాయి. పెరుగుదల దశ కోలుకోవడం, విస్తరణ అనే రెండు అంశాలను కలిగి ఉంటుంది, ఇది గరిష్ట స్థాయికి చేరుకుంటుంది. అలాగే స్తబ్దత దశ కూడా మాంద్యం, సంక్షోభం అనే రెండు అంశాలను కలిగి ఉంటుంది. సంక్షోభంతో పెట్టుబడిదారి వ్యవస్థ పెరుగుదల అథోస్థాయికి చేరుకుంటుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థ వృద్ధి అటువంటి వరుసగా, అనివార్యంగా సంభవించే చక్రీయ సంక్షోభాల ద్వారా జరుగుతుంది. ప్రతి విస్తరణ స్తబ్దతను పెంచితే, స్తబ్దత విస్తరణ విత్తనాలను తనలో దాచుకుని ఉంటుంది.

## చార్ట్ 7


## వ్యాపార చక్రం

ఉచ్ఛ స్థాయి ఉచ్ఛ స్థాయి

విస్తరణ మాంద్యం విస్తరణ మాంద్యం

డిప్రెషన్ పుంజుకోవడం

తీవ్ర స్థాయి




## IV

## పెట్టుబడిదారీ విధానం అత్యున్నత దశ - సామ్రాజ్యవాదం

మనం గమనించినట్లు పెట్టుబడిదారీ వ్యవస్థలో పెట్టుబడిదారుల మధ్య పోటీ, అసమర్థ సంస్థలు దివాలా తీయడానికి దారితీస్తుంది. సంక్షోభ సమయంలో ఇది ఒక అంటువ్యాధిలా మారుతుంది. ఫలితంగా కొన్ని సంస్థల వద్ద పెట్టుబడి కుప్పలు తెప్పలుగా పేరుకుపోయి ఆధిపత్య సంస్థలుగా, గుత్తాధిపత్య సంస్థలుగా రూపాంతరం చెందుతాయి. సాధారణంగా మార్కెట్లో ఉండే డిమాండ్ సరఫరాలు ధరలను నియంత్రిస్తాయి. ఏ ఒక్క ఉత్పత్తిదారుడో లేదా కొనుగోలుదారుడో ధరలను ప్రభావితం చేయలేరు. కానీ ఒక పెట్టుబడిదారీ సంస్థ గుత్తాధిపత్య సంస్థగా మారినప్పుడు, అది ధరలను నియంత్రించగలదు. ధరలను పెంచడం, ఉత్పత్తిని తగ్గించడం ద్వారా లాభాలను పెంచుకోవడానికి ప్రయత్నిస్తుంది.

అందువలన, పోటీ గుత్తాధిపత్యానికి దారి తీస్తుంది. 19వ శతాబ్దం చివరి నాటికి పెట్టుబడిదారీ విధానంలో గుత్తాధిపత్యం ప్రధాన లక్షణంగా మారిందని లెనిన్ పేర్కొన్నాడు. పెట్టుబడిదారీ దేశాలలోని వివిధ పారిశ్రామిక రంగాలలో ఉత్పత్తిని గుత్తాధిపత్య సంస్థలు నియంత్రిస్తున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ స్వేచ్ఛా పోటీ దశ నుండి గుత్తాధిపత్య దశకు చేరుకుంది. సామ్రాజ్యవాదం మొదటి లక్షణం గుత్తాధిపత్య సంస్థలు ఏర్పడటం.

రెండవ లక్షణం, ద్రవ్య పెట్టుబడి ఆవిర్భావం. పెట్టుబడిని సాధారణంగా దాని ఆర్థిక కార్యకలాపాల స్వభావాన్ని బట్టి. 1) వాణిజ్య పెట్టుబడి, 2) పారిశ్రామిక పెట్టుబడి, 3) బ్యాంకింగ్ పెట్టుబడి గా వర్గీకరిస్తారు. కానీ 19వ శతాబ్దం నాటికి, పారిశ్రామిక పెట్టుబడి గుత్తాధిపత్య సంస్థలు ఉద్భవించడమే కాకుండా, బ్యాంకింగ్ పెట్టుబడితో కలిసిపోయి, ద్రవ్య పెట్టుబడి అనే కొత్త హైబ్రిడ్‌ను సృష్టించింది. కొంత

కాలానికి ద్రవ్య పెట్టుబడి ప్రత్యక్ష ఉత్పత్తి, వ్యాపార కార్యకలాపాల నుండి విరమించుకుని, బయటి నుండి ఉత్పత్తిని నియంత్రిస్తూ, స్వతంత్రంగా వ్యవహరించే పాత్రను పోషిస్తున్నది.

ద్రవ్య పెట్టుబడి ఆవిర్భావంతో, వలస దేశాలకు పెట్టుబడుల ఎగుమతి పెరిగింది. అప్పటి వరకు పెట్టుబడిదారులు తమ స్వదేశాల్లో పెట్టుబడులు పెట్టి, ఉత్పత్తి చేసిన సరుకులు ఎగుమతి చేయడం అనేది సాధారణ పద్ధతిగా ఉంది. ఈ పద్ధతిలో వాణిజ్యం విస్తరిస్తూనే ఉంది. కానీ ద్రవ్య పెట్టుబడి వలన పెట్టుబడుల ఎగుమతి అనేది మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంది.

పై పరిణామాలన్నీ వలసవాద చట్రంలో జరిగాయి. సామ్రాజ్యవాద దేశాలు ప్రపంచాన్ని జయించాయి, విభజించుకున్నాయి. వలసల పునర్విభజన కోసం సామ్రాజ్యవాద దేశాల మధ్య ఏర్పడిన పోటీ ఫలితంగా యుద్ధాలు ప్రారంభమయ్యాయి.

ఈ కొత్త పరిణామాలను సమగ్రంగా అంచనా వేయడం ద్వారా పెట్టుబడిదారీ విధానపు కొత్త దశను సామ్రాజ్యవాదంగా లెనిన్ నిర్వచించారు. సామ్రాజ్యవాదం కంటే ముందునుండే వలసవాదం ఉందనేది మన గమనంలో ఉండాలి. వలసవాద చట్రంలోనే సామ్రాజ్యవాదం అభివృద్ధి చెందింది. వలసవాదం వలస దేశాలను దోచుకొని ఆ దేశాలు వెనుకబడిపోవడానికి కారణం అయింది. సామ్రాజ్యవాదం వైరుధ్యాలకు పెట్టిన పదును జాతీయ విముక్తి ఉద్యమాలకు దారితీసింది. 20వ శతాబ్దం మధ్య కాలంలో వలస విముక్తి ప్రక్రియ వేగవంతమైంది.

వలసలు స్వతంత్ర దేశాలుగా అవతరించినప్పటికీ సామ్రాజ్యవాదుల పట్టు కొనసాగుతోంది. నయా వలసవాదం అనేది సామ్రాజ్యవాద దోపిడీ చట్రం. ఐరోపాలో సోషలిస్టు వ్యవస్థ పతనం, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ దశకు నాంది పలికింది. పెట్టుబడి ప్రవాహానికి జాతీయ స్థాయిలో ఉండే అవరోధాలను తొలగించింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అపూర్వమైన రీతిలో ద్రవ్యీకరించి, ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యాన్ని నెలకొల్పింది.

మార్క్సిస్టు రాజకీయ అర్థశాస్త్రం అనేది కేవలం పెట్టుబడిదారీ దోపిడీ స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి, శ్రామిక జనాభాను సమీకరించడానికి మాత్రమే కాదు, పెట్టుబడిదారీ వ్యవస్థలో పెట్టుబడి పోగుపడటం గురించి, సంక్షోభం అనివార్యత గురించి వెల్లడిస్తుంది. ప్రతి సంక్షోభం పెట్టుబడిదారీ విధానపు అసంబద్ధతను బహిర్గతం చేయడానికీ, ప్రజలలో అవగాహన పెంచడానికీ అవకాశాన్ని కల్పిస్తుంది. సామ్రాజ్యవాదం అనే భావన సమకాలీన పెట్టుబడిదారీ దోపిడీ విధానాల స్వభావాన్ని, దాని వైరుధ్యాలను అర్థం చేసుకోవడానికి మనకు సహాయం చేస్తుంది.

(2)

# ద్రవ్య పెట్టుబడి, సమకాలీన సామ్రాజ్యవాదం

ద్రవ్య పెట్టుబడి గురించి ఒక శతాబ్దం క్రితం లెనిన్ తన రచనలో "ద్రవ్య పెట్టుబడి అనేది బ్యాంకు పెట్టుబడి, పారిశ్రామిక పెట్టుబడి సమ్మేళనం" అని చెప్పాడు. బ్యాంకుల, పారిశ్రామిక సంస్థల డైరెక్టర్ల బోర్డులో కూర్చున్న ద్రవ్య అరాచక ముఠా, ద్రవ్య పెట్టుబడికి అధ్యక్షత వహిస్తుందన్నాడు. లెనిన్ భావనలు సామ్రాజ్యవాద దేశాల మధ్య శత్రుత్వం నేపథ్యంలో ఉన్నాయి, ఆ దశలో వివిధ అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల ద్రవ్య పెట్టుబడులు, ద్రవ్య అరాచక ముఠాలు రెండూ దేశ ఆధారితమైనవి, ఇతర అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలతో "ఆర్థిక భూభాగం" కోసం ఘర్షణలో మునిగి ఉన్న సమయమది.

అయితే సమకాలీన పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యం నెమ్మదించబడిన దశగా నిర్వచించించబడుతున్నది. ఈ నెమ్మదించబడటం అనేది ఎలాంటి ఒప్పందం లేకుండానే పెట్టుబడిదారీ శక్తుల మధ్య శాంతియుతంగా ప్రపంచం విభజించడానికి ప్రాతిపదికను సృష్టించింది. కార్ల్ కౌట్స్కీ దీనిని "అల్ట్రా- సామ్రాజ్య వాదం" అని వర్ణించాడు. కాని అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి ఏదేని ఒక దేశాన్ని ఆధారం చేసుకోవాల్సిన అవసరం లేదు. ప్రపంచం వివిధ పొరలుగా విభజించబడి, వివిధ రకాల ప్రభావాల కింద ఉండాలని కోరుకోదు, వాస్తవానికి అటువంటి విభజనలన్నింటినీ తొలగించాలని కోరుకుంటుంది, తద్వారా అది ప్రపంచవ్యాప్తంగా స్వేచ్ఛగా తిరగ గలుగుతుంది. సమకాలీన ద్రవ్య పెట్టుబడి ప్రపంచీకరించబడింది (అంటే అంతర్జాతీయ స్వభావం కలిగి ఉంది); లెనిన్ కాలంలో వలె ఏ జాతీయ

సామ్రాజ్యవాద వ్యూహంలో భాగం కాదు; ఇది పారిశ్రామిక ఉత్పత్తిలో మాత్రమే కాకుండా అనేక ఊహాగానాలను బలంగా కల్పించి ఆస్తుల ధరలను కృత్రిమంగా పెంచే బుడగలను సృష్టిస్తుంది.

ఇంకా ఏమిటంటే, సమకాలీన ద్రవ్య పెట్టుబడి కేవలం తాను ప్రపంచీకరించ బడటమే కాకుండా, వాస్తవానికి "ఉత్పత్తిని ప్రపంచీకరించే" పరిస్థితిని సృష్టిస్తుంది. అనగా ఉత్పాదక కార్యకలాపాలను అభివృద్ధి చెందిన దేశాల నుండి తక్కువ వేతనాలు ఉన్న మూడవ ప్రపంచ దేశాలకు తరలించడానికి కారణం అయింది. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంకు వంటి ప్రపంచ ఆర్థిక సంస్థల సహాయంతో నయా–ఉదారవాద విధానాలను అమలు చేయాలని మూడవ ప్రపంచ దేశాలను బలవంతం చేస్తుంది. దీనిని ఆ దేశాలపై ఆర్థిక క్రమశిక్షణ విధించడంగా పిలుస్తున్నారు.

నయా–ఉదారవాద క్రమాన్ని విధించడం, నయా–ఉదారవాద వ్యూహాన్ని విస్తృతంగా అమలు చేయడం ద్వారా, అంతకుముందు అమలులో ఉన్న ఆంక్షలతో కూడిన రక్షణాత్మక వ్యూహాన్ని నిర్మూలించి, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం కిందకి తీసుకొచ్చింది. ఇది ఆధిపత్యానికి ప్రతిఫలనం, అదే సందర్భంలో ఆధిపత్య వాదనను నొక్కిచెప్పే ఒక సాధనం కూడా. నయా – ఉదారవాద క్రమాన్ని అమలు చేస్తున్న సమకాలీన సామ్రాజ్యవాదం వెనుక అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం ఉంది. రెండు ప్రపంచ యుద్ధాల వలన, రెండు ప్రపంచ యుద్ధాల మధ్య కాలంలో సంభవించిన మహా మాంద్యం, సంక్షోభం వల్ల సామ్రాజ్యవాదం బలహీనపడింది. వలసలు విముక్తి కావడం, అభివృద్ధి చెందిన దేశాల్లో సార్వత్రిక ఓటు హక్కును ప్రవేశపెట్టడం, సంక్షేమ రాజ్య చర్యలను స్వీకరించడం, అధిక స్థాయిలో రాజ్యం ఆర్థిక కార్యకలాపాలను కొనసాగించడానికి కీనీషియన్ "డిమాండ్ మేనేజ్‌మెంట్" పద్ధతిని అమలుచేయడం వంటి రాయితీలు ఇవ్వడం ద్వారా రెండవ ప్రపంచ యుద్ధం ముగింపు దశలో సోషలిస్టు శిబిరం ప్రభావాన్ని, వ్యాప్తిని అడ్డుకుని, తన అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి ప్రయత్నం చేసింది.

పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ ఈ సవాలును ఎదుర్కొని తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటున్న తరుణంలో అమెరికా, యూరోపియన్ బ్యాంకుల్లో భారీగా పేరుకుపోయిన ద్రవ్య నిల్వలు లాభదాయకమైన అవకాశాల కోసం ప్రపంచమంతా స్వేచ్ఛగా తిరగాలని కోరుకుంటున్నాయి. అప్పటికి ఉనికిలో ఉన్న అంతర్జాతీయ ద్రవ్య నియంత్రణ సంస్థ బ్రెట్టన్ వుడ్స్ ప్రపంచీకరణకు అడ్డంకిగా మారింది. ఎందుకంటే ఆ సంస్థ వాణిజ్యంపై, పెట్టుబడులపై నియంత్రణ విధించడానికి దేశాలకు

అనుమతిచ్చింది. ఆయా దేశాలు నియంత్రణలను అమలు చేస్తున్నాయి. అప్పటి వరకు కాగితపు కరెన్సీ ముద్రణకు బంగారం ప్రాతిపదికగా ఉండేది, బంగారానికి బదులుగా అమెరికా డాలర్‌ను ప్రాతిపదికగా పరిగణించవచ్చు అని బ్రెట్టెన్ వుడ్స్ సంస్థ 'డాలరు బంగారంతో సమానం' అంటూ ఒక నిర్ణయం చేసింది (అధికారికంగా $ 35 అమెరికా డాలర్‌లను ఒక ఔన్సు బంగారంగా మార్చుకోవచ్చు అని బ్రెట్టన్ వుడ్స్ సంస్థ నిర్ణయించింది). ఈ నిర్ణయం బ్రెట్టెన్ వుడ్స్ సంస్థ ఉనికినే దెబ్బ తీసింది. ఎందుకంటే ఈ చర్య వలన బ్యాంకుల చేతిలో భారీ ద్రవ్య నిల్వలు ఏర్పడ్డాయి. అమెరికా డాలర్ల ప్రవాహం మొదలైంది.

ఆంక్షలతో కూడిన రక్షణాత్మక వ్యూహం లోని వైరుధ్యాల వలన, అభివృద్ధి చెందిన దేశాల్లో యుద్ధానంతరం ద్రవ్యోల్బణం ఏర్పడింది. బ్యాంకుల వద్ద పోగుడిన ద్రవ్య పెట్టుబడి, రక్షణాత్మక వ్యూహాన్ని అప్రతిష్టపాలు చేయడానికి ఈ ద్రవ్యోల్బణ పరిస్థితిని ఉపయోగించుకుని నయా – ఉదారవాద విధానాల్ని ప్రపంచంపై రుద్దింది. ఆ విధంగా పాత, అనియంత్రిత, యాదృచ్ఛిక పెట్టుబడిదారీ విధానానికి పునర్జీవం పోసింది.

నయా – ఉదారవాద కాలంలో మనం చూస్తున్నదేమిటంటే రక్షణాత్మక ఆర్థిక వ్యూహం అమలులో ఉన్నప్పుడు అభివృద్ధి చెందిన దేశాలలో కార్మికవర్గం సాధించుకున్న అనేక ప్రయోజనాలు వెనక్కి తీసుకోబడుతున్నాయి. మూడవ ప్రపంచ దేశాలలో జాతీయ నియంత్రణలో ఉన్న సహజ వనరులు, ఆహారధాన్యాల స్వయం సమృద్ధి, అభివృద్ధి చెందిన దేశాల పెట్టుబడి దాడి నుండి రక్షించేందుకు, సాంకేతిక పునాదిని నిర్మించేందుకు దోహదపడిన ప్రభుత్వరంగ సంస్థలు వంటి వ్యవస్థలు వెనక్కి నెట్టబడుతున్నాయి.

నయా – ఉదారవాదం ఏలుబడిలో వస్తువులు, సేవలు, పెట్టుబడులు (ద్రవ్య పెట్టుబడితో సహా) ఎలాంటి నిబంధనలు లేకుండా దేశాల సరిహద్దులు దాటి స్వేచ్ఛగా ప్రవహిస్తాయి. దీని అర్థం ఏమిటంటే, ప్రపంచీకరించబడిన లేదా అంతర్జాతీయీ కరించబడిన పెట్టుబడి జాతీయ ప్రభుత్వంతో తలపడుతుంది. దీని వలన కలిగే ఫలితం ఒకటే. జాతీయ ప్రభుత్వం ఎల్లప్పుడూ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ("పెట్టుబడిదారుల విశ్వాసాన్ని" నిలుపుకోవాలి) డిమాండ్‌లకు అంగీకరించాలి. అలా చేసినపుడు ఆర్థిక సంక్షోభానికి దారితీసేలా దేశం నుండి భారీ పెట్టుబడులు బయటికి వెళ్ళవు. ఇది ప్రభుత్వాల సార్వభౌమాధికారాన్ని దెబ్బతీస్తుంది, ప్రభుత్వ వర్గ లక్ష్యాన్ని సంకుచింపచేసి, ప్రజాస్వామ్యాన్ని కుదించేస్తుంది.

ప్రభుత్వాలు సార్వభౌమాధికారాన్ని కోల్పోయి అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి

ఆదేశాలను తప్పనిసరిగా పాటించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ ఆదేశాలకు ద్రవ్య పెట్టుబడి స్వంత దేశంతో ఎలాంటి సంబంధం ఉండదు. ఈ ఆదేశాలు నయా–ఉదా రవాద ఎజెండాలో భాగంగా రూపొందించబడుతాయి. అదేవిధంగా, ప్రపంచ ద్రవ్య పెట్టుబడి ప్రవాహాల సుడిగుండం నుండి బయటపడలేక వామపక్షాలు మినహా అన్ని రాజకీయ నిర్మాణాలు ఒకే ఆర్థిక ఎజెండాను అనుసరిస్తాయి. ప్రజాస్వామ్యం కుంచించుకుపోయి ప్రత్యామ్నాయ ఆర్థిక ఎజెండాలే ప్రజలకు లేవు అనే ప్రచారం మధ్య నిజమైన ప్రత్యామ్నాయం ఎంపిక చేసుకునే అవకాశం తిరస్కరించబడుతుంది. ఇది ప్రజా సార్వభౌమత్వాన్ని అపహాస్యం చేస్తుంది. ప్రజాస్వామ్యాన్ని సమర్థించే ప్రజల సార్వభౌమాధికారం, ప్రపంచీకరణ ద్రవ్య పెట్టుబడి సార్వభౌమాధికారంతో భర్తీ చేయబడుతుంది. ఇది నయా–ఉదారవాదంలో రాజ్యపు వర్గ ధోరణిలో వచ్చిన మార్పు, అయితే దీనిపై సవివరమైన చర్చ అవసరం.

## II

అంతకు ముందున్న బూర్జువా రాజ్యం చేసినట్లు వర్గాలకు అతీతంగా ఉంటూ అవసరమైనప్పుడల్లా ఒక ప్రత్యేక వర్గానికి అనుకూలంగా జోక్యం చేసుకునే బదులు, నయా – ఉదారవాదం ప్రభావంలో ఉన్న రాజ్యం ప్రపంచీకరించబడిన పెట్టుబడితో కలిసిపోయిన దేశీయ కార్పొరేట్–ద్రవ్య కులీన ముఠాకు అనుకూలంగా జోక్యం చేసుకుంటుంది. దీనర్థం "శ్రామిక ప్రజలకు" (కార్మికులు, రైతులు, చిన్న ఉత్పత్తిదారులు) మద్దతు, రక్షణ చర్యలను ఉపసంహరించు కోవడం. నిజమే, ఈ ఉపసంహరణలు అకస్మాత్తుగా జరిగినవి కాదు. ఇవి కాలక్రమేణా జరుగుతున్నవి. తప్పుడు ఆశలు, తప్పుడు వాగ్దానాలతో మభ్యపెట్టడం ద్వారా జరుగుతుంది. కానీ, నయా–ఉదారవాద యుగంలో ఇది తప్పించుకోలేని ధోరణి.

ఉదాహరణకు భారతదేశంలో ఆహార ధాన్యాలకు మద్దతు ధర ఉపసంహరణ ఇంకా జరగలేదు, వాణిజ్య పంటలకు మద్దతు ఉపసంహరణ జరిగింది. మోడీ ప్రభుత్వం మూడు రైతు వ్యతిరేక చట్టాలను తెచ్చి అపఖ్యాతి పాలైంది. ఆ వ్యవసాయ చట్టాల ద్వారా ఆహారధాన్యాలకు మద్దతు ధర ఉపసంహరణకు ప్రయత్నించినప్పుడు, దృడ సంకల్పంతో రైతులు సాగించిన పోరాటానికి భయపడి ప్రభుత్వం తాత్కాలికంగా వెనక్కి తగ్గవలసి వచ్చింది. అంతర్జాతీయ వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపార ఆధిపత్యానికి రైతు వ్యవసాయం లొంగిపోవడం, సాధారణంగా చిన్న ఉత్పత్తి పెద్ద పెట్టుబడిదారీ ఆక్రమణకు గురికావడం అనేది నయా–ఉదారవాదం యుగంలో తప్పించుకోలేని

ధోరణి. కానీ భారతదేశం దానిని పూర్తిగా అమలు చేయడానికి సమయం తీసుకుంది, ఇంకా ఆ ప్రక్రియ పూర్తి కాలేదు (మోడీ ప్రభుత్వం 'ఉచితాలను' తగ్గించే ప్రయత్నం రైతు వ్యవసాయాన్ని అణచివేసే ఎజెండాను మరింత ముందుకు తీసుకెళ్లడానికి మరొక గట్టి ప్రయత్నమే).

రైతు వ్యవసాయాన్ని నాశనం చేయడం ఇంకా పూర్తి కానప్పటికీ, ఇన్‌పుట్ సబ్సిడీని ఉపసంహరించుకోవడం, వాణిజ్య పంటలకు మద్దతు ధర ఉపసంహరణ వంటి చర్యల ద్వారా, విద్య, ఆరోగ్యం వంటి సేవలను ప్రైవేటీకరించడం ద్వారా వారి నిజ ఆదాయాన్ని పీల్చివేయడంతో రైతాంగం తీవ్ర కష్టాలను ఎదుర్కొంటుంది. పెద్ద ఎత్తున జరుగుతున్న రైతుల ఆత్మహత్యలు, కష్టాల్లో ఉన్న రైతులు ఉపాధిని వెతుక్కుంటూ పట్టణాలకు వలస వెళ్లడం లాంటి వాటిలో ఈ పరిణామం పర్యవసానాలు వ్యక్తమవుతున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం 1991, 2011 మధ్య కాలంలో "సాగుదారుల" సంఖ్య కోటి యాభై లక్షలు తగ్గింది. కొందరు వ్యవసాయ కూలీల స్థాయికి నెట్టబడితే, మరికొందరు ఉపాధి కోసం పట్టణాలకు, నగరాలకు వలస వెళ్లారు.

అదే సందర్భంలో, దిగుమతులపై సాపేక్షంగా ఆంక్షలు ఎత్తివేయడంతో దేశీయ ఉత్పత్తిలో సాంకేతిక మార్పు రేటు వేగవంతమైంది. ఇది పెట్టుబడిదారీ రంగంలో శ్రమ ఉత్పాదకత వృద్ధి రేటును పెంచింది. అందువల్ల భారతదేశంలో నయా-ఉదార వాదంలో జిడిపి వృద్ధి రేటు అంతకుముందున్న, ఆంక్షలతో కూడిన కాలంతో పోలిస్తే పెరిగినప్పటికీ, శ్రామిక ఉత్పాదకత వృద్ధి రేటు పెరుగుదల రేటు, ఉపాధి ఎంత మేరకు పెరిగిందని చూస్తే రెండింటి మధ్య వ్యత్యాసం ఉంది. వాస్తవానికి ఉపాధి పెరుగుదల రేటు మందగిస్తుంది. భారతదేశంలో నయా-ఉదారవాద కాలంలో ఉపాధి వృద్ధి రేటు సంవత్సరానికి 1 శాతంగా ఉంది. అంతకుముందు ఇది సగటున 2 శాతంగా ఉంది. జిడిపి వృద్ధి రేటు రెండింతలు పెరిగినప్పటికీ పరిస్థితి అలా ఉంది. ఉపాధి వృద్ధి రేటు శ్రామిక శక్తి సహజ వృద్ధి రేటు కంటే కూడా తక్కువగా ఉంది. అంటే, గ్రామీణ ప్రాంతాల నుండి వలస వచ్చినవారిని ఇముడ్చుకోలేక పోవడమే కాకుండా, అది ఇప్పటికే ఉపాధి పొందుతున్న శ్రామికశక్తిలో సహజ పెరుగుదలను కూడా ఇముడ్చుకోలేదు.

నయా-ఉదారవాద ఆర్థిక విధానాల అమలు ఫలితంగా మొత్తం శ్రామిక శక్తిలో పారిశ్రామిక రిజర్వ్ సైన్యం సాపేక్ష పరిమాణం పెరుగుతుంది. అయితే ఇది బహిరంగంగా నిరుద్యోగం పెరగడంగా కనిపించదు. పని పంపకం ద్వారా వ్యక్తమవు

తుంది. ఒకే పనిని ఎక్కువ మంది కార్మికులు చేస్తారు. తద్వారా ప్రతి ఒక్కరూ తక్కువ సంపాదిస్తారు. నయా-ఉదారవాద విధానాల వల్ల రైతు వ్యవసాయంతో సహా చిన్న ఉత్పత్తి విధానం అణచివేయబడుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థకి శ్రమశక్తిని ఇముడ్చుకునే సామర్థ్యం మందగించి, పారిశ్రామిక రిజర్వ్ సైన్యం సాపేక్ష పరిమాణం పెరుగుతుంది. దీంతో, ఆదాయ అసమానతలు పెరగడమే కాకుండా, శ్రామిక జనాభా సగటు నిజ ఆదాయం తగ్గిపోతుంది.

సగటు నిజ ఆదాయం తగ్గడం అనేది పేదరికం శాతం పెరగడాన్ని చూపుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో రోజుకు 2,200 కేలరీల శక్తి నిచ్చే ఆహారం వినియోగించలేని వ్యక్తుల జనాభా (గ్రామీణ భారతదేశంలో పేదరికానికి అసలు నిర్వచనం) 1993-4లో 58 శాతం నుండి 2011-2 నాటికి 68 శాతానికి పెరిగింది. పట్టణ ప్రాంతాల్లో రోజుకు 2,100 కేలరీల శక్తి నిచ్చే ఆహారం వినియోగించలేని వ్యక్తుల జనాభా (పట్టణ భారతదేశంలో పేదరికానికి అసలు అధికారిక నిర్వచనం) 1993-94లో 57 శాతం నుండి 2011-12లో 65 శాతానికి పెరిగింది. శ్రామిక జనాభా సగటు నిజ ఆదాయం క్షీణించినందున, ఆర్థిక వ్యవస్థలో శ్రామిక ఉత్పాదకత పెరిగినప్పటికీ, ఉత్పత్తిలో మిగులు నిష్పత్తి స్పష్టంగా పెరుగుతుంది. దీని కారణంగా ఆదాయ అసమానతలు పెరిగాయి. ఛాన్సెల్, పికెట్టీల అధ్యయనం ఇదే విషయాన్ని తెలియజేస్తుంది.

ఆదాయ అసమానతలు పెరుగుతున్న కొద్దీ డిమాండ్ స్వభావం మారుతుంది, డిమాండ్ అనేది శ్రామిక ప్రజలు వినియోగించే వస్తువుల నుండి, అదనపు విలువను స్వాధీనం చేసుకున్న వారు వినియోగించే వస్తువుల వైపు మారుతుంది. రెండోది మునుపటి కంటే తక్కువ ఉపాధి- ఎక్కువ దోపిడీ ఉండటం వలన, ఉపాధి వృద్ధి రేటును మరింత పరిమితం చేస్తుంది. పారిశ్రామిక రిజర్వ్ సైన్యం పెరిగే ధోరణిని మరింత బలపరుస్తుంది. ఇది కేవలం భారతదేశానికి మాత్రమే సంబంధించిన దృగ్విషయం కాదు. ప్రపంచవ్యాప్త దృగ్విషయం. ఇది నయా-ఉదారవాద పెట్టుబడిదారీ ఉత్పత్తి విధాన తర్కం నుండి ఉద్భవించింది.

ఇది ఈ చారిత్రక సందర్భంలో ఉన్న దృగ్విషయం. వలసవాద వ్యతిరేక పోరాటం కార్మికులు, రైతులే కాకుండా బూర్జువాలు, పట్టణ మధ్యతరగతి కూడా పాల్గొన్న బహుళ - వర్గ పోరాటం. రక్షణాత్మక ఆర్థిక వ్యూహ కాలంలో భారతదేశంలో, ఇతర ప్రాంతాలలో పెట్టుబడిదారీ విధానాన్ని నిర్మించే ప్రయత్నం జరిగినప్పటికీ, సామ్రాజ్యవాదం నుండి సాపేక్ష స్వయంప్రతిపత్తితో వ్యవహరించింది (ప్రభుత్వ రంగాన్ని నిర్మించడం, అలీన విదేశాంగ విధానాన్ని అనుసరించడం ఈ ప్రయత్నానికి నిదర్శనం).

ఈ ప్రయత్నంలో అది వర్గ కూటమి మద్దతును నిలుపుకుంది.

నయా – ఉదారవాదం, సామ్రాజ్యవాదపు కొత్త దశ అయినప్పటికీ దేశంలోని శ్రామిక ప్రజలపై సామ్రాజ్యవాదాన్ని పునరుద్ధరించింది. వలసవాద వ్యతిరేక వర్గ కూటమిని విచ్ఛిన్నం చేసింది. ఇది కేవలం బడా బూర్జువా వర్గానికి మాత్రమే కాకుండా, కార్పొరేట్ – ద్రవ్య కులీన ముఠాకు, అదనపు విలువపై జీవించే మధ్యతరగతి వర్గానికి కూడా మద్దతునిస్తుంది. ఆ విధంగా సామ్రాజ్యవాదం తన కొత్త దశలో మునుపటి దశ సామ్రాజ్యవాదంతో పోరాడిన వర్గ–కూటమిని విచ్ఛిన్నం చేయడమే కాకుండా, సమాజంలో కొత్త వర్గ విభజనను సృష్టించి, విస్తృతిని పెంచుతుంది. ఈ విభజనలో ఒక వైపు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడితో కలిసిపోయిన వారు, అంటే కార్పొరేట్లు – ద్రవ్య కులీన ముఠా, పట్టణ మధ్యతరగతిలోని ఎగువ భాగంలో ఉండేవారు (అంతకు ముందు సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటానికి దూరంగా ఉన్న భూస్వాములే కాకుండా, తమ కార్యాచరణను వ్యవసాయం నుండి ఇతర రంగాలకు మార్చుకోవడం ద్వారా నయా–ఉదారవాద విధానాల వల్ల ఉత్పన్నమైన ప్రస్తుత వ్యవసాయ సంక్షోభం నుండి తమను తాము కాపాడుకున్నవారు). మరొక వైపు శ్రామిక ప్రజలు, పట్టణ కార్మికులు, భవననిర్మాణ కార్మికులు, వ్యవసాయ కార్మికులు, పెద్ద సంఖ్యలో ఉన్న రైతులు, చిన్న ఉత్పత్తిదారులు, చేతివృత్తులవారు, హస్త కళాకారులు, మత్స్యకారులు తదితరులు.

దేశంలోని ఈ ప్రత్యేక విభజన సమకాలీన సామ్రాజ్యవాద కొత్త, నిర్దిష్ట లక్ష ణం. వలసవాద కాలంలో ఈ విభజనకు అవతలి వైపున భూస్వాములు, కొంతమంది దళారీ పెట్టుబడిదారులు (భారతదేశంలో వారి బలం చాలా తక్కువగా ఉండేది) ఉ ండేవారు. కానీ దేశంలోని ప్రజానీకంలో అధికభాగం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఏకమయ్యారు. అయితే ఇప్పుడు సామ్రాజ్యవాద అనుకూల శిబిరం, అంటే నయా–ఉదారవాదానికి మద్దతు ఇచ్చే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి వైపు ఉన్న శిబిరం గణనీయమైన బలం పుంజుకుంది. ఈ శిబిరంలో కార్పొరేట్లు – ద్రవ్య కులీన ముఠా మాత్రమే కాకుండా, పట్టణ మధ్యతరగతిలో పెద్ద భాగం ఉంది. నయా–ఉదారవాద విధానాల వల్ల సంపన్న దేశాల నుండి ఉత్పత్తి మూడవ ప్రపంచ దేశాలకు మారిన తరువాత ఈ తరగతి ఎక్కువగా లబ్ది పొందింది.

## III

విడ్డూరమేమిటంటే, నయా – ఉదారవాదం మూడవ ప్రపంచ దేశాలలో శ్రామిక ప్రజలకు, ఆర్థిక కులీన వర్గానికి (మరియు పట్టణ ఎగువ మధ్యతరగతి)

మధ్య ఆర్థిక అంతరాన్ని పెంచుతుంది. అదే సందర్భంలో సంపన్న దేశాల కార్మికులకు, మూడవ ప్రపంచ దేశాల కార్మికులకు మధ్య వేతనాలలో అంతరం పెరగకుండా కట్టడి చేస్తుంది. అధిక–వేతనాలు ఉండే దేశాల నుండి తక్కువ–వేతనాలుండే దేశాల ఆర్థిక వ్యవస్థల వైపు ఉత్పాదక పెట్టుబడి తరలిపోవడమే దీనికి కారణం. పెట్టుబడి ఇలా తరలిపోవడం వలన  మూడవ ప్రపంచ దేశాల కార్మికుల వేతనాలను సంపన్న దేశాల కార్మికుల వేతనాలతో సమం చేయదు. కానీ అది రెండు ప్రాంతాల కార్మికుల వేతనాల మధ్య అంతరాన్ని అదుపులో ఉంచుతుంది. చారిత్రాత్మకంగా సంపన్న దేశాలలో కార్మిక ఉత్పాదకత పెరిగినందున, అక్కడ నిజ వేతనాలు కూడా పెరిగాయి. వలసవాదం మూడవ ప్రపంచం దేశాల్లోని పరిశ్రమలను  దెబ్బ తీసినందువలన భారీగా నిరుద్యోగం పెరిగి కార్మికుల వేతనాలు జీవనాధార స్థాయిలోనే కట్టడిచేయబడ్డాయి. తద్వారా రెండు ప్రాంతాలలో నిజ వేతనాలు కాలక్రమేణా వేరు వేరుగా ఉన్నాయి.

శ్రామికులు "దక్షిణాది" (వర్ధమాన) నుండి "ఉత్తరాది" (సంపన్న)కి వెళ్ళడానికి అనుమతించబడనందున  ఇటువంటి తారతమ్యాలు సాధ్యమయ్యాయి. అయితే పెట్టుబడి మాత్రం వ్యతిరేక దిశలో తరలించడానికి అనుమతించబడింది. అయితే, అది ఎప్పుడు కూడా ప్రపంచ డిమాండ్‌ను తీర్చడం కోసం పరిశ్రమల స్థాపనకు ముందుకు రాలేదు. అందుకు భిన్నంగా స్థానిక డిమాండ్‌ను చేరుకోవడం, లేదా ప్రాథమిక సరుకుల ఉత్పత్తిని ప్రోత్సహించడానికే పరిమితమైంది. నయా–ఉదారవాదం "దక్షిణాది" నుండి కార్మికులు "ఉత్తరాదికి" స్వేచ్ఛగా తరలి రావడానికి ఇప్పటికీ  అనుమతించనప్పటికీ, "ఉత్తరాది" నుండి పెట్టుబడి "దక్షిణాది"కి తరలి వెళ్ళడం ప్రారంభమైంది. ఇది "దక్షిణాది" వేతనాలతో పోలిస్తే "ఉత్తరాది" వేతనాలు మరింత పెరగకుండా చేస్తున్నది. అంటే  "ఉత్తరాది వేతనాలు" కూడా ఇప్పుడు "దక్షిణాది" భారీ కార్మిక నిల్వల హానికరమైన ప్రభా వానికి గురవుతాయి. శ్రమ ఉత్పాదకత ప్రతి చోటా పెరిగినప్పటికీ,  ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోని ఏ విభాగంలోనూ వేతనాలు పెరగవు, అదనపు విలువ మాత్రం ఆయా దేశాల్లోనే కాకుండా మొత్తం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పెరుగుతుంది.

ఈ దృగ్విషయం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ఇప్పుడు సంపన్న దేశాలకు,  మూడవ ప్రపంచానికి మధ్య ఉన్న వైరుధ్యంగా కంటే ప్రపంచంలోని పెట్టుబడిదారులకు, ప్రపంచ కార్మికులకు మధ్య వైరుధ్యంగా చూడాలని వాదించడానికి చాలా మందిని ప్రేరేపించింది.  మూడవ ప్రపంచ దేశాల బడా బూర్జువాలు, సంపన్న దేశాల పెట్టుబడి ఉమ్మడి ప్రయోజనాలు కలిగి ఉంటే, అదే సమయంలో సంపన్న దేశాల కార్మికులు,

మూడవ ప్రపంచంలోని కార్మికులతో సమానమైన పరిస్థితిని అనుభవిస్తున్నారు. కాబట్టి సామ్రాజ్యవాద భావనకు ఇకపై ప్రాసంగికత లేదని వారు వాదిస్తున్నారు.

ఏది ఏమైనప్పటికీ, ఇది ఒక తప్పుడు నిర్ధారణ. ఇది విప్లవ కార్యాచరణను కుంటుపరిచే నిర్ధారణ. ఇప్పుడు మూడవ ప్రపంచ కార్మిక – రైతు కూటమి నిర్మించడం సాధ్యమయ్యే పరిస్థితి ఉంది. ఇది అర్థవంతమైనది కూడా. కానీ "ఉత్తరాది", "దక్షిణాది" రెండింటికీ చెందిన కార్మికుల ప్రపంచ కూటమి దిగ్మండలంలో ఎక్కడా కనిపించడం లేదు. అటువంటి కూటమి కోసం వేచి ఉండటం, "ప్రపంచ పెట్టుబడిదారులు – ప్రపంచ కార్మికులు" అనే దృష్టి కోణంలో చూడాలని చెప్పడం అంటే, విప్లవ కార్యాచరణ కోసం నిరవధికంగా వేచి ఉండాలని చెప్పడమే. క్లుప్తంగా చెప్పాలంటే సామ్రాజ్యవాదం అంటే ఎల్లప్పుడూ ఒక దేశం మరొక దేశాన్ని దోపిడీ చేయడమే కాదు, ఇది సంపన్న దేశాల పెట్టుబడి, మూడవ ప్రపంచ దేశాల పెట్టుబడితో కలిసి, మూడవ ప్రపంచ దేశాలలోని శ్రామిక ప్రజలను దోపిడీ చేస్తుంది. అది కూడా వారి సగటు వాస్తవ ఆదాయాలు తరిగిపోయిన సందర్భంలో సైతం దోపిడీ చేస్తుంది (సంపన్న దేశాల పెట్టుబడి తన స్వంత దేశంలోని శ్రామికులను ఎంత తీవ్రంగా దోపిడీ చేస్తుందంటే, దాని వల్ల వారి నిజ ఆదాయాలు కూడా తగ్గిపోతాయి, లేదా స్తబ్దుగా ఉంటాయి, అయితే ఇది సామ్రాజ్యవాదాన్ని గుర్తించే అంశం మాత్రం కాదు).

ప్రపంచ స్థాయిలోను, దేశీయంగాను ఉత్పత్తిలో అదనపు విలువ మిగులు వాటా పెరుగుదల అధికోత్పత్తికి దారితీస్తుంది. శ్రామిక ప్రజలకు చేరే డబ్బులు ఎక్కువైనా, తక్కువైనా పూర్తిగా వినియోగంపై ఖర్చు చేయబడుతాయి, అదనపు విలువను కొల్లగొట్టే వారికి వచ్చే డబ్బు పాక్షికంగా మాత్రమే వినియోగంపై ఖర్చు చేయబడుతుంది. అంటే వేతనాల నుండి మిగులుకు మారుతుంది. ఇతర అంశాలలో మార్పేమీ లేనప్పుడు, మొత్తం వినియోగంలో తగ్గుదల అనేది కాలక్రమేణా పెట్టుబడిని కూడా తగ్గిస్తుంది, తద్వారా మొత్తం డిమాండ్ తగ్గుతుందిజ ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు మందగిస్తుంది. అటువంటి మందగమనం వలన దాని అసలు సమయంలో సాధించిన ఉత్పత్తితో పోలిస్తే జిడిపి పడిపోతుంది.

అధిక–ఉత్పత్తి సంక్షోభ ధోరణిని ప్రభుత్వ జోక్యం ద్వారా ఎదుర్కోవచ్చని ఆంగ్ల ఆర్థికవేత్త జాన్ మేనార్డ్ కీన్స్ సూచించారు. వేతనాల నుండి మిగులుకు మారడం వల్ల వినియోగ వ్యయంలో తగ్గిన దానికి సమాన స్థాయిలో ప్రభుత్వ వ్యయంలో పెంపుదలతో భర్తీ చేయగలిగితే, అసలు అధిక ఉత్పత్తి ఉండదు. అయితే, ఆ నిధులను ప్రభుత్వం ఆర్థిక లోటు ద్వారా, లేదా పెట్టుబడిదారుల (లేదా ధనవంతుల)పై పన్ను

ద్వారా సమకూర్చుకోవాలి. కానీ తమ మొత్తం ఆదాయాన్ని ఖర్చు చేసే శ్రామిక ప్రజలపై పన్నుల ద్వారా నిధులు సమకూర్చుకుని ప్రభుత్వం చేసే వ్యయం వలన శ్రామిక ప్రజల వ్యయాన్ని అది భర్తీ చేస్తుంది, అంతేగానీ మొత్తం డిమాండ్‌కు అదనంగా జోడించేది ఏమీ ఉండదు. కానీ ద్రవ్య లోటు ద్వారా, లేదా సంపన్నులపై పన్నుల ద్వారా నిధులు సమకూర్చుకొని ప్రభుత్వం ఖర్చు చేస్తే డిమాండ్ అదనంగా పెరుగుతుంది. అయితే నయా–ఉదారవాదం సంపన్నులపై పన్ను విధించడాన్ని, సహించదు, ఆర్థిక కార్యకలాపాలు పుంజుకునేలా చేయడానికి, ఉపాధిని పెంచడానికి అవసరమైన నిధుల కోసం ప్రభుత్వాలు ఆశ్రయించే ద్రవ్యలోటును కూడ కట్టడి చేస్తుంది.

ఆర్థిక లోటు ద్వారా ప్రభుత్వ వ్యయం పెరిగి ఆర్థిక కార్యకలాపాలను, ఉపాధిని పెంచి, పెట్టుబడిదారుల లాభాలను పెంచినప్పటికీ, ద్రవ్య పెట్టుబడి దీనిని వ్యతిరేకిస్తుంది. ఎందుకంటే ఇది పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రభుత్వం ప్రమేయం లేకుండా సమర్థవంతంగా పని చేయలేని వ్యవస్థ అని చూపిస్తుంది. ఇది పెట్టుబడిదారీ నియమాలకు విరుద్ధం. అందుకే చాలా దేశాల్లో (ఒక్క అమెరికాలో మినహా) ద్రవ్య లోటు పరిమాణం జిడిపిలో నామమాత్రపు 3 శాతానికి మించకూడదనే ద్రవ్య లోటు నియంత్రణ చట్టం ఆమోదించబడింది.

నయా–ఉదారవాదం అధిక–ఉత్పత్తి ధోరణిని నిరోధించే సామర్థ్యాన్ని పెట్టుబడిదారీ ప్రభుత్వాలకు లేకుండా చేసింది. అమెరికాలో ద్రవ్య లోటు నియంత్రణ, చట్టం లేనప్పటికీ, వేరొక కారణంతో ఇబ్బంది పడుతోంది. అమెరికా పెద్ద మొత్తంలో డిమాండును సృష్టించినప్పటికి డిమాండ్‌లో కొంత భాగం దిగుమతుల మూలంగా విదేశాలకు బదలాయిచబడుతుంది. నయా–ఉదారవాద కాలంలో ఈ పరిస్థితి అమెరికాలో అంతర్గతంగా ఆర్థిక లోటు విస్తారంగా పెంచుతుంది. పెద్ద మొత్తంలో సృష్టించబడిన డిమాండ్ కొంత విదేశాలలో ఉపాధి, ఉత్పత్తుల పెరుగుదలకు దోహదపడుతుంది. ఇదే సమయంలో అమెరికా విదేశీ రుణాలు విపరీతంగా పెరుగతాయి. ఈ పరిస్థితి ఆమెరికా రాజ్యానికి ఆమోదయోగ్యం కాదు. దీన్నిబట్టి నయా–ఉదారవాద వ్యవస్థ తప్పనిసరిగా, అనివార్యంగా అధికోత్పత్తి సంక్షోభంలో చిక్కుకుటుంది అని అర్థమవుతుంది. 2008 నుండి కొనసాగుతున్న అధికోత్పత్తి సంక్షోభం దీన్నే చూపిస్తున్నది.

2008కి ముందు సంక్షోభం నివారించబడటానికి కారణం ఆస్తుల ధరల పెరుగుదల "బుడగలు" ఏర్పడటం. మొదట "డాట్–కామ్ బుడగ", తరువాత అమెరికా ఆర్థిక వ్యవస్థలో కృత్రిమంగా డిమాండ్‌ను పెంచిన "హౌసింగ్ బుడగ". 2008లో

హౌసింగ్ "బుడగ" పతనంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ప్రపంచ పెట్టుబడిదారీ విధానం సుదీర్ఘమైన, దీర్ఘకాలిక సంక్షోభంలో కూరుకుపోయింది. దాని నుండి బయట పడాలంటే నయా–ఉదారవాదం పరిధిలో ఎటువంటి మార్గం లేదు.

## IV

ఈ నేపథ్యంలోనే పెట్టుబడిదారీ ప్రపంచమంతటా నయా–ఫాసిస్టు పోకడలు పెచ్చరిల్లుతున్నాయి. ఫాసిస్ట్ శక్తులు అన్ని ఆధునిక సమాజాలలో ఉంటాయి. కానీ సాధారణంగా కుక్క మూతి పిందెల్లా ఉంటాయి. పెద్ద వ్యాపారుల మద్దతు ఉన్నప్పుడే అవి కేంద్ర స్థానంలోకి వస్తాయి. పెట్టుబడిదారి ఆర్థిక వ్యవస్థ ఉనికికి ముప్పు కలిగించేలా అధిగమించలేని దీర్ఘకాలిక సంక్షోభంలో వ్యవస్థ మునిగిపోయినప్పుడు ఇది జరుగుతుంది. అటువంటి పరిస్థితిలో ఫాసిస్ట్ శక్తులు అనేక కారణాల వల్ల బడా వ్యాపారులకు ఉప యోగపడతాయి. మొదటిది, నిరంకుశత్వం పట్ల వారి క్రూరమైన నిబద్ధత, శ్రామిక వర్గ సంస్థలను, కార్మికుల పోరాటాలను అణచివేయడానికి ఉ పయోగపడుతాయి. రెండవది, వారు బలహీనమైన మత, లేదా జాతి, లేదా భాషా మైనారిటీలని లక్ష్యంగా చేసుకుంటారు. మెజారిటీ సమూహంలో వాటి పట్ల ద్వేషాన్ని రెచ్చగొడుతారు. ఇది భౌతిక జీవన పరిస్థితుల నుండి చర్చను పూర్తిగా దూరంగా తీసుకెళ్ళుతుంది. ఈ మైనారిటీ సమూహాలు మెజారిటీకి గతంలో హాని చేశారని కల్పిత కథలు సృష్టించి వాటికి ప్రతీకారం తీర్చుకోవాలని చెబుతుంది. మూడవది, ఈ ప్రచారం శ్రామిక ప్రజలను విభజిస్తుంది. సంక్షోభం వల్ల ఉత్పన్నమయ్యే భౌతిక సమస్యలపై ఐక్య పోరాటాలు చేయకుండా నిరోధించడంలో సహాయపడుతుంది.

పెద్ద వ్యాపారులు ఫాసిస్ట్ శక్తులతో కూటమిని ఏర్పరుచుకుంటారు. ఎందుకంటే అధిగమించలేని సంక్షోభ కాలంలో ఈ ఫాసిస్టు శక్తులు తెచ్చే అన్ని "ప్రయోజనాలే" దీనికి కారణం (వాస్తవానికి సంక్షోభంలో తరచుగా మైనారిటీ సమూహంపై నిందలు వేయబడుతాయి. నిరుద్యోగానికి వలసదారులే కారణం అని ప్రచారం చేస్తారు). ఆర్థిక సహకారం అందించడం, మీడియా మద్దతు ద్వారా ఈ ఫాసిస్టు శక్తులను ప్రోత్సహించి అధికారంలోకి రావడానికి వారికి బడా పెట్టుబడిదారీ వర్గం సహాయం చేస్తుంది. ఈ సహాయం కేవలం సంక్షోభం కాలంలో కార్మికవర్గ సమరశీ పోరాటానికి వ్యతిరేకంగా సాధారణ భద్రత కోసం మాత్రమే కాదు, సంక్షోభం వల్ల అస్పష్టంగా మారే లాభాలను స్పష్టమైనవిగా, సుసంపన్నమైనవిగా మార్చుకోవడం కూడా దీని వెనుక ఉంది.

భారతదేశంలో కార్పోరేట్–హిందూత్వ మతోన్మాద కూటమి నాయకత్వంలో పూర్తి స్థాయి నిరంకుశ పాలనకు దారితీసే పోకడల, ఫాసిస్టు ధోరణుల పెరుగుదలను చూస్తున్న మనమే దీనికి సాక్షులం. హిందూత్వ మతోన్మాద – కార్పొరేట్ పాలన

లక్షణాలు: అసమ్మతిని నిరంకుశంగా అణచివేయడం; నిస్సహాయులైన మైనారిటీ సమూహంపై ద్వేషాన్ని రెచ్చగొట్టడం; బడా వ్యాపారులకు, దానిలోని కొందరు తమకు అనుకూలమైన వారికి భారీ ప్రయోజనాలను అందించడం; ప్రభుత్వ యంత్రాం గాన్ని, ఫాసిస్టు దుండగులను కలిపి అణచివేతకు ప్రయోగించడం.

నయా-ఉదారవాదం అధిక వృద్ధికి ఊతం ఇచ్చినంత కాలం, ఈ వృద్ధికి శ్రామిక ప్రజల మద్దతు ఉన్నప్పటికీ, మనం చూసినట్లుగా, వారిలో సంపూర్ణ పేదరికమే పెరిగింది. ఇది చివరికి కష్టజీవులకు ప్రయోజనాలను తెస్తుంది అని 'ట్రికిల్ డౌన్' పేర అది చేసిన వాగ్దానానికి కట్టుబడనప్పటికి, అది ఇప్పటికీ సాధారణ మద్దతును పొందుతోంది. ఈ వృద్ధి ఫలితంగా అట్టడుగు స్థాయి ఆర్థిక స్థితి గల వారి ఆదాయాలు కూడా "తగ్గిపోయాయి". సంక్షోభం ప్రారంభంతో ఈ ఆశ అదృశ్యమవుతుంది; వ్యవస్థకు దాని మనుగడ కోసం కొత్త ఆసరా అవసరం ఏర్పడుతుంది, ఇది నయా-ఫాసిజం ద్వారా అందించబడుతుంది.

ఉదారవాద బూర్జువా రాజకీయ నిర్మాణాల ద్వారా మతపరమైన ప్రతీకలను ఉపయోగించడం, "మతోన్మాదం"కు వ్యతిరేకంగా ఎలాంటి సంఘటిత పోరాటం లేకపోవడం వంటి కారణాల వల్ల సామాజికంగా – రాజకీయంగా పూర్తిగా హిందుత్వ-ఫాసిస్టు పోకడల ఆధిక్యతను చూసే ధోరణి ఉదారవాదులలో ఉంది. ఫాసిస్ట్ ఆర్ఎస్ఎస్ హిందుత్వ ఎజెండా నయా-ఉదారవాదం నుండి పూర్తి వేరుగా ఉన్నట్లు కనిపించేలా చేస్తుంది. మార్క్సిజం మాత్రమే రెండింటికి మధ్య సంబంధాన్ని గ్రహిస్తుంది. అందుకే భారతదేశంలో నయా-ఫాసిజం ఎదుగుదల, ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలో కూడా ఇలాంటి ధోరణుల మధ్య సంబంధాన్ని కూడ మార్క్సిజం అర్థం చేసుకుంటుంది. నయా-ఫాసిజం ఆధిక్యత శ్రామిక ప్రజలకు అత్యంత ప్రమాదకరమైనది, అయినప్పటికీ, నయా-ఉదారవాద పెట్టుబడిదారీ విధానం బలహీనతను కూడా ఇది సూచిస్తుంది. పెట్టుబడిదారీ విధానం ఇకపై దాని పాత మార్గాల్లో కొనసాగలేదని ఇది సూచిస్తుంది. సంక్షిప్తంగా చెప్పాలంటే ఫాజిజం, ఆధిక్యత మార్పుకు ఒక ముందస్తు సూచిక.

1930ల నాటి పాత ఫాసిజానికి, సమకాలీన నయా-ఫాసిజానికి మధ్య కీలకమైన వ్యత్యాసం ఉంది. గతంలో ఫాసిజం ద్వారా సంక్షోభాన్ని అధిగమించినట్లు, ఈ రోజు నయా-ఫాసిజం ద్వారా సంక్షోభాన్ని అధిగమించలేము అనే వాస్తవం ఇందులో ఇమిడి ఉంది. పాత ఫాసిజం అది అధికారంలోకి వచ్చిన వెంటనే యుద్ధానికి సన్నాహకంగా చేపట్టిన సైనిక వ్యయం, అందుకోసం చేసిన రుణాల ద్వారా అధికారంలోకి వచ్చిన దేశాలను మహా మాంద్యం నుండి బయటపడేసింది. 1931లో మాంద్యం నుండి బయటపడిన మొదటి దేశం జపాన్. 1933లో నాజీలు

అధికారంలోకి వచ్చిన తర్వాత జర్మనీ అనుభవం కూడ అదే. అక్కడ కొద్ది కాలం నిరుద్యోగం కూడ అధిగమించబడింది. అప్పటికి యుద్ధ బీభత్సం ఇంకా పూర్తిగా ఆరంభం కాలేదు. కానీ యుద్ధ భయానక పరిస్థితుల నుండి పూర్తిగా బయటపడలేదు. ఫాసిస్టులు అధికారం చేపట్టిన దేశాలలో కొంత కాలం పాటు ప్రజాదరణ సైతం పొందారు.

అయితే నయా–ఫాసిజం నిరుద్యోగ సమస్యను అధిగమించలేదు. ఎందుకంటే నయా–ఉదారవాదం విధించిన పరిమితి ఉదారవాద బూర్జువా ప్రభుత్వాలకు ఆటంకం కలిగిస్తుంది. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ధనికులపై పన్ను విధించనివ్వదు. ద్రవ్య లోటునుపై పరిమితి విధించి డిమాండ్‌ను పెంచడానికి అవసరమైన వనరులను సేకరించనివ్వదు. నయా–ఫాసిస్ట్ ప్రభుత్వానికి కూడ ఈ నిబంధనలు వర్తిస్తాయి. అందువల్ల నయా–ఫాసిస్టు ప్రభుత్వాలకు పాత ఫాసిస్ట్ ప్రభుత్వాల మాదిరిగా వెసులుబాటు ఉండదు. పాత ఫాసిజం కాలంలో ద్రవ్య పెట్టుబడులు ప్రాథమికంగా జాతీయంగా ఉంటాయి. అందువల్ల ప్రభుత్వాలు చెప్పేదానికి అవి అనుకూలంగా ఉంటాయి.

నయా–ఫాసిస్ట్ ప్రభుత్వాన్ని గద్దె దించవచ్చు అన్నది దీనర్థం. సంక్షోభాన్ని అధిగమించలేని దాని అసమర్థత ఏదో ఒక సమయంలో దాని ప్రజాదరణను దెబ్బ తీస్తుంది. ఇది ప్రజాస్వామ్యాన్ని డొల్లగా చేసినప్పటికీ ఎన్నికల ప్రక్రియ వంటి ప్రజాస్వామ్య పద్ధతుల ముసుగు వేసుకునే ఉంటుంది. కానీ అది ఓటు ద్వారా పదవికి దూరం చేయబడినప్పటికీ, తరువాత వచ్చిన ఉదారవాద ప్రభుత్వం కూడా నయా–ఉదార వాద పరిమితుల్లో సంక్షోభాన్ని అధిగమించలేకపోతుంది. దీంతో ప్రజల అసంతృప్తికి అది గురవుతుంది. కాబట్టి, నయా–ఫాసిజం మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశం ఉంటుంది. మరో మాటలో చెప్పాలంటే, నయా–ఉదారవాద దీర్ఘకాలిక సంక్షోభం కారణంగా నయా–ఫాసిజం చాలా కాలం పాటు మనతో ఉ ంటుంది. వాతావరణాన్ని దెబ్బతీస్తుంది. సమాజం అంతకంతకు "శాంతియుతం" కావడానికి కారణమవుతుంది.

నయా–ఫాసిజాన్ని అధిగమించాలంటే దానిని ఉత్పత్తి చేసిన సందర్భం, నయా–ఉదారవాద పెట్టుబడిదారీ సంక్షోభాన్ని మనం అధిగమించాలి. ఈ సంక్షోభాన్ని నయా–ఉదారవాద పెట్టుబడిదారీ విధానంలోనే అధిగమించలేము కాబట్టి, దాని పరిష్కారానికి నయా–ఉదారవాద పెట్టుబడిదారీ విధానానికి మించి వెళ్లడం అవసరం. నయా–ఉ దారవాద పెట్టుబడిదారీ విధానం పెట్టుబడిదారీ విధానం చేరిన తాజా దశకు ప్రాతినిధ్యం వహిస్తుంది కాబట్టి, బూర్జువా సిద్ధాంతకర్తలు కూడా ఊహించలేని ప్రపంచం వైపు, సోషలిజం వైపు దశలవారీగా పురోగమించాలి.

మరో మాటలో చెప్పాలంటే, ఉదారవాద ఆలోచనాపరులు ఊహించినట్లు కాకుండా, నయా–ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాటం కేవలం యథాతథ స్థితిని పునరుద్ధరించడానికి ఇతర రాజకీయ శక్తులతో ఐక్య ఫ్రంట్‌ను ఏర్పాటు చేయడం మాత్రమే కాదు; అది కొద్దికాలం తర్వాత మరల నయా–ఫాసిజాన్ని తిరిగి అధికారంలోకి తీసుకువస్తుంది. నయా–ఉదారవాదం తెచ్చిన సంక్షోభానికి ముగింపు పలికితేనే నయా–ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాటం విజయవంతం అవుతుంది. అందుకోసం చేపట్టే చర్యలు తప్పనిసరిగా మనల్ని పెట్టుబడిదారీ విధానానికి మించిన దశకు తీసుకువెళ్ళే ఒక గతితర్కాన్ని ఆవిష్కరిస్తాయి. అయితే ఆ పరివర్తన వెంటనే కాకుండా దశల వారీగా జరుగుతుంది.

నయా–ఉదారవాదం అధిగమించలేని అవరోధం వద్దకు చేరుకోవడం చారిత్రకంగా సోషలిజం సంభావ్యతకు ముందస్తు సూచిక; ఆ లక్ష్యం వైపుకు పురోగతి సంక్లిష్టంగా ఉంటుంది, దీర్ఘకాలికంగా ఉంటుంది, ఇబ్బందులతో నిండి ఉంటుంది; కానీ విప్లవ కార్యాచరణకు ఈ చారిత్రక సంభావ్యత గురించిన సైద్ధాంతిక అవగాహన అవసరం.

③

# భారత రాజకీయ అర్థశాస్త్రం, స్వాతంత్ర్యానంతరం దేశ ఆర్థికాభివృద్ధి

**ఈ** నోట్ ప్రాథమిక లక్ష్యం 1947 నుండి 2020 వరకు భారతదేశ ఆర్థిక అభివృద్ధిని డాక్యుమెంట్ చేయడం. ఇందులో దేశాభివృద్ధి ప్రక్రియను, రాజకీయ అర్థశాస్త్రాన్ని మార్క్సిస్ట్ దృక్కోణం నుండి అర్థం చేసుకునే ప్రయత్నం జరిగింది. చర్చ స్థూల ఆర్థిక దృక్కోణం నుండి రూపొందించబడింది. వ్యవసాయం, పారిశ్రామిక రంగం అనే రెండు ఉత్పాదక రంగాల ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన విశ్లేషణ చేయడం జరిగింది.

## I

### వలసవాద సందర్భం

బ్రిటీష్ వలసవాదం భారత ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలను స్తబ్దతలో కూరుకుపోయేట్లు చేసింది. ఇంగ్లండ్, భారతదేశం మధ్య గుత్తాధిపత్య వాణిజ్యం ద్వారా భారత్ నుండి ఇంగ్లండ్‌కు వనరులను బదిలీ చేశారు. వనరుల తరలింపులో ఇంగ్లీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ పోషించిన పాత్ర గురించి భారతదేశంపై తన రచనలలో కార్ల్ మార్క్స్ ప్రత్యేకంగా పేర్కొన్నారు.

1757 తరువాత మొదట కంపెనీ ద్వారా, తరువాత ప్రభుత్వం ద్వారానే, భారతదేశం నుండి ఇంగ్లాండ్‌కు పెద్ద మొత్తంలో పన్నుల రూపంలో వనరులు బదిలీ చేయబడ్డాయి. మొదటి దశలో వస్త్రాలు, తరువాతి దశలో వాణిజ్య పంటల ఎగుమతి ద్వారా పన్ను చెల్లింపులు జరిగాయి. ఒక అంచనా ప్రకారం 200 సంవత్సరాల

పాలన కాలంలో ఇంగ్లాండ్‌కు భారత దేశం నుండి పన్నుల రూపంలో తరలించబడిన మొత్తం 44.6[1] ట్రిలియన్ (ట్రిలియన్ అంటే లక్ష కోట్లు) డాలర్లు. భారత్ నుండి తరలించబడిన భారీ వనరులు బ్రిటీష్ పారిశ్రామికీకరణకు గణనీయంగా తోడ్పడ్డాయి.

**వ్యవసాయంలో ప్రతిష్టంభన**

బ్రిటీష్ వలసవాదం భారతదేశంలో వ్యవసాయం, కుటీర పరిశ్రమలు, చేతివృత్తులు వంటి నిర్దిష్ట రంగాలలో కొత్త, ఆధునిక సమాజాన్ని నిర్మించకుండానే పాత సామాజిక వ్యవస్థను కూల్చివేసింది.[2] 18వ శతాబ్దం చివరిలో భూమిపై వ్యక్తిగత ఆస్తి హక్కు కల్పించడానికి బ్రిటిష్ పాలకులు ప్రయత్నించారు. ఇది ఇంగ్లీష్ లేదా ఫ్రెంచ్ భూ యాజమాన్య పద్దతులను పోలి ఉంటుంది. ఈ అన్ని భూ వ్యవస్థల విభజన అనేది ప్రతి ప్రాంతం నుండి వీలైనంత ఎక్కువ పన్నులను రాబట్టే విధంగా రూపొందించబడింది. ఈ అవసరాన్ని తీర్చడానికి, వలసవాద విధానాలు వాటి పన్నుల సంభావ్యతను బట్టి ప్రాంతాల మధ్య విభిన్నంగా ఉంటాయి. తూర్పు ప్రాంతాలు (బెంగాల్, బీహార్, ఒరిస్సా), పశ్చిమ ప్రాంతాలు (బాంబే, గుజరాత్), దక్షిణ ప్రాంతాలు (కర్ణాటక, మద్రాస్), వాయువ్య ప్రాంతాలు (పంజాబ్, హర్యానా) మధ్య విధానాలు భిన్నంగా ఉంటాయి.

తూర్పు ప్రాంతంలో జమీందారీ వ్యవస్థ ద్వారా బ్రిటీష్ వారు కొత్త తరగతి భూస్వాములను సృష్టించారు. ఈ జమీందారీ భూస్వామ్య వ్యవస్థ అధిక కౌలు రాబట్టడం, వాణిజ్య పంటలు పండించేలా ఒత్తిడి చేయడం, కాలువల ద్వారా నీటిపారుదల, ఇతర మౌలిక సదుపాయాలలో (ముఖ్యంగా రైల్వేలు) ప్రభుత్వ పెట్టుబడిని తగ్గించడం ద్వారా తూర్పు ప్రాంత వ్యవసాయ ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేసింది.

రైత్వారీ భూ రెవెన్యూ వ్యవస్థ అమలులో ఉన్న దక్షిణ, పశ్చిమ, తూర్పు ప్రాంతాల్లో పైన పేర్కొన్న అంశాల తీవ్రత తక్కువగా ఉన్నప్పటికి, రైతాంగ శ్రమను దోపిడీ చేసే తీవ్రత మాత్రం ఎక్కువగానే ఉండేది. సాపేక్షంగా చూసినప్పుడు రైత్వారీ ప్రాంతాలలో రైతాంగానికి, ప్రభుత్వానికి మధ్య మరింత ప్రత్యక్ష సంబంధాలున్నాయి. జమీందార్ లాంటి కౌలు వసూలుదారు మధ్య లేకపోవడం, భూమిపై రైతుల హక్కులను మెరుగ్గా గుర్తించడం వల్ల ఉత్పాదక పెట్టుబడులు పెట్టడం మరింత ఆకర్షణీయంగా మారింది. సంవత్సరాల పాటు ప్రభుత్వ పెట్టుబడులు రైత్వారీ ప్రాంతం వైపే అధికంగా పెట్టబడ్డాయి.

ఇలాంటి కొన్ని తేడాలున్నప్పటికి వ్యవసాయ ఉత్పత్తి సంబంధాలలో వెనుకబాటుతనం, అణచివేత అనేవి ఈ భూ వ్యవస్థలన్నింటిలో విస్తృతంగా నెలకొన్న సాధారణ లక్షణం. బడా భూస్వామ్య వ్యవసాయ ఉత్పత్తి సంబంధాలనేవి ప్రధాన

లక్షణం. బ్రిటీష్ ఇండియాలోని అన్ని భూ వ్యవస్థలలో భూ యాజమాన్యం కేంద్రీకరించ బడి ఉంటుంది. ఉప-విభజన, భూమిని చిన్న చిన్న ముక్కలుగా విభజించి నిర్వహణకు ఇవ్వడం, దౌర్జన్యంగా భూమి ఆక్రమించుకోవడం, కౌలుదారుల అభద్రత, దొంతర కౌలు, అక్రమ సెస్సులు, భూమిలేని రైతుల పెరుగుదల, రుణభారం, అక్రమ వడ్డీ వంటివి ఉండేవి.

వలసవాద భూ యాజమాన్య పద్ధతులు రైతులకు ప్రోత్సాహకరంగా లేక పోగా వారి అభివృద్ధిని అటంకపరిచే విధంగా ఉండేవి.[3] ఒకవైపు కౌలు విషయంలో అభద్రత, చిన్న భూ కమతాలలో ఉన్న వ్యవసాయ మిగులును అధిక కౌలు, అక్రమ వడ్డీల ద్వారా దోపిడీ చేయడం జరిగింది. మరొక వైపు రైతులకు భూమి, ఆధునిక సాంకేతికతను ఉపయోగించడానికి ఎటువంటి ప్రోత్సాహం లేదు. పెట్టుబడికి రైతుల వద్ద మిగులు లేకుండా చేసాయి. తత్ఫలితంగా స్వాతంత్ర్యం వచ్చే సమయానికి, భారతదేశంలో వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ చాలా పతనమైంది. ఉత్పత్తి తక్కువ, కొన్నిసార్లు పంటల దిగుబడి తగ్గుదల, నీటిపారుదల సౌకర్యం కలిగిన భూమి తక్కువ పరిమాణంలో ఉండటం, సాగుకు అనువైన భూమి పెద్ద ఎత్తున బీడు భూమిగా ఉండటం, నేల నాణ్యత క్షీణించడం, నాణ్యమైన విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో తక్కువ దిగుబడి రావడం, సాగు చేయడానికి పశువులను ఉ పయోగించడం ఇత్యాది కార ణాల వల్ల 1896 నుండి 1947ల మధ్య యాభై సంవత్సరాలలో భారతదేశ ఆహార ధాన్యాల ఉత్పత్తి సంవత్సరానికి 0.1 శాతం మాత్రమే పెరిగింది. ఇది జనాభా పెరుగుదల రేటు కంటే తక్కువ. పర్యవసానంగా 1918లో సుమారు 200 కిలోలుగా ఉన్న వార్షిక తలసరి ఆహార ధాన్యాల లభ్యత, 1947 నాటికి దాదాపు 150 కిలోలకు పడిపోయింది. వలసవాద విధానాలు భారతదేశంలో అనేక కరువులను సృష్టించాయి. వాటిలో ముఖ్యమైనది, 1940ల నాటి బెంగాల్ కరువు.[4]

## భారతదేశ పారిశ్రామికీకరణ

వలసవాద కాలంలో పారిశ్రామిక అభివృద్ధి అనేక లోటుపాట్లతో ప్రాథమిక దశలో ఉండేది. వాస్తవానికి, పరిశ్రమలను కుంటుపరచడం అనేది ప్రధానమైన ధోరణిగా ఉండేది. అంటే పారిశ్రామిక సామర్థ్యం తగ్గిపోవడం, పరిశ్రమలో పనిచేసే కార్మికుల నిష్పత్తి తగ్గడం.

బ్రిటీష్ రాజ్యం భారతదేశాన్ని స్వేచ్ఛాఆర్థిక విధానాన్ని అనుసరించాలని ఒత్తిడి చేసింది. ముడి, ప్రాథమిక సరుకులను తక్కువ ధరలకు ఎగుమతి చేసే వారు,

ఇంగ్లాండ్ నుండి వినియోగానికి సిద్ధంగా ఉన్న సరుకులు, ద్వితీయ సరుకులు అధిక ధరలకు స్వేచ్ఛగా భారతదేశంలోకి దిగుమతుల పేరుతో కుమ్మరించబడ్డాయి. ఈ ప్రక్రియ హస్తకళల, చేతివృత్తుల పరిశ్రమలు పెద్ద ఎత్తున విధ్వంసం కావడానికి దారితీసింది. ఈ ప్రక్రియను మార్క్స్ తన పెట్టుబడి గ్రంథం మొదటి సంపుటిలో "పాత హస్తకళలు, నూతన యంత్రాలతో పోటీ పడటం అనేది అసమానుల మధ్య పోటీగా" పేర్కొన్నాడు. 1834-35 నాటి బ్రిటిష్ గవర్నర్ జనరల్ రాతలను మార్క్స్ ఉటంకించాడు. అతను భారతదేశంలో వలసవాద ఫలితం గురించి ఇలా వ్రాసాడు : "వాణిజ్య చరిత్రలో ఇంతటి దుస్థితిని పోలిన సంఘటన మరొకటి కనిపించదు. భారతదేశ మైదానాల్లో నేత కార్మికుల ఎముకలు పీల్చి పిప్పి చేయబడుతున్నాయి... పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో ఉత్పత్తి సాధనాలు, ఉత్పత్తి కూడ శ్రామికునితో సంబంధం లేనట్లు, స్వతంత్రంగా ఉన్నట్లు ఉంటాయి. యంత్రాల ప్రవేశం ద్వారా ఈ దూరం మరింత అధికమయింది. దీనితో యంత్రాలను శ్రామికులు పూర్తి ప్రతికూలంగా చూడసాగారు. "

మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు ప్రపంచ మార్కెట్ విస్తరణ భారతదేశంలో పారిశ్రామిక వృద్ధికి కొంత అనుకూలించింది. కానీ 1929 నాటి మహా మాంద్యం వలన ఆ ఉద్దీపన కూడా అంతరించింది. పారిశ్రామిక మాంద్యం ఏర్పడింది.

వలసవాదం పారిశ్రామికీకరణను దెబ్బతీయడంతో ప్రపంచ జిడిపిలో భారతదేశం వాటా తీవ్రంగా పడిపోయింది. 1700 నుండి 1950 మధ్య కాలంలో ప్రపంచ జిడిపిలో భారతదేశం వాటా 24.5 శాతం నుండి 4.2 శాతానికి పడిపోయింది (ఆ కాలంలో చైనా వాటా 22.3 శాతం నుండి 4.6 శాతానికి పడిపోయింది).

స్వాతంత్ర్యం వచ్చేనాటికి జాతీయ ఆదాయంలో ఆధునిక భారీ పరిశ్రమల వాటా 7 శాతం మాత్రమే. చిన్న తరహా పరిశ్రమలు 10 శాతం వాటా కలిగి ఉన్నాయి. శ్రామిక శక్తిలో 2.5 శాతం మందికి మాత్రమే భారీ ఆధునిక పరిశ్రమలు ఉపాధి కల్పిస్తే, చిన్న తరహా పరిశ్రమలు 7 శాతం శ్రామిక శక్తికి ఉపాధి కల్పించాయి. పారిశ్రామికీకరణ దెబ్బ తినడం, గ్రామీణ ప్రాంతాల్లో భూమిలేని పేదలు పెరగడం వల్ల శ్రామిక శక్తిలో వ్యవసాయ కూలీల వాటా (శ్రామికీకరణ) పెరుగుదలకు దారితీసింది. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై 72 శాతం శ్రామిక శక్తి ఆధారపడి ఉన్నం దున, వ్యవసాయం ప్రాథమిక రంగం అయింది.

**ప్రాంతీయ వైవిధ్యాలు**

వలసవాద కాలంలో వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగాల అర్థికాభి

వృద్ధి ధోరణులలో ప్రాంతీయ వ్యత్యాసాలు ఉన్నాయి. చారిత్రాత్మకంగా పంజాబ్ ప్రాంతంలో అభివృద్ధి అన్ని రైత్వారీ ప్రాంతాలలో అభివృద్ధి కంటే అత్యధికంగా ఉంది. పంజాబ్ ప్రాంతంలో నీటిపారుదల కోసం కాలువలు త్రవ్వించడానికి ప్రభుత్వం ఎక్కువ పెట్టుబడి పెట్టింది. ఈ ప్రాంతంలో కాలువల ద్వారా నీటిపారుదల సాగుభూమి సగటు విస్తీర్ణం ఎక్కువగా ఉంది. చిన్న స్థాయి పారిశ్రామిక ఉత్పత్తి సంస్థలు వృద్ధి చెందాయి. బొంబాయి వంటి ఇతర రైత్వారీ ప్రాంతాలలో హస్తకళలు, చిన్న తరహా పరిశ్రమలు మనుగడ సాగించడానికి ఎక్కువ మూల్యం చెల్లించాల్సి వచ్చింది. ఆ విధంగా పంజాబ్ తరువాతి స్థానాలలో బొంబాయి, మద్రాస్ ప్రాంతాలు ఉన్నాయి.

ఈ ప్రాంతాలు నీటిపారుదలలో ప్రభుత్వ పెట్టుబడులకు, అలాగే మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాల మధ్య కాలంలో తయారీ పరిశ్రమల స్థాపనకు సాపేక్షంగా అనుకూలమైనదిగా ఉన్నది.

సంక్షిప్తంగా చెప్పాలంటే వలసవాద పాలన కాలంలో సాంప్రదాయ వ్యవసాయ ప్రాంతాలు, పారిశ్రామికాభివృద్ధి ద్వీపాలు అనే విచిత్రమైన ద్వంద్వవాదాలు ఉద్భవించాయి, కొనసాగాయి. ఈ నమూనా అసమాన ఆర్థిక తరగతులు, పెట్టుబడిదారులు ఆవిర్భవించి, పెరగడానికి దారితీసింది. ఇది అన్ని ప్రాంతాల్లో ఆర్థికవృద్ధి రేటులో దీర్ఘకాలిక వ్యత్యాసాల స్వభావాన్ని అంతం చేసింది.

## జాతీయోద్యమంలో వామపక్షం

మనం ఈ విభాగాన్ని ముగించే ముందు, జాతీయోద్యమంలో కొన్ని ధోరణులను గమనించాలి. 1930ల నుండి 1940ల నాటికి స్వాతంత్ర్య ఉద్యమం పట్టణ ప్రాంతాలలో బూర్జువాల నేతృత్వంలో సాగింది. గ్రామీణ భూస్వాములు ఆలస్యంగా, సంకోచంగా పాల్గొనడం చూస్తాం. అదేవిధంగా వామపక్ష ఉద్యమ పెరుగుదలను చూస్తాం. ఈ రెండు ధోరణుల మధ్య స్పష్టమైన వ్యత్యాసం కనిపించింది. వామపక్ష ఉద్యమం ప్రజల మనసులను కదిలించడం ప్రారంభించింది. మీరట్, కాన్పూర్, పెషావర్, తెభాగ, తెలంగాణ, మలబార్, పున్నప్రవాయలార్, తంజావూరు, థానే వంటి ప్రాంతాలలో జరిగిన ఆందోళనలు, కేసులలో ఉద్భవిస్తున్న వామపక్ష ఉద్యమం కనిపిస్తుంది. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సమరశీల కార్మిక ఉద్యమాలు కూడా జరిగాయి. రైల్వేలలో, ప్రభుత్వ ఉద్యోగులలో, రాయల్ ఇండియన్ నేవీలో కార్మిక పోరాటాలు జరిగాయి. ఈ సందర్భంగా కార్మికులు ముందుకు తెచ్చిన నినాదాలను ఆధిపత్య బూర్జువాలు పంచుకోలేదు.[5]

ఈ రైతాంగ, కార్మిక పోరాటాలు జాతీయ ఉద్యమానికి దోహదం చేయడమే కాకుండా, వామపక్ష ప్రతిపాదకులకు నూతన భారత దేశం గురించిన ఒక స్వప్నం

కూడ ఉంది. అయితే స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వామ్య కలిగిన బడా బూర్జువాలకు అంగీకారయోగ్యమైనది కాదు ఆ స్వప్నం. భారత దేశం ఇలాంటి విస్తృతమైన విప్లవాత్మక పరివర్తనకు లోనవుతుందన్న భయమే 1947 తర్వాత బడా బూర్జువాలు భూస్వాములతో మిలాఖత్ కావడానికి దారితీసింది.

ఈ విధానాల మధ్య వ్యత్యాసాలకు ముఖ్యమైన కారణం కులాన్ని అర్థం చేసుకోవడంలో ఉంది. మహాత్మా గాంధీ కుల వ్యవస్థను హిందూ సమాజాన్ని విభజించే అంశంగాకంటే ఏకంచేసే అంశంగా చూశారు. అతను కులాన్ని అసమానతల వైపు నడిపే వ్యవస్థగా చూడలేదు, లేదా కుల వ్యవస్థ "హరిజనులలో" న్యూనతను ప్రేరేపించేదిగా గాంధీజీ భావించలేదు. అదేవిధంగా, జవహర్‌లాల్ నెహ్రూ కుల వ్యవస్థను భారతదేశం సిగ్గుపడవలసిన అంశంగా చూడలేదు. కుల వ్యవస్థ అనేది "ఏ విధమైన సాధారణ సిద్ధాంతం లేకుండా ప్రతి సమూహానికి పూర్తి అవకాశాన్ని అనుమతించే సమ్మిళిత వ్యవస్థ" అని నెహ్రూ నమ్మాడు. కుల వ్యవస్థ, నెహ్రూ దృష్టిలో నిచ్చెన మెట్ల వ్యవస్థ కాదు, "ప్రతి సమూహంలో ప్రజాస్వామ్య అలవాటును కొనసాగించింది" అని భావించాడు.

కులంపై ఇటువంటి అభివృద్ధి నిరోధక అభిప్రాయాలు కమ్యూనిస్టులకు కాని, బి.ఆర్. అంబేద్కర్ వంటి ఇతర నాయకులకు కాని ఆమోదయోగ్యం అయ్యేవి కాదు.

జాతీయ ఉద్యమ ప్రాథమిక బలహీనత ఏమిటంటే, అది బూర్జువా నాయకత్వం లో ఉండటం, ఇది హిందూ నాగరికత, సంస్కృతి పునరుద్ధరణకు మద్దతుగా కూడ నిలబడింది. ఈ కారణంగా, వెనుకబడిన కుల సమూహాలు, అణగారిన ప్రజలు కాంగ్రెస్ వంటి బూర్జువా పార్టీల నాయకత్వాన్ని అంగీకరించడానికి సిద్ధంగా లేరని ఇఎంఎస్ నంబూద్రిపాద్ తన రచనల్లో పేర్కొన్నారు. ఆయన ఇంకా ఇలా వివరించారు:

" బూర్జువా నాయకులచే నిర్మించబడిన జాతీయోద్యమం ప్రధానంగా 'పాత' హిందూ నాగరికత, సంస్కృతి 'పునరుద్ధరణ' కోసం జరిగిన ఉద్యమం. ఈ నాగరికతను, సంస్కృతిని మనల్ని మనం మళ్ళీ గుర్తుచేసుకుందాం. ఇది కులాల నిచ్చెన మెట్ల వ్యవస్థ కేంద్రంగా ఉన్న గ్రామీణ సమాజ నిర్మాణంపై ఆధారపడి ఉంటుంది. ఈ కుల ఆధారిత సమాజ భారాన్ని పూర్తిగా నిస్సహాయతతో భరించిన కోట్లాది మంది ప్రజలు, వర్ణాశ్రమ ధర్మ సిద్ధాంతానికి ఇక కట్టుబడాల్సిన అవసరం లేదని మొదటిసారిగా చూడగలిగారు. వారు ఆధునిక బూర్జువా భావాలైన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంలో కొంత భాగాన్ని గ్రహించడం ప్రారంభించారు. అప్పటి పాలక

బ్రిటీష్ సామ్రాజ్యవాదం స్థానంలో అంతిమంగా పాత వర్ణాశ్రమ సమాజాన్ని పునరుద్ధరణ చేయాలనే ఉద్య మాన్ని సహించడానికి వారు సిద్ధంగా లేరు.

బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా భారత బడా బూర్జువాలు, భూస్వాములు, శ్రామికవర్గం ఐక్యంగా పోరాటంలో ఉన్నప్పుడు మనం ఐక్యతను చూడాలి. కార్మికులు, రైతాంగం భూస్వాములకు, బూర్జువాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న సందర్భంగా వారి మధ్య సంఘర్షణను చూడాలి. ఇందులోని ఐక్యత, ఘర్షణ అనే పరస్పర వైరుధ్యాలను గతితార్కిక పద్దతిలో సమగ్రంగా అధ్యయనం చేసి అర్ధం చేసుకోవాలి. అటువంటి విశ్లేషణ ద్వారానే 1947 తర్వాత బూర్జువా–భూస్వామ్య కూటమి ఘనీభవించడాన్ని మనం అర్థం చేసుకోవచ్చు.

## II

## స్వాతంత్ర్యం, అనంతరం అనుభవం : 1947 నుండి 1965 వరకు

భారతదేశం 1947 తర్వాత రాజ్యం అతిగా జోక్యం చేసుకునే ఆర్థిక విధానాన్ని అనుసరించింది. ఈ విధానాన్ని పెద్ద ప్రభుత్వ రంగ పరిశ్రమల స్థాపన, మౌలిక సదుపాయాలలో గణనీయమైన ప్రభుత్వ పెట్టుబడులు పెట్టడం అనే ప్రభుత్వ చర్యల ద్వారా గుర్తించవచ్చు. అందువల్ల భారతదేశాన్ని చాలా మంది “మిశ్రమ ఆర్థిక వ్యవస్థ”గా పేర్కొన్నారు. ఈ జోక్యవాద ఆర్థిక విధానం స్వాతంత్ర్యం తర్వాత ప్రణాళికాకర్తలు రూపొందించిన విధానం కాదు. ఇది కొంతవరకు జాతీయోద్యమ ఉత్పత్తి.

ఇక్కడ దానిని రెండు నిర్దిష్ట అంశాలుగా విభజన చేయవచ్చు.

మొదటిది, స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించిన భారత జాతీయ కాంగ్రెస్‌లోని విభిన్న ఆలోచనా స్రవంతికి నాయకత్వం వహించిన వారు స్వాతంత్ర్యానికి ముందే భారతదేశం కోసం ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి ప్రక్రియను ఊహించారు. నెహ్రూ అధ్యక్షతన 1938లో నేషనల్ ప్లానింగ్ కమిటీ (NPC) ఏర్పడింది. NPCలో ప్రముఖ పారిశ్రామికవేత్తలు, శాస్త్రవేత్తలు, ఆర్థికవేత్తలు, కార్మిక నాయకులు, రాజకీయ నాయకులు ఉన్నారు. నెహ్రూ, తన రచనలో ఆ కాలపు చర్చల వెనుక ఉన్న స్ఫూర్తిని ఈ క్రింది విధంగా సంగ్రహించారు : “పాశ్చాత్య దేశాలలో చాలా కాలం క్రితం సంభవించిన పారిశ్రామిక విప్లవాన్ని మనం వీలైనంత వరకు అందుకోవడానికి ప్రయత్నిస్తున్నాము.”

రెండవది, ఆ కాలంలోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు కూడా అభివృద్ధి ప్రారంభ సంవత్సరాల్లో ప్రణాళికా పద్ధతి, రాజ్యం జోక్యం తప్పనిసరి అనే స్థితికి వచ్చారు. 1944లో ఎనిమిది మంది ప్రముఖ పారిశ్రామికవేత్తలు కలిసి బొంబాయి ప్రణాళికను రూపొందించారు. ఇందులో ప్రైవేట్ పెట్టుబడిదారీ రంగం వృద్ధికి ప్రభుత్వ పెట్టుబడి, వనరుల ప్రణాళికాబద్ధమైన కేటాయింపు అవసరమని వారు భావించారు.[6]

పర్యవసానంగా, నెహ్రూవియన్ అభివృద్ధి మార్గంలో వివిధ రకాల ప్రభుత్వ-ప్రాయోజిత పెట్టుబడులు పెట్టడం అనేది పెట్టుబడిదారీ విధాన ప్రధాన లక్షణంగా ఉంటుంది. పంచవర్ష ప్రణాళికలు ఈ అభివృద్ధి విధానంలో ఒక లక్షణంగా మారాయి. అంతర్యుద్ధ కాలంలో సోవియట్ యూనియన్ పంచవర్ష ప్రణాళికా పద్ధతితో విజయం సాధించడం ప్రణాళికా పద్దతి పై ఆధారపడటానికి ఎన్నో దేశాలకు ప్రేరణ ఇచ్చింది. ప్రణాళికా పద్ధతే ఫాసిస్ట్ జర్మనీని ఎదుర్కొని, ఓడించగల బలమైన సైనిక శక్తిగా సోవియట్ రష్యాను తయారు చేసింది.[7] 1929 మహా మాంద్యానికి ప్రతిస్పందన కొనసాగింపుగా కొంతవరకు, యుద్ధంలో దెబ్బతిన్న యూరోపియన్ ఆర్థిక వ్యవస్థల పునర్నిర్మాణాన్ని సులభతరం చేయడానికి మరికొంత, అన్ని ప్రపంచ ఆర్థిక శక్తులు యుద్ధం తర్వాత, కీనీసియన్ ఆర్థిక విధానాలను అనుసరించాయి

నెహ్రూ హయాంలో అమలు చేసిన ప్రభుత్వ ప్రాయోజిత పెట్టుబడిదారీ విధానం సోషలిస్టు మార్గం కాదు. ఉత్పత్తి సాధనాలు ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోనే ఉండి, కొద్దిమంది చేతుల్లో గుత్తాధిపత్యం ఏర్పడింది. బాంబే ప్రణాళిక ప్రకారం ప్రారంభ సంవత్సరాల్లో ప్రభుత్వ జోక్యం ఉంటూ, బూర్జువాలు అభివృద్ధి ప్రక్రియకు నాయకత్వం వహించడానికి మెరుగ్గా సన్నద్ధమైన తర్వాత ప్రభుత్వం పెట్టుబడుల ఉపసంహరణకు తెరతీసింది. మరో మాటలో చెప్పాలంటే, వ్యూహాత్మక రంగాలలో, లాభాలకు గ్యారంటీ లేని ప్రమాదకర రంగాల్లో భారీ మూలధన పెట్టుబడులు పెట్టడంలో ప్రభుత్వం ప్రైవేట్ రంగానికి ప్రత్యామ్నాయంగా ఉంటుంది. ఈ రంగాలలో ఉత్పత్తిని చౌకైన ఇన్‌పుట్‌లుగా అందుబాటులో ఉంచడం మాత్రమే ప్రభుత్వ జోక్యం యొక్క పరిధి అని ప్రైవేట్ పెట్టుబడిదారీ రంగం నిర్వచించింది. అదనంగా, 1950లు, 1960లలో బడా బూర్జువా వర్గానికి బ్యాంకు క్రెడిట్‌లో ఎక్కువ భాగం అందుబాటులోకి వచ్చింది. నెహ్రూవియన్ ప్రభుత్వం ఆ విధంగా, బడా పెట్టుబడిదారీ వర్గాలకు అనుకూలంగా చురుకుగా జోక్యం చేసుకున్నది.

నిజానికి, బొంబాయి ప్రణాళిక రచన భారత పెట్టుబడిదారీ వర్గాల ఆలోచనను ప్రతిబింబిస్తుంది. అలాగే ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ జోక్యం ఆవశ్యకతకు

సాధారణ గుర్తింపును ప్రతిబింబిస్తుంది. అదే సమయంలో, ఇది పెట్టుబడిదారీ వర్గంలోని ఒక ఘోరమైన బలహీనతను కూడా వెల్లడి చేసింది. వారు భూస్వామ్యపు వెన్ను విరిచేందుకు, దేశీయ మార్కెట్‌ను విస్తరించేందుకు, ఆర్థిక వ్యవస్థలో విస్తృత ప్రాతిపదికన వృద్ధిని ఆవిష్కరించేందుకు ఇష్టపడలేదు. తమ వర్గ పాలనను నిలబెట్టు కోవడానికి, ప్రగతిశీల విప్లవ ఉద్యమం ముందుకు సాగకుండా చూసుకోవడానికి, వారు భూస్వా మ్యంతో రాజీకి, పొత్తుకు సిద్ధంగా ఉన్నారు. జాతీయ ఆర్థికాభివృద్ధికి సంబంధించిన స్వావలంబన మార్గాన్ని హృదయపూర్వకంగా అనుసరించడానికి కూడా వారు సిద్ధంగా లేరు. అందుకే, వారు సామ్రాజ్యవాదంతో రాజీ మార్గాన్ని అనుసరించారు. సోవియట్ యూనియన్ ఉనికి అనేది భారతదేశ పాలకవర్గాలు సామ్రాజ్యవాదానికి పూర్తిగా లొంగిపోకుండా కొంతమేరకు నిలబడే అవకాశాన్ని కల్పించింది. సామ్రాజ్యవాదంతో బడా బూర్జువా సంబంధం సహకారం, వైరుధ్యంపై ఆధారపడింది.

ఈ మార్గపు అంతర్గత వైరుధ్యాలపై ఆయా రంగాలకు సంబంధించి కొన్ని స్థూలమైన నిర్ధారణలకు మనం రావచ్చు.

**వ్యవసాయ సమస్య**

మొదటగా, పారిశ్రామికీకరణ ప్రణాళిక భారతదేశ వ్యవసాయ సమస్యను పరిష్కరించగలదా అనే దానిపై ఆధారపడి ఉంటుంది. వ్యవసాయేతర రంగ ఆర్థిక వ్యవస్థలో వృద్ధికి (అంతర్గతంగా )– వ్యవసాయ రంగంలో వృద్ధికి – (సాధనంగా)– రెండింటికీ వ్యవసాయ రంగంలో మార్పు అవసరం.[8] ప్రణాళికా కాలం కంటే ముందు రూపొందించిన విధాన పత్రాలు, జాతీయోద్యమ కాలంలో జరిగిన రైతాంగ ఆందోళనలు ఆ నాటి వ్యవసాయ స్థితిని ప్రతిబింబిస్తాయి.

మొదటి పంచవర్ష ప్రణాళిక పత్రం పేర్కొన్న విధంగా :

“....భూమి యాజమాన్యం, భూమి సాగుల భవిష్యత్తే జాతీయ అభివృద్ధిలో అత్యంత ప్రాథమిక సమస్య కావచ్చు. చాలా వరకు, ఆర్థిక, సామాజిక వ్యవస్థ నమూనా అనేది భూమి సమస్యను పరిష్కరించే విధానంపై ఆధారపడి ఉంటుంది.”

ప్రణాళికా పత్రాలలో ఈ ప్రాధాన్యత ఉన్నప్పటికీ, సంస్థాగత అసమానతలను తొలగించడానికి, అంతర్గత మార్కెట్‌ను విస్తరించే సాధనంగా భూమిపై ఆస్తి హక్కుల సంస్కరణను భారతీయ బూర్జువాలు ఎప్పుడూ పరిగణించలేదు. భారతదేశంలో భూ సంస్కరణలు విఫలమయ్యాయి.[9] స్వాతంత్ర్యం తర్వాత మొదటి 60 సంవత్సరాలలో

భూమిని పొందిన కుటుంబాల సంఖ్య కేవలం 54లక్షలు మాత్రమే. 1947 నుండి 2007 మధ్య 48లక్షల,90వేలఎకరాల భూమి మాత్రమే పునఃపంపిణీ చేయబడింది. పునఃపంపిణీ చేయబడిన మొత్తం భూమి, సాగుచేయబడుతున్న భూమిలో 2 శాతం కంటే తక్కువగా ఉంది. కౌలుదారులకు యాజమాన్య హక్కులు కల్పించబడిన భూమి మొత్తం విస్తీర్ణం సాగుచేయబడుతున్న భూమిలో 4 శాతం కంటే తక్కువగా ఉంది. మూడు రాష్ట్రాలు – కేరళ, పశ్చిమ బెంగాల్, త్రిపుర – మినహా ప్రతి రాష్ట్రంలో పునఃపంపిణీ చేయబడిన ప్రాంతం సాగుచేయబడుతున్న భూమిలో 1 శాతం కంటే తక్కువగా ఉంది. ఒక కుటుంబానికి 25 ఎకరాల సీలింగ్‌తో 1950ల మధ్యలో, 1960ల ప్రారంభంలో భూమిలేని, పేద రైతు కుటుంబాల మధ్య పంపిణీ చేయడానికి 6 కోట్ల 30 లక్షల ఎకరాల కంటే తక్కువ భూమి అందుబాటులో ఉండేది. అయితే ఇప్పటి వరకు 5 లక్షల ఎకరాలకు మించి భూ పంపిణీ జరగలేదు.[10]

మరోవైపు, వ్యవసాయాన్ని "బేర సారాల రంగం"గా కూడా చూడడం జరిగింది, అంటే, చాలా తక్కువ అదనపు పెట్టుబడితో ఉత్పత్తిని పెంచగల రంగం. మొదటి ప్రణాళికలో నీటిపారుదల కోసం ప్రణాళికా వ్యయంలో 20 శాతం కేటాయింపులను పక్కన పెడితే, రెండవ ప్రణాళిక నుండి ఆ వాటా దాదాపు 8 నుండి 10 శాతానికి పడిపోయింది. ఫలితంగా, మొత్తం విస్తీర్ణంలో నీటిపారుదల ప్రాంతం వాటా చాలా నెమ్మదిగా పెరిగింది, ఇది పంట దిగుబడి కూడ నెమ్మదిగా పెరిగేలా చేసింది. దిగుబడిలో పెరుగుదల లేకపోవడంతో, 1949–50, 1964–65 మధ్య పంటల ఉత్పత్తిలో పెరుగుదల చాలావరకు సాగు భూమి విస్తీర్ణంలో పెరుగుదల నుండి ఉద్భవించింది.

వ్యవసాయాన్ని బేరసారాల రంగంగా చూడటం అంటే వ్యవసాయంలో మిగులు విస్తరణ దానంతటదే జరుగుతుందని ప్రణాళికాకర్తల అంచనా. ఇది పెరుగుతున్న పారిశ్రామిక రంగానికి వేతన వస్తువుల (ప్రధానంగా ఆహారం) ప్రవాహాన్ని నిర్ధారిస్తుందనుకున్నారు. అయితే, ఈ ఊహ భారత రాజ్య స్వభావంపై సరైన అవగాహనకు రాకుండా చేసిందని అర్థమవుతుంది. ఒకవైపు, జాతీయోద్యమ నాయకత్వానికి ఉన్న వర్గ వైఖరుల కారణంగా, భూసంస్కరణల అమలు చేయడానికి వచ్చిన అన్ని అవకాశాలను ఉద్దేశ్య పూర్వకంగానే సైద్ధాంతికంగా అణగదొక్కడం జరిగింది. ఫలితంగా భూ సంస్కరణలు ఎన్నడూ అమలు కాలేదు. రైతులను, కార్మికులను సమీకరించి భూమి సమస్యను పరిష్కరించడానికి స్వాతంత్ర్య ఉద్యమం

అందించిన చారిత్రాత్మక అవకాశం చేజారిపోయింది.[11] సాంప్రదాయ గ్రామీణ ఆధిపత్య నిర్మాణాలు చెక్కుచెదరకుండా అలాగే ఉండిపోయాయి. లోతైన అసమానతల పునాదిపై ఏర్పడిన విధానాలే అమలు చేయబడుతున్నాయి.

భూసంస్కరణల వైఫల్యం, పెద్ద భూస్వాముల ఉనికి కేవలం ఆర్థికపరమైన చిక్కులు మాత్రమే కాదు. స్వాతంత్ర్యానంతరం గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక వివక్ష, రాజకీయ ఆధిపత్యానికి భూమి యాజమాన్యం భౌతిక ప్రాతిపదికగా ఉంది. అగ్రవర్ణ భూస్వాములు గ్రామాల్లో దళితులు, ఆదివాసీలు, ఇతర సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన సమూహాలను దోపిడీ చేయడం కొనసాగించవచ్చు, ఎందుకంటే భూమిపై యాజమాన్యం, ఆధిపత్యం వారికి కొంత సామాజిక అనుమతిని ఇచ్చింది. భారత జాతీయ కాంగ్రెస్ వంటి రాజకీయ పార్టీలకు పెద్ద భూస్వాములే నాయకత్వం వహించి ఆర్థిక సహాయం చేయడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఓట్లను, చట్టబద్ధతను ఆ పార్టీలు పొందాయి.

భూ సంస్కరణలు లేనప్పుడు, వ్యవసాయ విధానం కమ్యూనిటీ డెవలప్‌మెంట్ (సిడి) ప్రోగ్రామ్ వంటి పథకాలపై దృష్టి పెట్టడానికి ప్రయత్నించింది. పాశ్చాత్య దేశాలలో అనుభవాల నుండి తీసుకోబడిన CD కార్యక్రమం గ్రామీణ సమాజ సాధారణ అవసరాలను తీర్చడానికి, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలను స్వచ్ఛంద కార్మికులుగా సమీకరించడం లక్ష్యంగా పెట్టుకుంది. విద్య, గ్రామీణ పరిశ్రమలు, పశుపోషణ, స్థానిక స్వపరిపాలన వంటి గ్రామీణాభివృద్ధికి సంబంధించిన ఇతర అంశాలను మెరుగుపరచడం కూడా దీని లక్ష్యం. అయినప్పటికీ, భూ సంస్కరణలు, ప్రభుత్వ పెట్టుబడుల వలన కలిగే ప్రయోజనాల వంటి వాటిని నిర్మించగల సమగ్ర ప్రణాళికగా CD ప్రోగ్రామ్ ఎప్పుడూ రూపొందించబడలేదు. గ్రామస్తులు "స్వేచ్ఛాయుతమైన ఏజెంట్లు" లేదా ఏ విధమైన సజాతీయ "సమాజం" సభ్యులు కాదని గుర్తించడంలో ఈ విధానం విఫల మైంది. వ్యవసాయ రంగ నిచ్చెన మెట్ల వ్యవస్థలో వారి స్థానం వారిని కట్టడి చేస్తుందని వారు తెలుసుకోలేదు. ఫలితంగా, ప్రోగ్రామ్ నమూనా గ్రామీణ ప్రాంతాల్లో సంస్థాగతంగా ఉన్న అసమానతలను ప్రతిబింబించింది, వాటిని బలోపేతం చేసింది.

60వ దశకం మధ్య నాటికి సాగు విస్తీర్ణం విస్తరించే అవకాశాలు అంతరించాయి. వ్యవసాయ ఉత్పత్తి నెమ్మదిగా పీఠభూమి వైపు పయనిస్తోంది. ఈ పరిస్థితి పెరుగుతున్న జనాభాకు ఆహార లభ్యతపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తింది. 1965–66, 1966–67 రెండు వరుస కరువు సంవత్సరాల్లో ఆహార ధాన్యాల ఉత్పత్తి 1964–65లో 8 కోట్ల 90 లక్షల టన్నుల నుండి 1966–67నాటికి

7 కోట్ల 42 లక్షల టన్నులకు పడిపోయింది. మూడో ప్రణాళిక కాలంలో ఆహార ధరలు దాదాపు 50 శాతం పెరిగాయి. PL–480 పథకం కింద అమెరికా నుండి భారతదేశానికి ఆహార దిగుమతులు నిలిపివేయబడతాయనే భయాలు నెలకొన్నాయి. ఇది కాకుండా, ఆహార సంక్షోభం ప్రణాళిక ప్రక్రియనే పట్టాలు తప్పేలా చేసింది. ప్రణాళిక ప్రక్రియలో ఒక ముఖ్యమైన అంచనా ఏమిటంటే, వేతన వస్తువుల సరఫరాలో మొత్తం ప్రభుత్వ నియంత్రణ ఉండాలని. వేతన వస్తువుల ఉత్పత్తి కుదించుకు పోవడంతో, పారిశ్రామిక వృద్ధి రేటును కొనసాగించడానికి వ్యవసాయ ఉత్పత్తిలో పెరుగుదల తప్పనిసరి అవసరమైంది.

**పారిశ్రామికీకరణకు ప్రణాళిక**

స్వాతంత్ర్య కాలంలో సాంప్రదాయ పారిశ్రామిక కార్యకలాపాలైన వస్త్రాలు, ఆహార, వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్, ఖనిజ ముడి పదార్థాల ప్రాసెసింగ్ వంటివి ఆధిపత్యం చలాయించాయి. 1950ల ప్రారంభంలో వస్తూత్పత్తి రంగ జి.డి.పిలో వస్త్రాల వాటా 31.2 శాతం. మొత్తంమీద నాలుగు పారిశ్రామిక సమూహాలు – పైన పేర్కొన్న మూడింటితో పాటు కలప, ఫర్నిచర్ ఉత్పత్తులు మొత్తం పారిశ్రామిక ఉత్పత్తిలో 2/3 వంతు కంటే ఎక్కువ. మూలధన సరుకులు, మధ్యంతర సరుకులు ఎక్కువగా దిగుమతి చేయబడ్డాయి. 1950ల ప్రారంభంలో దాదాపు 55 శాతం మూలధన సరుకులను, 27 శాతం పారిశ్రామిక ముడి పదార్థాలను దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది.

1950లు, 1960ల ప్రారంభంలో పారిశ్రామిక విధానం ఆ కాలంలోని రాజకీయ ఏకాభిప్రాయాన్ని ప్రతిబింబిస్తుంది. ఆర్థిక శాస్త్రంలో "శైశవ పరిశ్రమ" సూత్రాన్ని అనుసరించే వాదన ఏమిటంటే, మొత్తంగా భారతీయ ఆర్థిక వ్యవస్థను ప్రభుత్వ పెట్టుబడి ప్రముఖ పాత్ర పోషించే "శైశవ ఆర్థిక వ్యవస్థ"గా పరిగణించాలి.[12] ఈ కాలాన్ని" దిగుమతి ప్రత్యామ్నాయ పారిశ్రామికీకరణ" (ISI). అని స్థూల ఆర్థిక విధానం పిలిచింది. అంటే, (ఎ) దేశీయ ఉత్పత్తిని విస్తరించడం ద్వారా దిగుమతులపై దేశం ఆధారపడటాన్ని తగ్గించడంపై దృష్టి సారించాలి (బి) దిగుమతులపై అధిక సుంకాలు, పరిమాణాత్మక పరిమితుల విధింపు వంటి ఆంక్షలు విధించడం ద్వారా దేశీయ పరిశ్రమలను కాపాడుకోవడం.

1956 పారిశ్రామిక విధాన తీర్మానం ఈ విధంగా పేర్కొంది : "సోషలిస్ట్ నమూనాను జాతీయ లక్ష్యంగా స్వీకరించడం, అలాగే ప్రణాళికాబద్ధమైన, వేగవంతమైన అభివృద్ధి అవసరం. ప్రాథమిక, వ్యూహాత్మక ప్రాముఖ్యత కలిగిన అన్ని పరిశ్రమలు

లేదా ప్రజా వినియోగ సేవల స్వభావం కలిగినవి ప్రభుత్వ రంగంలో ఉండాలి. ఇతర పరిశ్రమలు, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం మాత్రమే పెట్టుబడులు అందిచగలిగే స్థాయిలో పెట్టుబడి అవసరమైన పరిశ్రమలు కూడా ప్రభుత్వ రంగంలోనే ఉండాలి."

పర్యవసానంగా, పరిశ్రమలు మూడు రకాలుగా విభజించబడ్డాయి : (ఎ) షెడ్యూల్ ఎ : ఇక్కడ భారీ పెట్టుబడి అవసరమైన, పెద్ద-స్థాయి, అధిక-రిస్క్ మూలధనం ఎక్కువగా ఉండే రంగాలలో ప్రభుత్వ పెట్టుబడి మాత్రమే అనుమతించ బడుతుంది, (బి) షెడ్యూల్ బి: ఇక్కడ ప్రభుత్వ పెట్టుబడి ప్రధానంగా ఉండాలి, కానీ దానికి ప్రైవేట్ పరిశ్రమ అనుబంధం చేయబడుతుంది, (సి) షెడ్యూల్ సి: ప్రైవేట్ పెట్టుబడిని మాత్రమే ప్రోత్సహించాలి. 1947 తర్వాత పారిశ్రామిక వృద్ధి పుంజుకోవడం, రెండు ప్రాథమిక వనరుల నుండి వచ్చింది. 1) ప్రభుత్వ పెట్టుబడి, 2) దేశీయ పరిశ్రమకు రక్షణ కల్పించడం. అదే సమయంలో, ప్రైవేట్ పరిశ్రమ లైసెన్సింగ్, దిగుమతి-ఎగుమతి నియంత్రణలు, సుంకాలు, ధర నియంత్రణల ద్వారా నియంత్రించ బడుతుంది.

ఇటువంటి పారిశ్రామిక విధానం పారిశ్రామిక వృద్ధికి ఉద్దీపనను అందిం చింది. పారిశ్రామిక ఉత్పత్తి సూచిక 1950-51, 1964-65 మధ్య 7.2 శాతం వార్షిక వృద్ధి రేటును నమోదు చేసింది. 1956 వరకు అంటే, మొదటి పంచవర్ష ప్రణాళిక ముగిసే వరకు, వినియోగ వస్తువుల రంగానికి దిగుమతి ప్రత్యా మ్నాయం అత్యధికంగా ఉంది. తరువాత, రెండవ పంచవర్ష ప్రణాళిక నుండి భారీ పారిశ్రామిక రంగానికి ఇచ్చిన ప్రాధాన్యత కారణంగా, మూలధన వస్తువుల రంగంలో దిగుమతి ప్రత్యామ్నాయం యొక్క పరిధి ఎక్కువగా కనిపిస్తుంది.

అయితే, అరవైల మధ్య నాటికి పారిశ్రామిక వృద్ధి మందగించింది. 1965- 66, 1974-75 మధ్య పారిశ్రామిక వృద్ధి సంవత్సరానికి 4 శాతం మాత్రమే. పెద్దగా ఉపయోగించబడని సామర్థ్యాలు ఉన్నాయి. ఇవి తయారు చేసిన వస్తువులకు డిమాండ్ నిలిచిపోవడాన్ని సూచిస్తున్నాయి. మొదటిది, వ్యవసాయ మిగులు, పేలవమైన వృద్ధి పారిశ్రామిక వృద్ధికి అడ్డంకిగా మారింది. 1964-65లో గ్రామీణ రంగంలో మొత్తం పారిశ్రామిక వస్తువుల వినియోగంలో ధనవంతులైన 10 శాతం మంది 32.2 శాతం వస్తువులను వినియోగిస్తుండగా, పేదలుగా ఉన్న 50 శాతం జనాభా కేవలం 22 శాతం పారిశ్రామిక వస్తువులను మాత్రమే వినియోగించింది. భూ సంస్కరణల పేలవమైన అమలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో దేశీయ మార్కెట్ కున్న విస్తృత స్థాయి అవకాశాలను నిరోధించింది.

రెండవది, 1960ల ప్రారంభంలో సంవత్సరానికి 9.1 శాతం, 13.2 శాతం

చొప్పున పెరుగుతున్న ప్రభుత్వ పెట్టుబడి, ప్రభుత్వ వ్యయం 1965, 1974 మధ్య 0.7 శాతం, 2 శాతానికి పడిపోయాయి. ప్రభుత్వ పెట్టుబడుల క్షీణత ప్రాథమిక పారిశ్రామిక ఇన్‌పుట్‌ల సరఫరాను పరిమితం చేసింది. ప్రభుత్వ వ్యయం తగ్గడం వల్ల ప్రైవేట్ రంగంలో ఉత్పత్తికి డిమాండ్ తగ్గింది.

అదే సమయంలో, పోగుపడిన ఆర్థిక మిగులును స్వాధీనం చేసుకున్న ప్రైవేట్ రంగం, తద్వారా తాజా పెట్టుబడులు, వనరులను స్పెక్యులేటివ్ బిజినెస్ (షేర్ మార్కెట్), విలాసవంతమైన వస్తువుల వినియోగం, నిర్మాణం లాంటి రంగాల లోకి మళ్లించింది. పరిశ్రమలోని చాలా ఉప-రంగాలలో కొన్ని పారిశ్రామిక సమూహాల ఒలిగోపోలీ (ఆధిపత్యం నెరపే కొద్దిమంది బృందం) ఉంది. 1964 నాటి గుత్తాధిపత్యం పై విచారణ కమిషన్ ప్రకారం, వారు అధ్యయనం చేసిన 1298 ఉత్పత్తులలో దాదాపు 88 శాతం ఒలిగోపోలిస్టుల చేతుల్లో ఉన్నాయి. 1298 ఉత్పత్తులలో, 437 ఉత్పత్తులు మాత్రమే ఒక్కొక్క సంస్థ చేత ఉత్పత్తి చేయబడ్డాయి. 1951-1958 మధ్య వాటా మూలధనాన్ని, నాలుగు అతిపెద్ద సంస్థలు, నికర స్థిర ఆస్తులను 13 అతిపెద్ద సంస్థలు, నికర మూలధన స్టాక్స్ ను 20 అతి పెద్ద సంస్థలచే నియంత్రించ బడుతున్నాయి.

పరిశ్రమలో లైసెన్స్ విధాన పాలన నుండి అపారమైన ప్రయోజనం పొందుతూనే, ప్రైవేట్ రంగం ఈ విధానాన్ని బలహీనపరిచేందుకు చురుకుగా కుమ్మక్కైంది. పెద్ద వ్యాపార సంస్థలు లైసెన్సులలో అసమాన వాటాను పొంది వాటిని పక్కన పెట్టాయి. కానీ కొత్త సామర్థ్యాలను ఉత్పత్తి చేయడానికి, లేదా సృష్టించడానికి ఈ ప్రదేశాలలో పెట్టుబడులను పెట్టలేదు. బదులుగా, వారు తమ గద్దె వద్దకు ఇతరుల ప్రవేశాన్ని నిరోధించడానికి లైసెన్స్‌లను ఉపయోగించారు. అందువలన, గుత్తాధిపత్యం ఎటువంటి అదనపు పెట్టుబడి లేకుండా నిర్వహించబడింది. లైసెన్సింగ్ విధానం యొక్క లక్ష్యాలు ఓడిపోయాయి. పరిశ్రమలోని కొన్ని ఉప-రంగాలలో ధరల నియంత్రణ విధానం వలన వ్యాపార సంస్థలు ఈ ఉప-విభాగాల నుండి వైదొలిగి, ధరల నియంత్రణలు లేని వినియోగ సరుకుల రంగాలలో పెట్టుబడి పెట్టాయి.

1960ల మధ్య నాటికి, దిగుమతుల ప్రత్యామ్నాయానికున్న అవకాశాలు మరింత అడుగంటాయి. దేశీయ మార్కెట్‌లో పెరుగుదల ద్వారా మాత్రమే డిమాండ్‌లో మరింత పెరుగుదల సాధ్యమైంది.

## III

## స్వాతంత్ర్యానంతరం అనుభవం: 1966 నుండి 1980

వ్యవసాయ సంక్షోభానికి, పారిశ్రామిక సంక్షోభానికి భారత ప్రభుత్వం

భిన్నంగా స్పందించింది. హరిత విప్లవం వ్యవసాయ రంగంలో ప్రతిస్పందన అయితే, పారిశ్రామిక రంగంలో మందగమనం 1970ల చివరి వరకు కొనసాగింది.

**కొత్త వ్యవసాయ వ్యూహం (NAS)**

1960ల మధ్యకాలంలో రెండు వరుస కరువులు, అంతకు ముందు 1957–58లో మరో కరువు సంభవించాయి. ఇక్కడి నుంచే ఆహారోత్పత్తి సరిపోదనే భయం మొదలైంది. 1959లో భారత ప్రభుత్వం ఫోర్డ్ ఫౌండేషన్‌ను భారతీయ వ్యవసాయంపై వివరణాత్మక అధ్యయనం చేపట్టాలని అభ్యర్థించింది. 'ఇండియాస్ ఫుడ్ క్రైసిస్ అండ్ స్టెప్స్ టు మీట్ ఇట్' అనే పేరుతో రూపొందించిన నివేదిక వ్యవసాయ విధానంపై ప్రధాన ప్రభావాన్ని చూపిన పత్రం. ఉత్పత్తి, జనాభాలో ధోరణులను బట్టి వ్యవసాయోత్పత్తిలో వేగవంతమైన పెరుగుదల అనివార్యమని పేర్కొంది. వ్యవసాయంలో అభివృద్ధి చెందుతున్న కొత్త సాంకేతికతను పంటలు, ఉత్పత్తిని పెంచడానికి గరిష్ట సంభావ్యత ఉన్న ప్రాంతాలపై కేంద్రీకృత అభివృద్ధి కృషిని రూపొందించడానికి ఉపయోగించాలని సూచించారు. నీటిపారుదల సౌకర్యాలలో తక్షణ మెరుగుదల, మెరుగైన నీటి నిర్వహణ, చిన్న తరహా నీటిపారుదల ప్రాజెక్టులపై దృష్టి కేంద్రీకరించడం, స్వల్పకాలిక కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా ఎరువుల వినియోగాన్ని పెంచాలని కూడా సిఫార్సు చేసింది.[13]

ప్రతిస్పందనగా, ప్రభుత్వం 1961లో ఇంటెన్సివ్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (IADP)ని, 1964లో ఇంటెన్సివ్ అగ్రికల్చరల్ ఏరియా ప్రోగ్రామ్ (IAAP)ని ప్రవేశపెట్టింది. IADP మరియు IAAP రెండూ సమీకృత వ్యవసాయ విస్తరణలో పైలట్ పథకాలు. మెరుగైన సాంకేతికత, క్రెడిట్, అధిక దిగుబడినిచ్చే విత్తనాలు, గ్యారంటీ నీటిపారుదల సదుపాయం కలిపి అధిక దిగుబడినిచ్చే ఇన్‌పుట్‌ల "ప్యాకేజీ"ని స్వీకరించడాన్ని ప్రోత్సహించడం వారి లక్ష్యం. వరి, గోధుమ వంటి పంటల కోసం, శాస్త్రవేత్తలు అప్పటికి అధిక దిగుబడినిచ్చే, స్వల్పకాలిక, పొట్టిరకాలు, ఎరువులకు ప్రతిస్పందించే, వాతావరణ మార్పులను తట్టుకునే విత్తన రకాలను అభివృద్ధి చేశారు. 1966–67 తర్వాత, అధిక దిగుబడినిచ్చే వెరైటీస్ ప్రోగ్రామ్ (HYVP) అనే కొత్త కార్యక్రమం IAAPకి అనుసంధానం చేయబడింది. దేశం మొత్తం కవర్ అయ్యేలా విస్తరించబడింది. ఈ నూతన వ్యవసాయ వ్యూహమే (NAS) "హరిత విప్లవం"గా పిలవబడింది.

NAS ప్రధానంగా సాంకేతికతతో ముడివడిన కార్యక్రమం అయితే, దీనికి రెండు రకాలుగా ఒకటి ధర, రెండు క్రెడిట్ రంగాలలో ఆర్థిక మద్దతు లభించింది.

మొదటిది, కొత్త సాంకేతికతలను స్వీకరించడానికి ధర ప్రోత్సాహకాలు, అంటే అధిక ఉత్పత్తి ధరలు అవసరమని భావించారు. 1965లో ఏర్పాటైన వ్యవసాయ ధరల సంఘం (APC) ధరల స్థాయిపై ప్రభుత్వానికి సలహాలు ఇవ్వడానికి, సాంకేతికతలను స్వీకరించడానికి ప్రోత్సాహకంగా, అలాగే భూమి, ఇతర వనరులను హేతుబద్ధంగా వినియోగించుకోవడానికి మార్గదర్శకంగా ఉంటుంది. APC రెండు సెట్ల నిర్వహణ ధరలను సూచించాలి : కనీస మద్దతు ధర, సేకరణ ధర. మద్దతు ధర అనేది ఫ్లోర్ ధర, దీని ద్వారా ప్రభుత్వం ఉత్పత్తిదారులు అందించే మొత్తం సరుకు కొనుగోలు చేస్తుంది. సేకరణ ధర అనేది సాగు ఖర్చు, లాభాల మార్జిన్‌ను కవర్ చేసే ధర, ఇది ఉత్పత్తిదారులకు అందించబడుతుంది, అయితే ప్రభుత్వం వారి పంటను సబ్సిడీ ప్రజా పంపిణీ కోసం సేకరిస్తుంది. సేకరణ, బఫర్ స్టాక్ మేనేజ్‌మెంట్ విధానంలో లింక్‌గా ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (FCI) 1965లో స్థాపించబడింది. పేదలకు సరసమైన ధరలకు ఆహారాన్ని అందుబాటులో ఉంచే, అంతర్-తాత్కాలిక ధరల స్థిరత్వాన్ని కొనసాగించే ఏజెన్సీ ఇది.

రెండవది, 1969లో వాణిజ్య బ్యాంకుల జాతీయకరణ విధానం రైతాంగానికి రుణ లభ్యతను గణనీయంగా పెంచడానికి దోహదపడింది. బ్యాంకుల జాతీయకరణ గ్రామీణ ప్రాంతాల్లో మిగులు ధనాన్ని సమీకరించడానికి, ప్రభుత్వ బ్యాంకుల భౌగోళిక విస్తరణ, క్రియాత్మక పరిధిని మెరుగుపరచడానికి సహాయపడింది. గ్రామీణ ప్రాంతాల్లో వడ్డీ వ్యాపారుల పట్టును కొంత బలహీనపరిచింది.

అదనంగా ఎరువులు, పురుగుమందులు, నీటిపారుదల కోసం విద్యుత్ వంటి ముఖ్యమైన ఇన్‌పుట్‌ల ధరలను సబ్సిడీ పాలసీ కవర్ చేస్తుంది. వ్యవసాయ మార్కెటింగ్‌లో, వ్యవసాయ ఉత్పత్తి, మార్కెటింగ్ కమిటీ (APMC) చట్టాలు, అత్యవసర సరుకుల నిల్వ చట్టం సరుకుల మార్పిడిలో పక్కదారి పెట్టడాన్ని తగ్గించడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌ను నియంత్రించడానికి ఆమోదించబడ్డాయి. APMC చట్టం ప్రకారం, వేల సంఖ్యలో నియంత్రిత మార్కెట్లు (మండీలు) ఏర్పాటు చేయబడ్డాయి.

అయినప్పటికీ, దాని అన్ని సాంకేతిక ప్రయోజనాలతో, NAS యొక్క ఫలితాలు దాని ప్రారంభ దశలో రావాల్సిన దానికంటే చాలా తక్కువగా వచ్చాయి. ప్రారంభ హరిత విప్లవ కాలంలో వ్యవసాయ ఉత్పత్తి వృద్ధి రేటు ప్రారంభ ప్రణాళిక దశలో కంటే తక్కువగా ఉంది. ఈ విమర్శ ఆహార అభద్రతను తగ్గించడంలో NAS యొక్క సహకారాన్ని తిరస్కరించడం కాదు. నిజానికి, NAS దేశం యొక్క "ఓడలో వస్తేనే తినడం" అనే దుస్థితిని మార్చడంలో కీలక పాత్ర పోషించింది M.S.

స్వామినాథన్ ఎత్తి చూపినట్లుగా, జాతీయ సార్వభౌమాధికారం, ఆహార స్వయం సమృద్ధి మధ్య సంబంధాన్ని స్థాపించింది". కానీ ఈ వ్యూహంలో అంతర్గతంగా కొన్ని పరిమితులు ఉన్నాయి. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో సంస్థాగత అసమానతలను తీవ్రతరం చేసింది. నాల్గవ పంచవర్ష ప్రణాళిక పత్రం అటువంటి అసమానతలను NAS రూపకల్పనకు కేంద్రంగా అంగీకరించింది:

"...తక్కువ కాలంలో ఉత్పత్తి పెరుగుదలను సాధించాలనే ఆకాంక్ష తరచుగా అభివృద్ధికి సహకరించే అవకాశం, సామర్థ్యం కలిగి ఉన్న ప్రాంతాలపై, వ్యక్తులపై, తరగతులపై కేంద్రీకరించాల్సిన అవసరాన్ని ముందుకు తెస్తుంది" అని పేర్కొంది. ఈ పరిశీలనతోనే సాగు నీటిపారుదలతో సమగ్ర, సాంద్ర వ్యవసాయాభివృద్ధి వ్యూహాన్ని రూపొందించింది.'

ఉత్పత్తిలో సమర్థవంతమైన సంస్థాగత రూపాలు, ఆస్తి హక్కులు దగ్గరి సంబంధం కలిగి ఉన్నందున, సాంకేతిక వ్యాప్తి పరిధిని నిర్ణయించడంలో భూ సంస్కరణల అమలు కీలకమైన అంశం. NAS వైఫల్యం ఈ వ్యూహాత్మక అవకాశాన్ని దాటవేయడంలో దాగి ఉంది. పర్యవసానంగా, హరిత విప్లవం యొక్క ప్రయోజనాలు పంటలు, తరగతుల, ప్రాంతాలలో అసమానంగా ఉన్నాయి. దీని కోసం నీటిపారుదల సౌకర్యం ఉన్న ప్రాంతాలపై, కేవలం రెండు పంటలపై (వరి, గోధుమలు), కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడానికి అవసరమైన పెట్టుబడిని సమీకరించగల రైతులపై NAS దృష్టి సారించింది.

అయినప్పటికీ, హరిత విప్లవం భారతదేశంలో పెట్టుబడిదారీ వ్యవసాయ అభివృద్ధికి ఊతమిచ్చింది. భూస్వాముల ఉత్పత్తి ఆదాయాల పెరుగుదల, వాణిజ్యీకరణ, మార్కెట్ల పెరుగుదల, పెద్ద ఎత్తున కౌలుదారుల తొలగింపు, రైతుల మధ్య ఆర్థిక అంతరాలు, శ్రామికీకరణ వేగంగా పెరగడం, ప్రైవేట్ పెట్టుబడి పెరుగుదల, భారత ప్రభుత్వం నుండి మద్దతు ధర /క్రెడిట్/మార్కెటింగ్ విస్తరణ – ఈ చర్యలన్నీ పాత భూస్వామ్య వర్గాన్ని కొత్త తరగతిగా మార్చడం ప్రారంభించాయి, భూస్వామ్య వర్గం ఒకవైపు పాత యుగంలోని వెనుకబాటు చైతన్యాన్ని నిలుపుకుంటూనే, మరోవైపు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, స్వేచ్ఛా కార్మిక సంబంధాలను అవలంబించింది. ఈ తరగతులు క్రమంగా పెట్టుబడిదారీ భూస్వాములుగా మారారని అధ్యయనాలు చూపిస్తున్నాయి.[14]

ఈ భూస్వామ్య పెట్టుబడిదారులు 19వ శతాబ్దంలో ప్రష్యాలోని జంకర్ భూస్వాములు పరిణామం చెందిన విధానాన్ని పోలి ఉంటారు. శ్రామికవర్గం గ్రామీణ ప్రాంతాల్లో భూమిలేని కార్మికుల పరిమాణాన్ని పెంచింది. ప్రధానంగా దళితులు,

ఆదివాసీలు, ఇతర వెనుకబడిన తరగతుల పేద వర్గాలకు చెందిన వ్యవసాయ కూలీల తరగతిని పెంచింది. 2000లో అప్‌డేట్ చేయబడిన పార్టీ ప్రోగ్రామ్ ఈ విషయంలో ఇలా చెప్పింది :

"3.21. గ్రామీణ ప్రాంతాలలో చాలా వరకు భూస్వాములు-ధనిక రైతులు-కాంట్రాక్టర్లు-గ్రామీణ ధనవంతులుగా ఉన్న పెద్ద వ్యాపారులు శక్తివంతమైన కూటమిగా తయారు అయ్యారు. వామపక్ష-ఆధిపత్య రాష్ట్రాలు మినహా మిగతా చోట్ల పంచాయతీరాజ్ సంస్థలు, సహకార సంఘాలు, గ్రామీణ బ్యాంకులు క్రెడిట్ ఏజెన్సీలలో వారే ఆధిపత్యం చలాయిస్తున్నారు. వీరే బూర్జువా-భూస్వామ్య పార్టీల గ్రామీణ నాయకత్వాన్ని నియంత్రి స్తారు. ఈ సెక్షన్లు సేకరించిన మిగులు డబ్బు వడ్డీ వ్యాపారం, స్పెక్యులేటివ్ కార్య కలాపాలు, రియల్ ఎస్టేట్, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల స్థాపనకు మళ్లించబడుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆధిపత్య వర్గం మద్దతు కూడగట్టుకోవడానికి కుల అనుబంధాలను ఉపయోగించుకుంటుంది. గ్రామీణ పేదలను భయభ్రాంతులకు గురిచేయడానికి హింసను ఆశ్రయిస్తుంది. రాజ్యాంగం అమలులోకి వచ్చి 50 ఏళ్లు గడిచినా, భూ స్వాముల వ్యతిరేకత కారణంగా వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు, మెరుగైన జీవన పరిస్థితులు, సామాజిక భద్రతకు హామీ ఇచ్చే కేంద్ర చట్టాన్ని ఏ ప్రభుత్వమూ ఆమోదించలేదు."

**పారిశ్రామిక మందగమనం**

1960ల పారిశ్రామిక మందగమనం 1970ల చివరి వరకు కొనసాగింది. 1960ల నాటికి, ప్రభుత్వ వ్యయం డిమాండు పెరుగుతున్నప్పటికీ భారత ప్రభుత్వానికి ప్రభుత్వ రంగ సంస్థల నుండి తక్కువ మిగులు, పన్నుల నుండి తక్కువ ఆదాయం లభిస్తున్నది. ప్రభుత్వ వ్యయం కోసం ద్రవ్య లోటు ద్వారా ఎక్కువగా నిధులు సమకూర్చుకోవలసి వచ్చింది. అంతేకాకుండా, ఆదాయ వృద్ధిలో మందగమనం ప్రజలు పొదుపుచేయడంలో మందగమనానికి దారితీసింది. చివరగా, PL-480 ఆహార సహాయ పథకం కుదించుకు పోవడంతో విదేశీ సహాయాల ప్రవాహం కూడా మందగించింది. ప్రభుత్వ వ్యయం తగ్గడంతో, దేశీయ డిమాండ్ వృద్ధి మందగించింది. విద్యుత్, రవాణా, నీటిపారుదల వంటి కీలకమైన రంగాల్లోని సామర్థ్యాలను పెద్దగా ఉపయోగించుకోలేని పరిస్థితి ఉద్భవించింది.[15] నీటిపారుదలలో పెట్టుబడుల మందగమనం, క్రమంగా వ్యవసాయ ఉత్పాదకత వృద్ధిని వెనక్కి లాగింది.

ఇంకా, హరిత విప్లవం సమయంలో వ్యవసాయ ఉత్పత్తిలో పెరుగుదల, ముడి పదార్థాలను చౌక పరచడం ద్వారా పారిశ్రామిక ఉత్పత్తిని పెంచడంలో సహాయపడాల్సింది కాని అది జరగలేదు. 1960ల నాటికి, ఉత్పాదక జి.డి.పిలో

వస్త్రాల వంటి వ్యవసాయ ఆధారిత పారిశ్రామిక ఉత్పత్తుల వాటా పడిపోయింది. పారిశ్రామిక రంగం నిర్మాణాత్మక మార్పుకు గురైంది. ఇది వ్యవసాయం ద్వారా సరఫరా అయ్యే ఇన్‌పుట్‌ల పై తక్కువగా ఆధారపడేలా చేసింది.

అందువల్ల, 1966, 1969 మధ్య, భారతదేశం పంచవర్ష ప్రణాళికను నిలిపివేసి, వార్షిక ప్రణాళికలను మాత్రమే అనుసరించింది. 1969లో ప్రారంభమైన నాల్గవ ప్రణాళిక కాలం ఖర్చులు, వృద్ధికి సంబంధించిన లక్ష్యాలను తగ్గించింది. విదేశీ చెల్లింపుల సంక్షోభం పొంచి ఉంది. లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరా గాంధీల కాంగ్రెస్ ప్రభుత్వాలు అంతర్జాతీయ ద్రవ్య నిధి (IMF) ఒత్తిళ్లకు లొంగి, జూన్ 1966లో భారత రూపాయి విలువను డాలర్‌తో పోలిస్తే 4.80 నుండి రూ. 7.50కి తగ్గించాయి. విలువ తగ్గింపు అధిక ద్రవ్యోల్బణానికి దారితీసింది, ఇది NAS వ్యూహానికి అత్యవసర ప్రాతిపదికను ఏర్పరిచింది. 1973 చమురు షాక్ ద్రవ్యోల్బణం, విదేశీ చెల్లింపుల సంక్షోభాన్ని మరింత అధ్వాన్నం చేసింది. రూపాయి విలువ తగ్గింపు దిగుమతులను మరింత ఖరీదైనవిగా మార్చివేసింది, దీని వలన ఎరువులు, చమురు దిగుమతుల కోసం విదేశీ మారకద్రవ్యంలో ఎక్కువ భాగాన్ని త్యాగం చేయాల్సి వచ్చింది.

### మిశ్రమ ఆర్థిక విధాన మార్గంలో వైరుధ్యాలు

మిశ్రమ ఆర్థిక విధానాన్ని అనుసరించడం భారతదేశ పెట్టుబడిదారీ అభివృద్ధి మార్గంలో అనేక అంతర్గత వైరుధ్యాలను తీసుకొచ్చింది.

మొదటి వైరుధ్యం ఏమిటంటే, భారత ప్రభుత్వం దీర్ఘకాలంలో కూడా సరిదిద్దలేని రెండు పాత్రలను పోషించాల్సి వచ్చింది. ఒక వైపు, ప్రభుత్వం వివిధ ఉత్పాదక, మౌలిక రంగాలలో పెట్టుబడులకు వనరులను స్థిరంగా కేటాయించవలసి వచ్చింది. దేశీయ డిమాండ్‌ను కొనసాగించడానికి ఇది చాలా అవసరం అయినప్పటికీ, భూ సంస్కరణలు అమలు చేయనందున ఈ డిమాండ్ యొక్క సామాజిక పునాది కుంచించుకుపోయింది. మరోవైపు, పెట్టుబడిని కొనసాగించడానికి ప్రభుత్వ ఆదాయాలు అవసరం, ఇది అధిక పన్నుల నుండి రావలసి వచ్చింది. ఏదేమైనప్పటికీ, పట్టణ పారిశ్రామికవేత్తలపై, గ్రామీణ భూస్వాములపై తగినంత పన్నులు విధించడంలో ప్రభుత్వ వైఫల్యం కారణంగా పెట్టుబడి కోసం ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్న స్వంత వనరులు పరిమితం చేయబడ్డాయి. భూస్వామ్య వర్గాలు గ్రామీణ అభివృద్ధి నిధులు కాజేయటాన్ని తగ్గించడంలో కూడా ప్రభుత్వం విఫలమైంది. ఇది ప్రభుత్వ వ్యయం వలన జరగాల్సినంత అభివృద్ధి జరగకుండా చేసి, దాని ప్రభావాలను

తగ్గించింది.

రెండవది, పెట్టుబడిదారులలో కనీస స్థాయి ఆర్థిక క్రమశిక్షణ, చట్టం పట్ల గౌరవాన్ని పెంపొందించడంలో భారత రాజ్యం విఫలమైంది. ఇది నెహ్రూవియన్ జోక్యందారీ పాలనలో ఒక స్థిరమైన పెట్టుబడిదారీ పరివర్తన జరగకుండా ప్రతికూల ప్రభావాన్ని చూపింది. జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలలో, ప్రభుత్వ జోక్యం, ప్రభుత్వం, పెట్టుబడిదారీ వర్గంతో సన్నిహిత సహకార సంబంధం కలిగి ఉంది. అటువంటి సహకార సంబంధం జపాన్, దక్షిణ కొరియాలో పెట్టుబడిదారులతో క్రమశిక్షణతో కూడిన పాలనను పెంపొందించినప్పటికీ, భారతదేశ అనుభవం దీనికి విరుద్ధంగా ఉంది.

మూడవది, భారతదేశంలో పారిశ్రామిక వస్తువులకు డిమాండ్ ఎల్లప్పుడూ ప్రధానంగా సమాజంలోని సంపన్న వర్గాల నుండి వస్తుంది. ఈ వర్గాలు దేశీయంగా ఉత్పత్తి చేయబడిన పారిశ్రామిక వస్తువులతో ఎప్పుడూ సంతృప్తి చెందలేదు. సంపన్న దేశాల ఉత్పత్తి కేంద్రాలలో ఉత్పత్తి చేయబడే వినూత్నమైన, సాంకేతికంగా అభివృద్ధి చెందిన వస్తువుల కోసం ఎల్లప్పుడూ వెంపర్లాడాయి. ఏది ఏమైనప్పటికీ, భారతదేశం ఈ విధమైన డిమాండ్ కారణంగా దిగుమతి ప్రత్యామ్నాయ పాలనను ఎంతో కాలం కొనసాగించలేకపోయింది. దిగుమతులపై నియంత్రణల ఎత్తివేత విపారిశ్రామికీకరణ ద్వారా దేశీయ ఆర్థిక వ్యవస్థలో ఉద్యోగాలు కోల్పోవడానికి దారితీయవచ్చు అనే వాస్తవంతో సంబంధం లేకుండా, నియంత్రణల నుండి దిగుమతులను విముక్తి చేయాలని సంపన్న వర్గాల నుండి బలమైన డిమాండ్ ముందుకు వచ్చింది. అటువంటి వైరుధ్యం భారతదేశంలో 1960లు, 1970లు, 1980లలో ప్రముఖంగా ముందుకొచ్చి పాత పాలనను కూల్చివేయాలనే డిమాండును బలపరిచింది. మరో మాటలో చెప్పాలంటే, 1980ల నాటికే ప్రభుత్వప్రాయోజిత పెట్టుబడిదారీ మార్గాన్ని నిర్మూలించేందుకు బలమైన దేశీయ లాబీ ఏర్పడి ఉంది.[16]

# IV

## స్వాతంత్ర్యం అనంతరం అనుభవం:

## 1980 నుండి 1991వరకు

1980వ దశకంలో, 1960ల మధ్యకాలం నుండి సుదీర్ఘ కాలం కొనసాగిన స్తబ్దత నుండి వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు కొంత బయటపడ్డాయి. జి.డి.పి

పునరుద్ధరణను భారత ఆర్థిక వ్యవస్థ చవిచూసింది. మరీ ముఖ్యంగా, 1980ల దశాబ్దం కంటే ముందు 1950లు, 1960లు, 1970లలో (ఇది సంవత్సరానికి జి.డి.పి వృద్ధి రేటు సగటున 3 శాతం) చాలా హానికరమైన "జి.డి.పి హిందూ వృద్ధిరేటు". ఈ కాలాన్ని జి.డి.పి వృద్ధి రేట్ల గణనీయమైన విరామంగా గుర్తించబడింది. 1980లలో జి.డి.పి వృద్ధి రేటు 5.6 శాతానికి పెరిగింది. మరో మాటలో చెప్పాలంటే, స్వాతంత్ర్యం తర్వాత మొదటి మూడు దశాబ్దాలతో పోలిస్తే 1980లలోనే ఆర్థిక వ్యవస్థ అధిక వృద్ధి పథంలోకి వెళ్లింది.

**వ్యవసాయ వృద్ధి**

1980లలో వ్యవసాయ వృద్ధి కొత్త ప్రాంతాలకు, మరిన్ని పంటలకు వ్యాపించింది. ఈ దశాబ్దంలో వ్యవసాయోత్పత్తి సగటున సంవత్సరానికి 3 శాతం చొప్పున పెరిగింది. వ్యవసాయ వృద్ధిలో ఈ మలుపుకు దోహదపడిన రెండు ముఖ్యమైన అంశాలు ఉన్నాయి: మొదటిది, దేశంలోని తూర్పు ప్రాంతంలో, ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో ఆహార ఉత్పత్తిలో పెద్ద పెరుగుదల ఉంది. రెండవది, మధ్య భారత ప్రాంతంలో నూనె గింజల ఉత్పత్తిలో మెరుగుదల కనిపించింది.

1977-78 తర్వాత లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ బర్గా అని పిలిచే కౌలు సంస్కరణల ద్వారా 1980లలో పశ్చిమ బెంగాల్ ఉత్పత్తిలో సాధించిన విజయాలను అధ్యయనాలు గుర్తించాయి. పశ్చిమ బెంగాల్‌లో కౌలు సంస్కరణల రెండు ప్రధాన విజయాలు కౌలుదారులకు రక్షణ కల్పించడం, సరసమైన కౌలు నిర్ణయించడం. భారీ రాజకీయ సమీకరణ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా కౌలుదారులు భూ రికార్డుల్లో నమోదు చేయబడ్డారు. 1990 వరకు దాదాపు 14 లక్షల మంది కౌలుదారులు నమోదు చేయబడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 14 లక్షల ఎకరాల సీలింగ్-మిగులు భూమిని సేకరించింది. దాదాపు 25లక్షల కుటుంబాలకు, 11 లక్షల ఎకరాల భూమి పంపిణీ చేయబడింది.[17]

ఈ చర్యలు, బ్యాంకు రుణాల సరఫరాలో పెరుగుదల, చిన్న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, గ్రామీణ విద్యుదీకరణతో కలిపి పశ్చిమ బెంగాల్‌లో 1980వ దశకంలో అన్ని రాష్ట్రాల కంటే వ్యవసాయోత్పత్తిలో అత్యధిక వృద్ధి రేటు నమోదు చేయడంలో కీలక పాత్ర పోషించాయి. దివంగత ఆర్థికవేత్త అభిజిత్ సేన్ చెప్పినట్లుగా, "పశ్చిమ బెంగాల్, వ్యవసాయ విలువ జోడింపులో సంవత్సరానికి 7 శాతానికి పైగా వ్యవసాయ రంగంలో సాధించిన వృద్ధి రేటును (జాతీయ సగటు కంటే రెండున్నర రెట్లు ఎక్కువ) ఎనభైల విజయగాథగా వర్ణించవచ్చు." 1980లలో పశ్చిమ బెంగాల్ విజయగాథ

భారతదేశంలో వ్యవసాయ వృద్ధిని పెంపొందించడంలో భూసంస్కరణలు ఏమి సాధించగలవో చూపించే ఒక రుజువు.

1980లలో నూనెగింజల ఉత్పత్తి ఒక్కసారిగా పెరిగింది. నూనెగింజల ఉత్పత్తిలో పెరుగుదల ప్రధానంగా వివిధ రంగాలలో ప్రజల మద్దతుతో పాటు సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి ద్వారా సాధించబడింది. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, స్వావలంబన సాధించేందుకు "నూనె గింజలపై సాంకేతిక మిషన్" 1986లో ప్రారంభించబడింది. ఈ మిషన్ మొదటి విజయం 1987-88లో జరిగింది. కరువు ఉన్నప్పటికీ, నూనె గింజల ఉత్పత్తి మునుపటి సంవత్సరాల కంటే గణనీయంగా పెరిగింది. నూనె గింజల ఉత్పత్తి 1966 మరియు 1979 మధ్య సంవత్సరానికి 1.6 శాతంతో పోలిస్తే 1980లలో సంవత్సరానికి 5.8 శాతం చొప్పున పెరిగింది.

**పారిశ్రామిక పునరుద్ధరణ**

1980లలో పారిశ్రామిక (సేవల రంగాన్ని కూడా కలుపుకుని) వృద్ధిని ప్రపంచ, దేశీయ అంశాల నుండి విడదీయలేము. ప్రారంభంలో అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ ప్రపంచంతో పాటు లాటిన్ అమెరికా, ఆఫ్రికాలోని అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలతో సహా అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు ప్రపంచీకరణ వైపు తీవ్రంగా మొగ్గు చూపాయి. 1940ల చివరి, 1970ల ప్రారంభంలో ప్రపంచ పెట్టుబడిదారీ విధానానికి "స్వర్ణయుగం". పెట్టుబడిదారుల, బహుళజాతి సంస్థల లాభాల భారీ వృద్ధికి దారితీసింది. ఇది మరిన్ని లాభాల కోసం ప్రపంచవ్యాప్తంగా మూలధన ప్రవాహాలు పెరగడానికి దారితీసింది. లండన్ వంటి నగరాల్లో విదేశీ (ఆఫ్ షోర్) డాలర్ల మార్కెట్లు అభివృద్ధి చెందాయి. తరువాత, 1973, 1979 'చమురు షాక్‌లు' చమురు ఉత్పత్తి దేశాలలో లాభాలు ద్రవ్య మిగులు పెద్ద ఎత్తున పెరగడానికి దారితీశాయి. ఈ కొత్త పొదుపులు ఆఫ్‌షోర్ బ్యాంకుల్లో డిపాజిట్‌లుగా మారాయి. ఇప్పుడు బ్యాంకులో చేరిన నగదు నిల్వలను తాజా రుణాలుగా బయటకు నెట్టడానికి కొత్త రుణగ్రహీతల కోసం బ్యాంకులు వెతుకుతున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు, ముఖ్యంగా లాటిన్ అమెరికా దేశాలు భారీగా రుణాలు తీసుకున్నాయి.

కొంతకాలం ఈ రుణాలు తీసుకునే దేశాలు దిగుమతి ఆంక్షలను ఎదుర్కోకుండా అభివృద్ధి చెందుతాయి. కానీ అప్పులు పెరిగిపోవడంతో వారు నిలదొక్కుకోవడానికి ఎక్కువ అప్పులు చేయాల్సి వచ్చింది. అమెరికాలోని రోనాల్డ్ రీగన్ ప్రభుత్వం వడ్డీ రేట్లను పెంచడంతో పాత అప్పుల చెల్లింపు ఖర్చులు కూడా పెరిగాయి. అంతిమంగా, 1982లో మెక్సికో డిఫాల్ట్ అయింది, ఆ తర్వాత బ్రెజిల్, ఇతర లాటిన్ అమెరికా దేశాలు ఆ వరుసలో ఉన్నాయి.[18] రుణాల కోసం ఐ.ఎం.ఎఫ్‌ని

ఆశ్రయించడం మినహా వారికి వేరే మార్గం లేకుండా పోయింది. ఐ.ఎం.ఎఫ్ వారికి రుణాలు ఇచ్చింది కానీ స్థిరీకరణ, వ్యవస్థాగత సర్దుబాటు సంస్కరణలను అమలు చేయాలన్న షరతులు విధించింది.

లాటిన్ అమెరికాలో సంక్షోభం ముదురుతున్నప్పటికి, బడా బూర్జువా నేతృత్వం లోని భారతీయ పాలక వర్గం విదేశీ రుణాల ద్వారా దేశీయ పొదుపులను పెంచుకునేందుకు ప్రయత్నించింది. 1980లో భారతదేశంలోనే విదేశీ చెల్లింపుల లోటు స్వల్పంగా ఉంది, ఆ తర్వాత ఇందిరా గాంధీ ప్రభుత్వం 1982లో 540 కోట్ల డాలర్ల ఐఎంఎఫ్ రుణాన్ని తీసుకుంది. ఈ ఐఎంఎఫ్ రుణం కూడా భారత ఆర్థిక వ్యవస్థను అంతర్జాతీయ మార్కెట్లకు ద్వారాలు తెరవాలనే షరతులతో వచ్చింది. 1984లో రాజీవ్ గాంధీ ప్రధానమంత్రి అయిన తర్వాత, దేశ, విదేశీ ఆర్థిక విధానాలలో సరళీకరణ ప్రవేశపెట్ట బడింది.

1980ల ప్రారంభం నుండి, ప్రభుత్వం విదేశీ, దేశీయ వనరుల నుండి తీసుకునే రుణాలు పెరిగాయి. ప్రభుత్వ స్థూల మార్కెట్ రుణాలు 1960లలో రూ.100 కోట్ల నుండి 1979–80లో రూ.2296 కోట్లకు, 1984–85లో రూ.4584 కోట్లు, 1986–87లో రూ.6350 కోట్లకు పెరిగాయి.

అటువంటి రుణాలను ఉపయోగించి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ వ్యయ విస్తరణ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇది బడ్జెట్ లోటును పెంచింది. ద్రవ్య లోటు 1983–84లో రూ.1417 కోట్ల నుండి 1986–87లో రూ.8265 కోట్లకు పెరిగింది. ఈ నిధులు అభివృద్ధికి దోహదపడే ప్రణాళికా ప్రాజెక్ట్‌లకు అందించబడలేదు. దీనికి భిన్నంగా ప్రభుత్వం నుండి ఉత్పాదక, అనుత్పాదక రంగాలకు ప్రణాళికా రహితంగా నిధులు అందడం అదికమయింది. అంతేకాకుండా, ఒకవైపు, వ్యయంతో కూడిన, దిగుమతులపై ఆధారపడిన మధ్యతరగతి వినియోగం విజృంభించింది.[19] మరోవైపు, దేశీయ మూలధనకల్పన పెరిగింది, వాణిజ్య నిబంధనలు పారిశ్రామిక రంగానికి అనుకూలంగా మారాయి. ప్రభుత్వ పెట్టుబడుల పెరుగుదల మౌలిక సదుపాయాల వంటి రంగాలలోని పరిశ్రమల ఆర్థిక పనితీరును మెరుగుపరిచింది.

వీటన్నింటి ఫలితం 1980లలో పారిశ్రామిక జిడిపి వార్షిక సగటు 6 శాతానికి పెరగడం. ఈ కాలంలో సేవల రంగం కూడా సంవత్సరానికి 6.8 శాతం వృద్ధిని సాధించింది. కొంతమంది నయా ఉదారవాద ఆర్థికవేత్తలు 1980వ దశకంలో ఆర్థిక విస్తరణ 1980ల మధ్యకాలంలో జరిగిన సంశయ, పాక్షిక సరళీకరణ విధానాల ఫలితంగా జరిగిందని వాదించారు. ఏది ఏమైనప్పటికీ, 1980ల పాక్షిక సరళీకరణ చర్యలు ఆర్థిక విస్తరణ స్థాయిని సృష్టించేందుకు సరిపోవని ఆర్థికవేత్తల

మధ్య ఏకాభిప్రాయం ఉంది.

**ఆర్థిక సంక్షోభం రూపొందడం**

1980ల ఆర్థిక వ్యూహంతో ఉన్న సమస్య ఏమిటంటే, ఆ కాలంలో పెరిగిన ప్రభుత్వ వ్యయానికి, పన్నుల వంటి వివిధ రకాల దేశీయ వనరుల సమీకరణ ద్వారా కాకుండా, విదేశీ రుణాల ద్వారా ఎక్కువగా నిధులు సమకూర్చబడ్డాయి. అధిక పన్ను వసూళ్ల ద్వారా ప్రభుత్వ వ్యయం పెరిగితే రుణ భారాలు గణనీయంగా తగ్గుతాయి.

సిద్ధాంత పరంగా, సరఫరా పరిమితులు లేకుంటే, ద్రవ్య లోటు విధానం వృద్ధిని ప్రేరేపించగలదని భావిస్తున్నారు. కానీ 1980లలో భారతదేశంలో విదేశీ మారకద్రవ్యం కొరతకు గురయింది. ఆర్థిక వ్యవస్థలో ఆదాయం విస్తరిస్తున్న కొద్దీ, వస్తువులకు డిమాండ్ పెరుగుతుంది. తద్వారా దిగుమతులు పెరుగుతాయి. కానీ ఎగుమతులు తప్పనిసరిగా పెరగాల్సిన అవసరం లేదు. ఈ పరిస్థితిని రెండు దృష్టాంతాల పరంగా చూడవచ్చు: స్థిర మారకపు రేటు వ్యవస్థ, సౌకర్యవంతమైన మారకపు రేటు వ్యవస్థ.

స్థిర మారకపు రేటు వ్యవస్థలో విదేశీ మారకద్రవ్యం కొరతతో పాటు ప్రభుత్వ వ్యయంలో పెరుగుదల సరఫరాను అడ్డుకుంటుంది. ద్రవ్యోల్బణం డిమాండ్‌ను వెనక్కి లాగుతుంది. ప్రభుత్వం తన వ్యయాన్ని తగ్గించుకోవలసి వస్తుంది. అస్థిర మారకపు రేటు వ్యవస్థలో, రూపాయి విలువ తరుగుదల ఫలితంగా దిగుమతులు మరింత ఖరీదైనవిగా మారుతాయి. ఖరీదైన దిగుమతులు ధరలను పెంచే ద్రవ్యోల్బణానికి దారితీస్తాయి. దిగుమతులను కొనసాగించడానికి, ప్రభుత్వం విదేశీ రుణాలను తీసుకోవలసిన స్థితిలోకి నెట్టబడుతుంది.

1980వ దశకం చివరిలో విదేశీ రుణాల పెరుగుదల, దానితోపాటు విదేశీ చెల్లింపుల సమస్యతో కలిపి ప్రభుత్వ వ్యయ ఆధారిత వృద్ధిని కొనసాగించలేని స్థితికి దారితీసింది. పర్యవసానంగా, 1990-91 నాటికి విదేశీ చెల్లింపుల సంక్షోభం పెరిగింది, ఇది ఆర్థిక సరళీకరణ విధానాలను ప్రవేశపెట్టడానికి నేపథ్యంగా మారింది.

ద్రవ్యలోటు విధానం వల్ల ఏర్పడిన సమస్యలే కాకుండా, 1991-92లో విదేశీ చెల్లింపుల సంక్షోభానికి భారతదేశాన్ని తీసుకెళ్ళిన కొన్ని సామీప్యమైన బాహ్యమైన అంశాలు కూడా ఉన్నాయి.

మొదటిది, 1990 గల్ఫ్ యుద్ధం చమురు ధరల పెరుగుదలకు, చమురు సరఫరాలో కొరతకు దారితీసింది. భారత్ చమురు దిగుమతి బిల్లు పెరిగింది.

భారతదేశం నుండి వలసవెళ్ళిన ప్రజలు తిరిగి వెనక్కి రావడం, అనేక సంవత్సరాలుగా విదేశీ మారక ద్రవ్యానికి ముఖ్యమైన వనరుగా ఉన్న గల్ఫ్ ప్రాంతంలోని కార్మికుల నుండి నిధుల ప్రవాహం యుద్ధ సమయంలో క్షీణించింది. 1990-91లో మునుపటి సంవత్స రంతో పోలిస్తే విదేశీ ఆదాయం పరిమాణం పూర్తిగా పడిపోయింది. పశ్చిమాసియాకు భారతదేశం చేసే ఎగుమతులు కూడా ప్రతికూలంగా ప్రభావితమయ్యాయి. దీని కారణంగా విదేశీ వాణిజ్య సమతుల్యత క్షీణించింది.

రెండవది, భారతదేశంలో అంతర్గత రాజకీయ అస్థిరత కారణంగా, ఆర్థిక వ్యవస్థపై అంతర్జాతీయ పెట్టుబడిదారుల విశ్వాసం సన్నగిల్లింది. అంతర్జాతీయ క్రెడిట్ ఏజెన్సీలు భారతదేశం యొక్క క్రెడిట్ రేటింగ్‌ను తగ్గించాయి, ఇది విదేశీ పెట్టుబడుల పలాయనానికి దారితీసింది. ప్రవాస భారతీయులు భారతీయ బ్యాంకుల్లోని తమ డిపాజిట్లను పెద్ద ఎత్తున ఉపసంహరించుకున్నారు. భారతీయ ఎగుమతిదారులు ఎగుమతి ఆదాయాన్ని స్వదేశానికి రప్పించడాన్ని తగ్గించారు. ఫలితంగా, భారతీయ రిజర్వ్ బ్యాంక్ (RBI) విదేశీ మారక ద్రవ్యం నిల్వలు మూడు నెలల దిగుమతులకు ఆర్థిక సహాయం చేయలేని స్థాయికి పడిపోయాయి. భారతదేశం తన అంతర్జాతీయ రుణాలను ఎగవేయబోతోందనే భయాలు కూడా ఏర్పడ్డాయి.

ఈ ఆర్థిక సంక్షోభం ఏర్పడిన సందర్భంలో 1991లో అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం ఆర్థిక సంస్కరణల ప్యాకేజీని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ సంస్కరణల ప్యాకేజీ ప్రపంచ బ్యాంక్, ఐ.ఎం.ఎఫ్ వంటి అంతర్జాతీయ ఏజెన్సీల సహాయంతో ఆర్థిక స్థిరీకరణ, సంస్థాగత సర్దుబాట్లు అనే తీవ్ర కార్యక్రమంపై కేంద్రీ కరించబడి ఉంది. భారతదేశం ఐఎంఎఫ్ తో రుణ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఆర్థిక వ్యవస్థను సరళీకరించే దిశలో అనేక షరతులకు కట్టుబడి ఉంటామని భారత్ అంగీకరించింది.

1991 నాటి విదేశీ చెల్లింపుల సంక్షోభాన్ని నిజ ఆర్థిక వ్యవస్థలోని పరిణామాల నుండి వేరుచేయడాన్ని ఇక్కడ గమనించాలి. వాస్తవానికి, నిజ ఆర్థిక వ్యవస్థలో అనేక రంగాల్లో 1991లో పరిస్థితి మునుపటి సంవత్సరాల కంటే మెరుగ్గా ఉంది. ఉదాహరణకు, 1988-89, 1989-90 మధ్య కాలంలో 0.6 శాతం పెరిగిన వ్యవసాయ ఉత్పత్తి సూచిక, 1989-90, 1990-91 మధ్య 3.2 శాతానికి పెరిగింది. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో సంబంధిత మార్పులు వరుసగా 1.6 శాతం, 3 శాతంగా నమోదైంది. పారిశ్రామిక ఉత్పత్తి సూచిక 1988-89, 1989-90 మధ్య 8.6 శాతం, 1989-90, 1990-91 మధ్య 8.3 శాతం పెరిగింది. అందువల్ల,

1991లో ఆర్థిక స్థిరీకరణ, సంస్థాగత సర్దుబాట్ల అవసరం ఉందని చెప్పేవిధంగా నిజ ఆర్థిక వ్యవస్థలో సంక్షోభం లేదు.[20]

నిజ ఆర్థిక వ్యవస్థలో క్షీణతను చూపించిన ఏకైక అంశం అస్థిరమైన ద్రవ్యోల్బణం రేటు, ఇది 1991లో 14 శాతానికి చేరుకుంది. అయితే, ఉత్పత్తి పెరుగుదలపై పైన పేర్కొన్న సమాచారాన్ని బట్టి స్పష్టంగా కనిపించేదేమిటంటే ద్రవ్యోల్బణం అనేది ఉత్పత్తి కొరత నుండి ఉద్భవించలేదు. మరోవైపు, ఇది ఆర్థిక వ్యవస్థలో సరుకుల చట్టావ్యాపారుల అక్రమ నిల్వల ఫలితంగా ఏర్పడింది.

1991 మే లో ప్రభుత్వం పేద వర్గాలు వినియోగించే నిత్యావసర వస్తువుల (బియ్యం, గోధుమలు, వంట నూనెలు వంటివి) జారీ ధరలను పెంచింది. గోధుమల జారీ ధరను 15 శాతం, బియ్యం జారీ ధర 18 శాతం పెంచింది. చారిత్రాత్మకంగా ప్రభుత్వం సరుకుల జారీ ధరలను పెంచినప్పుడల్లా, బహిరంగ మార్కెట్లో ధరలు కూడా పెరిగాయి. 1991లో ఫలితం దానికి భిన్నంగా ఏమీలేదు. దీంతో ద్రవ్యోల్బణం రేట్లు అధికంగా పెరిగాయి. వాస్తవానికి, ద్రవ్యోల్బణం సమస్యను అధిగమించడానికి ప్రభుత్వం దిగుమతులను ఆశ్రయించవచ్చు, కానీ విదేశీ మారకద్రవ్యం కొరత ప్రభుత్వానికి ఆ వెసులుబాటును ఇవ్వలేదు.

విదేశీ చెల్లింపుల సంక్షోభాన్ని అధిగమించడానికి ప్రభుత్వానికి ఇతర అవకాశాలు ఎక్కడ అందుబాటులో ఉన్నాయి? భారతదేశానికి ఐఎంఎఫ్ సహాయం కాకుండా ఇతర అవకాశాలు అందుబాటులో ఏం ఉన్నాయి. ఆర్థిక స్థిరీకరణ, సంస్థాగత సర్దుబాటు విధానాల షరతులు సాపేక్షంగా తక్కువ ఉన్న ఐఎంఎఫ్ రుణాన్ని ఎంచుకున్నది.

ఇది విదేశీ చెల్లింపుల సంక్షోభాన్ని అధిగమించడానికి, అలాగే భారత రూపాయి పై విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి సహాయపడింది. ఏది ఏమైనప్పటికీ, ఏ కాలంలో నైనా ఒక దేశ అధికారిక విధానాలు ఆ కాలంలోని రాజకీయ, ఆర్థిక వ్యవస్థ, ముఖ్యంగా ప్రభుత్వ వర్గ స్వభావం ద్వారా ప్రభావితమవుతాయి. భారతదేశంలో అమలులోకి వచ్చిన ఆర్థిక సంస్కరణలను అమలు చేయాలనే నిర్ణయాన్ని రాజకీయ, ఆర్థిక వ్యవస్థ వర్గ స్వభావాన్ని బట్టి కాకుండా, ఆ పరిధి వెలుపల మరే ఇతర ప్రత్యామ్నాయ పద్ధతిలో విశ్లేషించలేము.

## సరళీకరణ డిమాండ్ల వర్గ స్వభావం

భారతదేశంలో ఆర్థిక సంస్కరణల ప్రవేశం ప్రజాస్వామ్యబద్ధంగా, జనాదేశం ఆధారంగా జరగలేదు. దీన్ని ప్రవేశపెట్టిన ప్రభుత్వం ఏనాడూ దాని ఊసే ఎత్తలేదు. 1950లు, 1960లలో బడా బూర్జువాలు దిగుమతి ప్రత్యామ్నాయ విధానానికి అండగా నిలిచినప్పటికీ, 1980ల నాటికి భవిష్యత్ విధానాల దిశపై వారి అభిప్రాయాలు

మార్పులకు గురయ్యాయి.[21]

మొదటిది, 1960లు, 1970లలో పారిశ్రామిక స్తబ్దత తర్వాత డిమాండ్ కొరత ఏర్పడింది. భారతీయ పారిశ్రామికవేత్తల ముందు ఉన్నది బహిరంగ మార్కెట్ సంస్థాగత సంస్కరణల, ఎగుమతి ఆధారిత వృద్ధి మార్గమే ఏకైక ప్రత్యామ్నాయం. ఏదేమైనా, ఎగుమతి మార్కెట్లలోకి చొచ్చుకుపోవడానికి, కనీస స్థాయి ఆర్థిక వనరులు, ఆర్థిక క్రమశిక్షణను కొనసాగించడానికి పెట్టుబడిదారుల నుండి వారి వంతు ప్రయత్నంతో పాటు గణనీయమైన స్థాయిలో ప్రభుత్వ జోక్యం అవసరం అవుతుంది. అయితే, తూర్పు ఆసియా దేశాలలో వలే కాకుండా అటువంటి మార్గం యొక్క పరిధి భారతదేశంలో పరిమితం చేయబడింది. ఈ సందర్భంలో, భారత పాలకవర్గం సంపన్న దేశాల పెట్టుబడితో సహకార వైఖరి తీసుకొని "మృదువైన ఎంపిక" విధానాన్ని అనుసరించింది.

రెండవది, భారతీయ పారిశ్రామిక అభివృద్ధి స్వభావాన్ని బట్టి 1980ల నాటికి కొత్త తరగతి పారిశ్రామికవేత్తలు అభివృద్ధి చెందారు. ఇది అప్పటికే పాతుకుపోయిన పాత పెట్టుబడిదారుల సమూహం కాకుండా దేశంలోని వివిధ ప్రాంతాలలో కొత్త పెట్టుబడిదారుల సమూహం యొక్క ఆవిర్భావాన్ని సూచిస్తుంది. ఈ ఆవిర్భావం పారిశ్రామిక వస్తువుల డిమాండును పెంచడంతో పాటు పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టడంలో రిస్క్ తీసుకోవాల్సిన మార్పును తీసుకొచ్చింది. అధిక సాంకేతిక వస్తువులకు డిమాండ్ తీవ్రంగా పెరగడంతో, వాటి ప్రధాన ఉత్పత్తిదారులుగా ఉద్భ వించిన కొత్త పారిశ్రామికవేత్తల సమూహం ఇది. ఈ సమూహం బహుళజాతి సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకోగలిగింది, వాటిచే నియంత్రించబడే కొత్త సాంకేతి కతలను అందిపుచ్చుకోగలిగింది. ఈ కొత్త పారిశ్రామిక సమూహాల వద్ద పెట్టుబడులు పోగుపడడానికి ప్రధాన వనరు వాణిజ్యం. దీనికి మంచి ఉదాహరణ సింథటిక్ ఫైబర్ వ్యాపారంలోకి ప్రవేశించిన రిలయన్స్ గ్రూప్. ఈ సమూహాలు 1970ల చివరలోఆర్థిక రంగంలో ప్రవేశపెట్టిన కొన్ని సడలింపులను కూడా మెరుగ్గా ఉపయోగించుకోగలిగాయి. ఇది ఈక్విటీ మార్కెట్‌లో బుడగల (బూమ్) సృష్టికి దారితీసింది.

1980వ దశకంలో పారిశ్రామిక రంగంలో ప్రభుత్వ నిబంధనలను సడలించాలనే డిమాండ్‌ను ఈ కొత్త పారిశ్రామిక సమూహాలు చాలా తీవ్రంగా ముందుకు తెచ్చాయి. దిగుమతి ప్రత్యామ్నాయ కాలంలో సంప్రదాయ పారిశ్రామిక సమూహాలకు అందించబడిన రక్షణను తొలగించాలని వారు కోరుకున్నారు. సాంకేతికత దిగుమతుల కోసం అవకాశాలను బాగా ఉపయోగించుకోవడానికి వాణిజ్య విధానంలో

ఉదారవాద నిబంధనలు కావాలని వారు కోరుకున్నారు. కొత్త పారిశ్రామికవేత్తల సమూహాల ఆవిర్భావం సాంప్రదాయ పారిశ్రామిక సమూహాల వ్యాపార వ్యూహాల పునర్వ్యవస్థీకరణకు దారితీసింది. ఈ సాంప్రదాయ సమూహాలకు, భవిష్యత్ వ్యాపార విస్తరణకు రెండే మార్గాలు ఉన్నాయి. కొత్త ఎగుమతి మార్కెట్‌లలోకి విస్తరించడం లేదా ప్రభుత్వం (ప్రభుత్వ రంగం) ఇప్పటికే ఆక్రమించిన రంగాలలోకి ఈ కొత్త పారిశ్రామికవేత్తలు ప్రవేశించడం. ఈ సాంప్రదాయ పెట్టుబడిదారుల సమూహాలు తమ స్వంత రంగాలలో రక్షణ నిబంధనలను కలిగి ఉన్నప్పటికీ, వారికి నిర్దిష్టంగా ఆసక్తి ఉన్న రంగాలలో పాక్షిక సరళీకరణను కోరుకున్నాయి. అందువల్ల, ఈ సమూహాలు ప్రభుత్వ రంగ పరిశ్రమల పెట్టుబడుల ఉపసంహరణ వంటి విధానాలకు మద్దతుదారులుగా మారాయి.

మూడవది, కొత్త మధ్యతరగతి నుండి సరళీకరణకు మద్దతు పెరుగుతోంది. ఈ మధ్యతరగతిలోని ఒక విభాగం పట్టణాలలో ఉండగా, మరొక విభాగం సంపన్న గ్రామీణ వ్యవసాయ కుటుంబాల సభ్యులుగా ఉన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మీడియా, టెలివిజన్ వృద్ధితో ఈ వినియోగదారుల సమూహాలు పాశ్చాత్య దేశాలలో అందుబాటులో ఉన్నాయని తమకు తెలిసిన కొత్త పారిశ్రామిక వస్తువులను పొందాలని కోరుకున్నారు. భారత సమాజంలో సరళీకృత ఆర్థిక విధానాలను కోరుకునే మరొక వర్గం ప్రవాస భారతీయులు, ఈ సమూహాలు కూడా కరెంట్ ఖాతా, పెట్టుబడి ఖాతా విధానాల నుండి విముక్తిని కోరుకున్నాయి.

ఆర్థిక వ్యవస్థ ద్వారాలను తెరవాలని వివిధ పారిశ్రామిక సమూహాలు, ప్రభావవంతమైన మధ్యతరగతి వర్గాల నుండి పెరుగుతున్న ఒత్తిడి 1991లో భారతదేశంలో ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టడానికి దోహదపడింది.[22]

## V

## స్వాతంత్ర్య అనంతరం అనుభవం:

## 1992 నుండి 2022 వరకు

### మారుతున్న ప్రపంచం

1991 అనంతర అనుభవం గురించిన ఏ అంచనా అయినా అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితి అప్పటికి బాగా మారిపోయిందనే వాస్తవాన్ని విస్మరించరాదు. సోవియట్ యూనియన్ కూలిపోయింది, తూర్పు యూరప్ తీవ్రమైన సంస్థాగత సర్దుబాట్లకు లోనైంది. సోవియట్ ధ్రువాన్ని కోల్పోయామనే చర్చ పాలకవర్గాలలో స్వావలంబన అభివృద్ధి అనే భావన పట్ల విశ్వాసం కోల్పోయేలా చేసింది, సోషలిజం, రాజ్య

జోక్యం విఫలమయ్యాయని చిత్రీకరించబడింది. ఈ మార్పులు భారత ఆర్థిక వ్యవస్థను ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థకు అనుసంధానించే విధానాలను ప్రవేశపెట్టడానికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించేందుకు అవకాశం కల్పించాయి. 1980ల మధ్యకాలం తర్వాత సరళీకరణ నెమ్మదిగా అమలు చేయబడుతుండగా, 1991 తర్వాత ఆర్థిక సరళీకరణ విధానాలను స్వీకరించడంలో వేగం, విస్తృతి పెరిగాయి.

అంతర్జాతీయ పరిస్థితిలో రెండవ అంశం 1970లు, 1980ల నుండి దేశాలలో ద్రవ్య ప్రవాహాలు పెరిగిన సందర్భం. 1961-1970 మధ్య, ప్రపంచ వార్షిక జిడిపి వృద్ధి రేట్లు సంవత్సరానికి సగటున 5.4 శాతంగా ఉన్నాయి. అభివృద్ధి చెందిన దేశాలు 5 శాతం వృద్ధి చెందాయి, కేంద్రీకృత ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థలు 6.7 శాతం, అభివృద్ధి చెందుతున్న దేశాలు 5.5 శాతం వృద్ధి చెందాయి. 1950ల నుండే, రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఆర్థిక వ్యవస్థలు పునర్నిర్మాణం మొదలవడంతో దేశాల మధ్య వాణిజ్యం వృద్ధి చెందింది. 1960ల చివరి నుండి, అంతర్జాతీయ పెట్టుబడి ప్రవాహం కూడా పెరగడం ప్రారంభమైంది. తర్వాత, 1970లు, 1980లలో ఆర్థిక సరళీకరణ చర్యల ఫలితంగా అంతర్జాతీయ ఆర్థిక ప్రవాహాలు పెరగడం ప్రారంభించాయి. పశ్చిమ దేశాలలో 1980లలో జరిగింది. ఈ సరిహద్దులతో నిమిత్తం లేని పెట్టుబడి ప్రవాహాలు పెట్టుబడిదారీ దేశాలలోను, సామ్యవాద దేశాలలోను ప్రాథమిక ఆర్థిక నిర్వహణ సూత్రాలు అనేకం మారేలా చేశాయి.

మారిన అంతర్జాతీయ పరిస్థితిలో మూడవ అంశం ఆర్థిక వ్యవస్థ యొక్క బహుళ రంగాలలో జరుగుతున్న సాంకేతిక విప్లవం. రవాణా మౌలిక సదుపాయాల నూతన అభివృద్ధి, కంప్యూటర్లు, ఇంటర్నెట్‌ల ఆగమనం, వందలాది ఉపగ్రహ ప్రయోగాలు కమ్యూనికేషన్, ట్రాన్స్మిషన్, సమాచార ప్రాసెసింగ్ రీతులను మార్చాయి. ఖర్చులను తగ్గించడంతో పాటు, ఆర్థిక లావాదేవీలలో కాలం, స్థలం యొక్క అడ్డంకులను గణనీయంగా తగ్గించాయి. 1970ల చివరి నుండి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ యొక్క నిర్మాణాన్ని, నిర్వహణను సమూలంగా మార్చిన ఈ సాంకేతికతలు, బహుళజాతి పెట్టుబడుల ప్రయోజనాలతో ఆధిపత్యం చెలాయించినప్పటికీ, నిజమైన ఏకీకృత ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థను సృష్టించే అవకాశానికి భౌతికంగా దోహదపడ్డాయి.

అంతర్జాతీయ పరిస్థితి యొక్క నాల్గవ అంశం పారిశ్రామిక సంస్థల అభివృద్ధి చెందుతున్న కొత్త రూపాలు. సాంకేతిక అభివృద్ధి, అవుట్‌సోర్సింగ్ వంటివి వెసులుబాటుతో కూడిన ఉత్పత్తి వ్యవస్థల ప్రాముఖ్యతను పెంచాయి. ఈ మార్పులు

బహుళజాతి పెట్టుబడిదారీ సంస్థలు ఉత్పత్తిలో పెట్టుబడి పెట్టకుండా వాణిజ్యంపై ఆధారపడేలా చేశాయి. ఇది ఉత్పత్తిలో వేతన ఖర్చులను తగ్గించడానికి అధిక వేతన ప్రాంతాల నుండి తక్కువ వేతన ప్రాంతాలకు స్వేచ్ఛగా పెట్టుబడిని తరలించడానికి అనుమతించింది. ఉత్పత్తిలో సౌలభ్యం ప్రపంచ ఆర్థిక ప్రవాహాల పెరుగుదలకు దారితీసింది. దీంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి స్వరూపాలలో కూడా మార్పు వచ్చింది.

1980ల ప్రారంభం నుండి ప్రపంచ ఉత్పత్తి, ఆర్థిక స్వరూపాలతో భారత ఆర్థిక వ్యవస్థ అనుసంధానం పెరగడం గురించి మనం చర్చించినప్పుడు ఈ చారిత్రక, భౌతిక సందర్భాలను విస్మరించకూడదు.

**భారతదేశపు సరళీకరణ కార్యక్రమం**

భారత ప్రభుత్వ ఆర్థిక స్థిరీకరణ, సంస్థాగత సర్దుబాటు కార్యక్రమాలు 1991 జూలైలో ప్రారంభించబడ్డాయి. సంస్కరణ చర్యలు ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్ చే మార్గనిర్దేశం చేయబడినప్పటికీ, వాటికి అనేకమంది భారతీయ ఆర్థికవేత్తల మద్దతు కూడా ఉంది.

విస్తృత స్థాయి సంస్కరణ చర్యలు ఇతర రంగాలతోపాటు, వాణిజ్యం, మారకపు రేటు నిర్వహణ, పరిశ్రమలు, పబ్లిక్ ఫైనాన్స్, ఫైనాన్స్ రంగం వంటి రంగాలను కలిగి ఉన్నాయి. స్థూల ఆర్థిక స్థిరీకరణ, ఆర్థిక దిద్దుబాటు, మారకపు రేటు సర్దుబాటు, ద్రవ్య లక్ష్యాలు, ద్రవ్యోల్బణ నియంత్రణ వంటి చర్యలు ప్రకటించబడ్డాయి. పారిశ్రామిక సడలింపు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల సరళీకరణ, వాణిజ్య సరళీకరణ, ప్రభుత్వ సంస్థల పునర్వ్యవస్థీకరణ, ఆర్థిక రంగ సంస్కరణలతో కూడిన నిర్మాణాత్మక సంస్కరణ చర్యలతో ఈ స్థిరీకరణ చర్యలు అనుబంధంగా ఉంటాయి. ఆర్థిక రంగ సంస్కరణలు 1969 తర్వాత జాతీయం చేయబడిన ప్రభుత్వ రంగ బ్యాంకులను పెద్ద ఎత్తున ప్రైవేటీకరించాలని సూచించాయి, అలాగే భారతదేశంలో తమ కార్యకలాపాలను విస్తరించడానికి విదేశీ బ్యాంకులకు తలుపులు తెరిచాయి.

ఆర్థిక వ్యవస్థలోని మూడు రంగాలలో సంస్కరణలు ప్రవేశపెట్టబడ్డాయి. మునుపటి కాలాలకు భిన్నంగా, 1990లలో వ్యవసాయ విధానం భిన్నమైన మలుపు తీసుకుంది. హరిత విప్లవ సంవత్సరాల సాంకేతిక దృక్పథంలో వ్యవసాయ రంగంలో సంస్థాగత మార్పుల అవసరాన్ని తిరస్కరించడం అంతర్లీనంగా ఉంటే, 1991 తర్వాత భారతదేశం అనుసరించిన నయా-ఉదారవాద ఆర్థిక సంస్కరణ దానిని బహిరంగంగా తిరస్కరించింది. సంస్కరణ కార్యక్రమం యొక్క ప్రాథమిక సూత్రం ఏమిటంటే, ఆర్థిక

వ్యవస్థ తలుపులు తెరవడంతో విదేశీ వాణిజ్యాన్ని సాధనంగా చేసుకొని వ్యవసాయ ఉత్పత్తుల మిగులును అధికం చేసుకోవడం వీలవుతుంది. ఆ విధంగా, భూసంస్కరణల అవసరం తొలగి పోలేదు, భూ సంస్కరణల అమలును వెనిక్కికొట్టడానికే ఈ ప్రయత్నం జరిగింది.

సంస్కరణల ప్రారంభ కాలంలో వ్యవసాయంలో సంస్కరణలు విస్తృత స్థాయిలో అమలుచేయబడలేదు. అయితే, కాలక్రమేణా వ్యవసాయ సంస్కరణలు ఎక్కువగా ప్రవేశపెట్టబడ్డాయి. సుంకాల ఆధారిత పరిమాణాత్మక ఆంక్షలు, ఎరువుల ధరల నియంత్రణను పాక్షికంగా సడలించడం, వ్యవసాయ మార్కెటింగ్‌లో కొన్ని నిబంధనల తొలగింపు, నిత్యావసర వస్తువుల చట్టంలోని నిబంధనల సడలింపు, సార్వత్రిక ప్రజా ఆహార పంపిణీ వ్యవస్థను కొన్ని తరగతుల ప్రజలకే పరిమితం చేయడం, కార్పొరేట్ సంస్థలను ప్రోత్సహించే చర్యలు ఉన్నాయి. పెద్ద ఎత్తున కాంట్రాక్టు వ్యవసాయాన్ని ప్రోత్సాహించడం కూడా ఉంది.

1991 పారిశ్రామిక విధానంలో, పారిశ్రామిక లైసెన్సింగ్ విధానాన్ని ఎత్తి వేయడం, ప్రభుత్వ రంగానికి రిజర్వు చేయబడిన పరిశ్రమల సంఖ్య తగ్గించడం, ప్రభుత్వ రంగ సంస్థలలో పెట్టుబడుల ఉపసంహరణ, పెట్టుబడిపై పరిమితుల రద్దు, గుత్తాధిపత్యం, నిర్బంధ వాణిజ్య (ఎంఆర్‌టిపి) చట్టం1969ని విస్తరించడంతో సహా అనేక సంస్కరణ చర్యలు ప్రవేశపెట్టబడ్డాయి. విదేశీ పెట్టుబడులకు ఎలాంటి షరతులు లేకుండా ఆమోదం తెలపడం. మధ్యంతర, పెట్టుబడి సరుకుల పరిమాణాత్మక దిగుమతిపై పరిమితుల తొలగింపు, రక్షిత సుంకాలు, పన్నుల తగ్గింపు.

**ద్రవ్య సంరక్షణవాదం పై దృష్టి**

1991 తర్వాత స్థూల ఆర్థిక విధానం ముఖ్య లక్షణం ద్రవ్య సంరక్షణవాదంపై దృష్టి కేంద్రీకరించి నయా-ఉదారవాదానికి భారత రాజ్యం పూర్తిగా లొంగిపోవడం. ధనవంతులపైన, కార్పొరేట్ సంస్థలపైన మరింతగా పన్నులు విధించేందుకు భారత ప్రభుత్వం నిరాకరించింది. వాస్తవానికి, వారిపై విధించే పన్ను రేట్లను తగ్గించింది. పన్నులను ఎగవేసేందుకు వారికి అనేక మినహాయింపులను ఇచ్చింది. దీంతో ప్రభుత్వానికి వచ్చే ఆదాయం తగ్గిపోయింది. ఈ రాబడి తగ్గడం వలన జరిగే నష్టం అధిక రుణాల ద్వారా కూడా భర్తీ కాలేదు. ద్రవ్య లోటులో ఏ మాత్రం పెరుగుదల సంభవించినా అంతర్జాతీయ పెట్టుబడిదారులను భారత ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులు పెట్టకుండా భయపెట్టవచ్చని భారత ప్రభుత్వం ఆందోళన చెందింది.

ఆ విధంగా, ద్రవ్య లోటును ఒక పరిమితిలో ఉంచేలా విధానాలు

రూపొందించబడ్డాయి. 2000లో ద్రవ్య బాధ్యత, బడ్జెట్ నిర్వహణ (FRBM) బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారు. FRBM చట్టం 2003లో ఆమోదించబడింది. ఈ చట్టం ప్రకారం, కేంద్ర ప్రభుత్వం రెవెన్యూ లోటును సున్నాకి తగ్గించి, ద్రవ్య లోటును GDPలో 3 శాతానికి తగ్గించాలి.

రాష్ట్ర స్థాయిలో ఆర్థిక బాధ్యత (ఎఫ్.ఆర్.బి.ఎం.) చట్టాలను ఆమోదించేలా కేంద్రం ప్రభుత్వం రాష్ట్రాలపై ఒత్తిడి చేసి ఒప్పించింది. కేంద్రం ఆమోదించిన చట్టానికి అనుగుణంగా రాష్ట్రాలు తమ చట్టాలను రూపొందించాలని చెప్పింది. పదకొండవ ఆర్థిక సంఘం (EFC) కేంద్ర వనరుల బదిలీలు, ఇతర ప్రయోజనాలను రాష్ట్రంలో ఈ చట్టం అమలుతో ముడిపెట్టడం ప్రారంభించింది. రాష్ట్ర స్థాయిలో ఎఫ్.ఆర్.బి.ఎం. చట్టాల ఆమోదం, అమలులే రాష్ట్రాలు సాధించిన ఆర్థిక ప్రగతికి సూచికగా మారాయి. ఆ విధంగా, ఎఫ్.ఆర్.బి.ఎం. చట్టాలు అన్ని రాష్ట్రాలలో ఆమోదించబడ్డాయి.

తత్ఫలితంగా, ఆర్థిక సంస్కరణల కాలంలో కఠినమైన ద్రవ్య నియంత్రణ విధానం అనుసరించబడింది. కీలకమైన సామాజిక రంగాలకు కేటాయింపుల కోతతో పాటు పెట్టుబడి వ్యయాల్లో కూడా కోత పడింది. ఎక్కువ నిధుల కోసం అలమటిస్తున్న అనేక సామాజిక రంగాలకు ఖర్చులు పెంచలేదు, ఇది ఈ రంగాలలో సేవలను తీవ్రంగా దెబ్బతీసింది. అటువంటి విధాన వైఖరిని 1990వ దశకం ప్రారంభంలో కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్న మన్మోహన్ సింగ్ ఈ క్రింది మాటల్లో వ్యక్తీకరించారు :

“ఆర్థిక స్థిరీకరణ కార్యక్రమం పేదలకు వ్యతిరేకమని కొందరు విమర్శించారు. ఆర్థిక వ్యవస్థపై దాని స్తోమతకు మించిన భారం పడితే ఆర్థిక వ్యవస్థ మనుగడ సాగించడం కష్టం. ఆర్థిక స్థిరీకరణ దెబ్బతింటుంది. ఈ అంశమే సామాజిక వ్యయంతో సహా అన్ని ఖర్చుల పెరుగుదలను తగ్గించడానికి మమ్మల్ని వత్తిడి చేసిందని నేను అంగీకరిస్తున్నాను... కానీ... మేము చేసిన పనిని చేయడం తప్ప మాకు వేరే ప్రత్యామ్నాయాలు పెద్దగా లేవు. సామాజిక వ్యయంలో కోతలను విమర్శించే వారు సామాజిక రంగాలపై పెరిగిన వ్యయం కోసం ఏ ఇతర ఖర్చులను తగ్గించవచ్చో మాకు తెలియజేయాలి.”

మరో మాటలో చెప్పాలంటే, ప్రభుత్వం దేశ ఆర్థిక సంక్షోభానికి పరిష్కారం వెతకడం కోసం ఆదాయం వైపు కాకుండా (పన్ను వసూళ్లు పెంచడం వల్ల వడ్డీల చెల్లింపులకు కొంతమేరకైనా నిధులు సమకూరుతాయి), వ్యయం వైపు చూసింది. ఈ చర్యలు ప్రభుత్వాల వ్యయంలో కోతలు విధించడానికి, శ్రామిక ప్రజల ఆదాయాలను, వేతనాలను తగ్గించడానికి చురుకుగా దోహదపడ్డాయి.

**ఒక వర్గ ప్రాజెక్టుగా నయా-ఉదారవాదం**

భారతదేశంలో నయా-ఉదారవాదం తప్పనిసరిగా ఒక వర్గ ప్రాజెక్టు. సరళీకరణ చర్యల సారాంశం బడా బూర్జువాలు పెట్టుబడిని మరింత పోగేసుకోడం. విస్తరించడం. వారి పెట్టుబడుల, లాభాల కేంద్రీకరణను పెంచడం. కార్మికులను, చిన్న ఉత్పత్తిదారులను వారి ఉత్పత్తి సాధనాల నుండి మరింత దూరం చేసి, వారిలో ఎక్కువ మందిని కార్మిక రిజర్వ్ సైన్యం (నిరుద్యోగం) లోకి నెట్టడం. ఇక్కడ, భారత ప్రభుత్వం ఒక వర్గం నుండి మరొక వర్గానికి ఆస్తుల బదిలీ ప్రక్రియను వేగంగా జరిగేలా నిబంధనలు సులభతరం చేసింది. స్పష్టంగా ప్రైవేటీకరణ, కార్పొరేట్ పన్నుల తగ్గింపు, పన్ను మినహాయింపుల ప్యాకేజీ, చిన్న ఉత్పత్తిదారులను అణిచివేయడం ద్వారా ఈ పని చేసింది.[23]

గతంలో ప్రాంతీయ అసమానతలను తగ్గించడంలో ప్రభుత్వ పెట్టుబడులు సహాయపడితే, నయా ఉదారవాద రాజ్యం రాష్ట్రాలు పెట్టుబడులను ఆకర్షించేందుకు పోటీ పడాలని ప్రోత్సహించింది. ఇది పన్ను రాయితీలను అందించడంలో పెద్ద పెట్టుబడుల కోసం "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్"ని అందించడంలో "క్రింది స్థాయి నుండి పోటీ" అనే పోటీ ప్రక్రియకు దారితీసింది. ఇది రాష్ట్రాల సొంత ఆదాయానికి గండికొట్టింది. రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడేలా చేసింది. ప్రైవేట్ రంగ పెట్టుబడుల ప్రవేశం కోసం, లాభాల కోసం ఇటీవల అంతరిక్షంతో సహా మరిన్ని వ్యూహాత్మక రంగాలు కూడా తెరవబడ్డాయి.

నిస్సందేహంగా, సామ్రాజ్యవాదం - భారతీయ బడా బూర్జువాల మధ్య సహకారం నయా-ఉదారవాదంతో బలపడింది. దేశంలోకి విదేశీ పెట్టుబడులు వచ్చే సౌలభ్యం గణనీయంగా విస్తరించింది. 1991-92, 2019-20 మధ్య భారతదేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డిఐ) స్థూల ప్రవాహం 970 కోట్ల డాలర్ల నుండి 7,43,900 కోట్ల డాలర్లకు పెరిగింది. వీటిలో ఎక్కువ భాగం ఈక్విటీలుగా, పెట్టుబడి నిధులలో షేర్ల రూపంలో ఉంది. అదేవిధంగా, భారతదేశంలోకి స్థూల విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడి(ఎఫ్‌పిఐ) 2011-12లో 18,50,130 కోట్ల డాలర్ల నుండి 2019-20లో 29,07,400 కోట్ల డాలర్లకు పెరిగింది.

భారతదేశ అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలు అనేక రెట్లు విస్తరించాయి. భారతదేశం వాణిజ్య సమతుల్యత ఎల్లప్పుడూ ప్రతికూలంగా ఉన్నప్పటికీ, దాని ఎగుమతులు 1991-92లో 1,79,980 కోట్ల డాలర్ల నుండి 2019-20లో 31,38,140 కోట్ల డాలర్లకు పెరిగాయి. దిగుమతులు 1991-92లో 1,95,510

కోట్ల కోట్ల డాలర్ల నుండి 2019-20లో 47,41,750 కోట్ల డాలర్లకు పెరిగాయి. ఈ కాలంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో భారతదేశం ఎక్కువగా విలీనమయింది.

విదేశీ గడ్డపై కంపెనీల విలీనం, విదేశీ సంస్థలను కొనుగోలు చేయడం, విదేశీ గడ్డపై ఉన్న కంపెనీలతో సంయుక్త భాగస్వామ్యం నెరపడం వంటి వాటి ద్వారా బడా పెట్టుబడులు ప్రపంచవ్యాప్తంగా తన రెక్కలను విస్తరింపజేయడానికి భారత ప్రభుత్వం సహాయపడింది, అనుమతించింది. 2000-01లో భారతదేశ పెట్టుబడి దారులు విదేశాల్లో ఇన్వెస్ట్ చేసిన పెట్టుబడి మొత్తం 7,590 కోట్ల డాలర్ల నుండి 2019-20లో 12,99,490 కోట్ల డాలర్లకు పెరిగింది, వీటిలో 75,720 కోట్ల డాలర్లు ఈక్విటీ పెట్టుబడి రూపంలో ఉన్నాయి.

అదే సమయంలో, భారతదేశంలో నయా-ఉదారవాదం కథ అంతా నాశనం చేయడం గురించే కాదు. నయా-ఉదారవాద కాలం భారత ఆర్థిక వ్యవస్థలో ఉత్పాదక శక్తుల పురోగతి, ఉత్పాదక సామర్థ్యాలు విస్తరించిన కాలం కూడా. వాణిజ్యం, పెట్టుబడి, ఫైనాన్స్, సాంకేతికత, తదితర పారిశ్రామిక సంస్థల మొత్తం వృద్ధి అధిక ఉత్పాదకత సాధించే ఉత్పాదక రంగంలోకి దూకాయి. ఈ ఉత్పాదక శక్తుల పెరుగుదల ఆర్థిక వ్యవస్థలో వృద్ధికి కొత్త అవకాశాలను కల్పించింది. దీని నుండి ఉత్పత్తి వర్గాలలోని ఒక విభాగం ప్రయోజనం పొందింది. ప్రత్యేక నైపుణ్యాలు ఉన్న వారికి మంచి వేతనంతో కూడిన ఉపాధి వృద్ధి కూడా ఉంది. ఇవన్నీ బూర్జువాలకు తమ లాభాల వనరుల కోసం వైవిధ్యమైన మార్గాలను అనుమతించాయి. పట్టణాలలో, గ్రామీణ ప్రాంతాలలో కొత్త సంపన్న తరగతులు పెరగడానికి దారితీశాయి, చిన్న ఉత్పత్తిదారులను పెద్ద ఎత్తున నాశనం చేసే సాధారణ ధోరణి [24] ఉన్నప్పటికీ మనం విశ్లేషణాత్మకంగా చూసి నప్పుడు సామ్రాజ్యవాదం పురోగమిస్తున్న యుగంలో నయా-ఉదారవాదం భారత ఆర్థిక వ్యవస్థలో వృద్ధి, మాంద్యం అనే విరుద్ధమైన కదలికకు కారణం. మనం ఉత్పత్తి వృద్ధిని మాత్రమే పండగలా జరుపుకునే సామ్రాజ్యవాద ఉచ్చులో పడకూడదు, నిజ ఆర్థిక వ్యవస్థలో వచ్చిన మార్పులను చూడకుండా మనం కళ్ళు మూసుకోకూడదు. వామపక్ష ఆర్థిక కాల్పనికవాదం వైపు ఆకర్షితులవకూడదు.

## 1991 తర్వాత స్థూల ఆర్థిక వృద్ధి నమూనాలు

1991-92 - 2019-20 మధ్య సుదీర్ఘ కాలాన్ని పరిగణనలోకి తీసుకుంటే జిడిపి వృద్ధి, మాంద్యాలలో మూడు ఉపదశలున్నాయి, వాటిని మనం తప్పకుండా గుర్తించాలి.

### 1వ దశ : 1991-92 నుండి 2002-03 వరకు

ఆర్థిక సంస్కరణల మొదటి దశాబ్దం 1991-92, - 2002-03 మధ్య - ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు 6.1 శాతం. 2003లో ఆర్‌బిఐ తన వార్షిక నివేదికలో 1990ల నాటి జిడిపి వృద్ధి రేటు 1980ల కంటే "కొద్దిగా ఎక్కువ" అని పేర్కొంది. మరో మాటలో చెప్పాలంటే, 1990లలో ఆర్థిక సరళీకరణ భారత ఆర్థిక వ్యవస్థను అధిక వృద్ధి పథంలోకి నడిపించిందని చెప్పడానికి ఎటువంటి ఆధారాలు లేవు. హిందూ వృద్ధి రేటు నుండి అధిక వృద్ధి పథానికి కదలిక ఉంటే, అది 1980ల ప్రారంభంలోనే మొదలైంది.

రంగాల వారీ వృద్ధి రేటును పరిశీలిస్తే, వ్యవసాయంలో వృద్ధి రేటు 1980లలో ఉన్న 3 శాతం నుండి 1వ దశ మధ్య నాటికి 2.7 శాతానికి క్షీణించింది. పరిశ్రమలో వృద్ధి రేటు 1980లలో ఉన్న 5.9 శాతం నుండి 1వ దశ మధ్య నాటికి 6.1 శాతానికి స్వల్పంగా పెరిగింది. ఈ విధంగా, 1990లలో సరుకుల ఉత్పత్తి రంగాలలో కొత్త చైతన్యం కనిపించలేదు. 1980లలో ఉత్పాదక రంగాలలో ఏ చైతన్యం ఏర్పడిందో అది 1990లలో కోల్పోబడిందని అందుబాటులో ఉన్న ఆధారాలు చూపిస్తున్నాయి. 1980ల కంటే 1990లలో స్వల్పంగా పెరిగిన జిడిపి వృద్ధి రేటు సేవల రంగంలో సాధించిన వృద్ధి రేటే. అది 6.8 శాతం నుండి 8.1 శాతానికి గణనీయంగా పెరిగింది. ఆ పెరుగుదల మొత్తం జిడిపి పెరుగుదలను ముందుకు నడిపించింది.

## 2వ దశ : 2003-04 నుండి 2010-11 వరకు

ఆర్థిక వ్యవస్థలో తదుపరి దశ వృద్ధి 2003-04 నాటికి ప్రారంభమైంది. అనేక ఆకస్మిక అంతర్జాతీయ, జాతీయ పరిస్థితుల కారణంగా, ఆర్థిక వృద్ధి రేటు మొదటి దశలో 6.1 శాతం నుండి రెండవ దశలో 8.6 శాతానికి పెరిగింది.

ఈ దశ అనేక కారణాల వల్ల ప్రత్యేకమైనది. ప్రపంచవ్యాప్తంగా, 1990ల చివరి నుండి, 2000ల ప్రారంభంలో జరిగిన అనేక యాదృచ్ఛిక మార్పులు దీనికి సహకరించాయి. 2000ల ప్రారంభంలో ప్రపంచ వాణిజ్యం వేగంగా వృద్ధి చెందింది, ఇది భారతీయ సరుకుల ఎగుమతుల పెరుగుదలకు దారితీసింది. అంతర్జాతీయ వ్యవసాయ ధరలు పెరిగాయి, ఇది భారత వ్యవసాయ ఎగుమతుల పెరుగుదలకు దారితీసింది. ముఖ్యంగా అమెరికా సంయుక్త రాష్ట్రాలలో అవుట్‌సోర్సింగ్ నియమాల సరళీకరణ భారతదేశంలో బ్యాక్-ఆఫీస్ కార్యకలాపాల పెరుగుదలకు దారితీసింది. భారతీయ IT మరియు ITES సంస్థల ప్రాబల్యానికి దారితీసింది. పర్యవసానంగా, వాణిజ్యేతర సాఫ్ట్‌వేర్ ఎగుమతులు కూడా పెరిగాయి. పాశ్చాత్య దేశాలలో తక్కువ

వడ్డీ రేటు  భారతదేశంలోకి విదేశీ పెట్టుబడుల ప్రవాహాల పెరుగుదలకు దారితీసింది, వీటిలో ఎక్కువ భాగం పోర్ట్‌ఫోలియో పెట్టుబడి రూపంలో ఉన్నాయి. FDI కోసం నిబంధనల సరళీకరణ తర్వాత రియల్ ఎస్టేట్ వంటి నిర్దిష్ట రంగాలలో కూడా FDI పెరిగింది.

దేశీయంగా, అధిక పొదుపు రేటు, బ్యాంక్ క్రెడిట్ అధిక వృద్ధి, అధిక స్థాయిలో పెట్టుబడి కల్పన అనుకూల కారకాలుగా మారాయి. అధిక వృద్ధి వలన ప్రభుత్వానికి పన్ను రాబడిలో స్వల్ప పెరుగుదల ఏర్పడింది, ఇది ప్రజా కేంద్రీకృత పథకాలలో పెట్టుబడులను పెంచడానికి వీలు కల్పించింది, ప్రత్యేకించి కేంద్రంలో వామపక్ష-మద్దతు గల UPA ప్రభుత్వం ఉన్నప్పుడు. అంతర్జాతీయ వ్యవసాయ ఉత్పత్తుల ధరలు, వ్యవసాయంలో ప్రభుత్వ పెట్టుబడులు, వ్యవసాయానికి బ్యాంకు రుణాల సరఫరా- ఇవన్నీ పెరగడంతో వ్యవసాయంలో కూడా వృద్ధి కనిపించింది.

వృద్ధికి సంబంధించిన ఈ కథనానికి సంఖ్యలు దన్నుగా నిలుస్తాయి. ఈ దశలో స్థూల ఆర్థిక సూచికల శ్రేణిలో మెరుగుదల ఉంది. వ్యవసాయ రంగం వార్షిక వృద్ధి 2.7 శాతం నుంచి 3.4 శాతానికి చేరుకుంది. పారిశ్రామిక రంగం 1వ దశ లో 6.1 శాతం,  2వ దశలో 8.9 శాతంగా ఉంది. సేవల రంగంలో వృద్ధి అత్యంత వేగంగా ఉంది: 1వ దశలో 8.1 శాతం, 2వ దశలో 10.1 శాతం. పెట్టుబడి రేటు 2003లో 27.2 శాతం నుంచి  2011నాటికి 40.2 శాతానికి పెరిగింది. పొదుపు రేటు 2003లో 26.8 శాతం నుంచి 2011లో 36.9 శాతానికి పెరిగింది. GDPలో ఎగుమతుల విలువ వాటా 2003లో 10.2 శాతం నుంచి 2011నాటికి 16.6 శాతానికి పెరిగింది. సగటున, 2005-06, 2011-12 మధ్య సరుకుల ఎగుమతుల వార్షిక  వృద్ధి 25 శాతం నుండి 30 శాతం. బ్యాంక్ క్రెడిట్ సరఫరా 2004 ఏప్రిల్ నాటికి నెలకు దాదాపు 11.1 శాతం వృద్ధి చెందింది,అయితే క్రమంగా 2009 జూలైలో 27.1 శాతానికి,  2011 మార్చిలో 20.3 శాతానికి పెరిగింది.

స్థూల ఆర్థిక వ్యవస్థలో ఈ మెరుగుదల ప్రజల జీవన స్థాయిలో ప్రతిబింబించింది. అయితే అది అంతంత మాత్రమే. 2004-05లో 2.3 శాతంగా ఉన్న నిరుద్యోగం 2009-10లో 2 శాతానికి, 2011-12లో 2.2 శాతానికి తగ్గిందని ప్రభుత్వ జాతీయ నమూనా సర్వే కార్యాలయం (ఎన్ఎస్ఎస్ఓ) నివేదికలు చెబుతున్నాయి. పేదరికం స్థాయి కూడా 2004-05లో 37.2 శాతం నుంచి 2011-12లో 21.9 శాతానికి తగ్గింది.

అదే సమయంలో, రుణాలపై అధికంగా ఆధారపడటం, అంతర్జాతీయ పెట్టుబడి మార్కెట్‌తో పెద్ద ఎత్తున అనుసంధానం కావడం 2010-11 (2007-

08 (ప్రపంచ ఆర్థిక సంక్షోభం) తర్వాత 2వ దశలో చేకూరిన లాభాలను రద్దు చేసింది. చౌకగా లభించే క్రెడిట్ 2వ దశ వృద్ధికి దోహదపడింది. బ్యాంకింగ్ రంగంలో అధిక స్థాయిలో ఉన్న ద్రవ్య నిల్వలను దృష్టిలో ఉంచుకుని, తాజా రుణాలు తీసుకున్న వారిలో ఎక్కువ భాగం రుణాలు పొందడానికి యోగ్యులుకాని వారైనప్పటికి బ్యాంకులు ఎక్కువగా రుణాలు ఇవ్వడానికి ఆసక్తి చూపాయి. అందువల్ల, తాజా రుణాలలో ఎక్కువ భాగం మౌలిక సదుపాయాలు, రియల్ ఎస్టేట్, వ్యక్తిగత రుణాలు, వినియోగ రుణాలు వంటి రంగాలలోకి వచ్చాయి. 2003-2011 మధ్య మొత్తం బ్యాంక్ రుణాలలో మౌలిక సదుపాయాల వాటా 9 శాతం నుండి 33.5 శాతానికి పెరిగింది. మరోవైపు, ఇతర పారిశ్రామిక రంగాలకు రుణ ప్రవాహం తక్కువగానే ఉంది. 2008 తర్వాత (నేటి వరకు) ప్రపంచ ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా ఉన్నందున, భారత పెట్టుబడిదారులకు వృద్ధిని కొనసాగించడానికి ఎటువంటి ప్రపంచ ఉద్దీపనలు అందుబాటులో లేవు. 2010-11 తర్వాత ఆర్థిక వ్యవస్థ కుదేలైంది.

### 3వ దశ : 2011-12 నుండి 2019-20 వరకు

2వ దశ బలహీనతలు, వైరుధ్యాల వలన 3వ దశలో వృద్ధి తీవ్రంగా పడిపోయింది. 2011-12 తర్వాత భారతదేశంలో ఆర్థిక వృద్ధిని విశ్లేషించేటప్పుడు ఉత్పన్నమయ్యే ఒక సమస్య జాతీయ ఖాతాల గణాంకాల ఆధార సంవత్సరాన్ని 2004-05 నుండి 2011-12 కు మార్చారు. గతంలో, ప్రాతిపదిక సంవత్సరాల్లో మార్పులు ఎటువంటి ఇబ్బందులను కలిగించలేదు, ఎందుకంటే పాతవాటిని, కొత్తవాటిని పోల్చిచూడటం కష్టం కాలేదు. కాని ఇప్పుడు, 2011-12కి ప్రాతిపపదిక సంవత్సరాన్ని మార్చడంతోపాటు కొన్ని మౌలిక మార్పులు కూడా చేశారు, ఇది పోలికకు ఆటంకం కలిగించింది. ఉదాహరణకు, జిడిపి అంచనాలో ఉపయోగించే వ్యవస్థీకృత ప్రైవేట్ రంగానికి సంబంధించిన డేటాబేస్, పరిశ్రమల వార్షిక సర్వే (ASI) విభాగం నుండి MCA-21 అని పిలువబడే కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో నమోదు చేయబడిన కంపెనీల జాబితాకు మార్చబడింది.

ఈ నోట్‌లో, ఆధార సంవత్సరాన్ని 2004-05 ను 2010-11 వరకు, స్థూల దేశీయోత్పత్తి (GDP) డేటాను 2011-12, 2019-20 మధ్య 2011-12 ఆధార సంవత్సరాన్ని GDP డేటా, స్థూల విలువ జోడించిన (GVA) డేటాను ఉపయోగించాము. మొత్తంమీద, సగటు వార్షిక GDP వృద్ధి రేటు 2వ దశలో 8.6 శాతం నుండి 3వ దశలో 6.9 శాతానికి పడిపోయింది, 3వ దశలో GVA వృద్ధి రేటు 6.7 శాతంగా ఉంది. GVA 2011-12 తర్వాత 2016-17 మొదటి త్రైమాసికం (Q1) వరకు పెరుగుతున్న ధోరణిని చూపింది. 2016-17 రెండవ

త్రైమాసికం (Q2) నుండి, GVA క్రమంగా తగ్గడం ప్రారంభించింది. ఇది 2016-17 క్యూ1లో 9.3 శాతం నుంచి 2019-20 క్యూ3లో 3.5 శాతానికి, 2019-20 క్యూ4లో 3 శాతానికి పడిపోయింది. ఈ క్షీణతకు రెండు తక్షణ కారణాలున్నాయి. నవంబర్ 2016లో డీమోనిటైజేషన్, ఆగస్టు 2017లో వస్తువులు, సేవల పన్ను (GST) సంస్కరణ. 2016లో రూ. 500 మరియు రూ. 1000 నోట్ల రద్దు అనే అనాలోచిత డీమోనిటైజేషన్ వలన కేవలం కొన్ని గంటల్లో ఆర్థిక వ్యవస్థ దాదాపు 86 శాతం నగదును పీల్చివేసింది.

కొత్త GVA సిరీస్ 2016-17 వరకు పెరిగినట్లు, ఆ తర్వాత పతనం చూపించింది, 2011-12, 2016-17 మధ్య GVA వృద్ధి రేటు పెరుగుదల వాస్తవికతను ఆర్థికవేత్తలు ప్రశ్నించారు. వాస్తవానికి, ఆర్థిక వృద్ధి పెరుగుదలతో సార్వత్రికంగా అనుబంధంగా ఉన్న అనేక స్థూల ఆర్థిక సూచికలు 2011-12 నుండి క్షీణించడం ప్రారంభించాయి. పెట్టుబడి రేటు 2011లో 40.2 శాతం నుంచి 2016-17లో 32.1 శాతానికి, 2019-20లో 31.7 శాతానికి పడిపోయింది. పొదుపు రేటు 2011లో 36.9 శాతం నుంచి 2016-17లో 31.1 శాతానికి, 2019-20లో 30.1 శాతానికి పడిపోయింది. GDPలో ఎగుమతుల వాటా 2011లో 16.6 శాతం నుండి 2016లో 11.9 శాతానికి, 2019లో 11.5 శాతానికి పడిపోయింది. ఎగుమతుల వృద్ధి రేటు 2005-06, 2011-12 మధ్య సగటున 25 నుండి 30 శాతానికి పడిపోయింది. 2011-12 తర్వాత సంవత్సరానికి 5 నుండి 9 శాతం మధ్య తగ్గుదల సంభవించింది. దేశీయ బ్యాంకు క్రెడిట్ నెలవారీ వృద్ధి రేటు జూలై 2009లో 27.1 శాతం నుండి మార్చి 2015లో 6.3 శాతానికి, మార్చి 2020లో 7.3 శాతానికి పడిపోయింది.

వార్షిక వృద్ధి రేట్ల క్షీణత రంగాల విభజనలో కూడా కనిపించింది. వ్యవసాయ వృద్ధి రేట్లు 2వ దశలో 3.4 శాతం నుంచి 3వ దశలో 3.3 శాతానికి తగ్గాయి. పారిశ్రామిక వృద్ధి 8.9 శాతం నుంచి 6 శాతానికి పడిపోయింది. సేవల రంగ వృద్ధి రేటు కూడా 10.1 శాతం నుంచి 8.1 శాతానికి పడిపోయింది.

2011-12 తర్వాత అనేక స్థూల ఆర్థిక సూచికల మందగమనం ప్రజల జీవితాలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపింది. మొదటిది, నిరుద్యోగిత రేటు 2011-12లో 2.2 శాతం నుండి 2017-18లో 6.1 శాతానికి, 2018-19లో 5.8 శాతానికి, 2019-20లో 4.8 శాతానికి పెరిగింది. 2017-18, 2018-19, 2019-20 సంవత్సరాల్లో నమోదైన నిరుద్యోగిత రేట్లు గత నాలుగు దశాబ్దాలలో నమోదైన అత్యధిక రేట్లు.

రెండవది, 2011-12 (NSSO-CES)లో ఆదాయ పేదరికం స్థాయి

21.9 శాతం నుండి 2017-18 (NSSO-CES)లో 22.8 శాతానికి 2019-20 (PLFS)లో 25.9 శాతానికి పెరిగాయి. నిజానికి, 1970ల ప్రారంభం తర్వాత భారతదేశంలో నికర పేదరిక స్థాయి పెరగడం ఇదే తొలిసారి. గ్రామీణ పేదరికం పెరుగుదల, పట్టణ ప్రాంతాలతో పోలిస్తే బాగా ఎక్కువగా ఉంది, గ్రామీణ పేదరికం 2011-12లో 25.7 శాతం నుండి 2017-18లో 29.6 శాతానికి, 2019-20లో 30.5 శాతానికి పెరిగింది.

సారాంశంలో, భారత ఆర్థిక వ్యవస్థ 2011-12 తర్వాత, ముఖ్యంగా 2016-17 తర్వాత క్రమంగా మందగిస్తోంది. GVA వృద్ధి రేట్లు 2016-17 తర్వాత మాత్రమే క్షీణతను చూపుతుండగా, సాధారణంగా ఆర్థిక వృద్ధికి సంబంధించిన ఆర్థిక సూచికలు 2011-12 నుండే క్షీణించడం ప్రారంభమయింది. ప్రత్యేకించి, పెట్టుబడి రేట్ల పతనం, దేశీయ రుణ వృద్ధి 3వ దశలో భారతదేశ తయారీ, మౌలిక సదుపాయాల సామర్థ్యాలను గణనీయంగా తగ్గించే అవకాశం ఉంది. వాస్తవానికి, 2020లో కోవిడ్-19 మహమ్మారి సంభవించే నాటికే, భారత ఆర్థిక వ్యవస్థ చాలా బలహీనమైన పరిస్థితిలో ఉంది.

ఈ మార్పులు మొత్తం డిమాండ్ వేగంగా కుంచించుకుపోతోందని సూచించే స్పష్టమైన ఆధారాలు. ఒకవైపు, వాస్తవ గ్రామీణ వేతనాల పెరుగుదల 2016-17 వరకు పెరిగింది. ఆ తర్వాత నిలిచిపోయింది, 2016-17 తర్వాత అనేక త్రైమాసికాల్లో ప్రతికూల వృద్ధి రేటును నమోదు చేసింది. మరోవైపు, తయారీ రంగంలో సామర్థ్య వినియోగం 2010-11లో 79 శాతం నుంచి 2016-17 నాటికి 72 శాతానికి, 2019-20లో 70 శాతానికి పడిపోయింది.

3వ దశలో ఆర్థిక మందగమనానికి సంబంధించిన కీలకమైన అంశం బ్యాంకింగ్ రంగంలో సంక్షోభం. సరళీకరణ యొక్క సుదీర్ఘ దశలో, ప్రభుత్వ బ్యాంకుల ఆధిపత్యంలో ఉన్న బ్యాంకింగ్ నిర్మాణానికి తదుపరి ప్రభుత్వాల స్థూల ఆర్థిక విధానాల నిర్మాణం దాదాపుగా మద్దతు ఇవ్వలేదు. 2000వ దశకం చివరిలో, ద్రవ్య సంరక్షణవాదం పట్ల ప్రభుత్వాల నిబద్ధత కారణంగా వృద్ధి మందగమనంలో సాగే అవకాశాలు ఉన్న సమయంలో, బ్యాంకులలో అధిక ద్రవ్యత ప్రతి-చక్రీయ ద్రవ్య విధానానికి ప్రత్యామ్నా యంగా పరిగణించబడింది. తరువాతి ప్రభుత్వాలు, అధిక ద్రవ్య లోటు గురించి ఆందోళన చెందుతూ, రిటైల్, వాహన, వ్యక్తిగత రుణాలు ఇవ్వాలని, ఎక్కువ రిస్కుతో కూడిన మౌలిక సదుపాయాల రంగాల కోసం మరింతగా

రుణాలు ఇవ్వాలని ప్రభుత్వ బ్యాంకులను ప్రోత్సహించాయి. ఇక్కడ, స్వల్పకాలిక డిపాజిట్ల ద్వారా నిధులు పొందిన బ్యాంకులు దీర్ఘకాలిక నష్టాలను కలిగి ఉన్న రంగాలకు రుణాలు  ఇస్తూ రిస్క్ తీసుకుంటున్నాయి, తరచుగా వీటికి ఎలాంటి గ్యారంటీ ఉండదు. ఆశ్చర్యం కలిగించని రీతిలో చాలా రుణాలు తిరిగిరానివిగా మారాయి. పర్యవసానంగా, 2010లలో పెరుగుతున్న నిరర్థక ఆస్తులతో (NPA) బ్యాంకులు సంక్షోభంలోకి నెట్టబడ్డాయి. ద్రవ్యలోటు భయంతో ప్రభుత్వ రంగ బ్యాంకులలో ప్రభుత్వం తిరిగి పెట్టుబడి పెట్టలేదు. ఈ సంక్షోభం నుండి బయట పడే దిక్కుమాలిన పరిష్కారం బ్యాంకుల ప్రైవేటీకరణ.

డిమాండ్ మందగమనం స్పష్టంగా కనిపించినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ప్రతి – చక్రీయ ద్రవ్య విధానాన్ని అనుసరించడానికి స్థిరంగా నిరాకరించింది. GDP కేంద్ర ప్రభుత్వ వ్యయాల నిష్పత్తి 2011–12 , 2019–20 మధ్య పడిపోయింది. ఈ క్లిష్ట కాలంలో కూడా సనాతన ద్రవ్య స్థిరీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. నయా ఉదారవాద విధాన పాలనలో ఆర్థిక కార్యకలాపాల నుండి రాజ్యం  ఉపసంహరణ పెరుగుతుంది అనడానికి ప్రభుత్వ వ్యయం తగ్గడం కూడా ఒక సూచిక.

**మూడు దశల్లో ధోరణుల సారాంశం**

మూడు దశల్లోని ధోరణులు మనకు సంక్లిష్టమైన చిత్రాన్ని అందిస్తాయి. సుదీర్ఘ మాంద్యంతో కూడిన  స్వల్ప వృద్ధి పెరుగుదల అనేది మూడు దశల్లోని మొత్తం ధోరణి.

**ఆర్థిక సరళీకరణ వర్గ స్వభావం, ఫలితాలు**

**గ్రామీణ ఆర్థిక వ్యవస్థ**

గత మూడు దశాబ్దాల అభివృద్ధి యొక్క వర్గ స్వభావాన్ని ప్రపంచీకరణ, సరళీకరణ కాలంనుండి, ప్రపంచ, దేశీయ లక్షణాల నుండి విడదీసి చూడలేము.

వ్యవసాయం వంటి రంగాల్లో వృద్ధి రేటు తగ్గుదలకు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి. 2015 - 2022 మధ్య వ్యవసాయ ఆదాయాలు రెట్టింపు అవుతాయని నరేంద్ర మోడీ ప్రభుత్వం వాగ్దానం చేసినప్పటికీ, 2012–13,  2019–20 మధ్య వ్యవసాయ కుటుంబాల సగటు వాస్తవ ఆదాయాలు  –1.4 శాతానికి పడిపోయాయని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. 1990ల మధ్య నుంచి 2010ల మధ్య కాలంలో 3 లక్షలకు పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం గ్రామీణ ప్రాంతాల్లోని దుస్థితికి మరో నిదర్శనం.

1990లలో,  ఆ తర్వాత, వ్యవసాయానికి ప్రభుత్వ సంస్థాగత మద్దతు

క్రమంగా తగ్గిపోయింది.[25] వ్యవసాయంలో ప్రభుత్వ పెట్టుబడి పెరుగుదల నిలిచిపోయింది. పరిశోధన, విస్తరణపై ప్రభుత్వ వ్యయంలో అదే పరిస్థితి నెలకొంది. కొల్లగొట్టే దిగుమతుల నుండి వ్యవసాయానికి అందించబడిన రక్షణలు తొలగించబడ్డాయి, ఫలితంగా వస్తువుల ధరలు తగ్గుముఖం పట్టాయి. ఆర్థిక సంస్కరణల్లో భాగంగా, ఇన్‌పుట్ సబ్సిడీ వ్యవస్థ నిరోధించబడింది, దీని కారణంగా ఇన్‌పుట్ ధరలు పెరిగి ఉత్పత్తి ఖర్చులు బాగా పెరిగాయి. ఫలితంగా వ్యవసాయంలో లాభదాయకత పడిపోయింది. గ్రామీణ రుణాల వృద్ధి 1990లలో మందగించింది. గ్రామీణ వడ్డీ వ్యాపారులకు తలుపులు తిరిగి తెరవబడ్డాయి. 2000ల తర్వాత, ప్రభుత్వ బ్యాంకులు పెద్ద రైతులు, కార్పొరేట్ అగ్రి-బిజినెస్ గ్రూపుల అవసరాలను ఎక్కువగా తీర్చాయి. నియంత్రిత మార్కెట్‌లు సమర్థవంతమైన మార్కెటింగ్‌కు అడ్డంకులుగా పరిగణించబడ్డాయి. కొత్త చట్టాల ద్వారా వాటిని క్రమబద్ధీకరించడానికి ప్రయత్నించారు. వ్యవసాయ పరిశోధన, విస్తరణలో, విత్తనోత్పత్తిలో, ఎరువులు, పురుగుమందుల ఉత్పత్తిలో, సూక్ష్మ నీటిపారుదలలో, వ్యవసాయ మార్కెటింగ్‌లో, విలువ జోడింపులో, ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో కార్పొరేట్ సంస్థలు ప్రవేశించాయి. పశువుల వధ, గొడ్డు మాంసం తినడంపై నిషేధానికి సంబంధించిన కొత్త నియమాలు, మార్గదర్శకాల వల్ల గ్రామీణ కుటుంబాల జీవనోపాధికి అదనపు దెబ్బ తగిలింది.

ఇవి సరళీకరణ కాలం యొక్క కాదనలేని లక్షణాలు అయినప్పటికీ, ఉత్పాదక శక్తుల వృద్ధిని ఇవి ఆపలేదు, రైతాంగంలో వ్యత్యాసాలు తొలగిపోయి, భిన్నత్వం లేని సమూహంగా, ఒకే తరగతిగా మార్చబడలేదు. 1991-92, 2019-20 మధ్య, మందగమన కాలాలకు ముందు లేదా దాని తర్వాత వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ వృద్ధి కాలాలు ఉన్నాయి. 2003-04, 2010-11 మధ్య వృద్ధి కాలంలో, చాలా పంటల ఉత్పత్తి, ఉత్పాదకత పెరిగింది. 2011-12 తర్వాత కూడా, వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ మందగించినప్పుడు, పప్పుధాన్యాలు, మొక్కజొన్న, పండ్లు, కూరగాయలు వంటి నిర్దిష్ట పంటలు ఉత్పత్తి, ఉత్పాదకత వృద్ధిని చవిచూసాయి. పత్తి వంటి పంటలలో 2003-04 తర్వాత ఉత్పాదకత పెరుగుదల, పత్తి రైతుల ఆదాయాలు ఒత్తిడికి గురయినప్పటికీ భారతదేశం తన వార్షిక ఎగుమతులను పెంచుకోవడానికి అవకాశం కల్పించింది.

ప్రభుత్వ పెట్టుబడులు నిలిచిపోయినప్పటికీ వ్యవసాయంలో ప్రైవేట్ పెట్టుబడులు పెరుగుతూనే ఉన్నాయి. ఏదోఒక స్థిర పెట్టుబడి వ్యయం చేసిన గ్రామీణ

కుటుంబాల శాతం 1992 - 2003 మధ్య పడిపోయింది (15.4 శాతం నుండి 13.2 శాతానికి), కానీ 2003, 2013 మధ్య (31.1 శాతానికి), 2013, 2019 మధ్య (34.9 శాతానికి) పెరిగింది. ప్రైవేట్ స్థిర పెట్టుబడి కల్పనలో ఎక్కువ భాగం బావులు తవ్వడం, ఫామ్‌హౌస్‌ల నిర్మాణం, ట్రాక్టర్లు, టిల్లర్ల కొనుగోలులో ఉంది. సరళీకరణ కాలంలో గ్రామీణ భారతదేశలో ట్రాక్టర్ల అమ్మకాలు పెరిగాయి. 1991-92లో, సంవత్సరానికి విక్రయించబడిన ట్రాక్టర్ల సంఖ్య 1,46,800. ఇది 2000-01లో 2,37,189కి, 2011-12లో 5,45,128కి, 2019-20లో 7,81,065కి పెరిగింది.

వ్యవసాయంలో ప్రైవేట్ పెట్టుబడి వృద్ధికి 2003-04 తర్వాత వ్యవసాయ రుణాల పెరుగుదల కూడా తోడ్పడింది. తాజా వ్యవసాయ రుణంలో అధిక భాగం అగ్రిబిజినెస్, కార్పొరేట్స్ కు వెళ్లినప్పటికీ, వ్యవసాయ రుణాల పెరుగుదల గ్రామీణ భారతదేశంలోని రైతులు కొత్త ట్రాక్టర్లు కొనుగోలు చేయడానికి సహాయపడింది. వ్యవసాయంలో కూడా రైతుల ఎరువుల వాడకం పెరిగింది. మొత్తం ఎరువుల విక్రయాలు 2007-08లో 4.3 కోట్ల టన్నుల నుంచి 2015-16లో 5.8 కోట్ల టన్నులకు, 2019-20లో 6.1 కోట్ల టన్నులకు పెరిగాయి.

వ్యవసాయ అనుబంధ రంగాలైన పశువుల పెంపకం, చేపల పెంపకంలో కూడా వృద్ధి ఉంది. పశువులలో అదనపు విలువ 1990లలో 3.6 శాతం, 2000లలో 4.4 శాతం, 2010లలో 6 శాతం చొప్పున ఏటా వృద్ధి చెందింది. నిజానికి, 2012-13, 2018-19 మధ్య పశుపోషణ ద్వారా వ్యవసాయ కుటుంబాల వాస్తవ ఆదాయం 65.9 శాతం పెరిగింది. అదేవిధంగా, 1990లు, 2000లలో 4.1 శాతం వృద్ధి రేటుతో మత్స్య సంపదలో అదనపు విలువ వార్షికంగా వృద్ధి చెందింది, అయితే 2010లలో 9.7 శాతానికి పెరిగింది.

మరో మాటలో చెప్పాలంటే, నయా-ఉదారవాదం కింద వ్యవసాయ పెట్టుబడిదారీ విధానం పంటలలో, ప్రాంతాలలో అసమానంగా ఉన్నప్పటికీ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులు పోగుపడటం కొనసాగింది. రైతుల మధ్య అసమానతలు పెరగడం, ముఖ్యంగా శ్రామికీకరణ ద్వారా పెట్టుబడి పోగుపడటం గుర్తించబడింది.[26] శ్రామికీకరణ రెండు స్థాయిలలో కొనసాగింది. మొదటిది, చిన్న మధ్యతరగతి రైతుల లాభాలు తీవ్రమైన ఒత్తిడికి గురయ్యాయి, యాంత్రీకరణ పెరుగుదల వల్ల వ్యవసాయంలో శ్రమ పద్ధతుల్లో మార్పులు వచ్చాయి. ఈ మార్పుల వల్ల భూమి అమ్మకాలు పెరిగి, చిన్న, మధ్యతరగతి రైతాంగంలో కొంత భాగం కూలీలుగా మార్కెట్‌లోకి ప్రవేశించడంతో వ్యవసాయ కూలీ మార్కెట్ విస్తరించింది. రెండవది, వ్యవసాయేతర అవసరాల కోసం

భూసేకరణకు సంబంధించిన కొత్త విధానాలు గ్రామీణ ప్రాంతాల్లో భూమిని కోల్పోవడానికి దోహదం చేశాయి. అయితే, గ్రామీణ కుటుంబాలు భూ సేకరణలో భూమిని కోల్పోవడానికి మధ్య ఉన్న సంబంధాన్ని మనం అతిగా చూడకూడదు. ఇటువంటి ప్రక్రియలు కొన్ని పాకెట్స్‌కు పరిమితం చేయబడ్డాయి. మరియు ఈ విషయంలో ఉదహరించిన అనేక గణాంకాలు వాస్తవికంగా ఉండకపోవచ్చు. రైతుల మధ్య అంతరాలు పెరగడం 1991 తర్వాత వ్యవసాయ పెట్టుబడిదారీ విధానంలో ఒక నిరంతర ధోరణి అనేది సారాంశం.[27]

తత్ఫలితంగా, నయా–ఉదారవాద యుగంలో వ్యవసాయ సమస్య మరింత క్లిష్టంగా మారింది. ఒక వైపున, గ్రామీణ ప్రాంతాల్లోని భూస్వామ్య వర్గాలు, భూమి, ఇతర రకాల పెట్టుబడిని కూడబెట్టుకోవడం కొనసాగించాయి, అయితే వారు తమ వ్యవసాయ పెట్టుబడిని ఇన్వెస్ట్ చేయడంతో పాటు వివిధ రంగాలు, వనరుల నుండి కూడ కొత్త మిగులును ఉత్పత్తి చేస్తారు: వ్యవసాయంలోను, వెలుపల, గ్రామంలో, పట్టణంలో, నగరాల్లో, ఉత్పత్తిలో, ఆస్తుల కొనుగోళ్లు, స్పెక్యులేషన్, మానవ వనరుల ద్వారా అనేక ప్రాంతాలలో, ఇతర వెనుకబడిన తరగతుల (OBC) సమూహాల నుండి కొత్త గ్రామీణ ధనవంతుల తరగతి ఉద్భవించింది. మరోవైపు, శ్రామిక వర్గాలకు వ్యవసాయం, వ్యవసాయేతర రంగాలలో ఉపాధిలో వైవిధ్యం పెరిగింది. నిర్దిష్ట సమయం పనికి, నిర్దిష్ట పని యూనిట్లకు ఒప్పందాలు, గ్రామాల్లో నుండి నగరాలకు వలసలు జరుగుతున్నాయి. కాని ఇదే సమయంలో రైతాంగం ఒత్తిడికి లోనవుతున్న ఈ ప్రక్రియలన్నీ "పాత" వ్యవసాయ సమస్య స్థానంలో "కొత్త" వ్యవసాయ సమస్యకు దారితీశాయని భావించడం, రైతాంగమంతా ఒకే తరగతి అని భావించడం, సామ్రాజ్యవాదాన్ని ప్రథమ శత్రువుగా నిలబెట్టడం, గ్రామాలలో వర్గ పోరాటాన్ని వాయిదా వేయడం – తప్పు అవుతుంది.

గ్రామీణ ప్రాంతాలలో పెట్టుబడి పోగుపడటం యొక్క కొత్త రూపాలు మరొక దృగ్విషయానికి దారితీశాయి : గ్రామీణ ఉన్నత వర్గాలలో అభివృద్ధి చెందుతున్న సమూహం నయా–ఉదారవాద ఆర్థిక విధానాల నుండి ప్రయోజనం పొందింది. అందుచేత వాటికి మద్దతు ఇస్తుంది. మొదటగా, గ్రామీణ ధనవంతుల విభాగాలు భూ సీలింగ్ నిబంధనలను పలుచన చేసే భూ సంస్కరణల చట్టాల నయా–ఉదారవాద సవరణలలో ప్రయోజనాలను చూస్తున్నారు. ఇటువంటి నిబంధనలు సాగు కోసం పెద్ద భూభాగాలను నిలుపుకోవడానికి వీలు కల్పిస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో పారిశ్రామిక అవసరాల కోసం భూమిని సేకరించడం పట్ల వారు చాలా నిర్లిప్తంగా ఉన్నారు. దీనికి కారణం వారు విక్రయించకలిగిన భూమి పరిమితంగా ఉండటం,

2013 భూసేకరణ చట్టం అధికధరలను అందించడం.

రెండవది, నయా-ఉదారవాద ప్రతిపాదకులు ప్రోత్సహించిన వ్యవసాయంలో గ్రామీణ ధనవంతులు అధిక-విలువ, అధిక-పెట్టుబడి, ఎగుమతి-ఆధారిత, ఉద్యానవన పంటల ఆధారిత తదితర వైవిధ్యమైన విభాగాల్లో వృద్ధి సాధించడంలో అపారమైన సామర్థ్యాన్ని చూపిస్తున్నారు. గ్రామీణ ధనవంతులైన తరగతులు అధిక-విలువైన విత్తనాలు, ఇతర ఇన్‌పుట్‌లలో పెట్టుబడి పెట్టడానికి సరిపడా పెట్టుబడి కలిగి ఉంటాయి. సూక్ష్మ నీటిపారుదల, డిజిటల్, సరియైన వ్యవసాయ పద్ధతులు, ఉద్యానవన, వ్యవసాయ వృద్ధికి అవసరమైన ఇతర అంశాల ప్రయోజనాలను పొందారు. వారు గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేట్ నేతృత్వంలోని సేవల విస్తరణ, వృద్ధిని కూడా స్వాగతించారు, ఎందుకంటే ప్రభుత్వ రంగంలో ఇవి విచ్ఛిన్నమయ్యాయి, అలాగే ఉన్నత స్థాయి ఉద్యానవన వ్యవసాయానికి అవసరమైన ఆధునిక సాంకేతికత, సాంకేతిక సలహాలు, ఇతర వనరులు అందుబాటులో లేవు. ఈ విభాగాలు గత మూడు దశాబ్దాలుగా వ్యవసాయ యాంత్రీకరణకు ఆర్థిక సహాయం చేసిన సబ్సిడీ, క్రెడిట్ పథకాల నుండి కూడా ప్రయోజనం పొందాయి. రైతుల యాజమాన్యంలోని ట్రాక్టర్ల సంఖ్య వేగంగా పెరగడం అటువంటి ప్రయోజనాలకు ఒక ఉదాహరణ.

మూడవదిగా, పాడి పరిశ్రమ, పౌల్ట్రీ, లోతట్టు ఆక్వాకల్చర్ వంటి వ్యవసాయ అనుబంధ రంగాలు నయా-ఉదారవాద కాలంలో వేగంగా వృద్ధి చెందాయి. ఈ సంస్థలలో పాలుపంచుకున్న గ్రామీణ ధనవంతుల విభాగాలు పండించే పంటలు, వ్యవసాయంలో వారి సహచరులతో పోలిస్తే ప్రభుత్వ మద్దతు లేదా ప్రభుత్వ రాయితీలపై తక్కువ ఆధారపడేవి. వారి సంస్థలు దాదాపు పూర్తిగా ప్రైవేట్ మార్కెట్‌లతో అనుసంధానించబడి ఉంటాయి. మార్కెట్ నేతృత్వంలోని ప్రోత్సాహకాల ద్వారా మార్గనిర్దేశం చేయబడతాయి. ఈ విభాగాలు కూడా నయా ఉదారవాదం నుండి ప్రయోజనాలను కోరుకుంటాయి, వారి కోరికల్లో పెద్ద వ్యవసాయ యూనిట్లపై ప్రభుత్వ నిబంధనలను రద్దు చేయడం, దేశీయ మార్కెట్ల విస్తరణ, లేదా ఎగుమతులు పెరిగే అవకాశాలు కల్పించడం వంటివి ఉన్నాయి.

క్లుప్తంగా చెప్పాలంటే, తమ సొంత ఉప-రంగాలకు ప్రభుత్వ రాయితీలను పెంచాలని డిమాండ్ చేసినప్పటికీ, గ్రామాలలో నయా-ఉదారవాదం తనకు మద్దతునిచ్చే కొత్త ప్రజా సమూహాలను ఏర్పాటు చేసుకుంది,

చివరగా, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (MGNREGS), ప్రజా పంపిణీ వ్యవస్థ (PDS) వంటి ప్రభుత్వ కార్యక్రమాల పట్ల

భూములు కలిగి ఉన్న రైతులలో వ్యతిరేకతను, అది పెరుగుతున్న తీరును మనం తక్కువ అంచనా వేయకూడదు. ఈ పథకాలు గ్రామీణ కార్మికుల రిజర్వేషన్ వేతనాల పెరుగుదలకు లేదంటే అధిక వేతన వ్యవస్థకు దోహదపడతాయని, పెట్టుబడి సమీకరణకు వచ్చే అవకాశాలకు ఈ పథకాలు విఘాతం కలిగిస్తున్నాయని వారు భావిస్తున్నారు.

గ్రామీణ సమాజంలో కొనసాగుతున్న కులం ప్రాసంగికత "కొత్త" వ్యవసాయ సమస్యకు వ్యతిరేకంగా పోరాడుతున్నామని చెప్పే వారి వాదన తప్పు అని నిరూపిస్తుంది. నయా–ఉదారవాద కాలంలో కూడా దళితులు, ఆదివాసీలు అగ్రవర్ణాల భూస్వాములచే నిరంతరం దాడులకు గురవుతున్న గ్రామీణ ప్రాంతాల్లో కుల వివక్షతకు, దోపిడీకి భూమి భౌతిక ప్రాతిపదికగానే కొనసాగుతోంది. అగ్రవర్ణాల భూస్వాములు సీలింగ్–మిగులు భూమిని పెంచడాన్ని వ్యతిరేకించడం మాత్రమే కాదు, దళితులకు ప్రభుత్వ భూమి, బంజరు భూమి లేదా ఇంటి స్థలాలను పంపిణీ చేయడాన్ని, ఆదివాసీలకు అడవులకు సమీపంలో ఉన్న భూమి పంపిణీ చేయడాన్ని కూడా వ్యతిరేకిస్తున్నారు. అగ్రకులాలు కూడా వివిధ సమస్యలపై దళితులు, ఆదివాసీలపై వివక్షను కొనసాగిస్తూనే ఉన్నాయి, రోడ్లు, దేవాలయాలలోకి ప్రవేశం, బావుల వినియోగం, కులాంతర వివాహాలు, సామూహిక భోజనం చేసే స్వేచ్ఛ హరించడం, జాతర్ల లాంటి సామాజిక కలయికలకు దూరంగా పెట్టడం, ఒక సాధారణ సూత్రం వలె కొనసాగుతోంది. దీని మూలంగా అణగారిన కులాల వారి స్వేచ్ఛ కుంచించడానికి దారితీసి వారు తీవ్రంగా అణిచివేతకు గురవుతున్నారు. వర్గపోరాటం తీవ్రతరం కాకుండా గ్రామీణ భారతంలో కుల నిర్మూలనను ఊహించలేమని స్పష్టంగా అర్థమవుతోంది.

**పరిశ్రమలు, స్థూల ఆర్థిక వ్యవస్థ**

సరళీకరణ కాలంలో బడా బూర్జువా వర్గం భారత ఆర్థిక వ్యవస్థలో మరింతగా వేళ్లూనుకుంది. దోపిడీలో వాటా కోసం విదేశీ పెట్టుబడుల పోటీ నుండి, దేశీయ లాభాలు పడిపోకుండా, తమ సొంత దేశంలో ఆధిపత్యాన్ని రక్షించుకోవడానికి వారు కృషి చేస్తూనే, అంతర్జాతీయ పెట్టుబడిదారీ విధానంతో మమేకమయ్యారు. కోణంలో బడా బూర్జువావర్గం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా తన స్వయంప్రతిపత్తిని కాపాడుకుంది, అయినప్పటికీ తనకు అనుకూలమైన సమయాలలో, రంగాలలో సామ్రా జ్యవాద ప్రయోజనాలకు కోసం పని చేయడానికి సిద్ధంగా ఉంది.

మొదటిగా చెప్పుకోవాలంటే, బడా బూర్జువాల ద్వంద్వ స్వభావం నయా–ఉ

దారవాదం క్రింద భద్రపరచబడింది. బడా బూర్జువా వర్గం భూస్వాములతో మైత్రిని తెంచుకుని రాజ్య స్వభావాన్ని మార్చివేసిందని చెప్పడానికి ఎలాంటి ఆధారాలు లేవు. మేము చర్చించినట్లుగా నయా–ఉదారవాద విధానాలకు సంబంధించి కొత్త తరగతి పెట్టుబడిదారీ భూస్వాములతో సహా – భూస్వాముల భౌతిక ప్రయోజనాల కోసం అంతటా, బడా బూర్జువాల, భూస్వాముల మధ్య బలమైన పరస్పర సంబంధాలు కొనసాగుతున్నాయి. ఒకవైపు, గ్రామీణ వర్గాల పెట్టుబడి సేకరణ రూపాలలో వైవిధ్యం దృష్ట్యా నయా–ఉదారవాద విధానాలు వారికి అనేక విధాలుగా ప్రయోజనం చేకూర్చాయి. నయా–ఉదారవాద విధానాల రాకతో వారి పెట్టుబడి పోగుపడే మార్గాలలో కొన్ని లాభపడ్డాయి. వారి ఆర్థిక స్థానాన్ని మరింత విస్తరించుకోవడానికి నయా ఉ దారవాదం ఉపయోగపడుతుందని భూస్వాములు భావిస్తున్నారు. మరోవైపు, బడా బూర్జువాలు భూస్వామ్యంతో తన మైత్రిని విడనాడి, భారత రాజ్యం యొక్క వర్గ స్వభావాన్ని మార్చడం సముచితమని భావించడంలేదు. ప్రస్తుత అభివృద్ధి దశలో రాజ్యస్వభావాన్ని అస్తవ్యస్తం చేయడం వారి దేశీయ ఆర్థిక ప్రయోజనాలను ధ్వంసం చేస్తుందని, ప్రపంచ వాణిజ్య అవకాశాలను ప్రమాదంలో పడేస్తుందని వారు భయపడుతున్నారు.

నయా–ఉదారవాద కాలంలో భారతీయ బూర్జువాల లాభాలు, ఆస్తులు అనేక రెట్లు పెరిగాయి. ప్రైవేట్ కార్పొరేట్ రంగం (ఆర్థిక, ఆర్థికేతర కంపెనీలు కలిపి) పన్నులు చెల్లించిన తర్వాత లాభాలు (పిఎటి) 1990–91లో రూ. 5,266 కోట్ల నుండి 2000–01లో రూ. 13,236 కోట్లకు, 2010–11లో రూ. 2.9 లక్షల కోట్లు, 2020–21లో 5.6 లక్షల కోట్లు. ప్రైవేట్ కార్పొరేట్ రంగ సంస్థల స్థూల స్థిర ఆస్తుల విలువ 1990–91లో రూ. 42,097 కోట్ల నుంచి 2000–01లో 5.5 లక్షల కోట్లకు, 2010–11లో రూ. 30.5 లక్షల కోట్లకు, 2020–21లో రూ. 77 లక్షల కోట్లకు పెరిగింది.[28] మొత్తం ఆస్తులలో, "స్థిర ఆస్తుల" వాటా క్షీణించడం, "పెట్టుబడుల" వాటా పెరగడం, కార్పొరేట్లు, పెట్టుబడి మార్కెట్ పరస్పరం ఆధారపడటాన్ని, వాటి మధ్య గల బలమైన సంబంధాల్ని చూపుతుంది.

లాభాలు లేదా ఆస్తుల పరిమాణం, సంఖ్యలు ఆర్థిక వ్యవస్థలో పెద్ద ఎత్తున పెట్టుబడులు కేంద్రీకరించబడ్డాయని తెలియజేస్తున్నాయి. గత దశాబ్దంలో పారిశ్రామిక, సేవల రంగాన్ని పెద్ద సంక్షోభం చుట్టుముట్టి కప్పేసింది. 1991–92 తర్వాత కాలాన్ని మూడు దశలుగా విభజిస్తే, 2010–11 తర్వాత కార్పొరేట్ రంగ లాభదాయకతలో తీవ్రమైన సంక్షోభం కన్పిస్తుంది. 2014 తర్వాత కార్పొరేట్ ప్రయోజనాల కోసం పూనుకున్న మోడీ ప్రభుత్వ విధానాలను ఈ విస్తృత సందర్భంలో చూడాలి.

2010-11 తర్వాత స్థూల ఆర్థిక వ్యవస్థలో వరుస అస్థిరత్వం, తీవ్రమైన క్షీణత గురించి మనం ఇప్పటికే చర్చించాము. 2011-12 నుండి పొదుపు రేటు, పెట్టుబడి రేటు, GDPలో బ్యాంక్ క్రెడిట్ వాటా, GDPలో ఎగుమతుల వాటాలో క్షీణతలు ఉన్నాయి, అంటే 3వ దశలో మేము 2011-12 తర్వాత నిరుద్యోగం రేటు, ఆదాయ పేదరికం పర్యవసానంగా పెరుగుదల గురించి కూడా చర్చించాము. సారాంశంలో, ఈ మార్పులు ప్రైవేట్ కార్పొరేట్ రంగంలో పెద్ద సంక్షోభానికి నేపథ్యాన్ని ఏర్పర్చాయి..

ముఖ్యంగా, 2011-12 తర్వాత ప్రైవేట్ కార్పొరేట్ రంగంలో పెట్టుబడి సేకరణలో తీవ్ర సంక్షోభం ఏర్పడింది. మొదటిది, 1వ దశ (15.9 శాతం), 2వ దశ (21.7 శాతం)తో పోలిస్తే ప్రైవేట్ కార్పొరేట్ రంగంలో మొత్తం ఆదాయాల సగటు వార్షిక వృద్ధి 3వ దశ (8.2 శాతం)లో అత్యల్పంగా ఉంది. రెండవది, ప్రైవేట్ కార్పొరేట్ రంగం యొక్క మొత్తం ఆస్తులు ఏటా 1వ దశలో 20.5 శాతం, 2వ దశలో 26.9 శాతం పెరగగా, 3వ దశలో 11.2 శాతం మాత్రమే పెరిగాయి. మూడవది, ప్రైవేట్ కార్పొరేట్ రంగంలో పన్ను తర్వాత లాభాలు (PAT) 1వ దశలో 5.4 శాతం, 2వ దశలో 23.6 శాతం పెరిగాయి, 3వ దశలో 3.3 శాతం మాత్రమే పెరిగాయి. నాల్గవది, ప్రైవేట్ కార్పొరేట్ రంగంలో రుణాల పెరుగుదల 1వ దశలో19.8 శాతం, 2వ దశలో 26.5 శాతం నుండి 3వ దశలో 9.3 శాతానికి పడిపోయింది. చివరగా, పన్ను తర్వాత లాభాలలో (PAT) సంవత్సరానికి సంవత్సరానికి వచ్చే మార్పులు పెట్టుబడి యొక్క వాటా 1వ దశలో సగటున 3.5 శాతం మరియు 2వ దశలో 6.6 శాతం, అయితే 3వ దశలో కేవలం 2.3 శాతం మాత్రమే. ఇది లాభదాయకత పతనాన్ని సూచిస్తుంది. ఈ ధోరణులు 1వ దశలో, లేదా 2వ దశలో అదే రేటుతో 3వ దశలో ప్రభుత్వానికి ప్రత్యక్ష, పరోక్ష పన్నులు చెల్లించే ప్రైవేట్ కార్పొరేట్ రంగం సామర్థ్యాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేశాయి. 2016 తర్వాత కార్పొరేట్ రంగం సామర్థ్యం విస్తరణతో స్వల్పంగా కొత్త పెట్టుబడులు పెరిగాయి.

ఈ పెట్టుబడి సంచయన సంక్షోభం మరో రెండు దృగ్విషయాలతో కూడి ఉంది. ఒకటి, వ్యవసాయేతర రంగంలో వ్యవస్థీకరణ జరిగింది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సంబంధించిన ఉద్దేశపూర్వకంగా అనుసరించిన విధానాల పర్యవసానంగా అలాంటి పరిశ్రమలు పతనం చెందడం మూలంగాను ఈ వ్యవస్థీకరణ జరిగింది. 2016లో డీమోనిటైజేషన్, 2017లో వస్తు, సేవల పన్ను (GST) వ్యవస్థలో సంస్కరణల తర్వాత అసంఘటిత రంగం వ్యవస్తీకృతం కావడం ఊపందుకుంది.

ఈ రెండింటి వలన, మధ్య తరహా, చిన్న కార్పొరేట్ రంగ సంస్థలతో పోలిస్తే, పెద్ద కార్పొ రేట్‌ల సంస్థల లాభాలు, పెట్టుబడులు కూడా పెరిగాయి. పెద్ద కార్పొరేట్ రంగ సంస్థ ల లాభాలను కాపాడటానికి పెట్టుబడి సంచయన సంక్షోభ భారాన్ని మధ్య, చిన్న తరహా రంగాలు మోశాయి.

ఇటీవల, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భారతీయ పెట్టుబడి దారులను ఇలా అడిగారు: "2019 నుండి, పరిశ్రమ [పరిస్థితులు] అనుకూలంగా లేవని నేను వింటున్నాను, అందుకే నేను కార్పొరేట్ పన్ను రేటును తగ్గించాను...... నేను భారతీయ పరిశ్రమ నుండి తెలుసుకోవాలనుకుంటున్నాను. వారు ఎందుకు సంకోచిస్తున్నారు [పెట్టుబడి పెట్టడానికి]... భారత కార్పొరేట్ సంస్థల నుండి నేను వినాలనుకుంటున్నాను, విదేశాలు, వాటి పరిశ్రమలు ఇప్పుడు ఇదే సరైన స్థలం అని భావిస్తున్నప్పుడు మిమ్మల్ని ఏది అడ్డుకుంటోంది?"

పెట్టుబడిదారీ కార్పొరేట్ రంగం యొక్క రాజకీయ అర్థశాస్త్రం గురించి సీతారామన్‌కు కనీస అవగాహన లేదు. 1990లు, 2000ల ప్రారంభం వరకు, ఆర్థిక వ్యవస్థలో తక్కువ వేతనాల వ్యవస్థ నుండి భారతదేశ కార్పొరేట్ రంగం లాభపడింది. దురదృష్టవశాత్తూ, తక్కువ వేతన వ్యవస్థను కార్పొరేట్ రంగం మరింత సమర్థవంతంగా ప్రపంచ మార్కెట్లో పోటీపడేందుకు కాకుండా మరింత ఎక్కువ లాభాలను పొందేందుకు ఉపయోగించుకున్నది.[29] అయితే, 2000ల మధ్య నుండి వేతనాలు పెరగడం ప్రారంభిం చడంతో, మిగులును ఉత్పత్తి చేసే కార్పొరేట్ రంగం సామర్థ్యం బలహీనపడింది. కార్పొరేట్ రంగం క్రియాశీలంగా మద్దతునిచ్చే భారత ప్రభుత్వ ద్రవ్య సంరక్షణవాదం, మొత్తం డిమాండ్‌ను కుదించడంలో మాత్రమే సహాయపడింది. వారి స్వంత సిద్ధాంత మైన నయా-ఉదారవాదానికి కట్టుబడి ఉ ఎండటమే ప్రతి-చక్రీయ ఆర్థిక విధానాన్ని అనుసరించడానికి ఉన్న అన్ని అవకాశాలను మూసివేసింది. దాని ఫలితాలు 2010వ దశకంలో కేవలం మూలధన సంచయన సంక్షోభంలో మాత్రమే కాకుండా, వేతనాల స్తబ్దత, నిరుద్యోగం పెరుగుదల, ఆదాయ పేదరికం పెరుగుదల తదితరాలలో మనకు స్పష్టంగా కనిపించాయి

మోడీ పాలనలో కార్పొరేట్ రంగానికి ఆమె, ఆమె ముందరి అరుణ్ జైట్లీ బహూకరించిన బహుళ పన్నుల మాఫీ , ఇతర లాలూచీ రాయితీల గురించి సీతారామన్ ఆశ్చర్యపోతున్నారా - ఇవి స్థూల ఆర్థిక వ్యవస్థ క్షీణిస్తున్నప్పటికీ కార్పొరేట్ రంగ లాభాలను చెక్కుచెదరనీయకుండా ఉంచే ప్రయత్నంలో భాగం. సంక్షోభానికి మూలకారణం నయా ఉదారవాద భావజాలానికి కట్టుబడి ఉండటమేనని ఆమెకు పూర్తిగా తెలియనట్లు కనిపిస్తుంది, ఇది డిమాండ్‌ను అణిచివేస్తుంది, తన నాయకుడి

నోట్ల రద్దు, జిఎస్‌టి సంస్కరణ వంటి అహేతుక కార్యక్రమాలతో కలిపి ఆర్థిక వ్యవస్థను ఆ సంక్షోభం దిశగా నెడుతుంది. భారత కార్పొరేట్ రంగం – చారిత్రకంగా భూస్వామ్యంతో పొత్తు పెట్టుకుని, సామ్రాజ్యవాదంపై పూర్తిగా ఆధార పడకుండా – అంతర్గతంగా మార్పులు చేసుకోవడం ద్వారా పెట్టుబడి సంచయన సంక్షోభం నుండి బయటపడే సామర్థ్యం కార్పొరేట్ రంగానికి లేదనే విషయాన్ని కూడా ఆమె అర్థం చేసుకోలేకపోయింది. పైగా, కార్పోరేట్ రంగం డిమాండ్ చేసిన వాటిని ప్రభుత్వం అందించడానికి అంగీకరించింది. పెట్టుబడుల ఉపసంహరణను వేగవంతం చేయడం, కార్మికులను దోపిడీ చేయడానికి మరింత అనువైన పరిస్థితిని సృష్టించడానికి కొత్త లేబర్ కోడ్‌లు తీసుకరావడం తదితర రూపాల్లో ప్రభుత్వం కొత్త నజరానాలు ఇస్తోంది.[30] ఆర్థిక వ్యవస్థలోని సంక్షోభాల నుండి ప్రజల దృష్టి మరల్చడం కోసం ప్రజల మధ్య మత విభజనలను రెచ్చగొట్టడానికి నిరంతరం జరుగుతున్న ప్రయత్నాలను కూడా ఈ నేపథ్యంలోనే చూడాలి.

## VI
## ముగింపు మాటలు

రాజకీయ శిక్షణా తరగతుల చర్చలలో వినియోగం కోసం ఈ నోట్ ను ప్రాథమిక సమాచారంగా పరిగణించవచ్చు. దీనికి మరింత సమాచారం, లోతైన విశ్లేషణ, ఖచ్చితమైన వివరణలు అవసరం, ఇది తుది రూపం తీసుకున్నప్పుడు నేను ఆ సవరణలన్ని చేపట్టాలని భావిస్తున్నాను. స్థల కొరత కారణంగా, మానవ అభివృద్ధి సూచికల విశ్లేషణ, ప్రభుత్వ విధానాలతో వాటి సంబంధం, నేడు దేశంలో నెలకొన్న ఉపాధి సంక్షోభం, పేదరికం – పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి, పెరుగుదల మధ్య సంక్లిష్ట సంబంధం వంటి అనేక అంశాలు కూడా వదిలివేయబడ్డాయి. హిందూత్వ ఒక మెజారిటీ భావజాలం. అయినప్పటికీ, భారతదేశంలో స్వాతంత్ర్యానంతర ఆర్థికాభివృద్ధికి సంబంధించిన రాజకీయ ఆర్థిక వ్యవస్థపై అర్థవంతమైన చర్చకు ఇది ఒక ప్రారంభ బిందువుగా ఉపయోగపడుతుందని నేను ఆశిస్తున్నాను. ఈ నోట్ తుది సవరణలో మరింత వివరణాత్మక సూచనలు పొందుపరచబడతాయి.

# END NOTES

1 For more, see Utsa Patnaik and Prabhat Patnaik (2021), "The Drain of Wealth: Colonialism before the First World War", *Monthly Review*, February.

2 For more, see Irfan Habib (2006), "Colonialism and the Indian Economy", Chapter 2 in *Indian Economy: 1858-1914*, Tulika Books, New Delhi.

3 For more, see Daniel Thorner (1962), "Emergence of the Indian Economy: 1760-1960," in D. Thorner and A. Thorner (ed.) *Land and Labour in India*, Asia Publishing House, London.

4 For more, see Shubhra Chakrabarti and Utsa Patnaik (eds.) (2019), *Agrarian and Other Histories: Essays for Binay Bhushan Chaudhuri*, Tulika books, New Delhi.

5 For more, see E. M. S. Namboodiripad (1993), *A History of Indian Freedom Struggle*, Social Scientist Press, new Delhi.

6 For more, see E. M. S. Namboodiripad (1974), *Indian Planning in Crisis*, Chintha Publishers, Trivandrum.

7 For more, see B. T. Ranadive (1953), *India's Five Year Plan: What it Offers*, Current Book House, Bombay.

8 For more, see E. M. S. Namboodiripad (1949), *On the Agrarian Question in India*, People's Publishing House, New Delhi.

9 For more, see V. K. Ramachandran and R. Ramakumar (2000), "Agrarian Reforms and Rural Development Policies in India: A

Note", Unpublished note, Mumbai.

10 For more, see Mishra, S. K. (2007), "On Agrarian Transition in West Bengal", *The Marxist*, 23 (2), pp. 1-22.

11 For more, see Venkatesh Athreya (2009), "The Land Question and Globalization: Some Reflections on the Relevance of Redistributive Land Reforms", in D. N. Reddy (ed.), *Agrarian Reforms, Land Markets and Rural Poor*, Concept Publishers, New Delhi.

12 For more, see Prabhat Patnaik (1979), "Industrial Development in India since Independence, *Social Scientist*, 7 (11), pp. 3–19

13 For more, see R. Ramakumar (2022), "Introduction: Economic Reforms and Agricultural Policy in India", in R. Ramakumar (ed.), *Distress in the Fields: Indian Agriculture After Liberalisation*, Tulika Books, New Delhi.

14 For more, see Utsa Patnaik (1986), "The Agrarian Question and Development of Capitalism in India", *Economic and Political Weekly*, 21 (18).

15 For more, see C. P. Chandrasekhar, (1988), "Aspects of Growth and Structural Change in Indian Industry", *Economic and Political Weekly*, 23 (45/47), pp. 2359–2370.

16 For more, see C. P. Chandrasekhar and Jayati Ghosh (2002), *The Market that Failed: A Decade of Neo-liberal Reforms in India*, LeftWord Books, New Delhi.

17 For more, see V. K. Ramachandran, Madhura Swaminathan and Vikas Rawal (2003), "Agricultural Growth in West Bengal", Paper Presented in the All-India Conference on *Agriculture and Rural Society in Contemporary India*, Barddhaman, December 17-20.

18 For more, see *The IMF Loan: Facts and Issues*, Government of West Bengal, Calcutta, November 1981.

19 For more, see C. P. Chandrasekhar and Jayati Ghosh (2002), *The Market that Failed: A Decade of Neo-liberal Reforms in India*, LeftWord Books, New Delhi.

20 For more, see Prabhat Patnaik and C. P. Chandrasekhar (1998),

"India: Dirigisme, Structural Adjustment, and the Radical Alternative, in Dean Baker, Gerald Epstein and Robert Pollin (eds.), *Globalization and Progressive Economic Policy*, Cambridge University Press, Cambridge.

21 For more, see C. P. Chandrasekhar and Jayati Ghosh (2002), *The Market that Failed: A Decade of Neo-liberal Reforms in India*, LeftWord Books, New Delhi.

22 For more, see Prakash Karat (2000), "Nature of Capitalist Path of Development Since Independence", in *On Party Programme,* Party Education Sub-Committee of the Central Committee of the CPI (M), New Delhi.

23 For more, see C. P. Chandrasekhar, (2012), "From Dirigisme to Neoliberalism: Aspects of the Political Economy of the Transition in India" in Kyung-Sup, C., Fine, B., Weiss, L. (eds) *Developmental Politics in Transition*, International Political Economy Series, Palgrave Macmillan, London.

24 For more, see Venkatesh Athreya (2015), "The Political Economy of Indian Development", Unpublished note, Chennai.

25 For more, see R. Ramakumar (2022), "Introduction: Economic Reforms and Agricultural Policy in India", in R. Ramakumar (ed.), *Distress in the Fields: Indian Agriculture After Liberalisation*, Tulika Books, New Delhi.

26 For more, see V. K. Ramachandran (2011), "The State of Agrarian Relations in India Today", *Marxist*, 27 (1-2).

27 For more, see "On Agrarian Classes", Report of the Study Group constituted by the Polit Bureau, *Marxist*, 32 (2), April-June 2016.

28 These data are from the Prowess database of Centre for Monitoring Indian Economy (CMIE). Prowess contains financial performance data of about 38,000 Indian companies from 1989. The database contains data on non-government companies with a market capitalization of over Rs. 100 crore, a P/E ratio between 5 and 10, a dividend yield of over 2 per cent and a debt:equity ratio of less than 1.

29 For more, see Surajit Mazumdar (2017), "The Indian Economy in the Second Decade of the 21st Century: Signs of a Crisis", available at https://mpra.ub.uni-muenchen.de/93164/

30 For more, see Surajit Mazumdar (2022), "Big Business and the State in India under Globalization", Unpublished note, Jawaharlal Nehru University, New Delhi.

4

# సమాజంలోని వివిధ తరగతులపై నయా-ఉదారవాదం ప్రభావం

**మ**న పార్టీ 23వ కాంగ్రెస్ ఆమోదించిన రాజకీయ తీర్మానం హిందూత్వ మతోన్మాద శక్తులను ఒంటరిపాటు చేయడానికి, ఓడించడానికి పోరాడాలని పిలుపునిచ్చింది. ఈ పని కూడా నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేక పోరాటంతో ముడిపడి ఉంది. ఆ కర్తవ్యంలో భాగంగా పార్టీ క్రింది మార్గదర్శనం చేసింది :

1. నిరంతర వర్గ, ప్రజా పోరాటాలు ద్వారా పార్టీ స్వతంత్ర పాత్రను బలోపేతం చేయడానికి, పార్టీ ప్రభావాన్ని విస్తరించడానికి, రాజకీయ జోక్య సామర్థ్యాన్ని పెంచుకోవడానికి కృషి చేయాలి. ప్రజా సమస్యలపై స్థానిక పోరాటాలను బలోపేతం చేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలి, వీటిపై ప్రత్యేక దృష్టిపెట్టి సరైన పర్యవేక్షణ చేయాలి.

2. నయా ఉదారవాద విధానాల ద్వారా తీవ్ర ఆర్థిక దోపిడీకి గురవుతున్న అన్ని తరగతుల ప్రజల జీవనోపాధి సమస్యలపై జరిగే పోరాటాల్లో వారితో కలిసి ఉద్యమించాలి. ఆకస్మికంగా ముందుకొచ్చిన పోరాటాలలో పార్టీ చురుగ్గా జోక్యం చేసుకోవాలి, పాల్గొనాలి. వాటిని అభివృద్ధి చేసి, బలోపేతం చేయాలి.

పై ఆదేశాలను సమర్థవంతంగా అమలు చేయడానికి, వివిధ వర్గాల ప్రజల జీవనోపాధి, పని పరిస్థితులపై నయా ఉదారవాద విధానాల ప్రభావాన్ని అర్థం చేసుకోవడం, పార్టీ, ప్రజా సంఘాలు ప్రజలను సమీకరించగలిన నిర్దిష్ట డిమాండ్లను, నినాదాలను రూపొందించడం అత్యవసరం.

ఈ దిశగా, సరళీకరణ తర్వాత సామాజిక ఆర్థిక పరిస్థితులలో వచ్చిన మార్పులు, వివిధ తరగతులపై ఈ మార్పుల ప్రభావంపై పార్టీ అధ్యయనం చేసి, ఈ అధ్యయనాల ఆధారంగా పార్టీ మనం ప్రజలలో పనిచేయడానికి ఖచ్చితమైన మార్గదర్శకత్వం ఇచ్చింది.

జాతీయ స్థాయి విధానాలతో పాటు, నయా ఉదారవాద పాలనలో భాగంగా రాష్ట్రాలలోని స్థానిక సంస్థలు, మున్సిపల్ కార్పొరేషన్, మునిసిపాలిటీ, పంచాయతీ స్థాయిల్లో, స్థానిక స్థాయిలలో కూడా కొన్ని విధాన చర్యలు తీసుకోబడుతున్నాయి. ఇవి వివిధ వర్గాల ప్రజల జీవనోపాధి, పని పరిస్థితులను వివిధ మార్గాల్లో ప్రభావితం చేస్తున్నాయి. మేము ఇంకా వీటిపై ఖచ్చితమైన అధ్యయనాన్ని చేపట్టవలసి ఉంది. నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా అట్టడుగు స్థాయి వరకు, శ్రమిస్తున్న అన్ని వర్గాల ప్రజలను సమీకరించేందుకు గట్టి నినాదాలు, డిమాండ్‌లను రూపొందించడానికి ఇది అవసరం.

మన దేశంలో నయా ఉదారవాద విధానాలు 1991లో కాంగ్రెస్ హయాంలో అధికారికంగా ప్రారంభించబడ్డాయి. అయితే దిగుమతులపై సుంకాల తగ్గింపు మొదలైన కొన్ని చర్యలు అంతకుముందు (రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా, విపి. సింగ్ ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు) ప్రవేశపెట్టబడ్డాయి. భారతదేశంలో నయా ఉదారవాదాన్ని అధికారికంగా స్వీకరించడానికి 1990-91లో విదేశీ చెల్లింపుల సంక్షోభం ఉపయోగించబడింది. ప్రస్తుత మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం వాటిని మరింత దూకుడుగా అమలు చేస్తున్నప్పటికీ, అప్పటి నుండి తరువాతి ప్రభుత్వాలు ఈ విధానాలను అనుసరిస్తూనే ఉన్నాయి.

నయా ఉదారవాదం అంటే కేవలం ఆర్థిక విధానాలే కాదు. ఇది రాజకీయాలు, సంస్కృతి మొదలైన వాటితో సహా సమాజంలోని అన్ని పార్శ్వాలతో కూడిన విభిన్న అంశాలని కలిగి ఉంది. ఇది ప్రజల జీవితాల యొక్క అన్ని అంశాలను ప్రభావితం చేస్తుంది.

**ఆర్థికం**

నయా ఉదారవాదం యొక్క ఆర్థిక భాగాలు ప్రముఖంగా 'LPG' (ఉదారీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ) విధానాలుగా వర్ణించబడ్డాయి, ఇవి దిగుమతి సుంకాలను తగ్గించడం ద్వారా ఆర్థిక వ్యవస్థను ప్రపంచ మార్కెట్లకు తెరవడం, పెట్టుబడిని ఆకర్షించే పేరుతో పెట్టుబడుల తరలింపుపై అన్ని నిబంధనలు, పరిమితులను తొలగించడం, పెట్టుబడుల ఉపసంహరణ, ప్రైవేటీకరణ. ప్రభుత్వ

రంగ సంస్థలు ప్రైవేటీకరించబడడమే కాకుండా భూమి, గనులు, అడవులు, జలవనరులు మొదలైన సహజ వనరులను ప్రయివేటు కార్పొరేట్లకు అప్పగిస్తున్నారు. ఆరోగ్యం, విద్య, విద్యుత్, టెలికమ్యూనికేషన్స్, రవాణా, ఆర్థిక సేవలు, నీటి సరఫరా, పారిశుధ్యం, భద్రత మొదలైన ప్రాథమిక సేవలను ప్రైవేట్ కంపెనీలు నిర్వహించేందుకు అనుమతించబడతాయి, పెద్ద పెద్ద దేశీయ, విదేశీ కంపెనీలు వినియోగ చార్జీలు వసూలు చేస్తాయి.

(ఉదాహరణలు: 1990ల నాటి విద్యుత్ సంస్కరణలు, విద్యుత్ సవరణ బిల్లు 2022, ప్రైవేట్ టెలికాం కంపెనీలను అనుమతించడం, పబ్లిక్ రోడ్డు రవాణాను బలహీనపరచడం / నిర్వీర్యం చేయడం, ప్రైవేట్ బస్సు ఆపరేటర్లను ప్రోత్సహించడం, ఒడిశా, జార్ఖండ్ ఇతర రాష్ట్రాల్లో గనులను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించడం, కార్పొరేటీకరణ, రక్షణ ఉత్పత్తి యూనిట్లు – ఆయుధ కర్మాగారాలు ప్రైవేటీకరణను సులభతరం చేసే 7 కార్పొరేషన్లుగా మార్చబడ్డాయి. పోస్టల్ శాఖను కార్పొరేటీకరించే ప్రయత్నాలు; LIC లో IPO; ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించే ప్రయత్నాలు; సాధారణ బీమా; విద్యలో – ముఖ్యంగా ఉన్నత విద్యలో; ఆరోగ్య సంరక్షణలో; నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ – రైల్వేలు, హైవేలు, చమురు, గ్యాస్ పైప్‌లైన్‌లు, పవర్ ట్రాన్స్‌మిషన్, BSNL టవర్లు, ఆప్టిక్ ఫైబర్‌లు, పోర్టులు, నేషనల్ ల్యాండ్ మానిటైజేషన్ ప్రాజెక్ట్ మొదలైనవి).

ఇతర దేశాల నుండి చౌక దిగుమతులను అనుమతించే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు.

కార్మిక చట్ట సవరణలు – రాజస్థాన్, మధ్యప్రదేశ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, జాతీయ స్థాయిలో లేబర్ కోడ్‌లు, అప్రెంటీస్ (సవరణ) చట్టం.

దివాలా (సవరణ) చట్టం, కోడ్, NPAల పెరుగుదల; కార్పొరేట్ రుణాలను రద్దు చేయడం; బ్యాంకు రుణాల చెల్లింపుకు కత్తిరింపులు; గత తొమ్మిదేళ్లలో SBI తన పెద్ద ఎగవేతదారులకు రూ. 1,45,248 కోట్లకు పైగా చెడ్డ రుణాలను రద్దు చేసింది; అయితే బ్యాంక్ రావలసిన దానిలో 13% మాత్రమే తిరిగి పొందగలిగింది. గత ఎనిమిదేళ్లలో రద్దు చేసిన మొత్తం మొండి బకాయిలు రూ. 10.83 లక్షల కోట్లు, మార్చి 2021 నాటికి రూ. 8.35 లక్షల కోట్ల మొండి బకాయిలకు దీన్ని జోడించి చూస్తే మొత్తం రూ. 19.18 లక్షల కోట్ల మొండి బకాయిలు అవుతున్నాయి. 2000–01, 2012–13 మధ్య ప్రభుత్వ రంగ బ్యాంకులు రద్దు చేసిన రుణాల మొత్తంతో పోల్చితే రికవరీ చేసిన రుణాలు దాదాపు 23.4 శాతం. ఏప్రిల్ 2014, మార్చి 2018 మధ్య, ప్రభుత్వ రంగ బ్యాంకులు రద్దు చేసిన మొత్తం రుణాలు దాదాపు

రూ. 3.17 లక్షల కోట్లు, ఇందులో దాదాపు రూ. 44900 కోట్ల రుణాలు గతంలో రద్దు చేయబడ్డాయి లేదా దాదాపు 14శాతం రికవరీ చేయబడ్డాయి. భారతదేశంలోని వాణిజ్య బ్యాంకులు గత ఐదేళ్లలో రూ. 9.54 లక్షల కోట్ల విలువైన మొండి బకాయిలను రద్దు చేశాయి. వీటిలో రూ. 7 లక్షల కోట్లకు పైగా ప్రభుత్వ రంగ బ్యాంకులు ఇచ్చిన రుణాలు, బ్యాంకులు రద్దు చేసిన రుణాల మొత్తం ఆ కాలంలో రికవర్ చేసిన రుణాల మొత్తాని కంటే రెండింతలు ఎక్కువ; విశ్లేషకుల అంచనా ప్రకారం చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు రుణాల మొత్తం సుమారు రూ. 1.2 లక్షలకోట్లు; సూక్ష్మ లేదా తక్కువ రేటెడ్ యూనిట్లు అధ్వాన్నంగా ఉ ండవచ్చు; కాని భారతీయ కార్పొరేట్లు మొత్తం GDPలో 51% విలువైన అప్పులు తీసుకున్నాయి. భారతీయ కంపెనీల వడ్డీని చెల్లించే సామర్థ్యంలో సమస్య ఉంది; దీనిని వడ్డీ కవరేజ్ నిష్పత్తి ద్వారా కొలుస్తారు; భారతీయ కార్పొరేట్ల కవరేజ్ నిష్పత్తి 3.69. ఇది 18 అభివృద్ధి చెందుతున్న మార్కెట్ దేశాలలో రెండవ అతి తక్కువ. కంపెనీలు తాము తీసుకున్న రుణాలను అనుత్పాదకంగా ఖర్చుపెట్టిన కారణంగా రూ.7.4 లక్షల కోట్ల అప్పులు ప్రమాదంలో పడవచ్చు; రూ. 7.4 లక్షల కోట్లలో రూ. 4 లక్షల కోట్ల విలువైన అప్పు నిజంగా అధిక ప్రమాదంలో ఉంది. ఇవి 8 కంపెనీలకు చెందినవి. కార్పొరేట్ పన్ను తగ్గింపు; పెట్టుబడులను ఆకర్షించే పేరుతో బడా కార్పొరేట్లకు అనేక రాయితీలు; అయినప్పటికీ ఎక్కువ ప్రైవేట్ పెట్టుబడి రాలేదు, ఉపాధి కల్పన జరగ లేదు.

సంక్షేమ వ్యయం, PDS, ఆరోగ్యం, విద్య మొదలైన వాటి ప్రైవేటీకరణ, వాణిజ్యీకరణలో ప్రభుత్వంచే భారీ కోత; ఆరోగ్యంపై ప్రభుత్వ వ్యయం 1990లో GDP లో 1.3% ఉంటే, ఇది 1999లో 0.9%కి తగ్గింది. విద్యపై ప్రభుత్వ వ్యయం కూడా తగ్గిపోతుంది.

కోవిడ్ మహమ్మారిని కూడా మోడీ ప్రభుత్వం స్వదేశీ, విదేశీ బడా కార్పొరేట్లు, గుత్తాధిపత్య కంపెనీల ప్రయోజనాల కోసం, నయా ఉదారవాద విధానాలను ముందుకు తీసుకెళ్లడానికి ఉపయోగించుకుంది. దీని టీకా విధానం వ్యాక్సిన్ ఉత్పత్తి చేసే పెద్ద కంపెనీలకు అనుకూలంగా ఉంది; పేటెంట్ హక్కులను వదులుకోవడానికి, వ్యాక్సిన్‌ను ఉత్పత్తి చేయడానికి, వ్యాక్సిన్ ఉత్పత్తిని పెంచడానికి, ప్రజల ప్రాణాలను రక్షించడానికి ప్రభుత్వ రంగ వ్యాక్సిన్ ఉత్పత్తి కంపెనీలను అనుమతించడానికి నిరాకరించింది.

సెన్సెక్స్ – స్పెక్యులేషన్‌ను ధనవంతులకు అనుకూలంగా తారుమారు చేసి, సంపదను వారికి బదిలీ చేశారు.

నయా ఉదారవాదం నుండి లబ్ది పొందింది బడా బూర్జువా వర్గం. వారిలో కొంత మంది అత్యధికంగా లబ్ది పొందారు. సామ్యవాదం వెనుకపట్టు పట్టడం, సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం ద్వారా ఉత్పన్నమైన ప్రపంచ పరిస్థితిని ఉపయోగించుకుని, వారు నయా ఉదారవాదాన్ని స్వీకరించారు, ప్రభుత్వంపై తమ పట్టు బిగించారు.

ఇప్పుడు వస్తూత్పత్తిలో తక్కువ ప్రమేయం కలిగిన (భారతి, ఇన్ఫోసిస్, హెచ్‌డిఎఫ్‌సి మొదలైనవి) బడాబూర్జువా వర్గంలో ప్రధాన భాగంగా ఉన్నారు. తయారీ రంగంలో ఉన్న బడా బూర్జువాలు సైతం తమ తయారీయేతర కార్యకలాపాలను (ఐటి, టెలికాం సేవలు, రిటైల్ వాణిజ్యం, బీమా మొదలైనవి) విస్తరించారు. 1990లో సాఫ్ట్‌వేర్ పరిశ్రమ ఆదాయం 19 కోట్ల 70లక్షల డాలర్లు; అది 2000లో 800కోట్ల డాలర్లకు పెరిగింది. సాఫ్ట్‌వేర్ పరిశ్రమ సంవత్సరానికి 50% కంటే ఎక్కువ పెరిగింది. 1990లో సాఫ్ట్‌వేర్ పరిశ్రమ ఎగుమతులు 10కోట్ల డాలర్లు, అవి 2000లో 630 కోట్ల డాలర్లకు పెరిగాయి.

విదేశీ బహుళజాతి సంస్థల ఉనికి కూడా మరింత స్పష్టంగా కనిపించింది. అవి కొన్ని రంగాలలో ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. 1991, 2000 మధ్య ప్రభుత్వం విదేశీ కంపెనీల ద్వారా 10000 కంటే ఎక్కువ పెట్టుబడి ప్రతిపాదనలను ఆమోదించింది (వాటిలో ఎన్ని ఆచరణరూపుదాల్చాయి?). వినియోగదారుల విభాగంలో ఎక్కువగా కనిపించే బ్రాండ్లు – హోండా, ఫోర్డ్, శామ్‌సంగ్, నోకియా, పెప్సీ, కోకాకోలా మొదలైనవి అలాంటివి. భారతదేశంపై బహుళజాతి సంస్థల ఆసక్తి ప్రధానంగా మార్కెట్‌పైనే ఉన్నది తప్ప, ప్రపంచ మార్కెట్‌కు ఉత్పత్తి ప్రదేశంగా భారతదేశాన్ని ఉపయోగించుకోవడంపై మాత్రం వాటికి అసక్తి లేదు. విదేశీ పెట్టుబడి భారతదేశంలోకి ప్రవహిస్తుంది కాబట్టి అది మరింత ఫైనాన్స్ స్వభావాన్ని కలిగి ఉంది. అదే సమయంలో భారతీయ సంస్థలు ప్రధానంగా విదేశాలలో కంపెనీల కొనుగోళ్ల ద్వారా మరింత అంతర్జాతీయాకరణ దిశగా ముఖ్యమైన అడుగులు వేస్తున్నాయి. 2008లో టాటా గ్రూప్ జాగ్వార్, ల్యాండ్ రోవర్ అనే రెండు బ్రిటిష్ లగ్జరీ బ్రాండ్ ఆటోమొబైల్ కంపెనీలను కొనుగోలు చేసింది.

భారతీయ, విదేశీ కార్పొరేట్ సంస్థల / గుత్తాధిపత్య సంస్థల ప్రయోజనాల కోసం భారత మార్కెట్‌ను ఏకీకరణ చేశారు.

నయా ఉదారవాదం కింద గుత్తాధిపత్యం పెరుగుతోంది. సంపద కొందరి చేతుల్లోనే కేంద్రీకృతమవుతోంది. సంపద, ఆదాయాల అసమానతలు అసహ్యకరంగా పెరిగాయి.

భారతదేశ అసమానతల నివేదిక 2021 ప్రకారం, భారతదేశంలోని అగ్రశ్రేణి 10 మంది వ్యక్తులు దేశ సంపదలో 57శాతం కలిగి ఉండగా, దిగువ 50శాతం మంది 5.9 శాతం సంపద మాత్రమే కలిగి ఉన్నారు. 1990ల మధ్యకాలం నుండి సేకరించబడిన మొత్తం అదనపు సంపదలో 38 శాతాన్ని అగ్రశ్రేణి 1 శాతం మంది తీసుకున్నారు. ఇది 2020 నుండి వేగవంతమైంది. 2016 – 2020 మధ్య ముఖేష్ అంబానీ నికర విలువ 350శాతం పెరిగింది. అదే కాలంలో గౌతమ్ అదానీ నికర విలువ 750శాతం పెరిగింది.

రాజకీయ నాయకులతో సన్నిహిత పరిచయాలతో అంతర్గత సమాచారం తెలుసుకోగల అవకాశం ఉంది, అటువంటి పరిచయాల ద్వారాను, ధనబలం తోను విధానాలను ప్రభావితం చేయడం పెరిగింది. రిలయన్స్ రేయాన్‌ను దిగుమతి చేసుకుంది, దానికి స్వంత మిల్లులు లేకుండానే పవర్ లూమ్‌ల ద్వారా వస్త్రాన్ని ఉత్పత్తి చేసింది. IPOలతో మధ్యతరగతి నుండి డబ్బును సమీకరించడం ద్వారా రిలయన్స్ పోర్టుఫోలియో పెట్టుబడులను పెంచుకుంది. రిలయన్స్ ఆస్తులు 1980లలో సంవత్సరానికి 60శాతం, అమ్మకాలు 30శాతం, లాభాలు 50% పెరిగాయి. జియోకు అనుకూలంగా ఇటీవల టెలికాం విధానాలు రూపొందించబడ్డాయి. అదానీ ప్రపంచంలోని మూడవ అత్యంత సంపన్న వ్యక్తిగా ఎదిగాడు.

పెద్ద భారతీయ కార్పొరేట్ల ద్వారా పెట్టుబడులకు ఫైనాన్సింగ్ విధానంలో మార్పు: ప్రధాన ప్రాథమిక వనర్లుగా 1950లలో అంతర్గత ఫైనాన్సింగ్ , 1960లలో బ్యాంకులు, 1970లు, 1980లలో ఆర్థిక సంస్థలు ఉన్నాయి. 1990లలో, వారు తమ నిధులలో ఎక్కువ భాగాన్ని షేర్లు లేదా ఈక్విటీల ద్వారా సమీకరించారు. 1990ల నుండి మార్కెట్ శక్తులు వనరుల కేటాయింపును నిర్దేశించాయి; రుణ ఫైనాన్సింగ్ పెరిగింది. ఇటీవలే అదానీ గ్రూప్ తన శక్తికి మించి విపరీతంగా రుణాలు తీసుకుందని నివేదించబడింది, ఇది ఇప్పటికే ఉన్న వాటిలోను, కొత్త వ్యాపారలోకి విస్తరించేందుకు దూకుడుగా పెట్టుబడి పెట్టడానికి ఈ రుణాన్ని ఉపయోగిస్తున్నది. క్రెడిట్ సైట్స్, ఫిచ్ గ్రూప్ యూనిట్ నివేదిక బ్యాంకులతో, మోడీ ప్రభుత్వంతో అదానీ గ్రూపుకున్న బలమైన సంబంధాన్ని హైలైట్ చేసింది. మితిమీరిన రుణ నిధులతో కూడిన వృద్ధి ప్రణాళికలతో ఆ గ్రూపులోని కంపెనీలు రుణవలయంలో చిక్కుకొని డిఫాల్ట్ అయ్యే

పరిస్థితి దాపురించవచ్చు. అదానీ గ్రూపుల అప్పులు - అదానీ ఎంటర్‌ప్రైజెస్ - రూ. 41,600 కోట్లు; అదానీ గ్రీన్ ఎనర్జీ – రూ. 52,800 కోట్లు; అదానీ పోర్ట్స్ & SEZ లు – రూ 47,400 కోట్లు; అదానీ పవర్ – రూ. 58200 కోట్లు; అదానీ టోటల్ గ్యాస్ – రూ. 1,000 కోట్లు; అదానీ ట్రాన్స్‌మిషన్స్ – రూ. 29,900 కోట్లు; మొత్తం రూ. 2,30,900 కోట్లు. రిలయన్స్ తన స్థూల రుణాన్ని రూ. 3.36 లక్షల కోట్లుగా, నికర రుణం రూ. 1.61 లక్షల కోట్లుగా 2020 చివరి నాటికి ప్రకటించింది. దాని నగదు, నగదుకు సమానమైన నిధులు రూ. 30,920 కోట్ల నుండి రూ. 17,397 కోట్లకు పడిపోయాయి. 2015 నుండి కంపెనీ రుణం గణనీయంగా పెరిగింది.

**రాజకీయ, సామాజిక సాంస్కృతిక మార్పులు**

పెట్టుబడిదారీ విధానం ఎల్లప్పుడూ ప్రయత్నించే కేంద్రీకరణ, నయా ఉదారవాద విధానాల రాకతో ఊపందుకుంది. నయా ఉదారవాద విధానాలను దూకుడుగా అనుసరిస్తున్న మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అసమ్మతిని, వ్యతిరేకతను అణిచివేసేందుకు ఫాసిస్ట్ ధోరణులను ప్రదర్శిస్తూ నిరంకుశ చర్యలను ఎక్కువగా ఆశ్రయిస్తోంది. అన్ని ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ పరిపాలన, దాని విధానాలను వ్యతిరేకించే వారిని భయపెట్టడానికి, బెదిరించడానికి, వేధించడానికి ఉపయోగించబడతున్నాయి. సమిష్టి చర్యలు తగ్గించబడ్డాయి. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, మానవ హక్కులపై దాడి జరుగుతోంది. పార్లమెంటరీ నిబంధనలను ఉల్లంఘించారు. ఫెడరలిజాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం జరుగుతోంది.

వర్గ ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి అస్తిత్వ రాజకీయాలు రాజకీయ పార్టీలు, సంస్థలచే ప్రచారం చేయబడతాయి. మీడియాను వ్యాపారీకరించారు, బడా కార్పొరేట్లు దాన్ని స్వాధీనం చేసుకున్నారు, కార్పొరేట్ ప్రయోజనాలకు గొంతుకగా దాన్ని ఉపయోగించుకుంటారు. మతతత్వాన్ని ప్రచారం చేస్తారు. అధికారంలో ఉన్న RSS, BJP యొక్క పెరుగుతున్న ప్రభావంతో, మెజారిటీ హిందూ మతం దేశ అధికార మతంగా చూపబడుతోంది, రాజ్యాంగంలో పొందుపరచబడిన మన దేశం యొక్క లౌకిక లక్షణం విస్మరించబడింది. పెరుగుతున్న నిరుద్యోగం, ధరల పెరుగుదల, ఆరోగ్యం, విద్య వంటి ప్రాథమిక సేవలు అందుబాటులో లేకపోవడం వంటి రోజువారీ సమస్యల నుండి ప్రజల దృష్టిని, అపోహలను ప్రేరేపిస్తూ, మహిళలు, దళితులకు సంబంధించిన ఛాందసవాద, తిరోగమన ఆలోచనలను ప్రోత్సహించడం ద్వారా మళ్లించాలని చూస్తున్నారు. సంస్కృతి, విశ్రాంతి మొదలైనవి సరుకుగా మారాయి.

వినియోగదారీ తత్వాన్ని ప్రోత్సహించారు. సమిష్టికి విరుద్ధంగా, వ్యక్తివాదం, కెరీర్‌వాదం మొదలైనవి ప్రోత్సహించబడతాయి.

నయా ఉదారవాదం న్యాయవ్యవస్థ వైఖరిని కూడా ప్రభావితం చేసింది.

**శ్రామిక వర్గం**

**పెరిగిన అసంఘటితరంగం**

మెజారిటీ కార్మికులు గ్రామాలతో సంబంధాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. ఇది వారి చైతన్యానికి ఒక విచిత్రమైన లక్షణాన్ని ఇస్తుంది. ఈ సంబంధం స్వచ్ఛమైన కార్మికవర్గ చైతన్య అభివృద్ధికి ఆటంకం కలిగిస్తుంది. భూస్వామ్య భావజాలం యొక్క అంశాలను నిలుపుకోవడం; కుల, మత, ప్రాంతీయ ప్రభావాలకు లొంగిపోవడంలో ఇది ప్రతిబింబిస్తుంది.

2000–2010 మధ్య భారత దేశంలో శ్రామిక శక్తి 6 కోట్ల 30 లక్షలు పెరిగింది, వీరిలో 4 కోట్ల 40 లక్షల మంది అసంఘటిత రంగంలో చేరారు, 2 కోట్ల 20 లక్షల మంది సంఘటిత రంగంలో అసంఘటిత కార్మికులుగా మారారు. అయితే సంఘటిత రంగంలోని అసంఘటిత కార్మికుల సంఖ్య వాస్తవానికి 30లక్షలు తగ్గింది.

ఉత్పత్తిలో, ప్రధానంగా వ్యవసాయేతర కార్యకలాపాలలో (నిర్మాణం, సేవలతో సహా) వేతన ఉపాధి గత రెండు దశాబ్దాలలో పెరిగింది. అనుత్పాదక కార్యకలాపాలలో వ్యవస్థీకృత ప్రైవేట్ రంగ ఉపాధిలో పెరుగుదల ఉంది, అయితే ఇందులో కొంత భాగం మాత్రమే అధిక జీతం కలిగిన వైట్ కాలర్ ఉద్యోగులు. అసంఘటిత రంగంలో కూడా, నిర్మాణ రంగాన్ని మినహాయించి, 3కోట్ల 80లక్షలకు పైగా కార్మికులు కార్పొరేటేతర, వ్యవసాయేతర సంస్థలలో పనిచేస్తున్నారు. వారిలో 2కోట్ల 70లక్షల మంది కిరాయి కార్మికులు ఉన్నారు. వేతన ఉపాధి యొక్క అత్యంత ముఖ్యమైన విస్తరణ వ్యవస్థీకృత, అసంఘటిత విభాగాలలో జరిగింది. అయితే, నిర్మాణం సంబంధిత కార్యకలాపాలలో ఇప్పుడు భారతదేశంలోని దాదాపు 11శాతం శ్రామికశక్తి (5కోట్ల మంది కార్మికులు)ని కలిగి ఉంది. ఈ కార్మికవర్గం యొక్క పరిస్థితి, లక్షణాలు భారతదేశంలో పెట్టుబడిదారీ అభివృద్ధి యొక్క చారిత్రక పరిమిత స్వభావాన్ని, అలాగే ప్రపంచీకరణ ప్రభావాలను ప్రతిబింబిస్తాయి.

నేషనల్ కమిషన్ ఫర్ ఎంటర్‌ప్రైజెస్ ఇన్ అనార్గనైజ్డ్ రిపోర్ట్ (2009) ప్రకారం, ఆర్థిక సంస్కరణల తర్వాత వ్యవస్థీకృత రంగంలో జరిగిన ఉపాధి కల్పన చాలావరకు అసంఘటిత స్వభావాన్ని కలిగి ఉంది. 1990ల ప్రారంభంలో ఉత్పాదక రంగంలో ఉపాధి పెరుగుదల ప్రధానంగా శాశ్వత స్వభావం లేనిదని అనేక

అధ్యయనాలు చూపించాయి. 1992-2001 మధ్య కాలంలో అడ్మినిస్ట్రేటివ్ మరియు మేనేజిరియల్ వర్కర్లను మినహాయించి తయారీ రంగంలో కాంట్రాక్ట్, తాత్కాలిక కార్మికుల వాటా రెండింతలు పెరిగింది. 2003-04, 2009-10 మధ్య, నేరుగా ఉపాధి పొందిన కార్మికుల వాటా 5.1శాతం మాత్రమే పెరిగింది. కాంట్రాక్టు కార్మికులు 12.4శాతం వృద్ధి చెందారు. మొత్తం వ్యవస్థీకృత ఉపాధిలో కాంట్రాక్టు కార్మికుల వాటా 1995-96లో 10.5శాతం నుండి 2009-10 నాటికి 25.7శాతానికి పెరిగింది, అదే సమయంలో నేరుగా ఉపాధి పొందుతున్న కార్మికుల వాటా 68.3శాతం నుండి 52.4 శాతానికి తగ్గింది. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ రిజర్వేషన్ల ద్వారా కొంత మేరకు ప్రయోజనం పొందిన SC / ST వర్గాలకు శాశ్వత ఉద్యోగాల పరిధిని తీవ్రంగా తగ్గించింది. విశేషమేమిటంటే, 50 మంది కంటే ఎక్కువ మంది పనిచేసే పెద్ద కంపెనీలలో ఎక్కువ మంది కాంట్రాక్టు కార్మికులను నియమించుకునే విధానం మునుపటితో పోలిస్తే 2000ల చివరి నాటికి అధికమయింది. 2009-10 నాటికి, 5000 కంటే ఎక్కువ మంది కార్మికులు ఉన్న కంపెనీల ద్వారా పనిచేస్తున్న మొత్తం కార్మికులలో దాదాపు సగం మంది కాంట్రాక్ట్ కార్మికులే.

నయా ఉదారవాదం కింద భారతదేశంలో శ్రామికశక్తిలో మహిళల శాతం తగ్గుతుండగా, అనేక ఇతర దేశాలలో ఉన్న ట్రెండ్‌కు విరుద్ధంగా, మహిళలకు వేతనం లేని పని పెరిగింది. నామమాత్రపు వేతనం, అనిశ్చిత పని పరిస్థితులతో ప్రభుత్వ 'సామాజిక కార్యకర్తలు'గా ఉన్న మహిళల సంఖ్య విపరీతంగా పెరిగింది.

'ఆన్‌లైన్ మార్కెటింగ్' ట్రెండ్ ఉనికిలోకి వచ్చి ఇటీవల విస్తరిస్తోంది. ఇన్వెంటరీలను పరిమితం చేయడానికి, డిమాండ్‌కు అనుగుణంగా కార్మికులను నియమించుకోవడానికి సమాచార సాంకేతికత ఉపయోగించబడుతుంది. ప్రస్తుతం 77 లక్షల మంది కార్మికులు గిగ్ వర్కర్లుగా పనిచేస్తున్నారు. 2029-30 నాటికి గిగ్ వర్క్‌ఫోర్స్ 2.35 కోట్లకు విస్తరించే అవకాశం ఉందని నీతి అయోగ్ నివేదిక పేర్కొంది.

కర్మాగారాల స్థానం పరంగా చూస్తే వ్యవస్థీకృత తయారీ రంగం మరింత 'గ్రామీణం'గా మారుతున్నదనేది గుర్తించదగిన ధోరణి. 2011-12లో గ్రామీణ కర్మాగారాలు, పట్టణ ప్రాంతాల పరిశ్రమల కంటే పెద్దవి, అవి ఎక్కువ పెట్టుబడిని, ఉత్పాదకతను కలిగి ఉన్నాయి. ఫ్యాక్టరీ ఉపాధిలో 44శాతం, స్థిర పెట్టుబడిలో 56శాతం, ఫ్యాక్టరీ నికర విలువకు జోడించినది 53శాతం. ఫ్యాక్టరీకి సగటు కార్మికుల సంఖ్య పట్టణ కర్మాగారాలలో (43) కంటే గ్రామీణ ఫ్యాక్టరీకి (56) ఎక్కువగా ఉంది. అయితే గ్రామీణ కర్మాగారాల్లో ప్రతి కార్మికుని వేతనం తక్కువగా ఉంది.

నికర విలువ జోడింపులో, వేతన వాటా గణనీయంగా తక్కువగా ఉంది (పట్టణ ఫ్యాక్టరీలలో 15.41శాతంతో పోలిస్తే గ్రామీణ ఫ్యాక్టరీలలో 8.85 శాతం).

**శ్రమశక్తి పొందిక**

నయా ఉదారవాదం కార్మికవర్గ పొందికను సమూలంగా మార్చివేసింది. ఎటువంటి చట్టబద్ధమైన ప్రయోజనాలు లేని కార్మికుల నిష్పత్తి పెరిగింది, చట్టబద్ధమైన రక్షణ ఉన్న కార్మికుల నిష్పత్తి బాగా తగ్గింది. కార్మికుల వృత్తి, స్థానం, యజమాని- అత్యంత చలనశీలంగా మారిన పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి, అయితే కార్మికుల ఆర్థిక పరిస్థితిలో మార్పుకు మాత్రం తక్కువ అవకాశాలే ఉన్నాయి.

**అనిశ్చిత ఉపాధి**

పెద్ద సంఖ్యలో కాంట్రాక్టు కార్మికులను నియమించడంతో పాటు, యాజమాన్యాలు వారి వేతన బిల్లులను తగ్గించడంతోపాటు యూనియన్‌లను నిరోధించడం, పర్మినెంట్ కార్మికుల బేరసారాల సామర్థ్యాన్ని తగ్గించడం వంటి వివిధ చర్యలను అవలంబిస్తున్నాయి. 'ఆన్ జాబ్ ట్రైనీస్', 'లాంగ్ టర్మ్ ట్రైనీ ఎంప్లాయీస్', 'ఫిక్స్‌డ్ టర్మ్ కాంట్రాక్ట్స్', 'జూనియర్ ఎగ్జిక్యూటివ్స్' మొదలైన వివిధ కేటగిరీలు పర్మినెంటు కార్మికుల చేసే ఉద్యోగాల కోసం నియమించబడుతున్నారు, కాని వారికి శాశ్వత ఉద్యోగుల వేతనంలో కొద్ది భాగాన్ని మాత్రమే చెల్లిస్తున్నారు. ఉదాహరణకు జపనీస్ కంపెనీ అయిన కెన్‌స్టార్ తమిళనాడు యూనిట్‌లో 1080 మంది శిక్షణ పొందుతున్న కార్మికులు ఉంటే, 73 మంది మాత్రమే పర్మినెంట్ కార్మికులు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళంలో రెడ్డి ల్యాబ్స్ విద్యార్థులు కంపెనీలో పనిచేస్తూ, దూర విద్య అభ్యసించడానికి అనుమతించి, తినడానికి మెస్‌ను ప్రారంభించింది.

**దోపిడీని తీవ్రతరం చేసే మార్గాలు**

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం, యాంత్రీకరణ, ఆటోమేషన్, రోబోటైజేషన్, పని గంటలు పెంచడం, వేతనాలు తగ్గించడం మొదలైన వివిధ పద్ధతులను కార్మికుల నుండి ఉత్పాదకతను పెంచడానికి, గరిష్ట మిగులును సేకరించేందుకు యజమానులు అవలంబిస్తున్నారు. ఉత్పాదకతను పెంచడానికి ఫ్రీక్వెంట్ టైమ్ మోషన్ (FTM) స్టడీస్, E- మేనేజ్‌మెంట్, సెల్ఫ్ మేనేజ్‌మెంట్ టీమ్స్ (SMT)లు మొదలైన విభిన్న నిర్వహణ పద్ధతులు ఉపయోగించబడతాయి. కార్మికులను కార్మికులుగా కాకుండా మేనేజ్‌మెంట్‌లో భాగంగా పరిగణిస్తున్నట్లు భ్రమ కలిగించేందుకు కార్మికులను 'అసోసియేట్‌లు', 'బృంద సభ్యులు', 'భాగస్వాములు', 'ఎగ్జిక్యూటివ్‌లు' అని పిలుస్తారు. అశోక్ లేలాండ్ కార్మికులు అవలంబిస్తున్న

ఆల్ టైమ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ATMS) ప్రకారం ఎనిమిది గంటల్లో 480 నిమిషాలు పని చేయాలి. వారు టాయిలెట్‌కి కూడా వెళ్లలేరు. కనీస అవసరమైన అలసట విరామాలు కూడా అనుమతించబడవు. అనేక బహుళజాతి సంస్థలలో, 'టోటల్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్' (TPM) వ్యవస్థ ద్వారా సామాజికంగా అవసరమైన శ్రమ సమయాన్ని, దానికయ్యే వ్యయాన్ని తగ్గిస్తున్నారు. ఫలితంగా ఆధునిక వ్యవస్థీకృత రంగ పరిశ్రమల్లోని కార్మికులు మెరుగైన వేతనాలు మరియు ఇతర ప్రోత్సాహకాలను పొందుతున్నప్పటికీ, మేధో పరమైన, మానసికపరమైన ఒత్తిడిని, వేధింపులను అధికంగా ఎదుర్కొంటున్నారు.

ఒక అధ్యయనం ప్రకారం, 2011-12లో, వ్యవస్థీకృత తయారీ రంగంలోని మొత్తం శ్రామికశక్తిలో 77.5 శాతం మందికి రాతపూర్వక ఒప్పందం లేదు; మరో 2.43 శాతం మంది ఒక సంవత్సరం కంటే తక్కువ కాలానికి మాత్రమే వ్రాతపూర్వక ఒప్పందాన్ని కలిగి ఉన్నారు. మొత్తం కార్మికులలో 17.41 శాతం మంది మాత్రమే మూడేళ్లకు పైగా రాతపూర్వక ఒప్పందాన్ని కలిగి ఉన్నారు. సంఘటిత రంగంలో 70శాతం కంటే ఎక్కువ మంది సాధారణ జీతాలు పొందుతున్న కార్మికులకు వ్రాతపూర్వక ఒప్పందాలు లేవు. మహిళా కార్మికుల పరిస్థితి దారుణంగా ఉంది. 91శాతం మందికి 2011-12లో రాతపూర్వక ఒప్పందం లేదు; కేవలం 6.3 శాతం మంది మాత్రమే మూడేళ్లకు పైగా ఒప్పందాన్ని కలిగి ఉన్నారు. 60 శాతం సాధారణ కార్మికులు, మహిళా కార్మికులు అధ్వాన్న స్థితిలో ఉన్నందున ప్రావిడెంట్ ఫండ్, ఆరోగ్య సంరక్షణ మొదలైన సామాజిక భద్రతా ప్రయోజనాలకు అర్హులు కారు.

**హక్కులను తగ్గించడం**

నయా ఉదారవాద పాలనకు ముందు, కార్మికులు పోరాటాల ద్వారా అలాగే న్యాయపరమైన జోక్యం ద్వారా చట్టబద్ధమైన హక్కులు అమలు చేయించుకోగలిగారు. ఉదాహరణకు, ఉక్కు (దుర్గాపూర్, IISCO, రూర్కెలా, భిలాయ్ స్టీల్ ప్లాంట్ క్యాంటీన్ కార్మికులు మొదలైనవి), పౌర విమానయానం (ఎయిర్ ఇండియా, ఇండియన్ ఎయిర్‌లైన్స్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా), విద్యుత్ (హర్యానా, హిమాచల్ ప్రదేశ్‌లోని రాష్ట్ర విద్యుత్ బోర్డులు)లో వేలాది మంది కాంట్రాక్ట్ కార్మికులు, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ మొదలైనవి), రవాణా మొదలైనవి కాంట్రాక్ట్ లేబర్ (R&A) చట్టాన్ని ఉపయోగించి క్రమబద్ధీకరించబడ్డారు. అయితే, సెయిల్, కోల్ ఇండియా దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌కు ప్రతిస్పందనగా ఎయిరిండియా విషయంలో సుప్రీం కోర్టు

తన తీర్పునే పాక్షికంగా రద్దు చేయడంతో నయా ఉదారవాద యుగంలో పరిస్థితి మారింది.

**వ్యవసాయ ఉపాధి**

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అప్లయిడ్ మ్యాన్‌పవర్ రీసెర్చ్ పేపర్ ప్రకారం, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటిసారిగా, భారతదేశంలో 2004-05 నుండి 2011-12 మధ్య కాలంలో వ్యవసాయంలో ఉపాధి పొందుతున్న వారి సంఖ్య 36కోట్ల 70లక్షలకు పడిపోయింది. నేడు, గ్రామీణ ప్రాంతాల్లోని చాలా మంది కార్మికులను ప్రత్యేకంగా 'వ్యవసాయ కార్మికులు'గా వర్గీకరించలేరు, ఎందుకంటే వారు తమను తాము పోషించుకునేందుకు సంవత్సరంలో 8 నెలలకు పైగా వ్యవసాయేతర పనులను చేయాల్సి ఉంటుంది.

**వలసలు**

కొనసాగుతున్న వ్యవసాయ సంక్షోభం ఫలితంగా పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయేతర పనులలో ఉపాధిని వెతకడానికి ఎక్కువ మంది ప్రజలు వ్యవసాయం నుండి వైదొలిగారు. రైతుల సంఖ్య తగ్గిపోతున్నందున, స్వయం ఉపాధి పొందుతున్న వారి నిష్పత్తి తగ్గింది. పని కోరుకునే వారిలో చాలామంది అసంఘటిత రంగంలోని వివిధ విభాగాలైన నిర్మాణ, రిక్షా పుల్లర్‌లు, రోజువారీ కూలీ కార్మికులు, వీధి వ్యాపారులు మొదలైన విధంగా ఉపాధి పొందుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణ ప్రాంతాలకు, రాష్ట్రాలలో, రాష్ట్రాల మధ్య భారీ వలసలు; పెద్ద సంఖ్యలో కాలానుగుణంగా వలసపోతారు. ఉదాహరణకు ఇటుక బట్టీ కార్మికులు మొదలైనవవారు; పని వెతుకులాటలో సమీపంలోని పట్టణాలు, నగరాలకు ప్రతిరోజూ ప్రయాణించే చాలామంది – నిర్మాణ, రోజువారీ కూలీ కార్మికులు; మహిళల జీతం లేని పని, గృహ ఆధారిత పని, కుటుంబాలను నిలబెట్టడానికి అనుత్పాదక కార్యకలాపాల కోసం తమ శ్రమను విక్రయించడం.

2001లో, గ్రామీణ బీహార్‌లోని 5 కుటుంబాలలో 3 కుటుంబాలు వలసదారులగా గ్రామం వెలుపల పనిచేస్తున్నారు. కార్మికులను తగ్గించే సాంకేతికతలను అవలంబించడంతో కర్మాగారాలు మూసివేయడం లేదా కార్మికులను తొలగించడంతో, ఈ గ్రామస్థులు, పట్టణవాసులు హాకర్లు, విక్రేతలు, నిర్మాణ కార్మికులు, ప్లంబర్లు, సెక్యూరిటీ గార్డులుగా ఉపాధి పొందుతున్నారు. ఈ వలసదారులలో అత్యధికులు పురుషులు.

సాధారణంగా గ్రామీణ వలస కార్మికుల మూలం అత్యంత ముఖ్యమైన రాష్ట్రాలు, ప్రాంతాలు తూర్పు UP, బీహార్, జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఈశాన్య భారత రాష్ట్రాలు. 1980ల వరకు పశ్చిమ బెంగాల్ వలసదారులకు ప్రధాన గమ్యస్థానంగా ఉండేది. అదే ప్రాంతాల నుండి పంజాబ్, హర్యానా, వాయువ్య పశ్చిమ భారతదేశపు వ్యవసాయ ప్రాంతాలకు వలసలు, ముఖ్యంగా పంజాబ్ హర్యానా బెల్ట్‌లో వరి సాగు విస్తరించిన తర్వాత అభివృద్ధి చెందడం 1990ల వరకు ప్రధాన భౌగోళిక ధోరణి. ఇటీవలి సంవత్సరాలలో ఈ రాష్ట్రాల నుండి కేరళ, తమిళనాడు, కర్నాటక, పూర్వపు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానాలుగా ప్రధాన వలస ప్రవాహాలు దక్షిణం వైపు మళ్లాయి.

కరోనా మహమ్మారి సమయంలో మనం చూసిన ధోరణి మన దేశంలో అభివృద్ధి చెందిన పశ్చిమ, దక్షిణ ప్రాంతాల వాస్తవాన్ని నిర్ధారిస్తుంది; వలస గణాంకాలు కూడా ఈ ధోరణిని సూచిస్తున్నాయి; ఇది అసమాన అభివృద్ధి యొక్క ఫలితం. లాభాలను ఆర్జించే ప్రాంతాలు, మార్కెట్లు, ముడి పదార్థాలు లేదా రవాణా మార్గాలకు దగ్గరగా ఉన్న ప్రాంతాలలో మాత్రమే ప్రైవేటు రంగం పెట్టుబడి పెడుతుంది. మొత్తం దేశం యొక్క సంపూర్ణ, సమతుల్య ప్రాంతీయ అభివృద్ధిని సాధించడానికి ప్రభుత్వ రంగం స్థాపించబడింది.

### గృహ ఆధారిత పని/స్వయం ఉపాధి

నయా ఉదారవాద పాలనలో బహుళజాతి సంస్థలు కూడా తమ పనిని గృహ ఆధారిత కార్మికులకు అవుట్‌సోర్సింగ్ చేయడంతో గృహ ఆధారిత పని పెరిగినట్లు కనుగొనబడింది... స్వయం ఉపాధి అనేది నయా ఉదారవాద పాలన యొక్క ఉత్పత్తి కానప్పటికీ, దానిలో స్వయం ఉపాధి పొందే వారి సంఖ్య కూడా పెరిగింది. స్వయం ఉపాధి ఇష్టపడి ఎంపిక చేసుకున్న దాని కంటే ఇబ్బందుల నుండి తీసుకోబడిందే ఎక్కువ. స్త్రీలు స్వయం ఉపాధి పొందిన కార్మికులలో చాలా పెద్ద విభాగంగా ఉన్నారు, తరచుగా జీతం లేని పనిలో నిమగ్నమై ఉన్నారు.

### జీతాలు, జీవనోపాధిపై ప్రభావం

భారతదేశ వ్యవస్థీకృత కర్మాగార రంగంలో ఒక కార్మికుని రోజువారీ నిజ సగటు వేతనం గత రెండు దశాబ్దాలుగా (1989-90 - 2011-12) పెరగలేదు. వాస్తవానికి ఇది 1992 ప్రారంభంలో ఉన్న స్థాయిల కంటే తక్కువగా ఉంది.

వేతన మాంద్యం, ఉపాధి సక్రమంగా లేకపోవడం, అటువంటి ఉపాధి

కోసం తరచుగా స్థలాలను మార్చాల్సిన రావడం, ప్రభుత్వం అందించే సామాజిక సేవలలో కోతలు / పరిమితులు కార్మికవర్గ కుటుంబాలను కొనసాగించడం కష్టతరం చేశాయి. తక్కువ వేతన ఆదాయాలు, ఖర్చుల పెరుగుదల, శ్రామిక కుటుంబాల సభ్యులు, స్త్రీలు చెల్లించని పనితో సహా వివిధ మార్గాల ద్వారా అదనపు ఆదాయాలను సంపాదించడం తప్పనిసరి చేసింది. ఈ విధంగా, ఉత్పత్తిలో వేతన ఉపాధికి వెలుపల ఉన్న అన్ని రకాల ఉపాధి, జీవనోపాధి, సామాజిక సేవల సమస్యలు కార్మికవర్గానికి సంబంధించినవిగా మారాయి.

## నిరుద్యోగం

భారతదేశంలో నిరుద్యోగం రేటు 2001లో 6.8 శాతం, ఒక దశాబ్దం తర్వాత 9.6 శాతానికి చేరుకుంది. ఇప్పుడు. కోవిడ్ మహమ్మారికి ముందు కూడా నిరుద్యోగిత రేటు 45 సంవత్సరాలలో అత్యధికం.

ఉద్యోగాల్లో ఉన్న మొత్తం భారతీయుల సంఖ్య 2013లో 44 కోట్ల నుంచి 2016లో 41 కోట్లకు, 2017లో 40 కోట్లకు, 2021లో 38 కోట్లకు తగ్గిపోయింది. రైల్వే, రక్షణ, విద్య, ఆరోగ్యం మొదలైన ప్రభుత్వ శాఖల్లో లక్షల ఉద్యోగాలు రద్దు చేయబడ్డాయి. ఖర్చు తగ్గించేందుకు లక్షలాది ఖాళీలను భర్తీ చేయడం లేదు

## మధ్యతరగతి ఉద్యోగులు

నయా ఉదారవాద విధానాలలో జీతాలపై వ్యయాన్ని తగ్గించడానికి ఉద్యోగుల సంఖ్యను భారీగా తగ్గించడం (ప్రభుత్వ శాఖలలో పోస్టుల రద్దు, లక్షలాది ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడం; VRS, ఔట్ సోర్సింగ్ మొదలైనవి). ఇది బ్యాంకులు, బీమా, టెలికాం, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, రైల్వేలు మొదలైన అనేక రంగాలలో ప్రస్తుతం ఉన్న ఉద్యోగులపై పనిభారం భారీగా పెరగడానికి దారితీసింది. యూనియన్ హక్కులు లేని 'అధికారులు'/ 'ఎగ్జిక్యూటివ్' వర్గం సంఖ్య పెరిగింది, ఎక్కువ గంటలు పని చేయవలసి వస్తున్నది. నేడు కొన్ని ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో, BSNLలో అధికారులు, క్లర్క్‌ల నిష్పత్తి 3:1కి పెరిగింది. – నామకరణంలో మార్పు – 'సేల్స్‌పర్సన్' స్థానంలో 'సేల్స్ ఎగ్జిక్యూటివ్'. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఉద్యోగాల అవుట్‌సోర్సింగ్ – ఉదా. SBI రుణాల ప్రాసెసింగ్‌ను రిలయన్స్ ఫైనాన్స్‌కి అవుట్‌సోర్స్ చేయడానికి నిర్ణయం తీసుకుంది, తుది మంజూరును మాత్రమే తన ఆధీనంలో ఉంచుకుంది; శాశ్వత ఉపాధిని తగ్గించడానికి; SBI కొన్ని ప్రైవేట్ బ్యాంకుల మాదిరి అనుబంధ సంస్థలను ప్రారంభించేందుకు నిర్ణయించింది. మెరుగైన వేతనాలు,

పని పరిస్థితులు ఉన్నప్పటికీ, గృహ ఖర్చులు, ప్రైవేట్ ఆరోగ్యం, విద్య, ఈ వర్గాలకు కూడా అందుబాటులో లేకుండా పోతున్నాయి. వారి పిల్లలకు ఉద్యోగాలు, విద్యుత్, రవాణా వంటి పౌర సౌకర్యాల లభ్యత తీవ్రమైన కారణాలతో పట్టణ ప్రాంతాల్లో మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితులకు నయా ఉదారవాద విధానాలకు ఉన్న సంబంధాన్ని వివరించి ఈ విధానాలతో పోరాడేలా వారిని ఒప్పించడం సవాలే.

IT ఉద్యోగుల సంఖ్య పెరుగుదల : 2000 సంవత్సరంలో భారతదేశంలో 340000 మంది సాఫ్ట్‌వేర్ నిపుణులు ఉన్నారు, ప్రతి సంవత్సరం కళాశాలల నుండి 50000 మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు బయటకు వస్తున్నారు. వారిలో 20 శాతం మహిళలు; 2004 నాటికి సాఫ్ట్‌వేర్ పరిశ్రమ 600000 మందికి ఉపాధి కల్పించింది, 1300 కోట్ల డాలర్లు ఎగుమతి చేసింది.

2002లో, కాల్ సెంటర్లు 110000 మందిని నియమించాయి, 71శాతం వృద్ధి చెందాయి; 2008లో ఈ రంగంలో 20 లక్షల మంది 2500కోట్ల డాలర్లు (GDP లో 3 శాతం) విలువైన పనిచేశారు; ఈ కాల్ సెంటర్ల పనికి ఒక ఉదాహరణ: US, కెనడాలోని క్యాథలిక్ పూజారులు ప్రార్థన అభ్యర్థనలను ఇక్కడికి పంపుతున్నారు. దీనికి కారణం ఒక్కో ప్రార్థనకు ఇండియాలో రు.40 అయితే, అదే అమెరికా, కెనడాల్లో దానికి ఐదు రెట్లు ఎక్కువ అవుతుంది.

ప్రైవేట్ కార్పొరేట్ సెక్టార్‌లో ఉన్నత స్థాయి విద్యను కలిగి ఉన్న వైట్ కాలర్ ఉద్యోగుల జీతాలలో పెరుగుతున్న ధోరణి ఉన్నప్పటికీ, వేతన వాటాను కుదించడం వల్ల లాభాలు, ఇతర మిగులు ఆదాయాలకు అనుకూలంగా ఆదాయాలు తీవ్రంగా పునఃపంపిణీ చేయబడుతున్నాయి. ప్రపంచవ్యాప్త చలనశీలత కలిగిన అంతర్జాతీయ శ్రామికశక్తిలో భాగమైన మధ్యతరగతి వర్గం సుసంపన్నత కూడా నయా ఉదారవాదం వేళ్లూనుకోవడానికి దోహదపడింది. ఎందుకంటే ఈ సామాజిక సమూహం ఎల్లప్పుడూ మీడియాలో, విద్యావేత్తలలో, బ్యూరోక్రసీ మొదలైన వాటిలో బలమైన ఉనికిని కలిగి ఉంది. వేర్వేరు కార్మికులు, ఉద్యోగులకు మధ్య వేతన వ్యత్యాసాలు ఎంతగా ఉన్నప్పటికీ, తక్కువ వేతనం వచ్చేవారు, ఎక్కువ వేతనం వచ్చే వారు అన్నదానితో నిమిత్తం లేకుండా అంతా సామర్థ్యాన్ని పెంచుకోవాలన్న, ఉత్పాదకతను అధికం చేయాలన్న పెట్టుబడి దౌష్ట్యానికి సమానంగానే గురవుతున్నారు.

రిఫ్రిజిరేటర్‌లు, వాషింగ్ మెషీన్‌లు, టీవీలు, కార్లు, కంప్యూటర్‌లు మొదలైన శాశ్వత వినియోగ వస్తువులు అందుబాటులో ఉన్న కారణంగా మొదట్లో మధ్యతరగతిలోని ప్రధాన విభాగం సంతోషంగా ఉంది; కాలం గడిచేకొద్దీ వీరిలో

నయా ఉదారవాదం పట్ల భ్రమలు క్రమంగా తొలగిపోతున్నాయి. ప్రైవేట్ విద్య, వైద్యం ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడం, సురక్షితమైన, శాశ్వత ఉద్యోగాలు తగ్గిపోతున్నాయి, వీటి మూలంగా వారు అధిక రుణాల బారిన పడి వారి ఆర్థిక స్థాయి పడిపోతున్నది. ఆరోగ్యం, న్యాయవాద వృత్తులు మొదలైన వాటిలో పెద్ద కార్పొరేట్ల ప్రాబల్యం కారణంగా, వైద్యులు, న్యాయవాదులు తమ వృత్తులను స్వతంత్రంగా ఆచరించలేకపోతున్నారు. పెద్ద సంఖ్యలో కార్పొరేట్ ఆసుపత్రులు లేదా న్యాయ సంస్థలలో ఉద్యోగులుగా మారుతున్నారు. IT సెక్టార్‌లో – ఇతర రంగాలలోని ఉద్యోగులతో పోల్చితే ఒక చిన్న విభాగం మాత్రమే మెరుగైన వేతనం పొందుతుంది, కానీ USA, UK మొదలైన వాటిలోని ఉద్యోగులతో పోలిస్తే, అధిక వివక్ష తక్కువ వేతనం. ITeS ఉద్యోగుల యొక్క విస్తారమైన విభాగం – డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కాల్ సెంటర్ కార్మికులు మొదలైన వారు తక్కువ వేతనం, అధిక దోపిడీకి గురవుతున్నారు.

**నివాస ప్రాంతాలు**

నివాస ప్రాంతాలు, పట్టణ, గ్రామీణ ప్రాంతాలు, నయా ఉదారవాదం కింద ఆదిమ సంచయన ప్రాంతాలుగా మారాయి.

నయా ఉదారవాదంలో పట్టణ ప్రాంతాలకు వలసలు పెరిగాయి. పట్టణీకరణ పెరిగింది. పట్టణ జనాభా 2001లో 28.53 శాతం నుండి 2021లో 35.4 శాతానికి పెరిగింది. నగరాలు, పట్టణాల్లోని నివాస ప్రాంతాలు బడా కార్పొరేట్లకు అప్పగించబడుతున్నాయి. అవి సరుకుగా, వాణిజ్యీకరించబడుతున్నాయి. అసంఘటిత రంగ కార్మికులు, దళితులు, ఇతర సామాజికంగా అణగారిన వర్గాలు నివసించే పట్టణ మురికివాడలు భూ మాఫియాలచే నియంత్రించబడతాయి.

అందువలన, నివాస ప్రాంతాలలో నివసించే అసంఘటిత రంగ కార్మికులను సంఘటితం చేయడం (వారిలో అత్యధికులు సామాజికంగా అణచి వేయబడిన వర్గాలకు చెందిన వారు) ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి ప్రాముఖ్యత కలిగిని పని.

విద్య, ఆరోగ్యం, విద్యుత్తు, తాగునీరు, పారిశుధ్యం మొదలైన సేవలతో పాటు వినోదం వంటి విశ్రాంతి స్థలాలు (పార్కులు, కమ్యూనిటీ హాళ్లు, స్టేడియంలు, ఆట స్థలాలు, క్రీడలు, బీచ్‌లు మొదలైనవి) వంటి ప్రజా సేవలు ప్రైవేటీకరించ బడుతున్నాయి.

నివాస ప్రాంతాలను ఆర్ఎస్ఎస్ తన తీవ్ర మత ప్రచారానికి స్థలాలుగా ఉపయోగించుకుంటుంది. ఇది గృహ ఆధారిత వ్యవహారాలు, పండుగలను బహిరంగ

కార్యక్రమాలు, దృశ్యాలుగా మారుస్తూ స్థానిక ప్రజలను సమీకరిస్తుంది. దేవుడు, మతం, పండుగలు మొదలైనవన్నీ సరుకుగా వాణిజ్యీకరించబడుతున్నాయి. మతపరమైన కుతంత్రాలను ఎదుర్కోవడానికి ప్రజలలో శాస్త్రీయ ఆలోచనను వ్యాప్తి చేయడానికి, నివాస ప్రాంతాలలో మన పార్టీ, ప్రజా సంఘాల జోక్యం పెరగాలి.

**సాధారణ ప్రభావం**

మొత్తం మీద, మన దేశంలో నయా ఉదారవాదం ప్రభావం అనేక అంశాలలో కనిపిస్తున్నది. కార్మికులు వివిధ తరగతులుగా విభజించబడ్డారు, వారి పని పరిస్థితులలో భారీ వ్యత్యాసాలున్నాయి. ఉద్యోగ భద్రత, ఆదాయ భద్రత, సామాజిక భద్రత లేని కొత్త తరహా ఉద్యోగాల కల్పనతో అనిశ్చితి పెరిగింది. 'స్కీం వర్కర్ల' సంఖ్య విపరీతంగా పెరిగింది, వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న వీరు కార్మికులుగా గుర్తించబడరు, వారిలో అత్యధికులు మహిళలే. యజమాని ఉద్యోగి సంబంధాలు పైకి కనిపించని పనులు పెరిగాయి, దీనితో శాశ్వత ఉపాధి భారీగా తగ్గిపోయింది. అసంఘటిత రంగంలో పని విస్తరించింది. గిగ్ వర్క్, ఇంటివద్దనుండే పనిచేయడం అధికమయింది. ఉద్యోగాలు కోల్పోవడంతో చాలా మందికి నిజ ఆదాయాలు తగ్గుతున్నాయి. కార్మికులలో చాలా మంది ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలు చేయకతప్పడం లేదు. కొద్దిమంది ఉన్నత విద్యావంతులు, అర్హతలున్న వారు, ఉన్నత వర్గాలు ఉద్యోగ భద్రత గురించి పట్టించుకోరు. కెరీర్ పురోగతి కోసం ఉద్యోగాలను మార్చడానికి అవకాశాలను చూసుకుంటారు.

ఒక చిన్న సెక్షన్ ప్రజలు - ఇంగ్లీషు విద్యావంతులు, ఉన్నత స్థాయిలో ఉన్న అగ్రవర్ణాల వారు ఉదారవాద విధానాల వల్ల లాభపడ్డారు.

**కార్మిక సంఘాలపై ప్రభావం**

**కార్మికవర్గాన్ని సంఘటితం చేయడంలో ఇబ్బందులు**

యూనియన్ పెట్టుకోవడంలో ఇబ్బందులు : ట్రేడ్ యూనియన్‌లను నమోదు చేయడంలో, కార్మిక చట్టాల అమలు యంత్రాంగాన్ని ప్రభుత్వం అసమర్థమైన దానిగా తయారు చేసింది. సంఘటిత రంగంలోని కార్మికులలో మూడింట ఒక వంతు మందికి మాత్రమే వారి పనిప్రదేశంలో యూనియన్ అందుబాటులో ఉంది. 2004-05లో, మొత్తం కార్మికులలో 36.2 శాతం మందికి వారి పని ప్రదేశంలో ఉన్న యూనియన్ గురించి తెలుసు. ఇది 2011-12 నాటికి 31.5 శాతానికి పడిపోయింది. రెగ్యులర్ కార్మికులలో సైతం 2011-12లో కేవలం 34.5 శాతం మందికి మాత్రమే వారి పనిప్రదేశంలో యూనియన్ ఉంది. వారి పని ప్రదేశంలో యూనియన్ ఉనికిని గురించి

తెలిసిన వారిలో కూడా, 2004–05లో కేవలం 76 శాతం మంది మాత్రమే ఏదో ఒక ట్రేడ్ యూనియన్‌లో సభ్యులుగా ఉన్నారు. ఇది 2011–12లో 66.3 శాతానికి తగ్గింది, లెఫ్ట్ ట్రేడ్ యూనియన్ల నాయకత్వంలోని కొన్ని విభాగాలు కూడా నయా ఉదారవాద పాలన యొక్క ప్రయోజనకరమైన ప్రభావాన్ని విశ్వసిస్తున్నట్లు కనిపించాయి. దీని ఫలితంగా చొరవ తగ్గింది, నిష్క్రియాపరత్వం, కొన్ని సందర్భాల్లో పరిశ్రమ స్థాయిలో సకాలంలో జోక్యం చేసుకోవడంలో వైఫల్యం ఏర్పడింది. పార్టీ, దాని నేతృత్వంలోని ట్రేడ్ యూనియన్లు జోక్యం చేసుకుని కార్మిక వర్గాన్ని కార్మిక వర్గ చైతన్యం వైపు మళ్ళించి సమర్థవంతమైన పోరాటాలకు సైద్ధాంతికంగా సిద్ధం చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలి.

నేటికీ మన దేశంలోని కార్మికులలోని పెద్దభాగంపై భూస్వామ్య చైతన్యం ప్రభావం కొనసాగుతోందనే వాస్తవంతో పాటు కార్మికవర్గం యొక్క మారుతున్న స్వభావం కూడా వారి వర్గ చైతన్యంపై ప్రభావం చూపుతున్నది. ఇది వారిని సంఘటిత పరచడంలో ఇబ్బందులను సృష్టిస్తుంది.

మనుగడ కోసం ఎక్కువ గంటలు పని చేసే, పలు ఉద్యోగాలు చేసే కార్మికులకు సమావేశాలకు తక్కువ సమయం దొరకడం వల్ల వారిని సంఘటితం చేయడం కూడా కష్టతరంగా మారింది. వారితో పోలిస్తే ఎక్కువ ఖాళీ సమయం ఉన్న కార్మికులలో ఆ సమయాన్ని గడిపే ప్రాధాన్యతలలో మార్పు ఉంది (పెరిగిన మతతత్వం, మూఢనమ్మకాల వ్యాప్తి, సంఘటిత బలంపై, సామూహిక చర్యలపై విశ్వాసం బలహీనపడటం). కార్మికులు ఐక్య పోరాటాల ద్వారా ప్రయోజనాలను సాధించడం కష్టతరంగా మారింది.

శ్రామికవర్గం యొక్క పరిస్థితులు ఆ తరగతిలో అనేక మితవాద సైద్ధాంతిక, సాంస్కృతిక ధోరణుల పెరుగుదలకు సారవంతమైన భూమిని అందిస్తున్నాయి. ఇప్పటికే అలాంటి భావజాలానికి లోనైన వారిలో వాటిని మరింత బలోపేతం చేస్తున్నాయి. కార్పొరేట్ నియంత్రిత దృశ్య మాధ్యమం అటువంటి మితవాద భావజాలాలను సాంస్కృతిక పద్ధతులను ప్రోత్సహిస్తున్నది, శ్రామిక వర్గంలోని పెద్దభాగాన్ని ప్రభావితం చేయగలిగింది. వ్యక్తిగత విజయాలను కీర్తించడం, సమిష్టి ప్రయత్నాలను, విజయాలను ప్రత్యేకించి ట్రేడ్ యూనియన్‌లను అపహాస్యం చేయడానికి మీడియా ప్రయత్నిస్తున్నది. మెరుగైన వేతనంతో కూడిన సంఘటిత రంగ ఉద్యోగుల విభాగాలలో ఖాళీ సమయాన్ని గడిపే పద్ధతుల్లో, వినియోగ ధోరణుల్లో మార్పు వచ్చింది. కులం, మతం, ప్రాంతం వంటి అస్తిత్వ ఆధారిత సంస్థల ప్రభావం కూడా పెరిగింది. ఆర్థిక రంగ ఉద్యోగులు లాంటి మధ్యతరగతి ఉద్యోగుల విభాగాలు

సమ్మెలలో పాల్గొంటారు, కానీ నయా ఉదారవాద విధానాల యొక్క మొత్తం ప్రభావాన్ని అర్థం చేసుకోవడానికి మాత్రం పెద్దగా ఆసక్తి చూపడం లేదు.

**గ్రామీణ వర్గాల స్వభావంలో మార్పు - రైతాంగం**

నయా ఉదారవాదం కింద వ్యవసాయంలో ప్రభుత్వ పెట్టుబడులు భారీగా తగ్గాయి. మన దేశం యొక్క స్వావలంబన లక్ష్యంగా వ్యవసాయ పరిశోధన, విస్తరణ సేవలు, చౌక రుణాలు, ఇన్‌పుట్‌లు, ధాన్యం సేకరణ, మద్దతు ధర, ప్రాసెసింగ్, మార్కెటింగ్‌ను అందించడం నుండి ప్రభుత్వం వైదొలిగింది. గ్రామీణాభివృద్ధి, ప్రత్యేక కార్యక్రమాలు, నీటిపారుదల, వరద నియంత్రణ, గ్రామీణ పరిశ్రమలు, ఇంధనం, రవాణా మొదలైన వాటిలో ప్రభుత్వ పెట్టుబడులు కూడా క్రమంగా క్షీణించాయి.

ఈ రంగాలన్నింటిని హస్తగతం చేసుకునేందుకు ప్రైవేటు రంగాన్ని అనుమతించింది. రాజస్థాన్‌లోని వ్యవసాయ గేట్లు ఇప్పటికే మోన్‌శాంటో, డ్యూపాంట్, బేయర్, పెప్సికో, కార్గిల్, SAB మిల్లర్, లుపిన్‌లతో పాటు కొన్ని భారతీయ కంపెనీలు ప్రవేశించాయి. రాజస్థాన్, గుజరాత్‌లో మోన్‌శాంటో వరుసగా ప్రాజెక్ట్ గోల్డెన్ కిరణాలు, ప్రాజెక్ట్ సన్‌షైన్ అని పిలువబడే రెండు ప్రధాన మొక్కజొన్న ప్రాజెక్టులను కలిగి ఉన్నది, ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వాలు ఆ కంపెనీ నుండి హైబ్రీడ్ విత్తనాలను కొనుగోలు చేసి రైతులకు పంపిణీ చేస్తాయి, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ఈ ఖర్చు భరిస్తుంది. సాగు ఖర్చు పెరిగింది. విద్యుత్ ప్రైవేటీకరణ విద్యుత్ ఛార్జీల పెరుగుదలకు దారితీసింది. చమురు ధరలపై నియంత్రణ సడలింపు ఫలితంగా డీజిల్ ధర పెరిగింది. ఎరువుల ధరలపై నియంత్రణలు ఎత్తివేయబడ్డాయి. విత్తనాలు, పురుగు మందులు, ఇతర ఇన్‌పుట్‌ల ధర పెరగడం, విస్తరణ సేవలను అందించకుండా ప్రభుత్వం ఉపసంహరించుకోవడం వల్ల సాగు ఖర్చు పెరిగింది.

WTO పాలనలో వాణిజ్య సరళీకరణ, వ్యవసాయ దిగుమతులపై పరిమాణాత్మక పరిమితులను తొలగించడం వలన, మన దేశంలోని రైతులు పండించిన ఆహార వస్తువులు, వాణిజ్య పంటలు అస్థిరమైన ప్రపంచ మార్కెట్ ధరల ప్రభావానికి గురయ్యాయి.

ప్రపంచ మార్కెట్‌లో ధరల హెచ్చుతగ్గులకు కూడా వారు బలయ్యారు. ఆహార ధాన్యాలు, ఉద్యాన పంటలు, పాల ఉత్పత్తులు, చేపల పెంపకం మొదలైన వాటిని ఉత్పత్తి అధికంగా ఉన్న దేశాల నుండి దిగుమతులను గుమ్మరించే ముప్పును రైతులు ఎదుర్కొంటున్నారు. భారతదేశం – EU ఎఫ్‌టిఏ (స్వేచ్ఛావ్యాపార ఒప్పందం) 90 శాతం వ్యవసాయ ఉత్పత్తులపై భారతీయ సుంకాలను సున్నా లేదా దాదాపు

సున్నా స్థాయికి తగ్గించాలని భావిస్తోంది, చౌకైన పాల ఉత్పత్తులు భారతీయ మార్కెట్‌లను వరదలా ముంచెత్తుతున్నాయి. 9 కోట్లకు పైగా రైతులు వ్యవసాయం ద్వారా వారి కొద్దిపాటి ఆదాయాన్ని పూరించడం కోసం ఈ రంగం మీద ఆధారపడి ఉన్నారని అంచనా వేయబడింది. పరిమాణాత్మక పరిమితులను తొలగించడం వలన చౌక దిగుమతులు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి, పామాయిల్ వంటి చౌకైన ప్రత్యామ్నాయాలు కూడా కొబ్బరి, వేరుశెనగ, ఇతర నూనె గింజల ధరల పతనానికి దారితీస్తున్నాయి. వ్యవసాయ వస్తువుల స్పెక్యులేషన్ వ్యాపారం, విపరీతమైన మార్కెట్ స్పెక్యులేషన్ కూడా ఆహార ధాన్యాల ధరలు పెరగడానికి దారితీసింది.

ఆర్థిక సరళీకరణ సామాజిక, అభివృద్ధి బ్యాంకింగ్ విధానాన్ని వెనక్కి తిప్పింది, తద్వారా గ్రామీణ పేదల ఆర్థిక ఇబ్బందులు, బాధలు పెరగడానికి కారణమయింది. ఇది రైతులకు సంస్థాగత రుణాల లభ్యతను తగ్గించింది, రైతులను వడ్డీ వ్యాపారుల దయాదాక్షిణ్యాలకు వదిలేసింది. ఈ విధానాల ఫలితంగా 48.6 శాతానికి పైగా రుణభారం పెరిగింది. చిన్న, సన్నకారు రైతాంగం ఆధారపడిన అనధికారిక రుణాలకు సరైన లెక్కలు లేనందున ఇది వాస్తవ పరిస్థితిని ప్రతిబింబించడం లేదు.

వ్యవసాయంలో మొత్తం విధానపరమైన చట్రాలు, చట్టాలు కూడా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు, గుత్తాధిపత్య సంస్థల ప్రయోజనాలకు లోబడి తయారు చేయబడుతున్నాయి.

పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ ఫర్ ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్ (పిపిపి-ఐఎడి) కార్యక్రమం వ్యవసాయ భూమిని వాణిజ్య వ్యవసాయానికి అప్పగించడానికి ఉద్దేశించబడింది, ఇప్పటికే 12 లక్షల ఎకరాల భూమి కోసం కంపెనీలు ప్రతిపాదనలు చేశాయి. ఈ పథకం కింద తాము ఎంచుకున్న పంటలను రైతుల భూముల్లో పండించడానికి పూర్తి స్వేచ్ఛ కలిగిన కంపెనీలకు సబ్సిడీ ఇవ్వడానికి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన నిధులు వినియోగించబడతాయి.

వ్యవసాయంలో USAతో వ్యూహాత్మక సహకారం పేరుతో, UPA ప్రభుత్వం వ్యవసాయంలో భారతదేశం-అమెరికా నాలెడ్జ్ ఇనిషియేటివ్ (KIA)ను ప్రారంభించింది. విత్తనం, ఆహారం, రిటైల్-వాణిజ్యంలో గుత్తాధిపత్యం కలిగిన అమెరికా సంస్థలు మోన్‌శాంటో, ఆర్చర్-డేనియల్స్-మిడ్‌ల్యాండ్, వాల్-మార్ట్‌లకు KIA బోర్డులో ప్రాతినిధ్యం ఇవ్వబడింది. దీనికి తోడు KIA బోర్డులో పూర్వపు ఇంపీరియల్ టుబాకో కంపెనీ (ఐటిసి), FICCI మరియు CII ప్రాతినిధ్యం కలిగి ఉన్నాయి. ఇవి వ్యవసాయ వాణిజ్య సంస్థల ప్రయోజనాలు కోసం పనిచేసేవి. అయితే

దేశంలో వ్యవసాయవిధానం, పరిశోధనల దిశను నిర్దేశిస్తున్న ఈ బోర్డు నుండి రైతు ప్రతినిధులను పూర్తిగా మినహాయించారు.

సరిపిడినంత పెట్టుబడి కల్పన జరగకపోవడం సాంకేతికత బదిలీ వేగాన్ని తగ్గిస్తుంది. నీటిపారుదల మౌలికసదుపాయాల, వ్యవసాయ మౌలిక సదుపాయాల కల్పనను కూడ తగ్గిస్తుంది. ఉత్పత్తిని పెంచే వ్యవసాయ పద్ధతులను అనుసరించకుండా చేస్తుంది.

కార్పొరేట్ వ్యవసాయానికి ప్రయోజనం చేకూర్చే విధంగా రూపొందించిన సాంకేతికతలను ప్రోత్సహించడం ద్వారా రైతు వ్యవసాయాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. మూడు వ్యవసాయ చట్టాలు వ్యవసాయంలోకి కార్పొరేట్ ప్రవేశాన్ని సులభతరం చేయడానికి, ప్రభుత్వ సేకరణ, PDSని తగ్గించడానికి ఉద్దేశించబడ్డాయి.

గత రెండు దశాబ్దాల్లో దేశంలో రైతుల సంఖ్య గణనీయంగా పడిపోయిందని తాజా జనాభా లెక్కల డేటాను విశ్లేషిస్తూ కొందరు నిపుణులు గుర్తించారు. వారి ప్రకారం, 1991 నుండి 1కోటి 50లక్షల మంది ప్రధాన సాగుదారులు వృత్తిని విడిచిపెట్టారు.

నయా ఉదారవాద ఆర్థిక విధానాలు భూమి, వనరులు ఎక్కువగా కేంద్రీకరణ, సాంద్రీకరణ జరగడానికి దారితీశాయి. వ్యవసాయ భూమితో పాటు అటవీ భూములను వాణిజ్య అవసరాల కోసం పెద్ద ఎత్తున కొనుగోళ్లు, మార్పిడి జరుగుతోంది. సెజ్‌లు, మైనింగ్, పరిశ్రమలు, పట్టణీకరణ జరుగుతున్నాయి. మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పేరుతో గోల్ఫ్ కోర్స్‌లు, ఫార్ములా వన్ రేసింగ్ ట్రాక్‌లు, నివాస సముదాయాలు వస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో భూమిలేని కుటుంబాలు (0.01 హెక్టార్ల కంటే తక్కువ భూమిని కలిగి ఉన్నవి) 1987-88లో 35% నుండి 2011-12లో 49%కి పెరిగాయి. అదే కాలంలో పైనున్న 10 శాతం మంది 50.2 శాతం భూములను కలిగి ఉన్నారు, దిగువ 50 శాతం వాటా 4.1 నుండి 0.4 శాతానికి తగ్గి, ఎగువ 10శాతం వాటా 2 శాతం పాయింట్లు పెరిగాయి (వికాస్ రావల్, 2013).

**రైతుల్లో వర్గ విభజన**

రైతాంగంలో వర్గ విభజన మరింత తీవ్రమయింది.

గ్రామీణ వ్యవసాయేతర ఆర్థిక వ్యవస్థలో, వ్యవసాయంలో పెట్టుబడిదారీ సంబంధాల యొక్క సర్వవ్యాప్త విస్తరణ గ్రామీణ భారతదేశంలోని ఉత్పత్తి సంబంధాలలో ప్రధాన ధోరణి.

భూస్వామ్య కుటుంబాలు – ఇప్పుడు దాదాపు పూర్తిగా పెట్టుబడిదారీ భూస్వాములు – చాలా భూమిని కలిగి ఉన్నారు, అత్యధిక భారతీయ గ్రామాలలో సాధారణంగా ఉత్తమమైన భూమి మొత్తం వీరి ఆధీనంలోనే ఉంది. వారి భూమిని కౌలుదారులు లేదా కిరాయి కార్మికుల శ్రమశక్తి ద్వారా సాగు చేస్తారు. మన దేశంలో పెద్ద సంఖ్యలో గ్రామాల్లో కౌలుదారుల సంఖ్య పెరగడానికి ఇదే కారణం

ప్రధాన శారీరక శ్రమ కార్యకలాపాలలో పాల్గొనని బడా పెట్టుబడిదారీ రైతులలో కొందరు ధనిక రైతు లేదా మధ్య తరగతి రైతు కుటుంబాల నుండి వచ్చారు. వారు స్వాతంత్ర్యానంతర వ్యవసాయ, గ్రామీణ విధానాల లబ్ధిదారులుగా ఉన్నారు. వారు వ్యవసాయం లేదా ఇతర కార్యకలాపాలు, డబ్బు రుణాలుగా ఇవ్వడం చేశారు. జీతంతో కూడిన ఉపాధి, వాణిజ్యం, వ్యాపారం నుండి సంపాదించిన మిగులును భూమిలో పెట్టుబడి పెట్టారు. వ్యవసాయం వారి కేంద్ర కార్యకలాపం, వారి ఆర్థిక శక్తికి ఆధారం. వారసత్వంగా వచ్చిన ఆస్తి భూస్వాముల వర్గ స్థితికి పునాది అయితే, ఉత్పాదక శక్తుల అభివృద్ధి సంచయనం, ముఖ్యంగా హరిత విప్లవం అనంతర కాలంలో పెట్టుబడిదారీ రైతుల వర్గ స్థితికి పునాది.

భూస్వాములు, బడా పెట్టుబడిదారీ రైతుల అధికారం యొక్క పునాది లేదా ప్రాతిపదిక భూమిపై నియంత్రణ అయినప్పటికీ, భూమి ఒక్కటే ఆ వర్గం చేత నియంత్రించబడే వనరు కాదు, లేదా భూమి ఒక్కటే దాని ప్రధాన సంపద కూడా కాదు. అనేక మంది భూస్వాములు, బడా పెట్టుబడిదారీ రైతులు కూడా లాభదాయకమైన వ్యాపార కార్యకలాపాలలో పాల్గొంటున్నారు. ఉదాహరణకు, వడ్డీ వ్యాపారం, ధాన్యం మిల్లులు, పాడి పరిశ్రమ, వాణిజ్యం, ఆహార ధాన్యాలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులలో స్పెక్యులేషన్, ఉద్యానవన పంటలు, సెరికల్చర్ , తయారీ, రియల్ ఎస్టేట్, నిర్మాణం, సినిమా థియేటర్లు, పెట్రోల్ పంపులు, లాడ్జింగ్ హౌస్‌లు, రవాణా, వ్యవసాయ యంత్రాల విక్రయం, లీజు, ప్రైవేట్ విద్యా సంస్థలు (విద్యా వ్యవస్థాపకత అనేది కొత్త, ముఖ్యమైన ఆదాయ వనరు. ఈ వర్గం యొక్క సామాజిక నియంత్రణలో ఒక ముఖ్యమైనది), ఆర్థిక ఆస్తుల నుండి ఆదాయాలు పొందడం మొదలైనవి.

భూమి యాజమాన్యంపై ఆధిపత్యం చెలాయించడంతో పాటు, ఈ తరగతి గ్రామీణ స్థాయిలో ఉన్న ప్రభుత్వ సంస్థలపై కూడ ఆధిపత్యం చెలాయిస్తుంది. క్రెడిట్ మరియు భౌతిక వ్యవసాయ ఇన్‌పుట్‌లు, విశిష్ట పాఠశాల విద్య, ఉన్నత విద్య,

సంఘటిత రంగ ఉపాధి వీరికి అందుబాటులో ఉన్నాయి. పేదల కోసం ఉద్దేశించిన వాటితో సహా గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని ప్రభుత్వ పథకాల పంపిణీపై ఈ వర్గం ముఖ్యమైన ప్రభావాన్ని చూపుతుంది, తరచుగా అలాంటి పథకాల నిధులను తమ ప్రయోజనాల కోసమే మళ్లించుకుంటారు.

ఈ బడా పెట్టుబడిదారీ రైతులలో ఎక్కువ మంది మధ్యస్త కులాలకు చెందినవారు. వారు అంతకుముందు మధ్యతరగతి రైతు వర్గానికి చెందినవారు. వారు రిజర్వేషన్ల ప్రయోజనం ద్వారా సమకూరిన, వ్యవసాయం ద్వారా లభించిన కొద్దిపాటి మిగులును వృత్తులను సృష్టించకలిగిన రంగాలలో పెట్టుబడి పెట్టడానికి ఉపయోగించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆధిపత్య శక్తిగా వారు ఉద్భవించారు. వారు గ్రామాలను విడిచిపెట్టలేదు, గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయాధికారాన్ని ప్రభావితం చేయడానికి వారి పరిచయాలను కొనసాగించారు. ఇది దేశంలోని వివిధ ప్రాంతాలలో OBC ఆధారిత రాజకీయ పార్టీల పెరుగుదలను వివరిస్తుంది. తమ ఆధిపత్యాన్ని స్థాపించడానికి, ఆధిపత్య వాదులలో స్థానాన్ని పొందేందుకు, వారు దళితులను అణచివేయడంలో ముందున్నారు. హిందూత్వ పథకంలో కూడా చురుకుగా పాల్గొంటున్నారు.

మునుపటి తరం భూస్వాములు గ్రామీణ ప్రాంతాల్లో వారి ఆధిపత్యం, అధికారాన్ని చెలాయించడం కోసం ప్రధానంగా భూ ఆదాయంపై ఆధారపడి ఉన్నారు. నయా ఉదారవాద అనంతర మార్పులు, మనం చూసినట్లుగా, వారు తమ ఆదాయ వనరులను వైవిధ్యపరచడానికి దారితీసింది. గ్రామీణ పేదలు కూడా వివిధ జీవనోపాధి మార్గాలను పొందారు, వారు కూడా తమ జీవనోపాధి కోసం భూమిపై తక్కువ ఆధారపడుతున్నారు. ఈ నేపథ్యంలో భూస్వాముల ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడాలంటే భూములను ఆక్రమించడం సరిపోదు. మనం వారి ఆధిపత్యాన్ని విచ్ఛిన్నం చేయడానికి కొత్త మార్గాలు, పోరాట రూపాల గురించి ఆలోచించాలి. అందుకే గ్రామీణ కార్మికులను సంఘటితం చేయడం ముఖ్యం

ఇటీవలి కాలంలో అభివృద్ధి చెందిన కొత్త ధోరణి పేద భూ యజమానుల నుండి ధనవంతులు భూమిని లీజుకు తీసుకోవడం. అటువంటి 'రివర్స్' కౌలు, అంటే చిన్న, పేద భూ యజమానులు ధనిక సాగుదారులకు భూమిని లీజుకు ఇచ్చే దృగ్విషయం. పేద భూ యజమానులు సాంకేతిక పరివర్తన ప్రయోజనాన్ని పొందలేరు,

దానికి తగిన ఉత్పత్తి సాధనాలు వారివద్ద లేవు, ఉండే అవకాశం కూడ లేదు. పెట్టుబడి కోసం నిధులలేమి, ప్రభుత్వ సేవలలో క్షీణత, పాత కాలువ నీటిపారుదల ప్రాంతాల్లో ప్రజా నీటిపారుదల సౌకర్యం దెబ్బతినడం, తత్ఫలితంగా ప్రైవేట్ యాజమాన్యంలోని గొట్టపు బావులపై ఆధారపడటం, పేద భూ యజమానులు ధనిక సాగుదారులకు భూమిని కౌలుకు ఇచ్చే పరిస్థితులను సృష్టించాయి.

పేద రైతులు ధనవంతులకు భూమిని లీజుకు ఇచ్చినప్పటికీ, వారు కౌలు డిమాండ్ చేయడం, లేదా కౌలు పెరుగుదలను అమలుచేయించుకునే స్థితిలో లేరు. వారు తమ భూమిని కౌలుకు తీసుకున్న ధనిక రైతుల కోరికలు, అభిరుచులకు అనుగుణంగా నడుచు కుంటున్నారు.

ఈ దృగ్విషయం ఒక విధంగా పేదలు వ్యవసాయం నుండి వైదొలగడాన్ని ప్రోత్సహిస్తుంది, లేదా వ్యవసాయాన్ని కార్పొరేటీకరణ చేయడానికి ప్రభుత్వానికి వీలు కల్పిస్తుంది. భూమిని పూలింగ్ చేయడం, కార్పొరేట్‌లకు లీజుకు ఇవ్వడం సులభం అవుతుంది. మరోవైపు, వ్యవసాయంలో సహకార ఉద్యమాన్ని అభివృద్ధి చేయడానికి కూడా ఈ ప్రక్రియ ఉపయోగపడుతుంది – రైతులను సహకార సంఘాలను ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించడం, ఉత్పత్తి సాధనాలను తద్వారా ఉత్పత్తి అయ్యే మిగులును పంచుకోవడం.

అంతర్జాతీయ వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్లను తెరవడంతో, వ్యవసాయ క్షేత్ర వివరాల ప్రకారం భూస్వాములు, ధనికరైతులు, మధ్యతరగతి రైతుల చేతుల్లో భూమి, ఇతర ఉత్పత్తి సాధనాల కేంద్రీకరణ కారణంగా, పేద రైతుల కంటే ఉత్పత్తి ఖర్చులు వారికి తక్కువగా ఉంటున్నాయి. మరింత సమర్థవంతమైన ఇన్‌పుట్ వినియోగం, మార్కెట్‌లకు మెరుగైన అవకాశాల ద్వారా భూస్వాములు, బడా పెట్టుబడిదారీ రైతులు, ధనిక రైతులకు ఉత్పత్తి యూనిట్‌కు లభించే ఆదాయం మధ్య తరగతి, పేద రైతుల కంటే ఎక్కువగా ఉంటుంది.

1990 – 2011 మధ్యకాలంలో, ప్రత్యక్ష వ్యవసాయ క్రెడిట్‌లో రూ. 20,000 కంటే తక్కువ రుణాల వాటా 92 శాతం నుండి 48 శాతానికి పడిపోయింది, అయితే రూ. 10 లక్షల కంటే ఎక్కువ రుణాలు కేవలం 4శాతం నుండి 2011లో దాదాపు 23 శాతానికి పెరిగాయి. ఈ పెద్ద రుణాలు ప్రధానంగా బడా వ్యవసాయ వాణిజ్య సంస్థల కార్యకలాపాలకు ఆర్థిక సహాయం చేయడానికి ఇవ్వబడ్డాయి.

1990ల నుండి, దాదాపు అన్ని పంటలపై ఎగుమతి నియంత్రణలు క్రమంగా భారత ప్రభుత్వంచే తొలగించబడ్డాయి. గోధుమ, గోధుమ ఉత్పత్తులు, బియ్యం, పప్పులు, నూనె గింజలు వంటి వస్తువుల దిగుమతులపై పరిమాణాత్మక పరిమితులు 2000 నుండి తొలగించబడ్డాయి. చాలా పంటల దిగుమతులపై సుంకాలు గణనీయంగా తగ్గించబడ్డాయి. WTO లో భారతదేశం అంగీకరించిన సుంకాల పరిమితుల కంటే కూడ తక్కువకు తగ్గించబడ్డాయి. 1990 - 91- 2011-12 మధ్య, భారతదేశ వ్యవసాయ ఎగుమతులు వార్షికంగా 13 శాతానికి వృద్ధి చెందగా, వ్యవసాయ దిగుమతులు 21 శాతానికి పెరిగాయి.

**పనిదినాలు**

వ్యవసాయంలో పనిదినాలు భారీగా తగ్గాయి. యాంత్రీకరణ వేగంగా అభివృద్ధి చెందుతోంది. గ్రామీణ ఉపాధి, 1993-94, 1999-2000 మధ్య, 2004-05 2009-10 మధ్య పతనమైంది. 1999-2000, 2004-05 మధ్య ఉపాధి వృద్ధి కూడా వేరే ఉపాధి లభించనందువల్లే, ఈ మొత్తం వృద్ధి అంతా అనంఘటిత ఉపాధి, ప్రధానంగా చాలా తక్కువ ఉత్పాదకత స్వయం ఉపాధి. MGNREGA కేటాయింపులు కూడ తగ్గించబడ్డాయి.

వ్యవసాయంలో పని తగ్గినందున, వ్యవసాయేతర పనులలో నిమగ్నమైన వ్యవసాయ కుటుంబాలతో సహా గ్రామీణ ప్రాంతాల్లో గ్రామీణ ప్రజల సంఖ్య పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కుటుంబాలలో కూడా వ్యవసాయేతర వనరుల ద్వారా వచ్చే ఆదాయం వాటా పెరిగింది.

**వేతనాలు**

వార్షిక ఆదాయాలు, అలాగే గ్రామీణ కార్మికుల వేతన రేట్లు, స్వయం ఉపాధి, వేతన - ఉద్యోగాలతో సహా అదే స్థాయిలో ఉన్నాయి లేదా నిజస్థాయిలో తగ్గాయి. అధిక ద్రవ్యోల్బణం, ముఖ్యంగా ఆహార వస్తువుల ధరలు 2004-05, 2009-10 మధ్యకాలంలో వాస్తవ వేతన రేట్లలో స్వల్ప పెరుగుదల ఉన్నప్పటికీ దాన్ని హరించాయి.

జీవనోపాధి కోసం పురుషులు వ్యవసాయేతర పనులకు వలస వెళ్లడంతో, స్త్రీలు నడిపించే కుటుంబాల సంఖ్య పెరిగింది. వ్యవసాయంలో ఉపాధి తగ్గి పోతున్నప్పటికీ, మూడింట రెండొంతుల మంది మహిళలు ఇప్పటికీ సాగు, వ్యవసాయ

కూలీపై ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయం, పశుపోషణ, సామూహిక ఇంధనం, పశుగ్రాసం, ప్రాథమిక మనుగడ కోసం అటవీ ఉత్పత్తుల వంటి అనుబంధ రంగాలలో మహిళల వేతనం లేని శ్రమ పెరిగింది.

పన్నెండవ పంచవర్ష ప్రణాళిక పత్రం దళితులు, ఆదివాసీల సబ్‌ప్లాన్‌లో ఆశించిన ఫలితాలు రాలేదన్నది. రైతాంగంలోని SC/ST వర్గాలకు కేటాయింపులు నిరంతరం తగ్గుతూనే ఉన్నాయి. వారిలో అసమానతలు, పేదరికం పెరుగుతున్నాయి. 2004-05, 2009-10 మధ్య, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ఆధారిత స్వయం ఉపాధి, వ్యవసాయక శ్రమ ఈ రెండూ కూడ తగ్గిపోయాయి. ఈ తగ్గుదల ఎస్సీలకు (వ్యవసాయ కార్మికులలో 3.6 శాతం, స్వయం ఉపాధిలో 1.6 శాతం) ఎస్టీల కంటే (స్వయం ఉపాధిలో 1.7 శాతం, వ్యవసాయ కార్మికులలో 1.6 శాతం) చాలా ఎక్కువగా ఉంది. అదే కాలంలో, గ్రామీణ ప్రాంతాల్లో ఇతర రకాలయిన శ్రమలపై ఆధారపడటం గణనీయంగా పెరిగింది.

గ్రామీణ ఉపాధి తగ్గిపోవడం దళిత, ఆదివాసీ రైతుల భూకమతాలపై ప్రభావం చూపింది. 2004-05, 2009-10 సంవత్సరాలలో, వారి ఆధీనంలో ఉన్న భూమి గణనీయంగా తగ్గింది. ఎస్టీలలో భూమిలేని వారి శాతం 6.5%, ఎస్సీలలో 5.9% పెరిగింది. ఎకరం కంటే తక్కువ భూమి ఉన్న వారి శాతం కూడా పెరిగింది. 2009-10లో దాదాపు 37.2 శాతం STలకు, 58.9 శాతం SC లకు ఎటువంటి భూమి లేదు. ఇది 2004-05 కంటే ఎస్టీలు 3.6 శాతం, ఎస్సీలు 2.5 శాతం అదనంగా భూమి లేనివారుగా తయారయ్యారు.

అటవీ హక్కుల చట్టం ఆమోదించబడినప్పటికీ ఆదివాసీలు, ఇతర సాంప్రదాయ అటవీ నివాసులు ఇంకా భూమి, అటవీ హక్కులను పొందలేదు. గిరిజన ప్రాంతాలలో కూడా కార్పొరేట్లు వనరులను పెద్ద ఎత్తున కొల్లగొడుతున్నారు. 31 మే 2013 నాటికి, ఆదివాసుల నుండి, ఇతర అటవీనివాసుల నుండి 32.48 లక్షల దరఖాస్తులు దాఖలు చేయబడ్డాయి, వాటిలో 28.22 లక్షలు ప్రాసెస్ చేయబడ్డాయి. ఇందులో మెజారిటీ అంటే 15.20 లక్షల దరఖాస్తులు తిరస్కరించబడ్డాయి.

గత దశాబ్దంన్నర కాలంలో ముప్పై లక్షల మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం వ్యవసాయ సంక్షోభం తీవ్రతను సూచిస్తోంది. గత కొన్నేళ్ళుగా ఆత్మహత్యలకు పాల్పడుతున్న వ్యవసాయ కూలీల సంఖ్య కూడా పెరుగుతోంది.

**యువత**

నయా ఉదారవాదం యువతపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇది యువతలో ఆకాంక్షలను సృష్టించినప్పటికీ, చాలా మంది యువకులు, ముఖ్యంగా దళితులు, ఆదివాసీలు, OBC లు, మైనారిటీలు మొదలైన సామాజికంగా అణగారిన వర్గాల నుండి వచ్చిన వారు తమ ఆకాంక్షలను సాధించలేకపోతున్నారు. యువత నిరుద్యోగం, ముఖ్యంగా విద్యావంతులైన యువతలో మున్నెన్నడూ లేనంత స్థాయికి చేరుకుంది. ILO అంచనా ప్రకారం దాదాపు 38శాతం మంది శ్రామిక యువత తీవ్ర పేదరికంలో జీవిస్తున్నారు.

పెరుగుతున్న సామాజిక, ఆర్థిక అసమానతల భారాన్ని యువత భరిస్తున్నారు. తమ ఆశయాలను సాకారం చేసుకునే అవకాశాలు లేకపోవటం వల్ల చాలా మంది సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. అన్ని రకాల మతతత్వ విభజన శక్తుల, ముఖ్యంగా ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలోని హిందుత్వ శక్తుల దుర్మార్గపు ప్రచారానికి, సైద్ధాంతిక జోక్యాలకు యువతలోని పెద్దభాగం ప్రభావితమవుతోంది.

**విద్యార్థులు**

నయా ఉదారవాదం కింద, విద్యపై ప్రభుత్వ వ్యయం, బడ్జెట్ కేటాయింపులు ఉద్దేశపూర్వకంగా, కావాలనే తగ్గించబడ్డాయి. ప్రభుత్వ విద్య నాణ్యత దిగజారింది. చాలా ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి.

మరోవైపు విద్యారంగంలో ప్రయివేటు రంగాన్ని ప్రోత్సహిస్తున్నారు. ప్రజా ప్రయోజనం నుండి విద్యను వ్యాపార వస్తువుగా మార్చారు. మొదట్లో ఉన్నత విద్యారంగంలోకి ప్రవేశించిన పెద్ద పెద్ద కార్పొరేట్ విద్యాసంస్థలు ఇప్పుడు ప్రాథమిక, మాధ్యమిక, పూర్వ ప్రాథమిక విద్యలో కూడా ప్రవేశించి సర్వవ్యాప్తి చెందాయి.

పర్యవసానంగా, విద్య ధనికుల హక్కుగా మారింది. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోర్సులు ప్రవేశపెట్టబడ్డాయి. స్కాలర్‌షిప్‌లకు బదులుగా విద్యార్థుల రుణాలు ప్రోత్సహించబడుతున్నాయి. తద్వారా పేదలు, ముఖ్యంగా ఎస్సీ / ఎస్టీ వర్గాలు, గ్రామీణ పిల్లలు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారు. విద్యను పొందడానికి ప్రమాణం మెరిట్, SC/ST వంటి సామాజిక అంశాల నుండి డబ్బును కలిగి ఉండటానికి మార్చబడింది.

విద్యావ్యవస్థ కూడా దోపిడీగా మారింది. ప్రభుత్వ విద్యా సంస్థలతో సహా శాశ్వత ఉపాధ్యాయులు / అధ్యాపకుల స్థానంలో కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు / లెక్చరర్లు మొదలైన వారిని ఎక్కువగా నియమిస్తున్నారు. 'అతిథి ఉపాధ్యాయులు', 'శిక్షామిత్రులు' మొదలైన పదాలను ఉపయోగించి ప్రభుత్వం ఉద్యోగ హోదాను తిరస్కరించిన ఉ పాధ్యాయుల సంఖ్య పెరిగింది. దీంతో ఈ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు, వారిని సంఘటితం చేసి ఉద్యమంలోకి తీసుకురావడానికి కార్మిక సంఘాల జోక్యం అవసరం.

మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం తన నూతన విద్యా విధానం (NEP)లో విద్యావ్యవస్థను వ్యాపారీకరణ, కార్పొరేటీకరణ, కేంద్రీకృతం చేసి బడా కార్పొరేట్‌లకు ప్రయోజనం చేకూర్చే ఉద్దేశంతో ఈ చర్యలను పొందుపరిచింది.

దీనికి తోడు మోడీ ప్రభుత్వం మొత్తం విద్యావ్యవస్థను కూడా కాషాయమయం చేస్తూ, సిలబస్‌ను మారుస్తూ, సైన్స్ స్థానంలో పురాణాలను చూపుతూ, చరిత్రను వక్రీకరించి, తారుమారు చేస్తూ పాఠ్య పుస్తకాలను తిరగరాస్తోంది. RSS కార్యకర్తలు, మద్దతుదారులను విశ్వవిద్యాలయాలలో కీలక స్థానాల్లో నియమించారు.

**పర్యావరణం**

2009లో భారతదేశంలో పర్యావరణ క్షీణతకు చెల్లించిన వ్యయం సుమారు రూ. 3 లక్షల 75 వేల కోట్లు, ఇది GDP లో 5.7శాతంకి సమానం.

నయా ఉదారవాదం యొక్క ప్రభావం ఆర్థిక విధానాలలో మార్పుగా మనం ఎక్కువగా అర్థం చేసుకున్నాము. సమాజం పైన, రాజకీయాలపైన దాని ప్రభావాన్ని చూడటం లేదు

**అధ్యయన బృందాల నివేదికల ఆధారంగా తీర్మానాలు**

నయా ఉదారవాదం కింద శ్రామిక వర్గం, రైతాంగం, అన్ని వర్గాల శ్రమజీవులపై దోపిడీ, అణచివేత తీవ్రతరం అవుతుందని గత కొన్ని సంవత్సరాల అనుభవం, అధ్యయన బృందాల నిర్ధారణలు తెలుపుతున్నాయి. కొన్ని వర్గాలలో ఆకాంక్షల పెరుగుదల ఉన్నప్పటికీ, నయా ఉదారవాదం ఆ ఆకాంక్షలను తీర్చగల వారి సామర్థ్యాన్ని అడ్డుకుంటుంది. ఆ విధంగా కార్మికులు, పేద, మధ్య తరగతి రైతులు, వ్యవసాయ కార్మికులు, ఇతర శ్రమజీవులలో నయా ఉదారవాద ప్రభావంపై

అసంతృప్తి, ఆగ్రహం పెరుగుతోంది. ఈ కోపాన్ని ఐక్య పోరాటాల ద్వారా వ్యక్తం చేయకుండా నిరోధించడానికి నయా ఉదారవాద రాజ్యం, దాని యంత్రాంగంపై తన పట్టును, సమాజంలోని విభిన్న అంశాలపై – సంస్కృతి, మతం, కులం మొదలైన వాటిపై దాని ప్రభావాన్ని ఉపయోగిస్తుంది. అయితే, ఇది ఎక్కువ కాలం ఉండదని అనుభవం రుజువు చేస్తుంది. వర్గ ఐక్యత, ప్రతిఘటన అభివృద్ధి చెందుతాయి.

ఈ ఐక్యతను బలోపేతం చేయడానికి, ఐక్య ప్రతిఘటనను పెంచడానికి తగిన మార్గాలను పార్టీ అభివృద్ధి చేయాలి. దీని కోసం నయా ఉదారవాదం యొక్క స్వభావం, దాని లక్ష్యాలు, దాని వైఫల్యాల గురించి సరైన అవగాహనను కలిగి ఉండాలి. దానితో పాటు ఇబ్బందులు ఉన్నప్పటికీ వర్గ ఉద్యమాలను పెంపొందించే గొప్ప సామర్థ్యాన్ని గుర్తించాల్సిన అవసరం ఉంది.

ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ ఇప్పటికీ 2008 సంక్షోభం నుండి స్థిరంగా బయటపడే సూచనలు కనిపించడంలేదు, ప్రారంభంలో తుఫానును ఎదుర్కొన్నట్లు అనిపించిన భారతీయ పెట్టుబడిదారీ విధానం కూడా లాభాల పెరుగుదలతో పాటు వృద్ధి సంచయనం మందగించే దశలోకి ప్రవేశించింది. ప్రైవేట్ పెట్టుబడిదారులు, విదేశీ పెట్టుబడుల యొక్క 'సెంటిమెంట్లను' మెరుగుపరచడానికి సంస్కరణల వైపు వత్తిడి ఉంటుంది. సంక్షోభం పారిశ్రామిక (తయారీ) రంగాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది, పెట్టుబడిదారులు శ్రామిక వర్గాన్ని నష్టపరిచి దాని నుండి బయటపడటానికి ప్రయత్నిస్తారు.

ఐక్య కార్మిక ఉద్యమం అభివృద్ధికి, కర్మాగారాల్లో పని చేసే పారిశ్రామిక శ్రామిక వర్గం యొక్క ప్రాముఖ్యత వారి సంఖ్యా నిష్పత్తి కన్నా అధికంగా ఉంటుంది. ఆ నిష్పత్తిలో కనిపించే ధోరణి కన్నా కూడ అధికం.

మన దేశంలో మూడు దశాబ్దాలకు పైగా నయా–ఉదారవాదం రాజ్యం యొక్క స్వభావంపై మన అవగాహనను మరింత ధృఢపరించింది. ఇది బడా బూర్జువా నేతృత్వంలోని బూర్జువా భూస్వామ్య రాజ్యం, ఇది మన విప్లవ దశ, ఇది కార్మికవర్గం నాయకత్వంలో పీపుల్స్ డెమోక్రటిక్ విప్లవం. కార్మిక, కర్షక మైత్రి ఈ విప్లవానికి ఇరుసు లాగా పనిచేస్తుంది. దీని చుట్టూ మధ్య తరగతి రైతులు, పట్టణ మధ్యతరగతి, పెటీ బూర్జువాలు సమీకరించబడతారు. అయితే ధనిక రైతులు మనకు మిత్రులుగా ఉండేలా చూసుకోవాలి. కనీసం తటస్థంగా ఉండేలా అయినా చూసుకోవాలి.

శ్రామిక వర్గంలోని అన్ని తరగతులను సంఘటితం చేయడం, అదే

సమయంలో అనిశ్చిత ఉపాధి సంబంధాలలో ఉన్న వారందరితో సహా పారిశ్రామిక శ్రామిక వర్గం యొక్క ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకోవడంగా మన కృషి ఉండాలి. ట్రేడ్ యూనియన్లు తమ ప్రభావాన్ని, నిర్మాణాన్ని విస్తరించుకోవడానికి, పట్టణ ప్రాంతాల్లో పార్టీ అభివృద్ధికి నివాస ప్రాంతాలపై ఎక్కువ శ్రద్ధ పెట్టాలి.

వ్యవసాయ కార్మికులు, పేద, మధ్యతరగతి రైతులపై కేంద్రీకరించి రైతులను సంఘటితం చేయాలి. కార్మికులు, రైతుల వర్గ ఐక్యతను పెంపొందించడానికి కార్మికులు, రైతుల ఉమ్మడి కార్యక్రమాలను బలోపేతం చేయాలి. గ్రామీణ కార్మికులలోని అన్ని విభాగాలను సంఘటితం చేయాలి.

మధ్యతరగతి వర్గాలు శ్రామిక వర్గంతో కలిసి వచ్చే విధంగా కృషి చేయాలి.

ఇది సైద్ధాంతిక పోరాటం, సోషలిజం కోసం పోరాటం అనే అవగాహనతో నయా-ఉదారవాదంపై దాని అన్ని వ్యక్తీకరణలలో పోరాడం జరపాలి.


**ప్రతులు : 1000**

**ప్రచురణ కాలం : డిసెంబర్, 2023**

**వెల : ₹ . 40 /-**

**ప్రచురణ**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ**

27-30-9, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ -520 002,

ఫోన్ నెం. 0866 2577202, 9490098000

*web : www.cpimap.org*